అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

ఆదివారం 16-03-2025

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 11 సంచిక : 74 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు + వెబ్‌లో (సోపతి) వెల : 8.00

ట్రంప్ మరో షాక్

41 దేశాలపై పర్యాటక ఆంక్షలు ?

జాబితాలో పాక్, అఫ్ఘాన్, భూటాన్

పాక్షికంగా వీసాలను నిలిపివేసే అవకాశం

సిద్ధమవుతున్న అమెరికా ప్రభుత్వం



న్యూఢిల్లీ : ఓ వైపు విదేశీ దిగుమతులపై సుంకాలు విధిస్తూ ప్రతీకార చర్యలకు దిగుతున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోవైపు 41 దేశాలపై పర్యాటక ఆంక్షలకు సిద్ధపడుతున్నారు. అక్రమ వలసలపై ట్రంప్ ఉక్కుపాదం మోపుతున్న నేపథ్యంలో పాకిస్తాన్, అఫ్ఘనిస్తాన్, భూటాన్ సహా పలు దేశాలకు అమెరికా వీసాలను పాక్షికంగా నిలిపివేయబోతున్నారు. ట్రంప్ మొదటిసారి అమెరికా అధ్యక్షుడైనప్పుడు విధించిన ఆంక్షలతో పోలిస్తే ఇవి మరింత విస్తృతమైనవని అధికారులు తెలిపారు. ముస్లింలు అధికంగా నివసిస్తున్న ఏడు దేశాలపై అప్పట్లో ట్రంప్ పర్యాటక ఆంక్షలు విధించారు. పర్యాటక ఆంక్షలకు సంబంధించి అమెరికా భద్రతాధికారులు ఓ ముసాయిదాను రూపొందించారు. 60 రోజుల్లో 'దిద్దుబాటు చర్యలు' చేపట్టని పక్షంలో షెహబాజ్ షరీఫ్ నేతృత్వంలోని పాకిస్తాన్ ప్రభుత్వంపై పాక్షిక ఆంక్షలు విధించడం జరుగుతుందని, ఆ దేశ పౌరులకు అమెరికా వీసాల జారీని తాత్కాలికంగా నిలిపివేస్తామని ఆ ముసాయిదా చెబుతోంది. అమెరికా నుంచి పర్యాటక ఆంక్షలు ఎదుర్కోబోతున్న దేశాల్లో తుర్క్‌మెనిస్తాన్, బెలారస్, వనువాటు కూడా ఉన్నాయి. వనువాటు పౌరసత్వం కోసం ఐపీఎల్ మాజీ చైర్‌పర్సన్ పెట్టుకున్న దరఖాస్తును ఆ దేశ ప్రధాని ఇటీవల తోసిపుచ్చిన విషయం తెలిసిందే. కాగా తమపై అమెరికా పర్యాటక ఆంక్షలు విధించబోతోందంటూ వస్తున్న వార్తలు ఊహాజనితమేనని పాకిస్తాన్ విదేశీ మంత్రిత్వ శాఖ ఈ వారం ప్రారంభంలో తెలిపింది. దీనిపై తమకు అధికారికంగా ఎలాంటి సమాచారం అందలేదని పాక్ విదేశాంగ ప్రతినిధి ఫాకత్ అలీ ఖాన్ చెప్పారు. తుర్క్‌మెనిస్తాన్‌లో ...13లో

ట్రంప్ ముఖం పైకి

మైక్రోఫోన్

మహిళా పాత్రికేయురాలి అత్యుత్సాహం

చిరాకు పడిన అధ్యక్షుడు

14లో

డేరాలు, గోడ రాతలు

తొలగించండి

రాజధానిని అందంగా తీర్చిదిద్దండి

అధికారులకు ట్రంప్ ఆదేశాలు

ఖబడ్దార్!

అభివృద్ధిని అడ్డుకుంటే సహించం

కేసీఆర్ దమ్ముంటే అసెంబ్లీకి రావాలి

ఆయనకు రాజ్యాంగ వ్యవస్థలపై విశ్వాసం లేదు

గవర్నర్ ప్రసంగంలో ఉండేది మా పార్టీ మ్యానిఫెస్టో అంశాలే...తప్పేంటి?

ప్రధాని మోడీ అన్ని రాష్ట్రాలకు పెద్దన్నే

32 సార్లు కాదు..ఇంకో 300 సార్లు ఢిల్లీ వెళ్తా

కేంద్రం నుంచి అనుమతులు తెచ్చుకోవడం ముఖ్యమంత్రిగా నా విధి

మీడియా పేరుతో నోటికొచ్చినట్టు మాట్లాడితే బట్టలూడదీసి కొడతాం

అబద్ధాల పునాదులపై ప్రభుత్వాన్ని నడపం...అంతా పారదర్శకమే :

అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి ఫైర్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రాభివృద్ధిని అడ్డుకుంటుంటే చూస్తూ ఊరుకోబోనని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీ అధినేతకు నీతి, జాతి లేదని ఘాటుగా విమర్శించారు. దమ్ముంటే ఆయన అసెంబ్లీకి రావాలన్నారు. అవసరమైతే స్పీకర్ ప్రతిపక్షనేత కే చంద్రశేఖరరావుతో ప్రత్యేకంగా మాట్లాడి, ఆయన ఎప్పుడు వస్తానంటే అప్పుడు అంశాలవారీగా చర్చలు జరిపేందుకు తాను సిద్ధంగా ఉన్నానని సవాలు విసిరారు. శనివారం శాసనసభలో గవర్నర్‌కు ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఆయన రెండు గంటల సేపు మాట్లాడారు. ఈ సందర్భంగా గడచిన 15 నెలల్లో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించారు. అదే సందర్భంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీని మాటలతో చీల్చిచెండాడారు. ముఖ్యంగా ప్రతిపక్షనేత కే చంద్రశేఖరరావుపై తీవ్రంగా ఫైర్ అయ్యారు. భారతంలో దుర్యోధనుడు మడుగులో దాక్కుంటే శ్రీకృష్ణుడు బయటకు వచ్చేలా చేశాడనీ, అదే విధంగా ప్రతిపక్షనేతను బయటకు లాగి, అసెంబ్లీకి రప్పిస్తామని అన్నారు. అసెంబ్లీలో తాను కానీ, తమపార్టీ ఎమ్మెల్యేల నుంచి కానీ ఆయన గౌరవానికి ఎలాంటి భంగం కలగకుండా చూసుకొనే బాధ్యతను తానే తీసుకుంటానన్నారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ పార్టీ సభ్యుల వికృత మాటలు, విచిత్ర చేష్టల్ని నియంత్రించాల్సిన బాధ్యత పెద్దమనిషిగా కేసీఆర్‌కు లేదా అని అడిగారు. బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశాల్లో ఎమ్మెల్యేలకు ఆయన చేసిన దిశానిర్దేశం ఇదేనా అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఎక్కడైనా, ఎవరైనా చనిపోతే కేసీఆర్‌తో పాటు కేటీఆర్, హరీశ్‌రావులు తలుపులు వేసుకొని డాన్సులు చేస్తూ, పైశాచికానందం పొందుతున్నారనీ తీవ్రంగా దుయ్యబట్టారు. అబద్ధాల పునాదుల ...6లో

వచ్చింది రెండ్రోజులు... జీతం రూ.57.84 లక్షలు

కేసీఆర్‌ను ఉద్దేశించి సీఎం రేవంత్

'బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ 2023 డిసెంబర్ నుంచి 2025 ఫిబ్రవరి వరకు ఎమ్మెల్యేగా, ప్రతిపక్షనేతగా ప్రభుత్వ ఖజానా నుంచి రూ.57,84,124లు జీతంగా తీసుకున్నారు. ప్రజల సొమ్మును జీతంగా తీసుకుంటూ, అదే ప్రజల పక్షాన ఎందుకు నిలబడట్లేదు. 15 నెలల్లో ఆయన అసెంబ్లీకి రెండు సార్లు మాత్రమే వచ్చారు' అని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు.



అసెంబ్లీలో సమస్యలపై

చర్చ జరగాలి

రాష్ట్రానికి నిధుల కోసం బీజేపీపై అన్ని పార్టీలూ పోరాడాలి 13లో

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

మర్పల్లి, మోమిన్‌పేట మండలాల్లో ప్రజా సమస్యలపై పార్టీ ఆధ్వర్యంలో సర్వే


హిందీని రుద్దొద్దు

ఇలా చెప్పడమంటే మరో భాషను ద్వేషించడం కాదు



పవన్‌కళ్యాణ్‌కు ప్రకాశ్‌రాజ్ కౌంటర్

న్యూఢిల్లీ : హిందీ భాషపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు, నెటిజన్లు విమర్శలు సంధిస్తున్నారు. తాజాగా ప్రముఖ నటుడు, రాజకీయ నాయకుడు ప్రకాశ్ రాజ్ కూడా వారితో గొంతు కలిపారు. ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఓ పోస్ట్ పెడుతూ ...5లో



పల్లా వర్సెస్ భట్టి

వందశాతం రుణమాఫీ అయినట్టు నిరూపిస్తే ముక్కునేలకు రాసి రాజీనామా చేస్తా : పల్లా

వామపక్ష విద్యార్థి సంఘం నుంచి వచ్చి, ఇలా మాట్లాడుతావా?

సభలో అబద్ధాలు మాట్లాడటం తగదు : భట్టి

వివరాలు 13లో



నా నియోజకవర్గంలోనే 31వేల మందికి రుణమాఫీ కాలేదు

మాపై ఇంకెన్నాళ్లు ఏడుస్తారు? : మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

వివరాలు 3లో



కేరళ విద్యా విధానాన్ని అధ్యయనం చేయాలి

- జాబ్ క్యాలెండర్‌కు చట్టబద్ధత కల్పించాలి : ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేరళ విద్యా విధానాన్ని అధ్యయనం చేయాలని ఎమ్మెల్సీ కోదండరామ్ ప్రభుత్వానికి సూచించారు. గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం సందర్భంగా మంగళవారం ఆయన శాసనమండలిలో మాట్లాడుతూ కేరళలో అమలు చేస్తున్న ఉద్యోగ భర్తీ విధానం భేషుగ్గా ఉందని కితాబునిచ్చారు. కేరళ సర్కార్ జాబ్ క్యాలెండర్‌కు చట్టబద్ధత కల్పించిందనీ, ఫలితంగా ప్రతి ఏటా ఎంతమంది ఉద్యోగ విరమణ పొందుతారో, అంత మందిని తిరిగి నోటిఫికేషన్ల ద్వారా కొత్తగా నియమిస్తారని అన్నారు. ఈ విధానం వల్ల రాష్ట్రంలో ఉద్యోగుల కొరత ఉండదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. కాంగ్రెస్ సర్కార్ జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి ఉద్యోగ భర్తీకి కసరత్తు చేయడాన్ని స్వాగతిస్తున్నట్టు చెప్పారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో కేవలం 81 వేల ఉద్యోగాలు భర్తీ చేయగా, 15 నెలల కాలంలో ప్రస్తుత ప్రభుత్వం 57 వేల ఉద్యోగాలను భర్తీ చేయడం గొప్ప విషయని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమమే నిధులు, నీళ్లు, నియామకాల కోసం జరిగిందనీ, కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నాలు చేయడం హర్షించదగ్గ పరిణామమన్నారు. స్వరాష్ట్రం ఏర్పడ్డ తర్వాత విద్యా వ్యవస్థ నిర్లక్ష్యానికి గురైందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా నైపుణ్యాల విషయంలో దేశంలోని 36 రాష్ట్రాల సగటులో తెలంగాణ 35వ స్థానంలో ఉందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గత సర్కార్ చేసిన తప్పిదాలు చేయకుండా విద్య, వైద్య రంగాలకు నిధులు పెంచి, ఖాళీలను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

లాల్ దర్వాజా దేవాలయాభివృద్ధికి రూ. 20 కోట్లు

- శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ ప్రకటన

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పురాతనమైన లాల్‌దర్వాజా దేవాలయాభివృద్ధిపై శాసనసభలో ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ అడిగిన ప్రశ్నకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఆ దేవాలయాభివృద్ధికి సీఎం ప్రత్యేక ఫండ్ నుంచి వెంటనే రూ.20 కోట్లు ఇస్తున్నట్టు ప్రకటించారు. హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో దేవాలయ అభివృద్ధిపై త్వరలో సమావేశం నిర్వహించాలని సూచించారు. పాతబస్తీ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ఇప్పటికే రెండు బ్రిడ్జిలను ప్రారంభించామని తెలిపారు. మెట్రో రైలు నిర్మాణానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో వరంగల్, కొత్తగూడెం, నిజామాబాద్, రామగుండం, ఆదిలాబాద్ వంటి ప్రాంతాల్లో ఎయిర్‌పోర్టులను అభివృద్ధి చేసే ఆలోచన ఉందని చెప్పారు. వరంగల్ ఎయిర్‌పోర్టుకు అనుమతి వచ్చిందనీ, కొత్తగూడెం విమానాశ్రయానికి కేంద్రం ఫిజిబులిటీ నివేదిక అడిగిందని సభకు వివరించారు. సచివాలయంలో మధ్యాహ్నం నాలుగు గంటల నుంచి ఆరు గంటల మధ్యలో ప్రజాప్రతినిధులకు, మాజీ ఎమ్మెల్యేలకు అపాయింట్‌మెంట్ ఇచ్చేందుకు చర్యలు చేపడుతామన్నారు. తమ దృష్టికి తీసుకొచ్చే సమస్యలను త్వరితగతిన పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు.

ఎప్‌సెట్‌కు 1,20,333 దరఖాస్తులు

.నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (టీజీఎప్‌సెట్)కు ఇప్పటి వరకు 1,20,333 దరఖాస్తులు వచ్చినట్టు కన్వీనర్ డాక్టర్ డీన్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంజినీరింగ్‌లో 85,702, అగ్రికల్చర్, ఫార్మసీలో 34,541, రెండు విభాగాలకు 90 మంది దరఖాస్తు చేసినట్టు పేర్కొన్నారు.

రాజీవ్ యువ వికాసానికి 17 నుంచి నమోదు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాజీవ్ యువ వికాస పథకానికి ఈ నెల 17 నుంచి ఏప్రిల్ 5 వరకు నమోదు చేసుకోవచ్చని తెలంగాణ వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ లిమిటెడ్ వైస్ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ మల్లయ్యభట్టు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హత, ఆసక్తి కలిగిన వారు ఓబీఎంఎంఎస్ ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని మరిన్ని వివరాలకు జిల్లా వెనుకబడిన తరగతుల సేవ సహకార సంస్థ కార్యాలయంలో సంప్రదించవచ్చు.

ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి

- టీచర్స్ ఎమ్మెల్సీ రఘోత్తమ్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉద్యోగుల పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని టీచర్స్ ఎమ్మెల్సీ రఘోత్తమ్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం శాసనమండలిలో ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇటీవల డిప్యూటీ సీఎం భట్టి ఇచ్చిన హామీ మేరకు ప్రతి నెలా రూ.500 కోట్లు విడుదల చేస్తే ఏడాదిలో ఉద్యోగుల బకాయిలు తీరుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ తమ సర్కార్ హయాంలో చేపట్టిన మన ఊరు.. మన బడి కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని కోరారు. బీజేపీ ఎమ్మెల్సీ ఏవీఎన్.రెడ్డి మాట్లాడుతూ కేజీబీవీ విద్యా సంస్థలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం భాగస్వామ్యం ఉందనే సాకుతో నిర్లక్ష్యం చేయడం తగదని సూచించారు. బీఆర్ఎస్ సభ్యులు తాత మధు మాట్లాడుతూ సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనుల వల్ల సత్తుపల్లి ప్రాంతం తీవ్ర కాలుష్యానికి గురవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సింగరేణి యాజమాన్యం కాలుష్య నివారణ చర్యలు తీసుకునేలా ఆదేశించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ సభ్యులు దయానంద్‌గుప్తా మాట్లాడుతూ టీటీడీలో తెలంగాణ ప్రజాప్రతినిధుల లేఖలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో చొరవ తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ బీసీలకు బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ బీజేపీ నేతలు రాష్ట్ర ప్రగతిని అడ్డుకుంటున్నారని విమర్శించారు. 2023 జీహెచ్ఎంసీ మ్యానిఫెస్టోలో బీజేపీ మూసీ పునరుజ్జీవం అని చెప్పి, తిరిగి ఎందుకు వ్యతిరేకిస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కార్ ప్రజలకిచ్చిన వాగ్దానాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్ కొనియాడారు. ఎంఐఎం ఎమ్మెల్సీ అఫెన్డీ మాట్లాడుతూ రైతు రుణమాఫీ, రైతు భరోసా లెక్కలను ప్రజల ముందుంచాలని కోరారు. సంక్రాంతి నుంచి తెల్ల రేషన్ కార్డులకు సన్నబియ్యం ఇస్తామన్న హామీని ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు.

అమరవీరుల కుటుంబాలకు న్యాయం చేయాలి

- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎల్.రమణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ అమర వీరుల కుటుంబాలకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎల్.రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం శాసనమండలిలో ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. 2023 కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో తెలంగాణ అమర వీరులకిచ్చిన ఒక్క హామీ అమలు కాలేదని గుర్తు చేశారు. ఉద్యమంలో అసువులు బాసిన కుటుంబాలకు రూ.25 వేల గౌరవ వేతనం, ఇంటిలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. ఆందోళన సమయంలో వారిపై నమోదైన కేసులను ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. ఇదే అంశంపై కోదండరామ్ మాట్లాడుతూ అమర వీరుల కుటుంబాలకు రూ.25 వేల పింఛన్ ఇవ్వడానికి సర్కార్ అంగీకరించిందనీ, జాప్యం లేకుండా వెంటనే అందించాలని కోరారు.

24 గంటల్లోనే రెండు గిన్నీస్ రికార్డులు

రొమ్ము క్యాన్సర్‌పై యూట్యూబ్‌లో అవగాహన పాఠం

ఒక్కరోజులో అత్యధిక వ్యూస్

ప్రతి ఏడాదీ 2 లక్షల రొమ్ము క్యాన్సర్ కేసులు : మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ నగరానికి చెందిన ఉషాలక్ష్మి బ్రెస్ట్ క్యాన్సర్ ఫౌండేషన్, కిమ్స్-ఉషాలక్ష్మి సెంటర్ ఫర్ బ్రెస్ట్ డిసీజెస్, బ్రహ్మకుమారీస్‌తో కలిసి యూట్యూబ్‌లో సరికొత్త రికార్డును నెలకొల్పాయి. ఇది 24 గంటల్లోనే రెండో గిన్నిస్ ప్రపంచ రికార్డు కావడం విశేషం. యూట్యూబ్‌లో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన పాఠానికి 24 గంటల్లో అత్యధిక వ్యూస్ అనే అంశానికి ఈ రికార్డు వచ్చింది. గిన్నిస్ ప్రపంచ రికార్డు బహూకరణను ప్రపంచ వ్యాప్తంగా 6,218 మంది యూట్యూబ్‌లో చూశారు. 40 నిమిషాలకుపైగా స్పష్టమైన ప్రజెంటేషన్ ఇచ్చినందుకు డాక్టర్ రఘురామ్‌ను సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ (జీడబ్ల్యూఆర్)ను సమర్పించిన ఈ ఈవెంట్ ఆసియా పసిఫిక్ జడ్జి రిషినాథ్ అభినందించారు. ఆన్ సైట్‌లో "అతిపెద్ద రొమ్ము క్యాన్సర్ అవగాహన పాఠం" కొన్ని రోజుల కిందట డాక్టర్ రఘురామ్ సాధించిన మరొక గిన్నిస్ వరల్డ్ రికార్డ్. మొత్తంగా 24 గంటల్లోనే 11 వేల మందికి పైగా ఈ మెగా ఎవేర్‌నెస్ డ్రైవ్ ద్వారా లబ్ధిపొందారు. ప్రముఖ సర్జన్, పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఉషాలక్ష్మి బ్రెస్ట్ క్యాన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, హైదరాబాద్‌కు చెందిన కిమ్స్-ఉషాలక్ష్మి సెంటర్ ఫర్ బ్రెస్ట్ డిసీజెస్ వ్యవస్థాపక డైరెక్టర్ డాక్టర్ పి.రఘు రామ్ అవగాహన పాఠాన్ని నిర్వహించారు.

ఈ గిన్నిస్ ప్రపంచ రికార్డు ప్రజంటేషన్ కార్యక్రమానికి హాజరైన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు మాట్లాడుతూ.. 50వ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా "డాక్టర్ పి.రఘురామ్ 24 గంటల్లో 11 వేల మందికి రొమ్ముక్యాన్సర్‌పై అవగాహన కల్పించడం ద్వారా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ నుంచి రెండు రికార్డులు సాధించడం అభినందనీయం. ప్రతి ఏడాదీ 2 లక్షల కొత్త రొమ్ము క్యాన్సర్ కేసులు నిర్ధారణ అవుతున్నాయి. ఏడాదికి లక్ష మరణాలు సంభవిస్తున్నాయి. రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ అయిన ప్రతి ఇద్దరు మహిళల్లో ఒకరు దేశంలోనే ఉన్నారు. డాక్టర్ రఘురామ్ కొన్నేండ్లుగా తెలుగు రాష్ట్రాల్లో రొమ్ము క్యాన్సర్‌పై ప్రచారం చేస్తున్నారు. వినూత్న కార్యక్రమాల ద్వారా ఈ క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని 4వేల గ్రామాల్లో పెద్దఎత్తున జనాభా ఆధారిత రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమం చేపట్టారు" అని తెలిపారు. డాక్టర్ రఘురామ్ మాట్లాడుతూ.. "ఈ గుర్తింపును మా తల్లి, ఐదు నెలల కిందట ఈ ప్రపంచాన్ని వదిలేసిన రొమ్ము క్యాన్సర్ విజేత డాక్టర్ ఉషాలక్ష్మికి అంకితం చేస్తున్నాను. తగిన అవగాహన లేకపోవడం, సామాన్యులందరికీ స్క్రీనింగ్ కార్యక్రమం లేకపోవడం, క్యాన్సర్ చికిత్సల్లో అసమానత వల్ల మన దేశంలో 60 శాతానికి పైగా రొమ్ము క్యాన్సర్ కేసులు ముదిరిన దశలోనే బయటపడుతున్నాయి. ఈ వ్యాధి చుట్టూ ఉన్న సామాజిక సమస్యలను నివారించడానికి, మహిళలు ఈ వ్యాధిని త్వరగా గుర్తించాల్సిన అవసరంపై వారిలో సాధికారత కల్పించడానికి ఇదో చిన్న ప్రయత్నం" అని చెప్పారు. కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మెన్ డాక్టర్ బి.భాస్కరరావు మాట్లాడుతూ.. "కుటుంబానికి స్త్రీ ప్రధాన కేంద్రం అనే విషయాన్ని మరచిపోకూడదు. ఆమె బాగుంటేనే కుటుంబం బాగుంటుంది. 40 ఏండ్లు దాటిన తమ సన్నిహితులు, సన్నిహితులు వార్షిక స్క్రీనింగ్ మామోగ్రామ్ చేయించుకునేలా చూడాల్సిన బాధ్యత పురుషులపై ఉంది" అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రఘురామ్‌ను ఆస్కి చైర్మెన్ కె.పద్మనాభయ్య ఘనంగా అభినందించారు.

ఎస్సీ, ఎస్టీల సంక్షేమంపై అసెంబ్లీలో చర్చించాలి

నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలి : రౌండ్ టేబుల్‌లో వక్తలు



నవతెలంగాణ - ముషీరాబాద్

ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధి కింద సంక్షేమానికి కేటాయించిన నిధుల ఖర్చులపై అసెంబ్లీలో చర్చించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధులపై శ్వేతపత్రం ప్రకటించాలని శనివారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గద్దర్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి గుమ్మడి సూర్యకిరణ్ మాట్లాడుతూ.. ఎన్నికల హామీలను అమలు చేయకపోవడం రాజ్యాంగ వ్యతిరేక చర్యని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేవెళ్ల డిక్లరేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ మాట్లాడుతూ.. అంబేద్కర్ అభయహస్తం పథకాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. 2024-25 బడ్జెట్‌లో ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధి కింద రూ.33,127 వేల కోట్లు కేటాయించగా రూ.9,824 కోట్లను మాత్రమే ఖర్చు చేశారన్నారు. గిరిజన శక్తి వ్యవస్థాపక అధ్యక్షులు వెంకటేష్ చౌహన్ మాట్లాడుతూ.. ఎస్టీల ప్రత్యేక అభివద్ధి నిధి కింద రూ.17,056 వేల కోట్లు కేటాయించగా రూ.6,766 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారన్నారు. కేవీపీఎస్ రాష్ట్ర నాయకులు దశరథ్ మాట్లాడుతూ.. రాజ్యాంగ సంక్షేమ హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమిద్దామని అన్నారు. మాల సంక్షేమ సంఘం అధ్యక్షులు బత్తుల రాంప్రసాద్ మాట్లాడుతూ.. చట్టం ప్రకారం నిధుల ఖర్చుపై సోషల్ అడిట్ నిర్వహించాలన్నారు. పీపుల్స్ మానిటరింగ్ కన్వీనర్ ఎస్.శివలింగం మాట్లాడుతూ.. సంక్షేమ హాస్టళ్లకు, గురుకులాలకు సొంత భవనాలు నిర్మాచాలని కోరారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్ మాట్లాడుతూ.. ఆహార, సామాజిక భద్రత కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త మామిడి నారాయణ, సైంటిఫిక్ స్టూడెంట్స్ యూనియన్ కార్యదర్శి డి.మోహన్, డీబీఎఫ్ నాయకులు చుంచు రాజేందర్, దాసరి ఎగొండ స్వామి, బ్యాగరి వేణు, పులి నవిన్ కుమార్, పరమేశ్వరి, రమ, ఉమ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ భూముల విక్రయాన్ని వ్యతిరేకిస్తున్నాం

వెనక్కి తగ్గకపోతే బీజేపీ ఆధ్వర్యంలో పోరాటం : ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ)కి చెందిన 400 ఎకరాల భూమిని విక్రయించాలనే తెలంగాణ ప్రభుత్వ హేయమైన నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బీజేపీ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ తెలిపారు. లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోరాటం చేస్తామని ప్రకటించారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పర్యావరణ, అకాడమిక్, సాంస్కృతిక ప్రాముఖ్యత గల స్థలాన్ని ప్రయివేటు, కార్పొరేట్ శక్తుల స్వార్థ ప్రయోజనాలకు దారాదత్తం చేయాలనుకోడం దారుణమన్నారు. విద్యా, పర్యావరణ పరిరక్షణ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని సూచిస్తున్నదని చెప్పారు. వర్సిటీ ఆవిర్భావ సమయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సర్వే నంబర్.25 కింద 2300 ఎకరాల స్థలాన్ని పరిశోధన, విద్యారంగ అభివృద్ధి కేటాయించిందని గుర్తుచేశారు. సంపద మొత్తాన్ని పారిశ్రామికులకు, కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేస్తున్నారని విమర్శించే కాంగ్రెస్... అధికారంలోకి రాగానే దేశ సంపదను ఎవరి ప్రయోజనాల కోసం వేలం వేస్తున్నదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కులగణనపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం

కాంగ్రెస్ ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కులగణన సర్వేపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. శనివారం శాసనమండలి మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ కుల గణనలో పాల్గొనని కేసీఆర్ కుటుంబానికి దానిపై మాట్లాడే అర్హత లేదని అన్నారు. గతంలో సంచలనం కోసమే బీఆర్ఎస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిందని ఆరోపించారు. తాము చేసిన సర్వే పారదర్శకమైతే పదేండ్ల కాలంలో ఎందుకు వెల్లడించలేదని ప్రశ్నించారు. ఆ ప్రభుత్వం చేయని పనిని తాము చేయడాన్ని జీర్ణించుకోలేక విషం కక్కుతున్నారని విమర్శించారు. బీసీలకు చట్ట సభలతో పాటు విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. పార్లమెంట్‌లో రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించేందుకు రాజకీయాలకతీతంగా అన్ని పార్టీలు కలిసి రావాలని కోరారు.

మతం.. మందిరం.. హిందూత్వ

బీజేపీ భావోద్వేగ రాజకీయాలు | సున్నితాంశాలతో ప్రజల దృష్టిని మరల్చుతున్న కాషాయపార్టీ

ప్రపంచంలోని అనేక దేశాలు శాస్త్ర సాంకేతిక, విద్య, వైద్యం వంటి పలు రంగాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తిస్తూ, వాటికి పరిష్కార మార్గాలు కనుగొంటూ ముందుకెళ్తున్నాయి. అంతర్జాతీయ సమాజంలో అన్ని రంగాల్లో తామే ముందుండాలన్న పోటీతత్వంతో దూసుకెళ్తున్నాయి. కానీ బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ పాలనలో దేశం హిందూ-ముస్లిం, మందిరం-మసీదు వంటి అంశాల వరకే పరిమితమైందని విశ్లేషకులు, మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ప్రధాని మోడీ, బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంల తీరు

కానరాని అభివృద్ధి మాటలు : మేధావులు, విశ్లేషకుల ఆందోళన

న్యూఢిల్లీ : అభివృద్ధిలో చైనా, అమెరికా వంటి దేశాలకు పోటీగా నిలుస్తున్నామంటున్న కేంద్రంలోని మోడీ సర్కారు ప్రకటనలు మాటలకే పరిమితమయ్యాయి. ప్రపంచంలోని పలు దేశాలు అభివృద్ధిలో మనకు అందనంత దూరం దూసుకెళ్తున్నాయి. కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ, ఆయా రాష్ట్రాల్లో ఆ పార్టీ అధికారంలో ఉన్న ప్రభుత్వాల పాలనల్లో మాత్రం మతం, మందిరం, హిందూత్వ అంశాలే రాజ్యమేలుతుండటం గమనార్హం. ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులు, బీజేపీ పాలిత రాష్ట్రాల్లోని ముఖ్యమంత్రులు, ఆ పార్టీ కీలక నాయకులు ఈ అంశాలకే ప్రాధాన్యతనిస్తున్నారని మేధావులు, విశ్లేషకులు అంటున్నారు. దేశ అభివృద్ధికి పనికొచ్చే విధంగా వారి మాటలు ఉండటం లేదని చెప్తున్నారు.

మతమే ఆయుధం

అధికారమనే అనంత లక్ష్యాన్ని అడ్డదారిలో అందుకోవటానికి బీజేపీ ఉపయోగించే ఒకే ఒక్క ఆయుధం మతం. ఈ సున్నితమైన అంశాన్ని వాడుకొనే 1990వ దశకంలో బీజేపీ రాజకీయంగా ఎదిగింది. ప్రస్తుతమూ ఇదే పంథాను కొనసాగిస్తూ దేశ అభివృద్ధికి అడ్డంకిగా మారింది. ప్రధాని మోడీ నుంచి కేంద్ర మంత్రులు, ఆ పార్టీ ముఖ్యమంత్రులు, నాయకులు కూడా మతం పేరిట ప్రసంగాలు చేస్తూ రాజకీయంగా పబ్బం గడుపుకుంటున్నారు. మహిళలు, మైనారిటీల రక్షణ, రైతు సమస్యలు, నిరుద్యోగం వంటి సమస్యలను భారత్ ప్రస్తుతం ఎదుర్కొంటున్నది. అయితే, వీటిని పరిష్కరించాలనే కనీస ఆలోచననూ బీజేపీ పాలకులు చేస్తున్నట్టు కనిపించటం లేదు.

సంభాల్‌తో అగ్గిరాజేసిన యోగి సర్కార్

బీజేపీలో మోడీ-షా ద్వయానికి పోటీగా మారిన యూపీ సీఎం యోగి చేసే హిందూత్వ ప్రసంగాలు ఆశ్చర్యం కలిగించక మానవు. దేశంలోని అతిపెద్ద రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న ఆయన.. తన ప్రభుత్వ చర్యలతో యూపీలోని సంభాల్‌ను చర్చకు కేంద్ర బిందువుగా మార్చారు. మసీదు ఉన్న ప్రాంతాన్ని హిందూ ఆలయానికి చెందినదిగా విపరీత ప్రచారాన్ని కల్పించారు. "సంభాల్ అనేది ఒక తీర్థక్షేత్రం. ఐదు వేల ఏండ్ల క్రితమే దీని గురించి గ్రంథాల్లో పేర్కొన్నారు. విష్ణు ప్రభువు పదో అవతారం సంభాల్‌లో ఉంటుందని పురుణాలు చెప్తున్నాయి. ఇస్లాం పుట్టింది 1400 ఏండ్ల క్రితమే. నేను మాట్లాడుతున్నది ఇస్లాంకు పూర్వం, కనీసం రెండు వేల ఏండ్ల కిందటి గురించి. సంభాల్‌లోని శ్రీహరి గుడిని 1526లో కూలగొట్టారు. 1528లో అయోధ్యలోని రామ మందిరాన్ని మీర్ బాకీ ధ్వంసం చేశారు" అని యోగి అన్నారు. అయితే, కొన్ని పవిత్ర ప్రదేశాలను మాత్రమే తిరిగి పొందామని చెప్పిన ఆయన.. మత గ్రంథాలపై అధ్యయనం చేసి తనతో చర్చకు రావాలని ఆయన తన రాజకీయ ప్రత్యర్థులకు సవాల్ విసిరారు. ప్రపంచం ఏదో ఒక రోజు కాషాయాన్ని ధరిస్తుందని యోగి అన్నారు.

మేధావుల ఆందోళన

యోగి వ్యాఖ్యలపై రాజకీయ విశ్లేషకులు, మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చరిత్రను తవ్వుతూ కోల్పోయిన గుడులను స్వాధీనం చేసుకోవటం, ప్రపంచం కాషాయ వస్త్రాన్ని ధరించే రోజు వస్తుందని చెప్పటం దేశంలోనే అతిపెద్ద రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న ఆయన రాజకీయ ప్రాధాన్యతలను వివరిస్తున్నదని అంటున్నారు. అంతేకాదు, యూపీలో వివాదస్పదంగా ఉన్న కాశీ విశ్వనాథ్ మందిరం, మథురలోని ఆలయం, రాజస్థాన్‌లోని అజ్మీర్ దర్గా, మహారాష్ట్రలోని ఔరంగజేబు సమాధి.. ఇలా చెప్పుకుంటూ పోతే పలు విషయాలతో అక్కడి బీజేపీ ప్రభుత్వాలు మత ఎజెండాతో ప్రజలలో విద్వేషాలను రగుల్చుతున్నాయని చెప్తున్నారు.

ఈశాన్యం, దక్షిణాదిలో...

ఈశాన్య భారతంలో బీజేపీకి బాధ్యత వహిస్తున్న అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ చర్యలు కూడా యోగికి ఏమాత్రమూ తీసిపోవని అంటున్నారు. మతం ఆధారంగా ముస్లింలనే టార్గెట్ చేసుకునే ఆయన చర్యలు పలు సందర్భాల్లో తీవ్ర వివాదంగా మారాయని గుర్తు చేస్తున్నారు. ఇక దక్షిణాదిన జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, బీజేపీ తమిళనాడు రాష్ట్ర చీఫ్ అన్నామలై వంటి వారికి కాషాయపార్టీ అండగా నిలబడుతూ మత చిచ్చు రేపుతున్నదని విశ్లేషకులు వివరిస్తున్నారు.

నెహ్రూ విజన్‌కు, మోడీ పాలనకు అదే తేడా

ఎన్నో పోరాటాల ఫలితంగా భారత్‌కు స్వాతంత్ర్యం సిద్ధించింది. ఈ పోరాటంలో, స్వతంత్ర భారతంలో గాంధీ-నెహ్రూ విజన్ ఎంతగానో పని చేసింది. భారత్‌ను ఆధునిక దేశంగా తీర్చిదిద్దటానికి, విద్య, వైద్యంలో సమాన అవకాశాలు, మౌలిక వసతులు, పరిశ్రమలు, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఆర్ట్, సాహిత్యం వంటి అంశాలలో నెహ్రూ దేశ తొలి ప్రధానిగా స్థిరంగా పని చేశారు. ఇక దైవాన్ని నమ్మే విషయంలో విరుద్ధ అభిప్రాయాలున్నా.. దేశంలో ఆధ్యాత్మికత విషయంలో ఆయన ఏ మాత్రమూ అడ్డుపడలేదు. అన్ని అంశాలనూ బ్యాలెన్స్ చేస్తూ దేశ అభివృద్ధికి నిరంతరం పని చేశారు. అయితే, ప్రస్తుత మోడీ పాలనలో, బీజేపీ పాలిత ప్రభుత్వాల్లో ఈ తీరు లోపించిందని రాజకీయ పరిశీలకులు, మేధావులు అంటున్నారు. కుటుంబ పాలన అంటూ గాంధీ-నెహ్రూ కుటుంబాలపై బీజేపీ చేస్తున్న విపరీత దాడులనూ వారు తప్పుబడుతున్నారు.

హిందూత్వ నాయకులకు జై

సంఘ్‌లో పని చేసిన గాడ్సే.. 1948లో గాంధీని హత్య చేసిన విషయం విదితమే. అలాంటి గాడ్సేను బీజేపీ నేతలు పలు వేదికలపై, పలు సందర్భాల్లో పొగిడిన సందర్భాలూ అనేకం. ఆర్‌ఎస్‌ఎస్ నేతలు, హిందూత్వ నాయకులైన ఎం.ఎస్. గోల్వాల్కర్, వి.డి సావర్కర్‌ల మాటలనూ వల్లె వేస్తారు. గొప్ప నేతలంటూ మోడీ నుంచి కిందిస్థాయి నాయకుల వరకు కీర్తిస్తుంటారు. ఇలాంటి సంఘ్ నాయకులను ఆదర్శంగా తీసుకునే బీజేపీ నేతలు.. గాంధీ, అంబేద్కర్‌లను నమ్ముతామని చెప్పటం పరస్పరం విరుద్ధమని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు ఇలాంటి సున్నితమైన అంశాలను వాడుకుంటున్న కేంద్రంలోని మోడీ సర్కారు, ఆయా రాష్ట్రాల్లోని బీజేపీ ప్రభుత్వాలు దేశ భవిష్యత్తును ప్రమాదంలో పడేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గాంధీ, అంబేద్కర్‌లపై కపట ప్రేమ

భారత రాజ్యాంగ నిర్మాత అయిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం పైనా బీజేపీ మాతృ సంస్థ అయిన ఆర్‌ఎస్‌ఎస్‌కు నమ్మకం లేదన్నది ప్రజాస్వామ్యవాదులు, మేధావుల వాదన. ఆర్‌ఎస్‌ఎస్ అడుగుజాడల్లో నడిచే బీజేపీ.. భారత రాజ్యాంగాన్ని ఏ మాత్రం గౌరవిస్తుందని అంటున్నారు. గాంధీ, అంబేద్కర్ వంటి వ్యక్తులపై లేని ప్రేమ చూపిస్తున్న బీజేపీ.. వారి ఆలోచనలకు విరుద్ధంగా పని చేస్తున్నది. లౌకికవాదం, బహుళత్వం వంటి అంశాలను పాతరేస్తున్నదని వారు అంటున్నారు. ప్రధాని స్థాయిలో ఉన్న మోడీ గుడులు, ఆశ్రమాలు చుట్టూ తిరగటం, సాధు, సంతువులను కలవటం వంటి విషయాలు రాజ్యాంగంలోని లౌకికవాదమనే భావనకు పూర్తి విరుద్ధమని చెప్తున్నారు.

కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలు మానుకోవాలి

- ఏఐకేఎస్ జాతీయ సహాయ కార్యదర్శి టి.సాగర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



మోడీ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను మానుకోవాలని ఏఐకేఎస్ జాతీయ సహాయ కార్యదర్శి టి సాగర్ కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం ఏపీలో యువరైతులు, మహిళా రైతుల రాష్ట్ర సదస్సును విజయవాడలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడారు. "వ్యవసాయరంగం తీవ్ర సంక్షోభంలో ఉంది. మోడీ ప్రభుత్వ విధానాలు రైతాంగానికి వ్యతిరేకంగా ఉన్నాయి. కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి కోతలు పెట్టారు. ఎరువుల సబ్సిడీకి 23 శాతం తగ్గించారు. బడా కార్పొరేట్లకు ఈ కాలంలో రూ.16లక్షల కోట్లు మాఫీ చేసిన కేంద్ర ప్రభుత్వం, రైతుల రుణాలు మాఫీ చేయడానికి సిద్ధం కావటం లేదు. స్వామినాథన్ కమిటీ సిఫారసుల ప్రకారం పెట్టిన పెట్టుబడికి 50శాతం కలిపి మద్దతు ధర నిర్ణయించ డంతో పాటు కొనుగోలుకు గ్యారెంటీ చేయాలి. రైతాంగ పోరాటం ఫలితంగా రద్దు చేసిన మూడు వ్యవసాయ చట్టాల స్థానంలో మళ్లీ జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధాన ముసాయిదాను తీసుకొచ్చింది. దీన్ని రద్దు చేసేవరకు ఐక్యంగా పోరాడుదాం"అని పిలుపునిచ్చారు. ఏపీలో ఆ విధానాలనే చంద్రబాబు ప్రభుత్వం అమలు చేస్తున్నదని చెప్పారు. వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర రోజు రోజుకు పెరుగుతున్నదనీ, పాడి రైతుల్లో 80 శాతం మహిళలే ఉంటున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ, వై.కేశవరావు, పి.హేమలత, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, సహాయ కార్యదర్శులు జొన్న శివశంకర్, ఎ రాజశేఖర్, పి .వి.ఆంజనేయులు పాల్గొన్నారు.

టన్నెల్‌లో అత్యాధునిక యంత్రాలు

కార్మికుల ఆచూకీ కోసం రెస్క్యూ టీమ్‌ల నిర్విరామ కృషి

- బృందాల వారీగా సమీక్ష

నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి



ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాద స్థలంలో సహాయక చర్యల్లో అత్యాధునిక యంత్రాలను వినియోగిస్తూ రెస్క్యూ టీమ్స్ నిర్విరామంగా కృషి చేస్తున్నాయి. అయినా కార్మికుల ఆచూకీ ఇంకా తెలియక బాధిత కుటుంబాలు రోజూ కన్నీటి పర్యంతమవుతున్నాయి. సహాయక బృందాల ఉన్నతాధికారులతో కలిసి శనివారం టన్నెల్ ఆఫీస్ వద్ద డిజాస్టర్ అండ్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అరవింద్ కుమార్, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సమీక్ష నిర్వహించారు. పురోగతిని సమీక్షించి, అవసరమైన మార్పులు చేస్తున్నట్టు తెలిపారు. ఉన్నతాధికారులు ప్రతి రోజూ టన్నెల్ లోపల ప్రమాద ప్రదేశాన్ని చేరుకొని సహాయక బృందాలకు మార్గనిర్దేశం చేస్తూ, సమన్వయంతో పనులు వేగంగా జరిగేటట్టు చర్యలు తీసుకుంటున్నారు. సహాయక చర్యలను మరింత వేగవంతం చేసేందుకు అత్యాధునిక రోబోటిక్ పద్ధతులను ఉపయోగిస్తున్నారు. అన్వి సంస్థ అభివృద్ధి చేసిన అటానమస్ హైడ్రాలిక్ పవర్డ్ రోబో ద్వారా, 30హెచ్‌పి సామర్థ్యం గల పంపుతో అనుసంధానమైన వ్యాక్యూమ్ ట్యాంక్ ఉపయోగించి నీటితో కూడిన బురద, మట్టిని తొలగించనున్నట్టు అధికారులు వివరించారు. టన్నెల్‌లో 24 గంటలు నిరంతరాయంగా సహాయక చర్యలు కొనసాగుతున్నట్టు, కార్మికులను గుర్తించేందుకు అన్ని ప్రయత్నాలూ చేస్తున్నట్టు అధికారులు చెప్పారు. టన్నెల్‌లోని నీటిని తొలగించేందుకు డీ-వాటరింగ్ ప్రక్రియ కొనసాగుతుండగా, ఆధునిక పరికరాలు, రోబోలను ఉపయోగించి తవ్వకాలు జరుగుతున్నాయి. ఆక్సిజన్ సరఫరా, వైద్య సేవలు, ఆహారం, మంచినీరు వంటి అవసరాలను నిరంతరం అందుబాటులో ఉంచేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. టన్నెల్ లోపల పని చేసే బృందాల భద్రతను దృష్టిలో పెట్టుకుని అత్యవసర అవసరాల ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు తెలిపారు. అనంతరం లిక్విడ్ రింగ్ వ్యాక్యూమ్ పంప్, వ్యాక్యూమ్ ట్యాంక్‌తో కూడిన మిషన్ పనితీరును జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పరిశీలించారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్మీ అధికారులు పరీక్షత్ మేహర, సింగరేణి మైండ్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య, ఎన్డీఆర్ఎఫ్ అధికారులు నిరంజన్, డాక్టర్ హరీష్, జీఎస్ఐ అధికారులు తప్లియాల్, హైడ్రాధికారులు, కడావర్ డాగ్స్ స్క్వాడ్, ర్యాట్ హెూల్ మైనర్స్, ఎస్‌డీఆర్ఎఫ్, దక్షిణ మధ్య రైల్వే అధికారులు, అన్వి రోబోటిక్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

21న హైదరాబాద్‌లో అసంఘటిత కార్మికుల మహాధర్నా : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



హమాలీ, భవన నిర్మాణం, ప్రయివేటు ట్రాన్స్‌పోర్ట్, బీడీ, తదితర అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 21న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహిం చనున్నట్టు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ ప్రకటించారు. రాష్ట్రంలో అసంఘటిత కార్మికుల సంక్షేమం కోసం ఒక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన వెల్ఫేర్ బోర్డు నిధులను కార్మికులందరికీ అందడం లేదనీ, చాలా మంది కార్మికులను నమోదు చేయకుండా చిన్నచిన్న కారణాలను భూతద్దంలో చూపెట్టి కార్డులివ్వలేదని విమర్శించారు. భవన నిర్మాణ రంగం వెల్ఫేర్‌బోర్డులోని నిధులు దుర్వినియోగం అవుతున్నాయని వాపోయారు. నకిలీ కార్డులు సృష్టించి కొందరు బ్రోకర్లు కాజేస్తున్నారని విమర్శించారు. హమాలీ, ట్రాన్స్‌పోర్టు కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని సుదీర్ఘ కాలంగా పోరాటాలు చేస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదని వాపోయారు. బీడీ కార్మికులకు సంబంధించిన వేతనాల జీవోలు ఏండ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని గుర్తుచేశారు. అదే సమయంలో బీడీ కార్మికులకు స్కాలర్‌షిప్పులు, గృహ నిర్మాణ పథకాలు అందడం లేదని వాపోయారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం బీడీ కార్మికులకు ప్రతి నెలా రూ.4 వేలు ఇవ్వాలని కోరారు

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో

588 మందికి కారుణ్య నియామకాలు

- 19న పత్రాలు అందజేయనున్న సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో కారుణ్య నియామకాల కింద రాష్ట్ర సర్కారు 588 మందికి ఉద్యోగాలివ్వనున్నది. ఈ నెల 19న రవీంద్రభారతిలో జరిగే సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయనున్నారు. వాస్తవానికి 2016 నుంచి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో కారుణ్య నియామకాల కోసం ఆశావాహులు ఎదురుచూస్తున్నారు. ఆ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) ప్రత్యేక చొరవ తీసుకుని ఫైలును క్లియర్ చేసేలా సీఎంపైనా, ఆర్థిక శాఖ మంత్రిపైనా ఒత్తిడి తీసుకొచ్చి సక్సెస్ అయింది. మంత్రి సీతక్క చొరవతో ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆ ఫైలును క్లియర్ చేశారు. ఈ నిర్ణయంతో 588కి మంది ఉద్యోగాలు లభించనున్నాయి.

సోషల్‌మీడియాను మంచికి వాడండి

- నా ఫొటోలు మార్ఫింగ్ చేయడంతో మనోవేదనకు గురయ్యా
- కొన్ని కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి
- సామాజిక మాధ్యమ కట్టడి అవసరం : మంత్రి డాక్టర్ సీతక్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



సోషల్‌మీడియా చెడుకు కాకుండా మంచికి వాడాలని అసెంబ్లీ వేదిక నుంచి సమాజానికి రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) విజ్ఞప్తి చేశారు. సోషల్‌మీడియాలో కొందరు బురద జల్లుతుంటే కడుక్కోవడం తమ వంతు అవుతున్నదని వాపోయారు. తన ఫొటోలు మార్ఫింగ్ చేసి విషప్రచారం చేయడంతో మనోవేదనకు గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నచెల్లెళ్లు చేతిలో చేయి వేసుకున్నా దాన్నీ మరోరకంగా చూపెట్టడం దారుణమన్నారు. సోషల్ మీడియాతో చాలా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయనీ, చిన్నాభిన్నమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి సోషల్ మీడియాను కట్టడి చేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. శనివారం అసెంబ్లీ లాబీల్లో ఆమె మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ నిర్వహించారు. సోషల్‌మీడియాలో పెట్టిన కొన్ని పోస్టులు తనను డీమోరల్ చేశాయన్నారు. మహిళలు రాజకీయాల్లో రావడం, ఎదగడమే కష్టమనీ, అలాంటిది తాము ఈ స్థాయికి వస్తే ఇలా ఇబ్బంది పెట్టడమేంటని వాపోయారు. సోషల్‌మీడియాను కరోనా సమయంలో సోషల్ సర్వీస్ కోసం తాను వాడుకున్నాననీ, అంతే స్థాయిలో ఇబ్బందులకు గురయ్యాయని పలు ఉదహరణలు తెలిపారు. బాడీ షేమింగ్, ఫొటోల మార్ఫింగ్, అననివి అన్నట్టుగా చూపెట్టడం వంటి ప్రమాదకర ధోరణులు పెచ్చరిల్లిపోతున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. ఏడాది కాలంగా రాష్ట్రంలో ఇది తీవ్రమైందన్నారు. సోషల్‌మీడియాలో అబద్ధాల ద్వారా బీఆర్ఎస్ నడుస్తున్నదని విమర్శించారు. అబద్ధాలకు కేరాఫ్ అడ్రస్‌గా బీఆర్ఎస్ మారిందన్నారు. ఏరోజుకైనా నిజమే గెలుస్తుందన్నారు. సోషల్‌మీడియా ఎఫెక్ట్ గురించి సీఎం రేవంత్‌రెడ్డి సభలో మాట్లాడటం తమలాంటి వారికి పెద్ద రిలీఫ్ అని చెప్పారు.

ఓటర్ ఐడీ, ఆధార్ లింకింగ్‌పై

18న సీఈసీ భేటీ



న్యూఢిల్లీ : ఓటర్ గుర్తింపు కార్డులను ఆధార్‌తో అనుసంధానించే విషయంపై చర్చించేందుకు ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ ఈ నెల 18న సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నారు. దీనికి హోం కార్యదర్శి, లెజిస్లేటివ్ శాఖ కార్యదర్శి, యూఐడీఏఐ సీఈఓ హాజరవుతారు. ఓటర్ల జాబితాలో అవకతవకలు చోటుచేసుకుంటు న్నాయనీ, ఒకే నెంబరుతో పలు ఓటరు కార్డులు జారీ అవుతున్నాయని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఈ సమావేశం జరుగుతోంది. ఓటర్ల జాబితాలను ఆధార్‌తో అనుసంధానించడం ప్రస్తుతానికి ఐచ్ఛికంగానే జరుగుతోంది. దీనిని తప్పనిసరి చేసే విషయంపై హోం కార్యదర్శి గోవింద్ మోహన్, లెజిస్లేటివ్ శాఖ కార్యదర్శి రాజీవ్ మణి, యూఐడీఏఐ సీఈఓ భువనేశ్ కుమార్‌తో సీఈసీ చర్చిస్తారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

నకిలీ ఓటర్ల నమోదు కోసం ఆధార్ కార్డులను క్లోనింగ్ చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయంటూ తృణమూల్ కాంగ్రెస్ ఈ నెల 11న ఎన్నికల కమిషన్‌కు మెమోరాండం అందజేసింది. ఆధార్ నెంబర్ల క్లోనింగ్ ఎపిక్, ఓటర్ల రిజిస్ట్రేషన్‌పై ప్రభావం చూపకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటారని అందులో ప్రశ్నించింది. కాగా సీఈసీ ఏర్పాటు చేయబోయే సమావేశం కేవలం కంటి తుడుపు చర్య మాత్రమేననీ, ఎన్నికలు జరిగే వరకూ నిఘా వేసి ఉంచుతామని రాజ్యసభలో తృణమూల్ కాంగ్రెస్ ఉప నాయకుడు సాగరికా ఘోష్ తెలిపారు.

జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ ఎత్తేయండి

- శాసనసభలో స్పీకర్‌ను కోరిన హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్ సభ్యులు జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్‌ను ఎత్తేయాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు మాజీమంత్రి, బీఆర్ఎస్ సభ్యులు హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు. శనివారం శాసనసభ సమావేశాలు ప్రారంభం కాగానే హరీశ్‌రావు మాట్లాడారు. జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ అంశాన్ని పున:పరిశీలించాలని కోరారు. జగదీశ్‌రెడ్డి స్పీకర్‌ను ఉద్దేశించి ఎక్కడ కూడా ఏకవచనంతో సంబోధించలేదని తెలిపారు. స్పీకర్ అంటే తమకు గౌరవం ఉందని చెప్పారు. సస్పెండ్ చేసేముందు జగదీశ్‌రెడ్డికి మాట్లాడే అవకాశమిస్తే బాగుండేదని అభిప్రాయపడ్డారు. ఏకపక్ష నిర్ణయాలు సరిగాదన్నారు.

కేసీఆర్ చావును కోరుతారా?

- ఇదేమి సంస్కారం? : మీడియా పాయింట్‌లో మాజీ మంత్రి వేముల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేసీఆర్ చావును కోరటమనేది ఏ సంస్కారమని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు. శనివారం అసెంబ్లీలోని మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటు కోసం, పదవులు త్యాగం చేసి, అలుపెరుగని పోరాటం చేసిన కేసీఆర్ పట్ల సీఎం రేవంత్ రెడ్డి కుసంస్కారంగా మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే శాసన సభలో ఆయన ఇచ్చిన సమాధానాన్ని తాము బహిష్కరించామని చెప్పారు. ఆయన ప్రసంగం మొత్తం కేసీఆర్ జపం, బీజేపీని పొగడ్తలతో ముంచెత్తారని ఎద్దేవా చేశారు. ఆరు గ్యారంటీలు, హామీల అమలు ప్రస్తావన ఊసే లేదని విమర్శించారు. ప్రతిపక్ష నాయకుడికి చాంబర్ కేటాయించటం కొన్ని దశాబ్దాలుగా ఉన్న సంప్రదాయమనీ, కానీ..ఈ ప్రభుత్వం కేసీఆర్‌పై అక్కసుతో చాంబర్‌నుంచి బైటికి గెంటేశారని తెలిపారు. ప్రతిపక్ష నాయకుడు సూచించిన వ్యక్తిని పీఏసీ చైర్మెన్‌గా నియమిస్తారనీ, కానీ.. పార్టీ మారిన వ్యక్తికి పదవి ఇవ్వటమేంటని ప్రశ్నించారు. ఇంత అసభ్యంగా ఏ ముఖ్యమంత్రి మాట్లాడలేదని గుర్తు చేశారు. అబద్ధాలకు చిరునామా సీఎం రేవంత్‌రెడ్డి అని చెప్పారు. అబద్ధాలతో సభను, రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. బాల్కొండ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 318 కోట్ల రుణమాఫీ చేస్తే, కాంగ్రెస్ రూ.170 కోట్లు మాత్రమే మాఫీ చేసిందని గుర్తు చేశారు. ఇది తప్పుని రుజువు చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాలు విసిరారు.



ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో 50శాతం మంది రైతులు రుణమాఫీ కాక ఇబ్బంది పడుతున్నారని ఆరోపంచారు. రైతుల రుణాల విషయంలో స్పష్టత లేదన్నారు. బీఆర్ఎస్ తెచ్చిన 317 జీవో వల్ల ఉద్యోగులు బాధపడుతున్నారని చెప్పారు. ఆ జీవో గురించి సీఎం ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు.

దన్‌పాల్ సూర్యనారాయణ గుప్త మాట్లాడుతూ గవర్నర్ చెప్పని అంశాలు కూడా ముఖ్యమంత్రి అసెంబ్లీలో చెప్పారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఓటమి నుండి ఇంకా సీఎం తేరుకోలేదని విమర్శించారు.

సీఎం ప్రసంగంలో బయటపడ్డ డొల్లతనం : పాల్వాయి హరీశ్

ఫెడరల్ స్ఫూర్తికి అనుగుణంగా కేంద్రం రాష్ట్రానికి సహకరిస్తున్నదనే విషయం ముఖ్యమంత్రి మాటల ద్వారా తెలుస్తోందని బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ అన్నారు. శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం నిధులు ఇవ్వకపోతే రాష్ట్ర ప్రభుత్వం ముందుకు పోలేదని తెలిపారు. బీజేపీతో ఢిల్లీలో దోస్తీ చేస్తున్న సీఎం.. ఇక్కడ ఆ పార్టీని తిడుతున్నారని చెప్పారు. జీతాలు ఇవ్వటానికి కూడా అప్పులు చేస్తున్నారని ఆరోపించారు.

సీఎం దిగజారి మాట్లాడుతున్నారు : ఎమ్మెల్యే కేపీ వివేకానంద



సీఎం రేవంత్‌రెడ్డి దిగజారి మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద విమర్శించారు. శనివారం అసెంబ్లీలోని మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ నామస్మరణ, విషంకక్కడం తప్ప సీఎం ప్రసంగంలో మరొకటి లేదని ఎద్దేవా చేశారు. గాంధీ భవన్‌లో మాట్లాడినట్టు అసెంబ్లీలో మాట్లాడితే ఎలా అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి అభద్రతా భావంతో ఉన్నారనీ, అందుకే కేసీఆర్ చావు కోరుతున్నారన్నారు. దుబాయ్‌లో ఎవరో చనిపోతే దాన్ని తమ పార్టీకి ఆపాదించటమేంటని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డికి రాజకీయాలపై పట్టుంటే ఆరుగురు మంత్రులను ఎందుకు నియమించలేకపోతున్నారో చెప్పాలని నిలదీశారు. బీజేపీ, కాంగ్రెస్ రహస్య స్నేహం బయటపడ్డదని చెప్పారు.

నా నియోజకవర్గంలోనే


31వేల మందికి రుణమాఫీ కాలేదు

- మాపై ఇంకెన్నాళ్లు ఏడుస్తారు? : మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



తన నియోజకవర్గ పరిధిలో 51 వేల మంది రైతులకు రుణమాఫీ కావాల్సి ఉండగా కేవలం 20 వేల మందికే అయిందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి నొక్కిచెప్పారు. ఇంకా 31 వేల మంది రైతులకు రుణమాఫీ కాలేదని ఎత్తిచూపారు. బీఆర్ఎస్ హయాంలో రెండు విడతల్లో చేసిన రుణమాఫీ కంటే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రుణమాఫీ చాలా తక్కువ అని కుండలుబద్దలు కొట్టినట్టు చెప్పారు. శనివారం శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపేక్రమంలో ఆయన మాట్లాడారు. తాను చెప్పింది అవాస్తవ మైతే సీఎం ఇచ్చే సమాధానంలో ఈ విషయాన్ని ప్రస్తావించాలని కోరారు. తాము నిలబడి మాట్లాడాలనుకుంటే చాలు కాంగ్రెస్ సభ్యులు ఎదురుదాడికి దిగుతు న్నారనీ, పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో అని విమర్శలు ఎక్కుపెడుతున్నారని వాపోయారు. తమ ప్రభుత్వం ఏమి చేసిందనేది గతమనీ, మీరు చేస్తామన్నది చేయకుండా తమ పార్టీపై పడి ఏడవటమేందని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినదగ్గర నుంచీ ఏడుస్తూనే ఉన్నారనీ, ఇంకా ఈ ఏడుపులు ఎన్నాళ్లు అంటూ నిలదీశారు. రుణమాఫీ చేశాం.. బోనస్ ఇచ్చాం.. రైతు బంధు ఇచ్చాం.. అని చెప్పుకోవడం గాదు.. ఎన్నికల సమయంలో ఏం చెప్పారు? హామీల సంగతేంటి? అసలు ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారు? ఎంత మందికి ఇచ్చారు? అనే దాన్ని వివరంగా మంత్రులు సమాధానాలు ఇవ్వాలని కోరారు.



సంపాదకీయం

అహంకారోక్తి!

తమపై బలవంతంగా హిందీని రుద్దేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని మండిపడుతున్న తమిళనాడు ప్రభుత్వం, తాను ప్రవేశపెట్టే బడ్జెట్ లోగోనూ మార్చేసింది. దేవనాగరి లిపిలో ఉండే రూపాయి చిహ్నం స్థానంలో తమిళ రూపాయి అక్షరాన్ని ఉంచింది. 'ఎల్లోర్ కుమ్ ఎల్లామ్'(అందరి కోసం అన్నీ) అని రాసి ఉన్న లోగోను విడుదల చేసింది. మాభాషను, నాగరికతను పార్లమెంటులో అపహాస్యం చేస్తుంటే, మేము దానిని రక్షించుకోవాలి కదా! అని తెలిపింది. ఇదిప్పుడు భాషాభిమానం, ఆత్మాభిమానం, ఆత్మగౌరవంగా చర్చ జరుగుతోంది.

"ఎంత మదమెంత కావరమెంత పొగరు" అని పింగళి నాగేంద్రగారు సినిమాల్లో రాసిన మాటలు ఈ సందర్భానికి సరిగ్గా సరిపోయేట్టున్నాయి. నోటి బలుపని కూడా వర్ణించుకోవచ్చు. వీళ్లు ఈ దేశాన్ని ఏలుతున్న మంత్రులా! లేక ప్రాంతాలకు, వాళ్ల వాళ్ల సంస్థలకు నియమించబడినవాళ్లా! దేశం మొత్తానికి, ప్రజలకు బాధ్యత వహించాల్సిన మంత్రుల భాషణం ఇంత దారుణంగా ఉండటం అత్యంత గర్హణీయం. పార్లమెంటులోనే కాదు, ప్రజలందరూ ప్రతిస్పందించాల్సిన విషయమిది. అది నేడు తమిళ ప్రజలకు సంబంధించినదే కావచ్చు. రేపు ఎవరినైనా అనటానికి వెనుకాడనితనమే కనపడుతున్నది. పార్లమెంట్ సాక్షిగా కేంద్రమంత్రి, అందులోనూ విద్యాశాఖ మంత్రి తమిళప్రజలను అనాగరికులంటూ వ్యాఖ్యానించడం తీవ్రమైన విషయం. గతంలోనూ ఈ 'ఉత్తర' కుమా రులు ద్రావిడులు నల్లవాళ్లని హీనంగా మాట్లాడటం విన్నాం. ఈ దేశంలోని ఒక ప్రాంత ప్రజలను అనాగరికులని అవమానించే పనికి ఒక మంత్రి పూనుకోవడాన్ని ముక్తకంఠంతో ఖండించాల్సిన విషయం. అందుకే సభలోని డి.ఎం.కె సభ్యులు ఆయనపై సభా హక్కుల ఉల్లంఘన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.

ముఖ్యంగా ఈ సంభాషణ చోటుచేసుకోవడానికి కారణం, త్రిభాషా సూత్రాన్ని తమిళనాడు అమలు చేయడం లేదన్న అక్కసుతో చేసిన వ్యాఖ్య. తమిళులు ఎప్పటినుంచో హిందీభాషను వారిపై రుద్దడాన్ని వ్యతిరేకిస్తూనే ఉన్నారు. కేంద్రం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపి2020) ప్రకారం మూడు భాషలు నేర్చు కోవాలని నిర్దేశిస్తున్నది. పరోక్షంగా హిందీని దేశమంతా రుద్దేందుకు ప్రయత్నం సాగుతోంది. విద్య ఉమ్మడి జాబితాలో ఉంది కనుక, రాష్ట్ర ప్రభుత్వ విధానం ప్రకారం ద్విభాషా విధానాన్ని కొనసాగిస్తామని తమిళనాడు అంటున్నది. ఉత్తర భారతంలో కూడా ద్రావిడభాషలు అమలు కావడం లేదు. అసలు ఒక లిపిలేని భాషను ఎక్కువ మంది మాట్లాడు తున్నారని అధికార భాషగా చేసి, అందరూ నేర్వాలని ఆంక్షలు పెట్టడమేమిటని విమర్శకుల వాదన. ఇది ఉత్తర భారత ఆధిపత్యాన్ని, కేంద్రీకృతతత్వాన్ని అమలు చేయడంలో భాగమనీ, ఆరోపణలు తలెత్తుతున్నాయి. ఇందులో భాషలపై ద్వేషాలు ఏమీలేవు. ఎవరైనా ఎన్ని భాషలైనా నేర్చుకోవచ్చు. భాషలను ప్రేమించనూవచ్చు. కానీ ఒక ఆధిపత్య ధోరణిలో భాగంగా భాషను రుద్దడాన్ని ఎవరూ అంగీకరించరు. ద్రావిడ ప్రాంతంపై హిందీని రుద్దడమే కాదు, ఉత్తర భారతంలోని అనేక ప్రాంతీయ భాషలు హిందీ ఆధిపత్యం వల్ల కనుమరుగై పోయాయనీ విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. ఇదిలా ఉంటే, త్రిభాషా విధానాన్ని అమలు చేయకపోతే విద్యారంగానికి నిధులు నిలిపివేస్తామని కేంద్ర ప్రభుత్వం బెదిరించడం, విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడటం సరి అయినది కాదు.

తమపై బలవంతంగా హిందీని రుద్దేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని మండిపడుతున్న తమిళనాడు ప్రభుత్వం, తాను ప్రవేశపెట్టే బడ్జెట్ లోగోనూ మార్చేసింది. దేవనాగరి లిపిలో ఉండే రూపాయి చిహ్నం స్థానంలో తమిళ రూపాయి అక్షరాన్ని ఉంచింది. 'ఎల్లోర్ కుమ్ ఎల్లామ్'(అందరి కోసం అన్నీ) అని రాసి ఉన్న లోగోను విడుదల చేసింది. మాభాషను, నాగరికతను పార్లమెంటులో అపహాస్యం చేస్తుంటే, మేము దానిని రక్షించుకోవాలి కదా! అని తెలిపింది. ఇదిప్పుడు భాషాభిమానం, ఆత్మాభిమానం, ఆత్మగౌరవంగా చర్చ జరుగుతోంది. ఇదిలా కొనసాగుతుండగా కేంద్రం మరో అంశాన్ని ముందుకు తెచ్చింది. దేశంలో నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ. దక్షిణాది రాష్ట్రాలకు నష్టం కలిగే విధంగా ఈ డీలిమిటేషన్ ప్రక్రియ ఉందని పెద్దఎత్తున విమర్శలొస్తున్నాయి. జనాభా ప్రాతిపదికన ఉత్తరాదిన పార్లమెంటు సీట్లు పెంచి, దక్షిణాదికి పెరగకపోతే, దక్షిణ భారతం యొక్క ప్రాధాన్యత తగ్గిపోతుంది. ఇది రాజ్యాంగ సమాఖ్య వ్యవస్థకు పూర్తి వ్యతిరేకమని, ఈ రాష్ట్రాల ముఖ్యమంత్రులు అభిప్రాయపడుతున్నారు. మనం పరి శీలించినట్లయితే, బీజేపీ విస్తరణకు దక్షిణ భారతదేశం పెద్ద ఆటంకంగా ఉన్న విషయం పదేండ్లుగా కనపడుతున్నది. తన కేంద్రీకృత జమిలి ఎన్నికల విధానాన్ని నెగ్గించుకోవటానికి దాని పార్లమెంటు సంఖ్యాబలం సరిపోవడం లేదు.

అందుకని ఏ విధంగానైనా డీలిమిటేషన్ ప్రక్రియలో ఉత్తరాదిలో సంఖ్యను పెంచుకోవాలనే ఆలోచనతో వాళ్లు ముందుకు పోతున్నారు. ఇది గమనించిన తమిళనాడు, ఈ నెల 22న దక్షిణాది రాష్ట్రాల అన్ని పార్టీల నాయ కులను, ముఖ్యమంత్రులను పిలిచి సమావేశం ఏర్పాటు చేస్తున్నది. ఒక్క ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఏమీ స్పందించలేదు. కాగా పిల్లల్ని ఎక్కువ కనండి, జనాభా పెంచండి అని పిలుపునిస్తున్నారు. కుటుంబ నియంత్రణను పాటించిన దక్షిణాది రాష్ట్రాల ప్రాధాన్యతను ఈ రకంగా తగ్గించే చర్యలను తిప్పికొట్టాల్సి ఉంది. బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలపై వివక్షాపూరితంగా, కక్షపూరితంగా వ్యవహరిస్తున్న కేంద్ర వైఖరిని ఎండగట్టాలి. అహంకారంతో దక్షిణాది ప్రజలపై చేస్తున్న వ్యాఖ్యలను ఖండించాలి.

దక్షిణాది ఆందోళనలూ, సనాతన సమర్థకులూ



తెలకపల్లి రవి

మార్చి 22న తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ చెన్నయ్‌లో ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశం దేశవ్యాపితంగా చర్చకు దారితీస్తున్నది. ఏకపక్షంగా లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన చేయడం దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరుగుతుందనే ఆందోళనతో నిర్వహిస్తున్న ఈ సమావేశానికి హాజరవుతున్నట్టు కేరళ, తెలంగాణ, కర్నాటక ముఖ్యమంత్రులు పినరయి విజయన్, రేవంత్ రెడ్డి, సిద్ధరామయ్య ప్రకటించారు. ప్రతిపక్షంలో ఉన్న వైఎస్ఆర్‌పార్టీ అధినేత జగన్‌నూ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కూడా ఈ సమావేశానికి ఆహ్వానించారు. ఒరిస్సా బీజేడీ ముఖ్యమంత్రి మాజీని, బెంగాల్ సీఎం, తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీని కూడా పిలిచారని చెబుతున్నారు. ఇంకా 'ఆప్' వంటి పలు రాజకీయ పార్టీల అధినేతలను కూడా ఆహ్వానించారు. ఇండియా వేదిక 2024 ఎన్నికలతో ముగిసిపోయిందని సీపీఐ(ఎం) జాతీయ సమన్వయకర్త ప్రకాశ్‌కరత్ చెప్పిన నేపథ్యంలో రాజకీయ చర్చకాకపోయినా రాజ్యాంగ అంశంపై జరిగే ఒక విస్తృతమైన రాజకీయ సమీ కరణ వేదికగా ఈ సమావేశం దృష్టిని ఆకర్షించడంలో ఆశ్చర్యం లేదు. సరిగ్గా ఈ నేపథ్యంలోనే హిందీని బల వంతంగా రుద్దడం కూడా పునర్విభజన చర్చకు తోడై వేడి పెరిగింది.

ఎదురుదాడి దేనికి?

ఈ సమావేశం ఇంకా జరగకముందే బీజేపీ, దాని భాగస్వాములైన జనసేన టీడీపీ, జనసేన వంటివి ప్రత్యక్షంగా పరోక్షంగా దాడి చేస్తున్నాయి. బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు, ఎంపీ లక్ష్మణ్ దేశాన్ని విభజించే రాజకీయాల కోసం చెన్నయ్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్ కలసి కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. ఈ దేశం ఏమైనా కేక్‌లా కోసుకుతినడానికా? అంటూ ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిఠాపురం జయకేతనం సభలో చేసిన వ్యాఖ్య ఇందుకు పరాకాష్ట. ఇదేదో భాషల మధ్య, ఉత్తరాది దక్షిణాది మధ్య, మతాల మధ్య యుద్ధమన్నట్టు పవన్ వ్యాఖ్యలు సాగాయి. తెలుగువారి పట్ల తమిళులు వివక్ష చూపిస్తారని ఆరోపించడమే గాక షరామామూలుగా తన సనాతన మంత్రంతో లౌకికతత్వంపైన విశృంఖల వ్యాఖ్యలకు ఆయన పాల్పడ్డారు. అసలు వివాదానికి కారణమైన కేంద్ర బీజేపీని నెత్తినెత్తుకుని ఉత్తరాది దక్షిణాది తేడాలేమిటని లౌకిక పార్టీలపై చిందులేశారు. మరోవైపున మంత్రి లోకేశ్ అనేక భాషలు నేర్చుకుంటే తప్పేమిటని హిందీ రుద్దే ప్రయత్నాలకు వంతపాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విషయానికి వస్తే నియోజకవర్గాలు తగ్గుతాయనేది కేవలం ఊహాగానంగా ఉందంటూ దాటవేశారు. (మళ్లీ ఆయనే 2029 నాటికి మహిళా రిజర్వేషన్ కింద ఏపీ శాసనసభలో డెబ్బయి స్థానాలు పెరుగుతాయని సభ సాక్షిగా ఊహించి చెప్పారు. లోక్‌సభలో పెరగకుండా శాసనసభలో మాత్రమే పెరిగే అవకాశముండదని వేరే చెప్పనవసరం లేదు.) దక్షిణాదికి ఒక్కసీటు కూడా తగ్గబోదని హోంమంత్రి అమిత్‌షా ఇటీవల చెప్పడాన్ని ఇలాంటి వారు ప్రస్తావిస్తున్నారు. కానీ ఇక్కడ తగ్గకపోయినా అక్కడ పెరిగితే కథ మళ్లీ మొదటికి వస్తుంది కదా అని దక్షిణాది నాయకులు వేసే ప్రశ్నకు మాత్రం సమాధానం లేదు. కనుక పునర్విభజన అయినా, హిందీ భాషను రుద్దడమైనా పూర్తి వివరాలు చెప్పకుండా కేంద్రం ఏకపక్షంగా వ్యవహరించడం వల్ల ఉత్పన్నమైన పరిస్థితి ఇది. పవన్ వంటివారు దక్షిణాది మోడీల్లా మారిపోయి ఎదురుదాడి చేసినంత మాత్రాన, చంద్రబాబు లోకేశ్ దాటేసినంత మాత్రాన ఒక వాస్తవ సమస్య లేకుండా పోదు. బీజేపీతో అనుకూలంగా ఉండే జగన్ కూడా తమ ఎంపీల సమావేశంలో ఈ అంశంపై పూర్తి చర్చ తర్వాతే నిర్ణయం తీసుకోవాలని చెప్పారని అంటున్నారు. చెన్నై సమావేశానికి ఆయన కాకపోయినా వైసీపీ ఎంపీలు హాజరయ్యే అవకాశముందని ఆ పార్టీవర్గాలు చెబుతున్నాయి గానీ నిజంగా ఏం జరుగుతుందో చూడాలి. ముందే చెప్పినట్టు ఈ విషయం వరకూ బీఆర్ఎస్ కూడా హాజరవుతానని ప్రకటించింది. కాకపోతే ఆ సమయంలో కూడా రేవంత్ సర్కారుకు సంస్కారం లేదనీ, స్టాలిన్‌కు సంస్కారం ఉంది గనక పిలిచారని కేటీఆర్ వ్యాఖ్యానించారు. 2023 శాసనసభ ఎన్నికలకు కాస్త ముందు నుంచి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బీజేపీపై విమర్శలు తగ్గించి కాంగ్రెస్‌పైనే కేంద్రీకరించడం తెలిసిన విషయమే. ఏతావాతా తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక పరిస్థితి కూడా ఈ దక్షిణాది సమ్మేళనంలో ఎలా వ్యక్తమవుతుందనేది మరో అంశం.

పునర్విభజన రహస్యం?

ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్నట్టు నియోజకవర్గాల తగ్గింపు అనేది ఊహాజనితమైన ప్రశ్న కాదు. పినరాయి విజయన్ దీనిపై స్పష్టమైన ప్రకటనే చేశారు. గతంలో చాలాసార్లు చెప్పుకున్నట్టు జాతీయ విధానంలో భాగంగా జనాభా తగ్గింపు కృషిలో జయప్రదమైన దక్షిణాది రాష్ట్రాల స్థానాల సంఖ్య తగ్గించడం కన్నా పొరబాటుండదు. అదే సమయంలో బీహార్, ఉత్తర ప్రదేశ్ వంటి రాష్ట్రాలు జనాభా విపరీతంగా పెరుగుతున్నా అదుపు చేయనందుకు సత్కరించినట్టు సీట్లు పెంచడమూ తప్పే అవుతుంది. చంద్రబాబు, స్టాలిన్ కూడా ఏ అధ్యయనం లేకుండా చెబుతున్నట్టు జనాభా పెంచేయమని పిలుపివ్వడమూ కాదు. కేంద్ర విధానం రాజ్యాంగబద్ధంగా, శాస్త్రీయంగా ఉండాలని పినరాయి తన ప్రకటనలో స్పష్టం చేశారు. ప్రతిరాష్ట్రానికీ ఇప్పుడున్న సీట్ల శాతం తగ్గకూడదు. జనాభా తగ్గించినందుకు సీట్ల తగ్గింపు శిక్ష కాకూడదు. 1952, 1963,1973లో అంటే ప్రతి దశాబ్దికి ఒకసారి జనాభా లెక్కల తర్వాత నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. అయితే 1976లో 42వ రాజ్యాంగ సవరణతో దాన్ని నిలిపేసి 2001 తర్వాత మళ్లీ చేపట్టాలని నిర్ణయించారు. ఈలోగా జనాభా నియంత్రణను ప్రోత్సహించి వివిధ రాష్ట్రాల మధ్య జనాభా అసమానతలు తగ్గించాలనేది ఇక్కడ ఉద్దేశం. 84వ రాజ్యాంగ సవరణ ప్రకారం దీన్ని 2031 వరకూ నిలిపేశారు. ఇప్పుడు హఠాత్తుగా ఆ చర్చ ముందుకు తెచ్చిన కేంద్రం దక్షిణాది రాష్ట్రాలకు నిష్పత్తి ప్రకారమే సీట్లు ఉంటాయి గానీ తగ్గబోవని మాట్లాడుతున్నది. అయితే ఇక్కడ సమస్య ఏమిటో పినరాయి సూటిగానే లేవనెత్తారు. సీట్ల నిష్పత్తిని కాపాడతారా లేక జనాభా నిష్పత్తిని కాపాడతారా? ఇందులో ఏది పాటించినా సీట్లు తగ్గుతాయని తేల్చిచెప్పారు. గతంలో 1952లో అప్పటి దక్షిణాది రాష్ట్రాల సీట్ల వాటా లోక్‌సభలో 25.35శాతం వుంటే 1967 నాటికి అది 24.13శాతానికి తగ్గింది. 1977లో ఉన్నవాటిని స్తంభింపచేసేనాటికి ఈ వాటా 23.85శాతానికి దిగజారింది. మామూలుగానే ఇంత తగ్గుదల కనిపిస్తుంటే ఇప్పుడు పెద్ద ఎత్తున జరిగిన జనాభా తగ్గింపు తర్వాత ఇది మరీ కోతపడటం అనివార్యం. కనుకనే పినరాయి వంటివారు ముందు మీ పునర్విభజన ప్రాతిపదిక ఏంటో చెప్పి సీట్ల విషయంలో న్యాయం జరిగేలా హామీ కల్పించి తర్వాతే అడుగు ముందుకేయాలంటున్నారు. ఇదేదో సీట్లు, పార్టీల సమస్యగా చూస్తే పొరబాటు. దేశవ్యాపిత విధానాలు రూపొందించే పార్లమెంటులో రాష్ట్రాలకు అందులోనూ పెద్ద భాగంగా వున్న మొత్తం దక్షిణాదికి తగు ప్రాతినిధ్యం లేకపోతే నష్టం కలుగుతుంది. దేశ సమైక్యతా భావనా దెబ్బతింటుంది. శుష్క నినాదాలతో అధీకృత దేశభక్తి భంగిమలతో తేలేది కాదు. నిజమైన సమాఖ్య భావనతో రాజ్యాంగ స్ఫూర్తితో ప్రజాస్వామిక అవగాహనకు రావాల్సి ఉంటుంది. ప్రతిజనాభా లెక్కల తర్వాత పార్లమెంటు నిర్ణయం మేరకు రాష్ట్రపతి ఆదేశాలతో నియోజకవ ర్గాల పునర్విభజన జరగాలని మాత్రమే రాజ్యాంగం చెబుతున్నది. ఇప్పుడు జనాభా తగ్గించిన రాష్ట్రాలకు నష్టం జరగకూడదంటే ఆ మేరకు నిర్దిష్టమైన కొత్త కొలబద్దలు కావాలి. వాటిపై రాష్ట్రాలతో వివరమైన చర్చ జరగాలి. అవేవీ లేకుండానే అమిత్‌షాతో సహా కేంద్ర పెద్దలు ఏకపక్షంగా మాట్లా డటం సందేహాలు పెంచుతున్నది. కేంద్రం ఏకపక్ష నిర్ణయాల నేపథ్యం, దక్షిణాన బీజేపీ బలం బాగా తక్కువ కా వడం, ఈ సందేహాలను తీవ్రం చేస్తుంది.



ముఖ్యమంత్రి చంద్రబాబు విషయానికి వస్తే నియోజకవర్గాలు తగ్గుతాయనేది కేవలం ఊహాగానంగా ఉందంటూ దాటవేశారు. (మళ్లీ ఆయనే 2029 నాటికి మహిళా రిజర్వేషన్ కింద ఏపీ శాసనసభలో డెబ్బయి స్థానాలు పెరుగుతాయని సభ సాక్షిగా ఊహించి చెప్పారు. లోక్‌సభలో పెరగకుండా శాసనసభలో మాత్రమే పెరిగే అవకాశముండదని వేరే చెప్పనవసరం లేదు.) దక్షిణాదికి ఒక్కసీటు కూడా తగ్గబోదని హోంమంత్రి అమిత్‌షా ఇటీవల చెప్పడాన్ని ఇలాంటి వారు ప్రస్తావిస్తున్నారు. కానీ ఇక్కడ తగ్గకపోయినా అక్కడ పెరిగితే కథ మళ్లీ మొదటికి వస్తుంది కదా అని దక్షిణాది నాయకులు వేసే ప్రశ్నకు మాత్రం సమాధానం లేదు.

1952, 1963,1973లో అంటే ప్రతి దశాబ్దికి ఒకసారి జనాభా లెక్కల తర్వాత నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. అయితే 1976లో 42వ రాజ్యాంగ సవరణతో దాన్ని నిలిపేసి 2001 తర్వాత మళ్లీ చేపట్టాలని నిర్ణయించారు. ఈలోగా జనాభా నియంత్రణను ప్రోత్సహించి వివిధ రాష్ట్రాల మధ్య జనాభా అసమానతలు తగ్గించాలనేది ఇక్కడ ఉద్దేశం. 84వ రాజ్యాంగ సవరణ ప్రకారం దీన్ని 2031 వరకూ నిలిపేశారు. ఇప్పుడు హఠాత్తుగా ఆ చర్చ ముందుకు తెచ్చిన కేంద్రం దక్షిణాది రాష్ట్రాలకు నిష్పత్తి ప్రకారమే సీట్లు ఉంటాయి గానీ తగ్గబోవని మాట్లాడుతున్నది. అయితే ఇక్కడ సమస్య ఏమిటో పినరాయి సూటిగానే లేవనెత్తారు. సీట్ల నిష్పత్తిని కాపాడతారా లేక జనాభా నిష్పత్తిని కాపాడతారా? ఇందులో ఏది పాటించినా సీట్లు తగ్గుతాయని తేల్చిచెప్పారు.

హిందీ, హిందూత్వ!

కేంద్రం ఏకపక్షంగా తీసుకొచ్చిన నూతన విద్యా విధానం కూడా దక్షిణాన తూర్పున రాష్ట్రాల్లో హిందీ బలవంతాన రుద్దుతున్నారనే నిరసనకు దారితీసింది. తూర్పున రాష్ట్రాల్లోనూ ఈ భావన ఉంది. కేంద్రం ఉత్తర ప్రత్యుత్తరాల్లోనూ పార్లమెంటు ప్రశ్నోత్తరాల్లోనూ కూడా హిందీనే పెంచడంపై ఎంపీలు నిరసన తెలియజేశారు. కేరళ సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిటాస్ దీనిపై సుదీర్ఘ లేఖ రాశారు. హిందీ భారతీయ ఆత్మ అని స్వయంగా అమిత్ షా ప్రకటించారు. తమిళనాడులో సంప్రదాయికంగా హిందీ సమస్యపై భావోద్వేగాలు ఎక్కువ గనక ఆ పేరే వినిపిస్తుంది గానీ సమస్య నిజమైందే. నూతన విద్యా విధానం త్రిభాషా సూత్రాని మళ్లీ ముందుకు తెచ్చింది. ప్రాథమిక విద్యలో మాతృభాషలో జరగాలని చెప్పడం గాక స్థానిక భాష లేదా ప్రాంతీయ భాష ఏదో ఒకదాంట్లో జరగాలని, మరోభారతీయ భాష కూడా నేర్వాలనీ ఆ విధానం చెబుతున్నది. ఇది అశాస్త్రీయమే గాక ఆ లేత వయసుకు భారం కూడా. ఇప్పటికే ఇంగ్లీషు మీడియంతో చదువులు మొదలవుతున్న స్థితిలో ప్రాంతీయ భాష, భారతీయ భాష అనడం హిందీ లేదా సంస్కృతం తెచ్చిపెట్టడానికే దారితీస్తుందనేది అనుభవం. హిందీ రాష్ట్రాల్లో ఆ భాష నేర్చుకుంటే సరిపోతుంది గాని ఇతరచోట్ల మరో భారతీయ భాష కింద హిందీనే నేర్పడం కద్దు. కేంద్రం నిధులు యంత్రాంగం, పథకాలు అన్నీ ఆ దిశలోనే ఉన్నాయి తప్ప ఇతర భాషలకోసం ఎలాంటి ఏర్పాటు లేదు. ఇంగ్లీషుతో పాటు తమిళం ఎలాగూ నేర్చుకుంటున్నప్పుడు హిందీని తప్పనిసరి చేయడమేమిటని తమిళనాడులో గత వందేళ్లుగా ఆందోళనలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యం చూడకుండా త్రిభాషా విధానం అమలు చేయకపోతే కేంద్ర విద్యానిధులు నిలిపేస్తామని మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వంటివారు నిర్ణయం తీసుకోవడం అప్రజాస్వామికం. బాధ్యతా రహితం. ఈ బలవంతపు శాసనాలు ఆపకుండా తమిళులు హిందీ వ్యతిరేకులన్నట్టు వారిపై అభాండాలు వేయడం అనుచితం. అంతటితో ఆగక పవన్ తెలుగువారిని తమిళులు అవమానిస్తారని చెబుతున్నారు. మద్రాసీలుగా పిలవబడే తెలుగువారి ఆత్మగౌరవం ఎన్టీఆర్ వల్లనే నిలబడిందని టీడీపీ వారు, ఆయన అభిమానులు చెబుతుంటారు. ఎన్టీఆర్‌ను గౌరవించ వచ్చు గాని అంతకుముందే మహానాయకు లెందరో ఉన్నారు. వీరతెలంగాణ సాయుధ పోరాటం వంటి ఘట్టాలూ వున్నాయి. ప్రజాస్వామ్య చైతన్యమూ ఉంది. నిజానికి పవన్ అపహాస్యం చేసిన పెరియార్ వంటివారి ద్రావిడ భావజాలం ఎన్టీఆర్ పౌరాణిక చిత్రాల్లో చూస్తాం. ఈయనే గతంలో హిందీ గో బ్యాక్ నినాదాన్ని రీ ట్వీట్ చేయడం, ప్రత్యేక ప్యాకేజి పాచిపోయిన లడ్డు అంటూ హిందీలో మాట్లాడి కేంద్రాన్ని ఎగతాళి చేయడం మర్చిపోలేము. తమిళ చిత్రాలు హిందీలో డబ్ చేయొద్దని పవన్ కల్యాణ్ మాట్లాడ్డం హాస్యాస్పదమే. ఎందుకంటే అక్కడ హిందీ సినిమాలు బాగా ఆడతాయి. షారుఖ్ ఖాన్ దీపికా పడుకునేల చెన్నై ఎక్స్‌ప్రెస్, రజనీకాంత్ ధారావీపై తీసిన కాలా వంటి చిత్రాలు కూడా చూశాం. ఇప్పుడు పాన్‌ఇండియా యుగంలో దక్షిణాదినే హిందీ పరిశ్రమ చూపు ఉంటున్నది. అవగాహన రాహిత్యం, అవకాశవాదం అనర్థదాయకం. సున్నితమైన భాషా సాంస్కృతిక సమస్యలను విశాల దృష్టితో చూడకుండా సనాతన సులోచనాలు తగిలించుకోవడం వల్ల సమగ్రంగా చూడలేక అరకొర వ్యాఖ్యలు చేస్తున్నారు. సినిమాల నుంచి ప్రాంతాలు, మతాల వరకూ ప్రతి విషయంలోనూ మోడీని మోయడమే కార్యక్రమంగా పెట్టుకున్న ఫలితమిది. ప్రకాశ్‌రాజ్ దీనికి సరిగ్గానే సమాధానమిచ్చారు. 22వ తేదీ సమావేశం ఈ విషయంలో సహేతుక సూచనలు చేస్తుందని, కేంద్రం కూడా సానుకూల దృష్టిలో ప్రజాస్వామికంగా నిర్ణయాలు తీసుకోవాలనీ ఆశిద్దాం.

కమలం పార్టీ... అబద్ధాల జీఎస్టీ

గతంలో ఉన్న విలువ ఆధారిత పన్ను (వ్యాట్)ను మోడీ అధికారంలోకొచ్చాక వస్తు సేవల పన్ను (జీఎస్టీ)గా మార్చారు. అది అమల్లోకి వచ్చిన తర్వాత పొద్దున్నే వాడే టూత్‌బ్రష్ నుంచి రాత్రి పడు కోబోయే ముందు వెలిగించే మస్కిటో కాయిల్ వరకూ దేన్నీ వదిలిపెట్టకుండా జీఎస్టీ బాదటం పరి పాటైంది. ఇడ్లీ సాంబారు మొదలుకుని హైదరాబాద్ బిర్యానీ వరకూ, ఆర్టీసీ బస్సు నుంచి ఎయిర్ బస్సు (విమానం) వరకూ దంచుడు దంచుతూ ముక్కు పిండి జీఎస్టీ వసూలు చేస్తోంది కేంద్రం. దీంతో సరుకులు కొన్నదాని కంటే ఈ పన్ను బాదుడుతోనే బెంబేలెత్తుతున్నారు ప్రజలు. ఇదంతా ఒక ఎత్తయితే...ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం శాసనసభలో ఇంకో దానిపైనా జీఎస్టీ వేయాలి, ఆ మేరకు పీఎం మోడీ సాబ్‌ను కోరతానంటూ ఛలోక్తులు విసిరారు. 'అబద్ధాలు ఆడటంలో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ సభ్యులు ఆరితేరారు. నిమిషానికో ట్వీట్, గంటకో అబద్ధం, పూటకో విమర్శలాగా ఉంది వారి వ్యవహారం, మమ్మల్ని తిట్టిపోయటమే వారు పనిగా పెట్టుకున్నారు, అందువల్ల అబద్ధాలపై కూడా జీఎస్టీ వేయాలంటూ ప్రధానికి చెబుతా, అప్పుడైనా గులాబీ పార్టీ వాళ్ల అబద్ధాలు ఆడకుంట ఉంటరేమో...' అంటూ ప్రధాన ప్రతిపక్షంపై సెటైర్లు విసిరారు. సరే... సీఎం చెప్పింది బాగానే ఉందిగానీ, ఆయన చెప్పినట్టు అబద్ధాలపై జీఎస్టీ విధించాల్సి వస్తే... ఫస్టు బుక్కయ్యేది కమలం పార్టీయేనంటూ సరదాగా వ్యాఖ్యానిస్తున్నారు రాజకీయ విశ్లేషకులు. ఎందుకంటే 2014 నుంచి ఇప్పటిదాకా ఈ దేశంలో ఎవ్వరూ ఇవ్వనన్ని హామీలిచ్చి, వాటిని యథేచ్ఛగా ఉల్లంఘించి, అబద్ధాల మీద అబద్ధాలు చెప్పింది, చెబుతున్నది కేంద్రంలోని కమలం పార్టీయే కదా? అందుకే అన్ని పార్టీల కంటే ఆ పార్టీయే 'అబద్ధాల జీఎస్టీ'ని ఎక్కువగా చెల్లించాల్సి వస్తుందన్నది వారి వాదన...

-బి.వి.యన్.పద్మరాజు

మేమే.. మేమే..!

అంతా మేమే...అది చేసింది మేమే...భవిష్యత్తులో చేసేది మేమే.. మీరేం చేసినా అది కరెక్టు కాదు. అది అలా కాదు..ఇలా చేయాలి. ఆ విధంగా చేయడం మీ చేతగానితనానికి నిదర్శనం. పదేండ్లు రాష్ట్రాన్ని పరిపాలించిన బీఆర్ఎస్ నేతల వాలకం తీరిది. పదేండ్లు ఏనాడైనా ఒకర్నైనా కలిస్తిరా? వారి సమస్యను వింటిరా? కోరింది చేస్తిరా? చివరకు ఇందిపార్కు వద్ద ధర్నాలకు అవకాశం ఉండదని చెప్పితిరి. అన్ని సమస్యలను మేమే పరిష్కరిస్తామంటిరి. ప్రగతి భవన్‌కు రానియ్యాకపోతిరి. సచివాలయానికి రాకుండా అడ్డుకుంటిరి. విత్తనాలు ఇవ్వకపోతిరి. ఎరువులు తేకపోతిరి. పెట్టుబడి ఇస్తిరి..నిమ్మలంగా ఉంటిరి. పరిశ్రమల స్థాపనపై పెద్ద ఎత్తున ప్రచారం చేస్తిరి. ఒప్పం దాలంటిరి, పెట్టుబడులు తెచ్చినంటిరి. ఏ ఊర్లో కంపెనీ పెట్టారో చెప్పరైతిరి. నిరుద్యోగులను గోసపెడితిరి. నోటి ఫికేషన్లు ఇవ్వకపోతిరి..ఏజీ పెరిగిపాయే..పిల్ల దొరక్క పాయే. పెద్దరోడ్లు ఏస్తిరి. ఊర్లు, తాండలను పట్టించుకోక పోతిరి. ఇప్పటికీ గర్భిణులను కావడిలో తీసుకరాబట్టిరి. కమిషన్లు, భూ దందాలు, లంచాలు, అవినీతి అందల మెక్కేలా చేస్తిరి. కార్మిక సంఘాలు ఉండవంటిరి..ఉద్యోగ సంఘాలతో చర్చలు లేవంటిరి. డీఏలు ఇవ్వకపోతిరి. ధర్నా చౌక్ లేదని చెప్పితిరి. అంబేద్కర్ విగ్రహం దగ్గర కూర్చొంటిరి. నినాదాలు ఇస్తిరి, పోతిరి. అమర నిరాహార దీక్ష అని బెదిరిస్తిరి. చేయకపోతిరి. అప్పులు చేస్తిరి...అమ్దాని రాకుండా పోతిరి. పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించక చేత్తిరి. చేసిన కష్టమంతా ప్రజలు వాటికి ఖర్చు చేస్తుంటిరి. ఇవన్నీ భరించలేక ప్రజలు 'సాగనంపిరి'. ఇప్పుడేమో గగ్గోలు పెడుతుంటిరి.

-గుడిగ రఘు

చిత్రాలు - చరిత్రలు

నజర్

స్కూలు నుంచి వచ్చీ రావటంతోనే స్కూలు బ్యాగును, టిఫిన్ బాక్స్‌ను చెరోపక్క విసిరికొట్టాడు బిట్టు. కోపంగా వెళ్లి సోఫాలో కూలబడ్డాడు. బిట్టూ ఏడవ తరగతి చదువుతున్నాడు. కమల్, వాణీల ఏకైక పుత్రుడు. తన ఆలోచనలు, ఆశయాలకు తగ్గట్టు కొడుకు తీర్చిదిద్దాలని కమల్ తాపత్రయం. అందుకు బిట్టూని తన వెంట సభలకు తీసుకెళుతుంటాడు. బిట్టూకి ఓ ఐఫోన్ కూడా ఇప్పించాడు. అంతేకాకుండా అనేక వాట్సప్ గ్రూపుల్లో చేర్పించాడు. తన ఆశయాలను బోధించే యూట్యూబ్ ఛానళ్లకు సబ్‌స్క్రైబ్ కూడా చేయించాడు. వీలు చిక్కినపుడల్లా "కాశ్మీర్ ఫైల్స్, కేరళఫైల్స్, రజాకార్" లాంటి 'చారిత్రాత్మక' సినిమాలు కూడా చూయిస్తుంటాడు.

ఇటీవల విడుదలైన 'ఛావా'ను హిందీలో, తెలుగులో కూడా రెండేసిసార్లు తండ్రీకొడుకులు ఎంతో తన్మ యత్వంతో చూశారు. ఆ సినిమా చూసి వచ్చిన మర్నాడే బిట్టూ స్కూలుకి వెళ్లి వచ్చి.. అన్ని విసిరి కొట్టాడన్న మాట.

"ఏమైందిరా అన్నీ విసిరికొడుతున్నావు?" అన్నది వాణి కోపంగా.

"డాడీ ఎప్పుడు వస్తాడు?" తల్లి మాట పట్టించుకోకుండా ఎదురు ప్రశ్న వేశాడు బిట్టూ.

"అడిగిందానికి సమాధానం చెప్పకుండా ఎదురుప్రశ్న వేస్తావేంట్రా?" మరింత కోపంగా అరిచింది వాణి.

"మమ్మీ ఇంకొక్క ప్రశ్న వేశావంటే నీవు కూడా విలన్‌వే?" అన్నాడు బిట్టూ.

"ప్రశ్నవేస్తే విలన్ అవుతానా? మరి స్కూల్ బ్యాగ్, టిఫిన్ బ్యాగ్ విసిరికొట్టి నీవు రౌడీవయ్యావు కదరా!" అంటూ బిట్టూ వీపు మీద ఒక్కటిచ్చింది వాణి.

"డాడీ వచ్చింతర్వాత నీ పని చెబుతానుండు!" అంటూ బయటికి పరుగెత్తాడు బిట్టూ.

తల బాదుకుంటూ వంటింట్లోకి వెళ్లింది వాణి.

ఇంతలోనే ఆఫీసు నుండి కమల్ వచ్చాడు.

"ఏడీ నా ముద్దుల కొడుకు?" అడిగాడు వాణిని.

"హీరో గారు బయటికి వెళ్లాడు!" అన్నది వాణి విసురుగా.

కమల్ నవ్వుకుంటూ బట్టలు మార్చుకుని వచ్చాడు. భార్య తెచ్చిన చాయి తాగుతూ కూర్చున్నాడు.

బయటి నుండి బిట్టూ వచ్చాడు. కషాయ జుబ్బా, పైజమా వేసుకున్నాడు. తలకు అదే కలర్ హెయిర్ బ్యాండు పెట్టుకున్నాడు. నుదుట పొడగాటి తిలకం దిద్దుకున్నాడు. ఆ గెటప్‌లో బిట్టుని చూసి కమల్ పొంగిపోయాడు.

"శెభాష్! బేటా నా కలలకు ప్రతి రూపంలా ఉన్నావు! ఏంకావాలో కోరుకో!" అన్నాడు కమల్ అభయమిస్తూ.

"నన్ను హీరోగా పెట్టి సినిమా తియ్యి డాడీ!" అన్నాడు బిట్టూ ఠీవిగా. కమల్ కండ్లు తిరిగాయి. కింద పడబోయి తమాయించుకున్నాడు.

"ఏం మాట్లాడుతున్నావురా! నరాలు కట్ అయిపోయినయి!" అన్నాడు కమల్ నోరు పెగల్చుకుని "పోసాని"లా

"నిజమే మాట్లాడుతున్నాను డాడీ! నన్ను హీరోగా పెట్టి సినిమా తియ్యి!" అన్నాడు బిట్టూ మరింత గట్టిగా.

కమల్‌కి ఏం చెప్పాలో అర్థం కాలేదు.

"ఇపుడు సినిమా తియ్యాలంటే కోట్లు ఖర్చు అవుతుందిరా! అంత డబ్బు మన వద్ద లేదు కన్నా!" అన్నాడు నీరసంగా.

"మన అదానీ అంకుల్‌ని అడుగు డాడీ ఇస్తాడు!" అన్నాడు బిట్టూ.

"అదానీ డబ్బులు మనకెందుకు ఇస్తాడ్రా!" అన్నాడు కమల్ ఆశ్చర్యంగా.

"అదేంటి డాడీ, అలా అంటావు. డబ్బులు గవర్నమెంటు వద్ద ఉంటే ఫ్రాడ్ చేస్తారని, అందుకే అన్నీ అదానీ కిస్తే, అదానీ, అంబానీ అంకుల్స్ నిరుద్యోగులకి బోలెడు ఉద్యోగాలు ఇస్తారని మొన్న నీవేకదా చెప్పావు! అంబానీ, అదానీల వద్ద మన డబ్బులు చాలా ఉన్నాయి కదా! అందులో కొన్నే కదా సినిమా తీయడానికి అడిగేది!" అన్నాడు బిట్టూ.

వంటింట్లో నుండి వాణి కిలా కిలా నవ్వింది.

వెంటనే వంటింట్లోకి వెళ్లి అక్కడే ఉన్న కత్తిపీట తీస్కుని వాణిని పొడిచెయ్యాలని అనిపించింది కమల్‌కి. కాని తమాయించుకున్నాడు.

"ఇంతకూ, సినిమా ఎందుకురా? నీవు హీరోగా ఎందుకు?" అడిగాడు కమల్.

"నా చరిత్రను రికార్డు చెయ్యడానికి!" అన్నాడు బిట్టూ, కాలు మీద కాలు వేసుకుని.

"నీకేం చరిత్ర ఉందిరా, ఇంకా చదువుతూనే ఉన్నావు కదా!" అన్నాడు కమల్ ఆశ్చర్యంగా.

"నేను పుట్టగానే నన్ను నీ చేతిలో పెడితే, నా బరువు నీవు భరించలేక నన్ను మంచంలో పడేస్తే, మంచం ఒంగిపోయినట్లు, నేను పాకుతుంటే బండలు అరిగిపోయినట్లు, నేను దొగ్గాడుతుంటే మూడు తలల నాగుపాము ఎదురొస్తే, దాన్ని పట్టుకుని నా తలకింద పెట్టుకుని నిద్రపోయినట్లు, సినిమాలో చూపించాలి!" అన్నాడు బిట్టు.

"ఒరేయి, నీవు పుట్టినపుడు బరువు తక్కువగా ఉన్నావని, నెలరోజులు ఇంక్యుబిలేటర్‌లో పెట్టారు, నీవు దొగ్గాడుతుంటే, ఆడుకుంటావని నీ ముందు బాల్ వేస్తే, గంటసేపు గుక్కపట్టి ఏడ్చావు కదా!" అన్నాడు కమల్.



"అదంతా నాకు తెలియదు! అదంతా చూపాల్సిందే. నేను యుకెజిలో స్కూలు ఫస్టు వచ్చినట్లు, ఫస్టు క్లాసులో టౌను ఫస్టు వచ్చినట్లు, ఫిఫ్త్ క్లాసులో స్టేట్ ఫస్టు వచ్చినట్లు, సెవెంత్ క్లాసులో ఆలిండియా ఫస్ట్ వచ్చినట్లు వీటిన్నింటికి మోడీ తాత మనింటికి వచ్చి నాకు మెమొంటో ఇచ్చినట్లు కూడా తీయాలి!" అన్నాడు బిట్టు.

బిట్టు స్క్రిప్టుకి కమల్ బిత్తరపోయాడు.

"నీవు చెప్పింది బానే ఉందిగాని, నీవు అన్ని క్లాసుల్లో అత్తెసరు మార్కులతోనే పాస్ అయ్యావు కదా! పైగా ఏడవ తరగతి ఇంకా చదువుతూనే ఉన్నావు! మరి ఎలా?" అనుమానంగా అడిగాడు కమల్.

"అదంతా నాకు అనవసరం! సినిమా చివర్లో నేను ఔరంగజేబు కరాటే ఫైటు చేసినట్లు, ఆ ఫైటింగ్‌లో నేను కొట్టిన దెబ్బలకి, ఔరంగజేబు గుర్రం మీద పారిపోతుంటే, నేను ఛేజ్ చేసి, ఔరంగజేబును చంపి నట్లు ఉండాలి! క్లైమాక్స్‌లో శంభాజీని చంపిన ఔరంగజేబును చంపి నేను రివెంజ్ తీసుకున్నట్లు చూపాలి!" అన్నాడు బిట్టు కసిగా.

బిట్టు విజువలైజేషన్ చూసి కమల్‌కి దిమ్మ తిరిగింది.

"బ్రహ్మాండం!" అంటూ చప్పట్లు కొట్టాడు.

మాంచి స్క్రిప్ట్! ఎలాగైనా సినిమా తీయాల్సిందే! ఏ1 సహాయంతో బ్రహ్మాండమైన సినిమా తీద్దాం!" అన్నాడు కమల్. తన కొడుకు ఔరంగజేబును చంపడమనే కాన్సెప్ట్ బాగా నచ్చింది.

"ఎపుడో చనిపోయిన ఔరంగజేబును, ఇప్పుడెలా చంపుతారు? చరిత్రను అలా వక్రీకరించొద్దు!" అన్నది వాణి నచ్చచెబుతూ.

"ఇప్పుడే డాడీ సినిమా తీస్తానని అన్నాడు! నీవు అడ్డుపడకు మమ్మీ! లేకపోతే ఇదే సినిమాలో నిన్ను కూడా విలన్‌గా పెడతాం!" అన్నాడు బిట్టూ కోపంగా.

"అవున్రా! మీ మమ్మీ చెప్పింది నిజమే. ఔరంగజేబు ఎపుడో చనిపోయాడు కదా!" అన్నాడు కమల్.

"ఏ1తో తీస్తానని ఇందాకే చెప్పావు కదా! నా క్యాడా ఓ డౌటు వస్తోంది. నీవు, నాకు చూపించిన కాశ్మీర్ ఫైల్స్, కేరళ ఫైల్స్, రజాకార్, చావా సినిమాలు కూడా ఏ1తోనే తీశారా? వాటి స్క్రిప్ట్ కూడా నేను తయారు చేసినట్లే చేశారా? చెప్పు డాడీ?" అడిగాడు బిట్టూ.

"ఆ సినిమాల్లో వచ్చినదంతా నిజమే! కావాలంటే వాట్సప్ ఎన్నిసార్లైనా చదువుకో!" అన్నాడు నమ్మకంగా కమల్.

"మరి నాది స్క్రిప్ట్ అంటావెందుకు? నాదీ చరిత్రే కావాలంటే వాట్సప్ చూడు!" అంటూ తన ఐఫోన్ తండ్రికి ఇచ్చాడు.

కమల్ ఐఫోన్‌లో బిట్టు ఫ్రెండ్స్ గ్రూప్ చూశాడు. అందులో బిట్టు ఇంతకు ముందు తన చిన్నప్పుడు చేసిన పనులు ఏవైతో చెప్పాడో అవన్నీ, ఫొటోలతో సహా ఉన్నాయి! మోడీతో మెమొంటో తీసుకుంటున్న ఫొటో ఉంది! గుర్రం మీద పారిపోతున్న ఔరంగజేబును బిట్టూ ఛేజ్ చేసి, ఔరంగజేబును కిందేసి చంపుతున్న వీడియో కూడా ఉంది!

అవన్నీ చూసి కమల్ కండ్లు బైర్లుకమ్మి దభీమని కిందపడిపోయాడు! మొహం మీద ఐసునీళ్లు చల్లినా లేవనే లేదు!

- ఉషాకిరణ్

సెమీ అర్బన్‌లోకి ఫోర్త్ సిటీ..!

ప్రస్తుతం 13,600 ఎకరాల భూ సేకరణ

600 ఎకరాల్లో హెచ్ఎమ్‌డీఏ లేఔట్లు

మరో 16 వేల ఎకరాల భూ సేకరణకు సన్నాహాలు

రాష్ట్ర రాజధాని విస్తరణలో ఫ్యూచర్ సిటీ 30 వేల ఎకరాల్లో నిర్మాణానికి ఏర్పాట్లు



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర రాజధాని విస్తరణలో భాగంగా ప్రభుత్వం ఫోర్త్ సిటీ ఏర్పాటును ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఫ్యూచర్ సిటీ పనులను వేగవంతం చేసేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి చెర్మెన్‌గా స్వయంగా సీఎం ఉండటంతో ఫోర్త్ సిటీ నిర్మాణంలో వేగం పెరగనుంది. 30 వేల ఎకరాల్లో అభివృద్ధి చేయనున్న ఫ్యూచర్ సిటీకి భూ సేకరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల్లో ప్రస్తుతం 13,600 ఎకరాలు ప్రభుత్వం చేతిలో ఉన్నాయి. మరో 16 వేల ఎకరాలు సేకరించేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించినట్టు అధికారులు తెలిపారు. ఫ్యూచర్ సిటీ నిర్మాణంలో రాష్ట్ర రాజధాని ముఖచిత్రం మారిపోనుందని నిపుణులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో పెద్దఎత్తున్న ఐటీ కంపెనీలు, ఎలక్ట్రానిక్, మ్యాన్‌ఫాక్చరింగ్ జోన్, ఏఐ సిటీ, లైఫ్‌సైన్స్, ఎడ్యుకేషన్, యూనివర్సిటీ జోన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇక్కడ జాతీయ, అంతర్జాతీయ కంపెనీలతో పెద్ద సంఖ్యలో పెట్టుబడులు పెట్టించడంతోపాటు, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి.

రంగారెడ్డి జిల్లాలో ఓఆర్ఆర్, రీజినల్ రింగ్ రోడ్డుకు మధ్యలో 30 వేల ఎకరాల విస్తీర్ణంలో ఫోర్త్ సిటీ (ఫ్యూచర్ సిటీ)ని నిర్మించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం రంగారెడ్డి జిల్లాలో సైబర్ సిటీ విస్తరించింది. ఫ్యూచర్ సిటీతో పూర్తిగా రంగారెడ్డి జిల్లా రాష్ట్ర రాజధానిలో భాగం కానుంది. రాష్ట్రాన్ని మూడు ప్రాంతాలుగా విభజించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది. ఓఆర్ఆర్ ప్రాంతానికి వెలుపల ఉన్న ప్రాంతాన్ని అర్బన్ ప్రాంతం, ఓఆర్ఆర్ నుంచి రీజినల్ రింగ్ రోడ్డు ప్రాంతం వరకు సెమీ అర్బన్ ప్రాంతంగా, మిగిలిన ప్రాంతాన్ని గ్రామీణ తెలంగాణ ప్రాంతంగా విభజించే అవకాశాలు ఉన్నాయి.

సెమీ అర్బన్ ప్రాంతంలో మౌలిక వసతుల కల్పనకు మొదటగా ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ఇప్పటికే స్కిల్ యునివర్సిటీ, 600 ఎకరాల్లో హెచ్ఎమ్‌డీఏ లేఔట్ చేసింది. ఫోర్త్ సిటీ అభివృద్ధికి రూ.12,972 కోట్లు అవసరమని రాష్ట్ర ప్రభుత్వం అంచనాలు వేసింది. ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి కావాల్సిన భూ సేకరణకు, మౌలిక వసతుల కల్పనకు నిధుల కేటాయింపు విషయంలో కూడా ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇప్పటికే ఫార్మాసిటీ పేరుతో కందుకూరు, యాచారం మండలాల పరిధిలో 13,600 ఎకరాల భూమిని సేకరించింది. అయితే, ఈ ఫార్మాసిటీ స్థానంలో ఫోర్త్ సిటీ, నెట్‌జీరో సిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. దీనిలో భాగంగా ఇప్పటికే మీర్‌ఖాన్‌పేట కేంద్రంగా ఇటీవల స్కిల్ యూనివర్సిటీకి సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అయితే, ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి మరో 16 వేల ఎకరాల భూమి అవసరం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. భూసేకరణకు సంబంధించి నిధులు కూడా సమకూర్చినట్టు అధికారులు తెలిపారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో ఫోర్త్ సిటీ

ప్రపంచ దేశాలు ఫోర్త్ సిటీ వైపు చూడాలన్నదే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రూట్ మ్యాప్ తయారు చేస్తోంది. ఇందులో భాగంగా అంతర్జాతీయ స్థాయిలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు అంకురార్పణ చేసింది. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు కలిగిన కంపెనీలను ఇక్కడ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఎలక్ట్రానిక్, మ్యాన్‌ఫాక్చరింగ్ జోన్, ఏఐ సిటీ, లైఫ్‌సైన్స్, ఎడ్యుకేషన్, యూనివర్సిటీ జోన్‌ల ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

పంట ఎండి.. రోడెక్కిన రైతన్న

- రూ.50 వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్
- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు
- జిల్లాకు వస్తున్న సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన ప్రకటన చేయాలి : సీపీఐ(ఎం) జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి



నవతెలంగాణ-జనగామ

వేసిన పైర్లు మొత్తం సాగునీరు అందక వాడుముఖం పట్టగా.. ఇప్పటికే సగం వరకు ఎండిపోయాయి. కాయకష్టంతోపాటు వేలాది రూపాయలు ఖర్చుపెట్టిన రైతులు కన్నీటిపర్యంతమవుతున్నారు. నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలంటూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో జనగామ జిల్లావ్యాప్తంగా శనివారం ధర్నాలు, రాస్తారోకోలు చేశారు.ఎండిన పంటలకు ఎకరానికి రూ.50వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ రోడ్డెక్కారు. జిల్లాలో ఎండుతున్న పంటలను కాపాడేందుకు గోదావరి జలాలు విడుదల చేయాలని, ఎండిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంతోపాటు స్టేషన్‌ఘన్‌పూర్, జఫర్‌గడ్, బచ్చన్నపేట, లింగాలగణపురం, పాలకుర్తి మండల కేంద్రాల్లో రైతులు ధర్నా, రాస్తారోకోలు నిర్వహించారు. జనగామ పట్టణంలోని నెహ్రూ పార్క్ వద్ద రాస్తారోకోతో జనగామ- సిద్దిపేట వైపుకు వెళ్లే వాహనాలు పెద్దఎత్తున నిలిచిపోయాయి. ఈ ధర్నాలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో ఎండిన పంటలకి ఎకరానికి రూ.50వేల నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాకు వస్తున్న సీఎం రేవంత్ రెడ్డి రైతాంగాన్ని ఆదుకోవడం కోసం స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు.భూగర్భ జలాలు తగ్గడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. యాసంగిలో నీటి వనరుల ఆధారంగా.. తక్కువ ఎకరాల్లోనే రైతులు పంటలు సాగుచేశారని, వేసిన కొద్దిపాటి పంటలు కూడా ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఎండిపోయాయని అన్నారు. చెరువులు, కుంటలు నింపకపోవడంతో ఈ దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలోనూ అంతంత మాత్రంగానే రైతులు పంటలు పండించారని తెలిపారు.యాసంగిలోనైనా పంట పండుతుందని ఆశిస్తే నిరాశే మిగిలిందన్నారు. రైతులందరికీ బ్యాంకు రుణాలు మాఫీ కాకపోవడం, తిరిగి రుణాలు ఇవ్వకపోవడం, రైతు భరోసా మొత్తం రైతుల ఖాతాలో జమ కాకపోవడం, పండిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారుజిల్లా అధికార యంత్రాంగం, నీటిపారుదల శాఖ అధికారులు జనవరి, ఫిబ్రవరి మాసాల్లో దేవాదుల కాలువల ద్వారా రిజర్వాయర్లు, చెరువులు, కుంటలను నీటితో నింపితే ఇలాంటి దారుణ పరిస్థితులు వచ్చేవి కావన్నారు. అధికారుల, పాలకుల నిర్లక్ష్యమే పంటలు ఎండిపోవడానికి కారణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి వెంటనే పూర్తిస్థాయిలో ఎండిన పంటలను సర్వే నిర్వహించి రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఇ.అహల్య, బోట్ల శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, ఎండి.అజారుద్దీన్, నాయకులు బాల్నే వెంకటమల్లయ్య, కుర్ర ఉప్పలయ్య, దారావత్ మహేందర్, అజ్మీర సురేష్ నాయక్, కన్నెబోయిన బాలరాజ్, మంగ బీరయ్య, బొట్ల శ్రావణ్, పాము శ్రీకాంత్, మణిరత్నం, బండ సౌందర్య, మల్లేష్ రాజా, సుధాకర్, కర్రే రాములు, కర్రే సత్తయ్య, కిష్టయ్య, ఓర్య నాయక్ పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యే కాంగ్రెస్ లక్ష్యం

- తెలంగాణ రాష్ట్ర జవహర్ బాల్ మంచ్ చైర్మెన్ మామిడి రిషికేష్ రెడ్డి



నవతెలంగాణ-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర విద్యార్థులకు మెరుగైన విద్యనందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మిస్తోందని తెలంగాణ రాష్ట్ర జవహర్ బాల్ మంచ్ చైర్మెన్ మామిడి రిషి కేష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన విద్యార్థుల తరుపున సీఎం రేవంత్‌రెడ్డికి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకి, మంత్రివర్గానికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికల హామీలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం వైపు అడుగులు వేసిందని అన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 55 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను రూ. 11,5000 కోట్లతో 25 ఎకరాలలో నిర్మించనుందనీ, ఒక్కో స్కూల్‌ను రూ.200 కోట్లతో అధునాతనమైన హంగులతో అందుబాటులోకి తేనుందని అన్నారు. దీని ద్వారా సుమారు మూడు లక్షల మంది లబ్ది పొందుతారని తెలిపారు. ఇప్పటికే పైలెట్ ప్రాజెక్టు కింద కొడంగల్, మధిరలో ఈ ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల క్యాంపస్‌లు నిర్మిస్తున్నారన్నారు.

ఈ స్కూళ్ల ప్రత్యేకతలు

1.ప్రభుత్వం నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఒక్కో దాంట్లో 2,560 మంది విద్యార్థులు 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుకోనున్నారు.

2. పాఠశాలలకు వేర్వేరు బ్లాక్‌లు ఉంటాయి. ప్రతి స్కూల్లో 30 మంది చొప్పున 120 మంది టీచర్లు పనిచేస్తారు. అలాగే.. లైబ్రరీలో 5 వేల పుస్తకాలు, కంప్యూటర్ కేంద్రంలో 60 కంప్యూటర్లు ఉంటాయి. అన్ని తరగతి గదుల్లో డిజిటల్ బోర్డులు ఉంటాయి.

3.ఈ ఇంటిగ్రేటెడ్ గురుకుల భవనాలు నిర్మించే ప్రాంతాల్లో 25 ఏండ్ల క్రితం నుంచి అక్కడి ఉష్ణోగ్రతలు, వర్షపాతం, చలి, వేడిగాలుల తీవ్రత తదితర వాతావరణ అంశాల్ని ఆర్కిటెక్ సంస్థ పరిగణనలోకి తీసుకుంది. వాతావరణ అనుకూల భవనాలను డిజైన్ చేసింది.

4. ప్రతి డార్మిటరీ గదిలో పది బెడ్‌లు, రెండు బాత్‌రూములు ఉండేలా ప్రణాళిక చేసింది. క్యాంపస్‌లో తరగతి గదులు, ల్యాబొరేటరీలు కాకుండా.. కంప్యూటర్ సెంటర్, లైబ్రరీ, ఆడిటోరియం, ఇండోర్ స్పోర్ట్స్, క్రికెట్, ఫుట్‌బాల్ మైదానాలు, బాస్కెట్‌బాల్, వాలీబాల్, టెన్నిస్ కోర్టులు, ఔట్‌డోర్ జిమ్, థియేటర్, ల్యాండ్‌స్కేప్ కోర్టులు వంటి అధునాతనమైన సౌకర్యాలతో నిర్మించనున్నారు.

హిందీని రుద్దొద్దు

(మొదటిపేజీ తరువాయి)

ఇతరులపై హిందీని రుద్దేందుకు పవన్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఒక భాషను వ్యతిరేకించడం అంటే దాని పట్ల ద్వేషంతో కాదనీ, మాతృభాషను, సాంస్కృతిక గుర్తింపును పరిరక్షించుకోవడానికే తాము ఆ భాషను వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. "మీ హిందీ భాషను మా మీద రుద్దకండి. ఇలా చెప్పడమంటే మరో భాషను ద్వేషించడం కాదు. స్వాభిమానంతో మా మాతృభాషను, మా తల్లిని కాపాడుకోవడం అని పవన్ కళ్యాణ్ గారికి ఎవరైనా చెప్పండి" అని ఆయన తన పోస్ట్‌లో సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లోని పిఠాపురంలో శుక్రవారం జరిగిన జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభలో పవన్ కళ్యాణ్ ప్రసంగిస్తూ హిందీని వ్యతిరేకిస్తున్న తమిళనాడు రాజకీయ నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

విదేశీ జర్నలిస్టులకు శిక్షణ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ఆయా దేశాలకు చెందిన పలువురు విదేశీ జర్నలిస్టులకు రాష్ట్ర ప్రభుత్వ శిక్షణ శనివారంతో ముగిసింది. గయానా, టాంజానీయా, నేపాల్, శ్రీలంక, సురినామ్ దేశాలకు చెందిన మొత్తం 26మంది జర్నలిస్టులకు ఆయా అంశాల్లో శిక్షణ ఇచ్చారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవవనరుల కేంద్రంలో రెండు వారాలపాటు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ డాక్టర్ శశాంక్ గోయల్ మాట్లాడుతూ ప్రపంచంలోని మీడియా ప్రతినిధులంతా ఆయా వ్యవస్థలపై నిఘా ఉంచి వాచ్‌డాగ్‌లా వ్యవహరించాలని అభిప్రాయపడ్డారు. జర్నలిస్టులు ప్రభుత్వాలు, ప్రజలకు మధ్య వారధులుగా ఉండాలని చెప్పారు. తాజా ఏఐ జర్నలిజంలో కీలకభూమిక పోషిస్తున్నదన్నారు. జర్నలిస్టులు కేవలం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంతోపాటు నిజాలు మాత్రమే రాయాలని చెప్పారు. సమాచారం ఎప్పటికప్పుడు సేకరిస్తూ పోటీ ప్రపంచంలో ముందుకు సాగుతుండాలని వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమం జర్నలిస్టులకు ఉపయోగ పడుతుందని ఆశిస్తున్నామని వివరించారు.

బీసీలకు బడ్జెట్‌లో 42 శాతం నిధులు కేటాయించాలి

బీసీ ఇంటలెక్చువల్ ఫోరంలో వక్తలు



నవతెలంగాణ-బంజారా హిల్స్

బీసీలకు జనాభా ప్రకారం బడ్జెట్‌లో 42శాతం నిధులు కేటాయించాలని బీసీ ఇంటలెక్చువల్ ఫోరంలో వక్తలు డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ తరహాలో బీసీ సబ్‌ప్లాన్ చట్టం తీసుకొచ్చి నిధులు విడుదల చేయాలని కోరారు. కాన్షీరామ్ జయంతి సందర్భంగా శనివారం బీసీ ఇంటలెక్చువల్ ఫోరం, జాతీయ బీసీ సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో 'బడ్జెట్లు - బీసీల వాటా- సబ్‌ప్లాన్ ఆవశ్యకత" అనే అంశంపై హైదరాబాద్ బేగంపేట్‌లోని హోటల్ హరిత ప్లాజాలో జాజుల శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు తీర్మానాలను ప్రవేశపెట్టారు. బీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మెన్ టి.చిరంజీవులు మాట్లాడుతూ.. తీర్మానాల ప్రతులను కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీకి, సీఎం రేవంత్‌రెడ్డికి, టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్‌గౌడ్‌కు అందజేస్తామని తెలిపారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం ప్రభుత్వ కాంట్రాక్ట్ పనుల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అందరికీ సమానంగా రాజ్యాంగ ఫలాలు అందుకొన్నప్పుడే సామాజిక న్యాయం దక్కుతుందన్నారు. రాజకీయాధికారంతోనే హక్కులు సాధించుకోవచ్చని, ఆ దిశగా బీసీలంతా ఏకమై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మెన్ ఈరవత్రి అనిల్, బీసీ కమిషన్ మాజీ చైర్మెన్ వకుళాభరణం కృష్ణమోహన్, డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు విశారదన్ మహరాజ్, ప్రొఫెసర్ మురళీమనోహర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీసీ కుల సంఘాల జేఏసీ కన్వీనర్ బాలగోని బాల్‌రాజ్ గౌడ్, ఓబీసీ ఇంటలెక్చువల్ ఫోరమ్ జాతీయ అధ్యక్షులు ఆళ్ల రామకృష్ణ, బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్, విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు విక్రమ్ గౌడ్, మహిళా విభాగం అధ్యక్షులు మణి మంజీర తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- ప్రభుత్వానికి కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హోంగార్డులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం శాసనమండలిలో ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. చాలీచాలని జీతాలతో హోంగార్డులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. హోంగార్డులకు పోలీస్ ఉద్యోగాల భర్తీలో 25 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించడంతో పాటు స్థానికంగా విధులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. హోంగార్డులందరికీ హెల్త్ కార్డులు అందించాలని విజ్ఞప్తి చేశారు.

కళాశాలల్లో ఫీజుల పెంపు ప్రతిపాదన తిరస్కరించాలి

- ఏఐఎస్ఎఫ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ప్రయివేట్ ఇంజనీరింగ్ కళాశాలలు వచ్చే విద్యా సంవత్సరం నుంచి బీటెక్ ఫీజులు పెంచాలని టీజీఎఫ్ఆర్సీ ముందు పెట్టిన ప్రతిపాదనలను ఉన్నత విద్యామండలి, టీజీఎఫ్ఆర్సీ తిరస్కరించాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ, పుట్ట లక్ష్మణ్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒక్కో కళాశాల వారు ప్రస్తుతం ఉన్న ఫీజులో 50 శాతానికిపైగా ఫీజులు పెంచాలని ప్రతిపాదించడం దారుణమని పేర్కొన్నారు. ఇప్పటికే ప్రయివేట్ ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలు అధిక ఫీజులతో దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. ఇంజనీరింగ్ విద్యను పూర్తిగా వ్యాపారమయంగా మార్చారని ఆందోళన వ్యక్తం చేశారు. డిమాండ్ ఉన్న కోర్సు సీట్లకు ఇష్టానుసారంగా ఫీజులు పెంచుతున్నారని తెలిపారు. సీట్లను బ్లాక్‌లో పెడుతూ మెరిట్ విద్యార్థులకు ఇవ్వకుండా లక్షల రూపాయల ఫీజులు కట్టేవారికి సీట్లిస్తున్నారని ఆరోపించారు. కొన్ని కోర్సులకు విపరీతమైన డిమాండ్ పెరిగిన నేపథ్యంలో ఆ సీట్లకు అడ్మిషన్ల కొరత సృష్టించి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షల రూపాయల ఫీజులు రాబడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇంజనీరింగ్ విద్య పేదవారికి అందే అవకాశం లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

టెలిమెట్రిక్ సిస్టమ్‌ను పెట్టిస్తున్నాం

- కృష్ణా ఆయకట్టు సమస్యలకు కారణం బీఆర్ఎస్సే
- సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్నాం : మంత్రి ఉత్తమ్‌కుమార్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కృష్ణా జలాల నీటి వినియోగంపై టెలిమెట్రిక్ సిస్టమ్‌ను పెట్టిస్తున్నామని సాగు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. కేసీఆర్ నిర్ణయాల వల్లనే కృష్ణా జలాల వాటాలో తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందని చెప్పారు. పులిచింతల ప్రాజెక్టు వల్ల తెలంగాణకు న్యాయమే జరిగిందన్నారు. శనివారం శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ సభ్యులు సభలో అవాస్తవాలు మాట్లాడుతూ ప్రజల్ని తప్పుదోవ పట్టించొద్దని సూచించారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీవర్గీకరణకు క్లియర్ చేసే పనిలో తమ ప్రభుత్వం ఉందన్నారు. బీసీ కులగణన విషయంలో అంకెల మీద ఎలాంటి అపోహలు అవసరం లేదన్నారు. 1,04,000 మంది ప్రభుత్వ ఉద్యోగులు 50 రోజులు కష్టపడి వివరాలు సేకరించారని తెలిపారు. ఇంత శాస్త్రీయ పద్ధతిలో ఏ కులగణన కూడా ఇప్పటివరకూ జరగలేదన్నారు. రాష్ట్రంలో బీసీల జనాభా ఆరు శాతం పెరిగిందన్నారు. ఓసీల సంఖ్య ఆరు శాతం తగ్గిందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అసెంబ్లీలో డిక్లర్ చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపబోతున్నామని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కరోజులో సమగ్ర కుటుంబ సర్వే చేసి ఇప్పటి వరకు కూడా వివరాలు వెల్లడించలేదని విమర్శించారు. కేటీఆర్, కేసీఆర్, హరీశ్‌రావు సర్వేలో ఎందుకు పాల్గొనలేదని నిలదీశారు. తమ ప్రభుత్వం సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందన్నారు. పోతిరెడ్డి పాడు నుంచి 44 క్యూసెక్కుల నుంచి 88 క్యూసెక్కులను తరలించుకుపోయేలా కాల్వ చేసింది బీఆర్ఎస్ హయాంలోనేనని చెప్పారు.

బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష

- ఎంజేపీ కార్యదర్శి బడుగు సైదులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీసీ గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న 6నుంచి తొమ్మిదో తరగతుల సీట్లను భర్తీ చేయటానికి నిర్వహించే ప్రవేశ పరీక్షకు ఈ నెల 31 లోగా దరఖాస్తు చేసుకోవాలని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో www.mjptbcwreis.telangana.gov.in,https://mjptbcadmissions.org వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. 6, 7, 8, 9 తరగతుల (ఇంగ్లీష్ మీడియం)లో మొత్తం 6,832 బ్యాగ్‌లాగ్ సీట్లు ఉన్నాయనీ, అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వచ్చే నెల 20న (ఆదివారం) ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆ పరీక్షలో వచ్చిన మెరిట్ ఆధారంగా విద్యార్థుల ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షకు అర్హతగల విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం, అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.



నియోజకవర్గాల పునర్విభజనపై నేడు అన్ని పార్టీలకు ఆహ్వానం

- వేదిక ఖరారుపై చర్చ
- సీనియర్ నేత జానాతో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క భేటీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జనాభా ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజనపై ముందస్తుగా జాగ్రత్త పడాల్సినవసరం ఉందని గత క్యాబినెట్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఈ అంశంపై రాష్ట్రంలోని అన్ని పార్టీలతో మాట్లాడాలనీ, డిప్యూటీ సీఎంకు, సీనియర్ నేత జానారెడ్డిలకు సీఎం రేవంత్ సూచించారు. ఆ సూచనలో భాగంగా ఇప్పటికే రాజకీయ పార్టీలకు బహిరంగ లేఖను విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లడంలో భాగంగా శనివారం సీనియర్ నేత జానారెడ్డితో భట్టి విక్రమార్క భేటీ అయ్యారు. రాజకీయాలకతీతంగా, అన్ని పార్టీల నాయకులతో సంప్రదించి రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలని ఇరువురు చర్చించారు. ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేయడంలో భాగంగా శనివారమే అన్ని పార్టీల నాయకులతో ఫోన్‌లో మాట్లాడి .. ఎవరికీ ఇబ్బంది లేకుండా ఒక వేదికను (సచివాలయం లేదా పూలే ప్రజా భవన్) నిర్ణయించి.. ఖరారు చేయాలని నిర్ణయించారు.

కొత్తగూడెంలో విమానాశ్రయాన్ని ఏర్పాటు చేయండి

- సీపీఐ సభ్యులు కూనంనేని సాంబశివరావు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఉమ్మడి ఖమ్మం జిల్లా కొత్తగూడెం ప్రాంతంలో ఎప్పటి నుంచో ప్రతిపాదన ఉన్న విమానాశ్రయానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించాలని సీపీఐ సభ్యులు కూనంనేని సాంబశివరావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండటంతో నిధులు వస్తున్నాయని చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం సందర్భంగా ఆయన మాట్లాడారు. రామగుండం, కొత్తగూడెం ప్రాంతాలకు విమానాశ్రయం రాకుండా కొంత మంది కుట్ర చేస్తున్నట్టు కాంగ్రెస్ ఎంపీ అన్నారని గుర్తు చేశారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంలో సీఎం ఆత్మవిశ్వాసంతో మాట్లాడారని తెలిపారు. శాసనసభకు రానివారు కూడా స్వేచ్ఛ, భావస్వేచ్ఛ అంటున్నారనీ, ఈ విధమైన సంస్కృతి ఎక్కడి నుంచి వచ్చిందని ప్రశ్నించారు.

ఈ విద్వేష సంస్కృతి ఆంధ్రప్రదేశ్ నుంచి వస్తుందా? అని అనుమానం వ్యక్తం చేశారు. దాన్ని నియంత్రించాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న చట్టాలతో ఆ సంస్కృతిని నియంత్రించ వచ్చా...లేక కొత్త చట్టం అవసరమవుతుందా? అనేది ఆలోచించాలని సూచించారు. నలుగురైదుగురు కూడి ఏదిబడితే అది మాట్లాడితే కుదురుతుందా? అని ప్రశ్నించారు. దీనిపై జర్నలిస్టులు, రాజకీయ నాయకులతో ప్రత్యేకంగా సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజా సమస్యలపై మాట్లాడితే అర్బన్ నక్సలైట్లు అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో వస్తున్న కామెంట్లను సీఎం ఎలా భరిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. జర్నలిస్టులు సమాజానికి దిక్సూచి కావాలనీ, పరిధి దాటిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులకు జీతాలు అందడం లేదని చెప్పారు. రైతు రుణమాఫీ 80శాతం అయిందనీ, సాంకేతిక కారణాలతో ఆగిపోయిన రుణమాఫీని వెంటనే అమలు చేయాలని అన్నారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్యకు సీఎం అపాయింట్‌మెంట్ దొరకలేదంటూ సోషల్‌మీడియాలో వచ్చిందనీ, అలాంటి విషయాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీఎంను కోరారు.

పాఠశాలల పని వేళలు మార్పు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఒంటి పూట బడుల పని వేళలను ప్రభుత్వం మార్చింది. ఈ మేరకు శనివారం పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ.నర్సింహారెడ్డి సర్క్యులర్ జారీ చేశారు. మొదటి బెల్ ఉదయం7.45కు, స్కూల్ అసెంబ్లీ 7.50 ఉంటుందని తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు. పదవ తరగతి పరీక్షలు జరుగుతున్న పాఠశాలల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు.

అనేక మంచి కార్యక్రమాలు చేస్తున్నాం

కనీసం అభినందించే బాధ్యత ప్రతిపక్షానికి లేదా?

అప్పుల లెక్కలపై చర్చకు సిద్ధం

చెప్పిన గణాంకాలు తప్పైతే క్షమాపణ కోరుతా

లేకపోతే వారు ఒప్పుకోవాల్సిందే

ఢిల్లీకి వెళ్లి నిధులు సాధించా : శాసనమండలిలో సీఎం రేవంత్ రెడ్డి

బీఆర్ఎస్ వాకౌట్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం అనేక మంచి కార్యక్రమాలను చేపడుతున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. శనివారం శాసనమండలిలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఆయన సమాధానమిచ్చారు. ముఖ్యమంత్రి మాట్లాడేందుకు ఉపక్రమించగానే బీఆర్ఎస్ సభ్యులు లేచి సీఎం మార్చురీ వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పదే పదే నినాదాలు చేస్తుండటంతో సభలో కొద్దిసేపు ఎవరేమి మాట్లాడుతున్నారో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. మాట మాట అన్నట్టుగా బీఆర్ఎస్ సభ్యుల నినాదాల నడుమ కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ లేచి, బీఆర్ఎస్ సభ్యులు ప్రజల కోసం సభకు వస్తున్నారా? లేక ఒక కుటుంబం కోసం వస్తున్నారా? అని ప్రశ్నించారు. అదే సమయంలో మంత్రి కొండా సురేఖ, బీఆర్ఎస్ సభ్యులకు సభలో ఉండటం ఇష్టం లేకపోతే బయటికి వెళ్లాలన్నారు. చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి బీఆర్ఎస్ సభ్యులను సముదాయించే ప్రయత్నం చేసినప్పటికీ వారు వినిపించుకోలేదు. ముఖ్యమంత్రి ప్రసంగం తర్వాత వివరణ కోరవచ్చని సూచించినప్పటికీ క్షమాపణ చెప్పి తీరాల్సిందేనని పట్టుపట్టారు. దీంతో కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు జోక్యం చేసుకుని సభ బయట రాజకీయంగా చేసిన వ్యాఖ్యలకు సభలో లేవనెత్తడం, అదీ గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై మాట్లాడకుండా అడ్డుతగలడం సరికాదని సూచించారు. కొద్దిసేపు నినాదాలు చేసిన బీఆర్ఎస్ సభ్యులు సీఎం మార్చురీ వ్యాఖ్యలకు నిరసనగా తాము వాకౌట్ చేస్తున్నట్టు తెలిపి సభ నుంచి వెళ్లిపోయారు. అనంతరం ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తాను బీఆర్ఎస్ పార్టీని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను వ్యక్తిగతంగా ఆపాదించుకోవడం సరికాదని కోరారు. బీఆర్ఎస్ పార్టీ 2023కు ముందు అధికారంలో ఉంటే అసెంబ్లీ ఎన్నికల తర్వాత ప్రతిపక్షంలోకి వెళ్లిందనీ, ఆ తర్వాత ఎంపీ ఎన్నికల్లో జీరో అయిందని చెప్పే క్రమంలో



మార్చురీకెళ్లిందని అన్నట్టు వివరణ ఇచ్చారు.

గవర్నర్ ప్రసంగం రాష్ట్ర ప్రభుత్వ పనితీరును ప్రతిబింబిస్తున్నదని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష సభ్యులకు నచ్చిన కార్యక్రమాలను అభినందించి, మిగిలిన వాటికి సూచనలు చేస్తే బాగుండేదని అభిప్రాయపడ్డారు. ఎన్నికలకు ముందు ప్రజల ముందుకెళ్లామనీ, వారు తెలిపిన అవసరాల మేరకే తమ మ్యానిఫెస్టో రూపకల్పన జరిగిందని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆ హామీలను అమలు చేసేందుకు అడుగులు పడుతూనే ఉన్నాయని తెలిపారు. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు, తప్పుల కారణంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏ మాత్రం అనుకూలంగా లేదని చెప్పారు. అప్పులు, వారి తప్పులకు సంబంధించి తాను చెప్పే గణాంకాలపై ఒక రోజు పూర్తి స్థాయిలో చర్చించేందుకు సిద్ధమనీ, తాను చెప్పేవి తప్పైతే క్షమాపణ చెబుతానని తెలిపారు. లేనిపక్షంలో మరెప్పుడు వారు మాట్లాడొద్దన్నారు. రైతులు, మహిళలు, యువత తదితర వర్గాల కోసం తీసుకున్న కార్యక్రమాలతో పాటు రాష్ట్ర అభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలను, పథకాలను సీఎం వివరించారు. బీఆర్ఎస్ సర్కారు కాళేశ్వరాన్ని నిర్మించలేదనీ, కూలేశ్వరాన్ని నిర్మించిందని ఎద్దేవా చేశారు. ఆ ప్రాజెక్టు తెల్ల ఏనుగుతో సమానమని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలకు వారి ఫ్యూచర్ పై ఉన్న శ్రద్ధ రాష్ట్ర ఫ్యూచర్ పై లేదని విమర్శించారు. 15 నెలల్లోనే తాము రాష్ట్రంలో నిరుద్యోగాన్ని 22 శాతం నుంచి 18 శాతానికి తగ్గించగలిగామని తెలిపారు. తాను ఢిల్లీకి వెళ్లి నిధులు సాధించినట్టు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. వరంగల్ ఎయిర్ పోర్ట్, కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాలకు రూ.11 వేల కోట్లు, ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగం, ఆరోగ్య ప్రాజెక్టులకు రూ.4 వేల కోట్లు, కంటోన్మెంట్ ప్రాంతంలో ఎలివేటెడ్ కారిడార్ కోసం రక్షణశాఖకు చెందిన 160 ఎకరాలు కేటాయింపు, జహీరాబాద్ నిమ్జ్ కు రూ.1,200 కోట్లు, కాజీపేట్ కోచ్ ఫ్యాక్టరీ సాధించినట్టు తెలిపారు. రాష్ట్ర అభివద్ధి కోసం ఎన్నిసార్లైనా తాను ఢిల్లీ వెళతానని స్పష్టం చేశారు. పీఎం నరేంద్రమోడీని బడే బాయ్ అనడంలో తప్పేంటని ప్రశ్నించారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఈ దేశ ప్రధానమంత్రిని బడే బాయ్ అంటున్నట్టు తెలిపారు. బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన ప్రస్తుతం వచ్చే 42 శాతం రిజర్వేషన్లు తీసుకోవాలనీ, ఆ తర్వాత ఇంకా ఎలా ముందుకెళ్లేది ఆలోచించాలని సూచించారు. సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.

జీతాలివ్వడానికే తల ప్రాణం తోకకు...

ఉద్యోగులకు ప్రతి నెలా జీతం ఇవ్వడానికి తల ప్రాణం తోకకు వస్తున్నదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఇటీవల ఆర్బీఐ నుంచి చేబదులు తరహాలో రూ.4,000 కోట్లు తెచ్చి జీతాలిచ్చినట్టు తెలిపారు. రిటైర్ మెంట్ బెనిఫిట్స్ కు సంబంధించి ఎప్పటిలోగా చెల్లిస్తామనే దానికి స్పష్టతనిస్తామని తెలిపారు.

ఉపాధ్యాయులు ఆత్మపరిశీలన చేసుకోవాలి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు ఎందుకు తక్కువగా ఉంటుందో ఉపాధ్యాయులు ఆత్మపరిశీలన చేసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. అందరితో చర్చించి విద్యావ్యవస్థను ప్రక్షాళన చేసుకుందాని పిలుపునిచ్చారు. అనంతరం సభ గవర్నర్‌కు ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ఆమోదించింది.

పింఛన్‌లో అవకతవకలు

ఖమ్మం రూరల్ మండలం పాపటపల్లి గ్రామానికి చెందిన శిగ యశోద నిరుపేద వ్యవసాయ కూలీ. ఆమె భర్త చనిపోయి పదేండ్లయింది. అప్పటి నుంచి వితంతు పింఛన్ కోసం అనేకమార్లు దరఖాస్తు చేసుకుంది. కానీ ఆమెకు ఎటువంటి పైరవీ చేసేవారు లేరు. ఒకవేళ ఎవరైనా పైరవీ చేసేందుకు ముందుకొచ్చినా యశోదకు డబ్బులు ఇచ్చుకునే స్థోమత కూడా లేదు. అలా ఆమె పింఛన్ పదేండ్లుగా దరఖాస్తులకే పరిమితమైంది. ఇదీ గ్రామంలోని యశోద సమస్య మాత్రమే కాదు. ఈ గ్రామంలో పింఛన్‌కు అర్హత ఉండీ అందని నిరుపేదలు పదుల సంఖ్యలో ఉన్నారు. వాళ్లు అనేక ఏండ్లుగా దరఖాస్తు చేసుకున్నా పింఛన్ రావట్లేదు. అన్నీ ఉన్న ఆసాములకు పింఛన్లు వస్తుండటం విమర్శలకు దారితీస్తోంది. ఈ ఊర్లోని ఒక ధనిక రైతుకు పింఛన్ వస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాళ్ల కుటుంబంలో అందరూ ఉన్నత స్థాయిలో ఉన్నవారే. అలాంటి వారికి వచ్చి అర్హులైన తమకు రాకపోవడమేంటని బాధితులు వాపోతున్నారు.





కాగ్ నివేదిక ఇచ్చినా మారని తీరు

అనర్హులకు ఇస్తున్నట్టు తనిఖీల్లో వెల్లడి..

అర్హులకు ఇవ్వడంలోనూ నిర్లక్ష్యం

గత ప్రభుత్వం నుంచీ అదే వైఖరి

ఈ ప్రభుత్వానిదీ అదే తీరు

సీపీఐ(ఎం) సర్వేలో బాధితుల గోడు

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ప్రజా ప్రభుత్వంలో అర్హులకే 'చేయూత' అంటూ చెబుతున్న ప్రభుత్వం.. ఆసరా పింఛన్‌లలో అవకతవకలపై కాగ్ నివేదిక ఇచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. 'రెక్కాడితే గాని డొక్కాడని' నిరుపేద కూలీలకు పట్టుమని కుంటభూమి కూడా లేకున్నా... అందని పింఛన్, 25 ఎకరాలకు పైబడి ఉన్న ఆసాములకు పదేండ్లుగా వస్తుండటం గమనార్హం. తెలంగాణ వ్యాప్తంగా దాదాపు 44 లక్షల మంది పింఛన్ పొందుతున్నారు. ప్రతినెలా వీరికి రూ.వెయ్యి కోట్లకు పైగా లబ్ది చేకూరుతోంది. వీరిలో కనీసం 20 శాతం మందికి పైగా అనర్హులే ఉన్నట్లు కాగ్ నివేదిస్తోంది. ఒక్కో గ్రామంలో ఏండ్ల తరబడి వితంతు, వృద్ధాప్య పింఛన్ల కోసం వందలాది మంది దరఖాస్తు చేసుకుంటుంటే వారిలో పైరవీలున్న వారికే పింఛన్లు దక్కుతుండటంతో బాధితులు వాపోతున్నారు. పైరవీ లేకుండా పదుల సార్లు దరఖాస్తు చేసుకున్నా పింఛన్ ఇవ్వటం లేదని ఆవేదన చెందుతున్నారు. ప్రజా సమస్యలపై సీపీఐ(ఎం) నిర్వహిస్తున్న సర్వేలో పింఛన్లు, ఇండ్లు, రేషన్‌కార్డులపై అనేక మంది ఆవేదన వెలిబుచ్చుతున్నారు. అనర్హులకు పథకాలు దక్కుతున్నాయని...అర్హులను విస్మరిస్తు న్నారని గోడు వెళ్లబోస్తున్నారు.

కాగ్ నివేదిక ఏం చెప్పింది...

పింఛన్‌లలో అవకతవకలపై కంట్రోల్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) సరిగ్గా ఏడాది క్రితం నివేదిక సమర్పించింది. దీనిలో పేదలకు ప్రభుత్వ పథకాలు అందించాలంటే సవాలక్ష ప్రశ్నలు వేసి ఎక్కువ ధ్రువీకరణపత్రాలు అడిగే అధికారులు పెద్దల విషయంలో మాత్రం పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారని తేల్చింది. అర్హులకు పథకాలు అందించే విషయంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నా... అనర్హుల విషయంలో ముందుంటున్నారని పేర్కొంది. లక్షాధికారులకు కూడా పింఛన్‌లు ఇస్తున్నట్టు తేల్చింది. పింఛన్ లబ్దిదారులు అనేక మంది చనిపోయి ఏండ్లు గడుస్తున్నా ఇప్పటికీ వారి ఖాతాల్లో డబ్బులు జమవుతున్నట్టు పేర్కొంది.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇలా వందలాది మంది ఉన్నారని స్పష్టం చేసింది. చనిపోయి రెండు, మూడేండ్లయినా పింఛన్ వస్తున్నట్టుగా నివేదించిం ది. 2018 నుంచి 2021 వరకు నిర్వహించిన తనిఖీల్లోనే ఇన్ని అవకతవకలు వెలుగు చూశాయంటే ఆ తర్వాత లెక్కలు కూడా తీస్తే ఇంకా ఎన్ని అక్రమాలు వెలుగుచూస్తాయోననే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వెలిముద్రలు ఫెయిల్ అయినట్టు చూపించి రాష్ట్రంలో కొన్ని చోట్ల పంచాయతీ కార్యదర్శులే చనిపోయిన వారిపేరుతో డబ్బులు డ్రా చేశారని కాగ్ స్పష్టం చేసింది. ఇలా ఏడు నుంచి 30 నెలలు పాటు డ్రా చేసిన వారు ఉన్నారని వెల్లడించింది. పింఛన్ల చెల్లింపులకు సంబంధించి రుజువుగా అక్విటెన్స్ రిజిస్టర్ రికార్డుల్లో వివరాలు నమోదు చేయాలి. కానీ ఈ రిజిస్టర్‌లో రికార్డులు ఎక్కడా సరిగా నమోదు చేయకపోవడం గమనార్హం. నిబంధనలకు విరుద్ధంగా చేసిన చెల్లింపులను రాబట్టాలని గతేడాదే ప్రభుత్వానికి కాగ్ సూచించింది. కొత్త లబ్దిదారుల ఎంపికలో కూడా సరైన విధానాలు అవలంబించనట్టు స్పష్టం చేసింది. దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన ప్రక్రియలో అనేక లోపాలున్నట్లు బట్టబయలు చేసింది. ప్రభుత్వాలు మారినా పరిస్థితుల్లో మార్పు రాకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రజా ప్రభుత్వంగా చెప్పుకొనే కాంగ్రెస్ అర్హులు, అనర్హుల విషయంలో ఏమేరకు చర్యలు తీసుకుంటుందో చూడాలి.

రెండోసారి కూడా నేనే సీఎం అవుతా

సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రెండో సారి కూడా తానే ముఖ్యమంత్రి అవుతానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శనివారం శాసనమండలి వాయిదా అనంతరం ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. "మొదటి సారి బీఆర్ఎస్‌పై వ్యతిరేకతతో ఓటు వేశారు. రెండో సారి తమ మీద నమ్మకంతో ప్రజలు ఓటేస్తారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు శాయశక్తులా కృషి చేస్తా. ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసి ప్రజల వద్దకు వెళతాం. సంక్షేమ పథకాల లబ్దిదారులే మా ఓటర్లు. నేను పనిని నమ్ముకొని ముందుకు వెళ్తున్నా. ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటాం. స్టేచర్ కాదు స్టేట్ ఫ్యూచర్ నాకు ముఖ్యం. 25 లక్షల మందికిపైగా రైతులకు రుణమాఫీ జరిగింది. కోటి మంది మహిళలకు ఖచ్చితంగా లబ్ధి చేకూరుస్తాం. వారంతా ఇప్పుడు మాట్లాడకపోయినా ఓటు మాకే వేస్తారు. గతంలో నేను చెప్పింది జరిగింది. భవిష్యత్‌లోనూ నేను చెప్పిందే జరుగుతుంది. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు త్వరలో చెల్లిస్తాం. వచ్చే ఆర్థిక సంవత్సరంలోపు వందశాతం బకాయిలు చెల్లిస్తాం. ఆదాయాన్ని పెంచి పేదలకు పంచడమే మా విధానం" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

ఆ జర్నలిస్టులకు మద్దతు ఉపసంహరించుకో

నీ కుటుంబ సభ్యులను అలా చూపెడుతూ వీడియో చేస్తే ఊహించుకో : మంత్రి పొన్నం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆ జర్నలిస్టులకు మద్దతుగా మాట్లాడటం ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ సభ్యులు పల్లా రాజేశ్వర్‌రెడ్డికి మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. శనివారం శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే సమయంలో ఆయన మాట్లాడారు. జర్నలిస్టులంటే తమకు గౌరవం ఉందన్నారు. అయితే, అలాంటి వీడియోలు చేయడం ఎంత వరకు సముచితం అని ప్రశ్నించారు. వారిని అరెస్టు చేయడం అమానవీయం అని ఎలా అంటారని నిలదీశారు. మీ కుటుంబ సభ్యులను అలా చూపెడుతూ వీడియోలు చేస్తే ఊహించుకో..అప్పుడు ఫెయిన్ ఏంటో అర్థం అవుతుందని చెప్పారు. ఆ ఇద్దరు జర్నలిస్టులకు మద్దతుగా మాట్లాడటాన్ని ఉపసంహరించుకోవాలని సూచించారు.

ఎందుకు ఓర్వలేకపోతున్నారు : మంత్రి కోమటిరెడ్డి

తమ ప్రభుత్వం రైతులకు బోనస్ విషయంలో రూ.600 కోట్లు బకాయిపడ్డదనీ రాజేశ్వర్‌రెడ్డి అబద్ధాలు చెప్పడం కాదు..చూపించండి అని మంత్రి కోమటిరెడ్డి సవాల్ విసిరారు. నల్లగొండ, జనగామ నియోజకవర్గాల్లో రుణమాఫీ, సన్నవడ్లకు బోనస్‌కు సంబంధించిన వివరాలను అంకెలతో సహా వివరించారు. ఇప్పటి వరకూ ఏదైనా రాష్ట్రం ఒకే దఫాలో రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసిందా? అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం రైతులకు మంచి చేస్తుంటే ఎందుకు ఓర్వలేకపోతున్నారని నిలదీశారు.

ప్రభుత్వం మీద బురద జల్లే యత్నం : మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

తమ ప్రభుత్వం మీద బురద జల్లేలా అవాస్తవాలు మాట్లాడటం, సభను పక్కదారి పట్టించాలని చూడటం పల్లారాజేశ్వర్‌రెడ్డికి తగదని శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హితవు పలికారు. పదేండ్ల బీఆర్ఎస్ చేసిన పాపాలను తమ ప్రభుత్వంపై తోసేసి మాట్లాడటమేంటని ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఏం సంవత్సరం నుంచి పెండింగ్‌లో ఉన్నాయి? అవన్నీ మీరు పెట్టిపోయిన బకాయిలే కదా? మొత్తం కాంగ్రెస్ ప్రభుత్వమే ఇవ్వలేదని చూపడమేంటి? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీలకు తీసిపోని విధంగా ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీలను తీర్చిదిద్దే ప్రయత్నంలో తమ ప్రభుత్వముందని చెప్పారు. గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన ఆరోగ్యశ్రీ బకాయిలను, ఇతర పెండింగ్ బకాయిలను ప్రాధాన్యతా క్రమంలో చెల్లించుకుంటూ వస్తున్నామని వివరించారు.

భద్రాద్రి కొత్తగూడెంలో 64 మంది మావోయిస్టుల లొంగుబాటు

వీరికి పునరావాసం కల్పిస్తామన్న ఐజీ

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

ఉత్తర తెలంగాణలో భారీ సంఖ్యలో నిషేధిత సీపీఐ(మావోయిస్టు) సభ్యులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. మొత్తం 64 మంది మావోయిస్టులు తమ ఎదుట లొంగిపోయారని రాష్ట్ర మల్టీజోన్-2 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. లొంగిపోయినవారిలో మావోయిస్టు డివిజనల్ సభ్యుడు మొదలుకొని వివిధ క్షేత్రస్థాయి క్యాడర్ సభ్యులున్నారని ఆయన చెప్పారు. వీరంతా దాదాపుగా ఉత్తర తెలంగాణ జిల్లాలకు చెందినవారని అన్నారు. సమాజాన్ని మార్చాలనే లక్ష్యంతో వీరు మావోయిస్టు సిద్ధాంతాలను నమ్మి అందులో చేరారని ఐజీ తెలిపారు. వీరిలో కొందరికి విధ్వంసక చర్యలలో హస్తమున్నదని ఆయన అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన పిలుపుతో పాటు వారి కుటుంబ సభ్యులు చేసిన విజ్ఞప్తి మేరకు వీరు లొంగుబాటులో నడిచారని చంద్రశేఖర్‌రెడ్డి వివరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో వీరు వచ్చి లొంగిపోయారని ఆయన తెలిపారు.

మావోయిస్టు పార్టీలో చేరాక ఆ ఉద్యమం పట్ల రానురానూ వీరికి భ్రమలు తొలగిపోయాయని ఆయన అన్నారు. తాము అనుకున్నదొకటైతే, జరుగుతున్నది మరొకటని గ్రహించారని తెలిపారు. ఈ ఉద్యమ బాటలో నడిస్తే సమాజంలో ఎలాంటి మార్పులకూ ఆస్కారం లేదని వీరంతా విశ్వసించారనీ, ఆ మేరకు ప్రభుత్వానికి లొంగిపోవాలని నిర్ణయించారని ఐజీ చెప్పారు. వీరందరికీ లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం ఇచ్చే చేయూత పథకంలో భాగంగా పునరావాసం కల్పించటం జరుగుతుందనీ, ప్రజాస్వామ్యబద్ధంగా వీరు సమాజంలో బతకటానికి అన్ని రకాలుగా ప్రభుత్వం సహకరిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. వీరి లొంగుబాటుతో ఇటీవలికాలంలో సరెండరైనవారితో కలిపి వారి సంఖ్య 122కు చేరిందనీ, ఇందులో జిల్లా కమిటీ సభ్యులు మొదలుకొని మరికొందరు నాయకశ్రేణిలోనివారున్నారని ఐజీ తెలిపారు. అజ్ఞాతంలో ఉన్న మిగతా మావోయిస్టులు కూడా లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవాలనీ, వారికి ప్రభుత్వం పూర్తిగా చేయూతనిస్తుందని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఖబడ్దార్!

(మొదటిపేజీ తరువాయి)

మీద తాము ప్రభుత్వాన్ని నడపబోమనీ, పాలనాంశాలన్నీ పూర్తి పారదర్శకంగానే ఉంటాయని స్పష్టం చేశారు.

రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడతాం

రాజ్యాంగ స్ఫూర్తితోనే వ్యవస్థలు ఏర్పడ్డాయి. వాటిని గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. "గవర్నర్ ప్రసంగం లేకుండానే 2022 బడ్జెట్ సమావేశాలు ప్రారంభించారు. 2023లోనూ దాన్నే కొనసాగిద్దామని చూశారు. న్యాయస్థానం కఠినంగా వ్యవహరించడంతో గవర్నర్ ప్రసంగానికి ప్రభుత్వం అనుమతిచ్చింది. బలహీన వర్గాలకు చెందిన మహిళా గవర్నర్‌ను గత ప్రభుత్వం అవహేళన చేసింది. అన్ని రకాల రాజ్యాంగ వ్యవస్థల్ని ధ్వంసం చేశారు. మంత్రివర్గం ఆమోదించిన అంశాలనే ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తారు. మాది కాంగ్రెస్ ప్రభుత్వం. మా విధానాలు, ఆలోచనలు, మేం ప్రజలకు చేసిన పనులు మాత్రమే గవర్నర్ ప్రసంగంలో ఉంటాయి. ఈ మాత్రం అవగాహన లేని వాళ్లు మంత్రులుగా చేశామని చెప్పుకోవడం సిగ్గుచేటు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో అప్పటి మంత్రివర్గ ఆమోదం లేకుం డానే గవర్నర్ ప్రసంగం కొనసాగిందా?" అని ప్రశ్నిం చారు. బీఆర్ఎస్ నేతలకు అధికారంలో ఉన్నా, ప్రతి పక్షంలో ఉన్నా గవర్నర్ వ్యవస్థపై నమ్మకం లేదనీ, తాము అలాంటి తప్పులు చేయబోమని అన్నారు. గవర్నర్ వ్యవస్థను గౌరవిస్తామనీ, అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై ఏమైనా సలహాలు, సూచనలు చేస్తే స్వీకరిస్తామని స్పష్టం చేశారు.

ఢిల్లీ వెళ్తే తప్పేంటి?

"రాష్ట్రానికి రావల్సిన నిధులు, ప్రాజెక్టుల అనమతుల కోసం 32 సార్లు కాదు మరో 300 సార్లు ఢిల్లీ వెళ్తా. దానిలో తప్పేముంది?" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఢిల్లీ పర్యటన పేరుతో తానెలాంటి దుబారా ఖర్చులు చేయట్లేదని వివరణ ఇచ్చారు. ప్రధాని నరేంద్ర మోడీ అన్ని రాష్ట్రాలకు పెద్దన్నలాంటి వారే. పాలనలో భాగంగా ఆయన్ని కలవడంలో రాజకీయం ఏముందని ప్రశ్నించారు. ప్రధాని, కేంద్ర మంత్రివర్గ నిర్ణయాలు రాష్ట్రాల అభివృద్ధికి దోహదపడతాయి. దానికోసం కేంద్రంతో సత్సంబంధాలు కొనసాగించాలి. 'ప్రధానిని గౌరవించే విజ్ఞత మాది. రాజకీయాలు చేసే టైంలో నేను కాంగ్రెస్ నేతను.. ఆయన బీజేపీ నేత. రాష్ట్ర అవసరాల కోసం అవసరమైతే బీజేపీ శాసనసభాపక్షనేత ఏ మహేశ్వర్‌రెడ్డిని ఢిల్లీ తీసుకొని వెళ్తాం. ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని నాలుగు సార్లు కలిశాం. నిర్మలా సీతారామన్, అమిత్ షాలను కూడా కలిశాం. కేంద్రంలో నేను కలవని కేంద్రమంత్రి ఎవరూ లేరు' అని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పుకొచ్చారు.

మేం చేసిన అప్పులు కేసీఆర్ పాపాలు కడిగేందుకే..

పదేండ్లు రాష్ట్రాన్ని పాలించి, లెక్కాపత్రం లేకుండా నిధుల్ని ఇష్టం వచ్చినట్టు ఖర్చు చేసి, లక్షలకోట్లు అప్పులు చేసి, బిల్లులు పెండింగ్ పెట్టి పారిపోతే, 15 నెలలుగా వాటిని సరిదిద్దడానికే సరిపోయిందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. సీఎం కేసీఆర్ ముఖ్యమంత్రిగా పదేండ్లు పాలించి, అధికారమార్పిడి సమయానికి రూ.8,19,151 కోట్ల అప్పును తమకు వారసత్వంగా ఇచ్చి వెళ్లారు. 2023 డిసెంబర్ 1 నుంచి 2025 ఫిబ్రవరి 28వ తేదీ వరకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొత్తం రూ.1,58,041 కోట్ల అప్పు చేశాం. దానిలో కేసీఆర్ చేసిన అప్పులకు ప్రిన్సిపల్ అమౌంట్‌గా రూ.88,509 కోట్లు, వడ్డీలుగా రూ.64,768 కోట్లు...మొత్తంగా రూ.1,53,359 కోట్లు చెల్లించాం. మాకోసం చేసుకున్న అప్పు కేవలం రూ.4,652 కోట్లు మాత్రమే అని వివరణ ఇచ్చారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర అప్పు రూ.7,38,707 కోట్లు ఉందన్నారు.

కృష్ణా జలాలపై చర్చకు సిద్ధం

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎప్పుడు అసెంబ్లీకి వస్తే అప్పుడు కృష్ణా జలాలపై చర్చించేందుకు సిద్ధమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ అంశంపై తమ వాదన తప్పని కేసీఆర్ నిరూపిస్తే, తానే స్వయంగా క్షమాపణలు చెప్తానన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సినీనటి, అప్పటి నగరి ఎమ్మెల్యే రోజా ఇంట్లో కేసీఆర్ రొయ్యల పులుసు తిని, రాయలసీమను రతనాల సీమ చేస్తామన్నారని గుర్తుచేశారు. కానీ మహబూబ్‌నగర్ ప్రజలు కేసీఆర్‌ను గుండెల్లో పెట్టుకొని రాజకీయ భిక్షపెడితే, గుండెల మీద తన్నారని విమర్శించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే నాగార్జునసాగర్ పైకి సీఆర్‌పీఎఫ్ బలగాలు వచ్చాయనీ, అప్పుడు సైలెంట్‌గా ఉన్న బీఆర్ఎస్ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తప్పుబడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణా నీటి విషయంలో కేసీఆర్ కేంద్రమంత్రిగా ఉన్నప్పుడే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని పెంచారని గుర్తుచేశారు. కమీషన్ల కోసమే జూరాల నుంచి తీసుకోవాల్సిన నీళ్లను శ్రీశైలం బ్యాక్ వాటర్ ద్వారా తీసుకుంటామన్నారని వివరించారు.

ఎస్ఎల్‌బీసీ పాపం వారిదే...

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను ఉమ్మడి రాష్ట్రంలోనే 20 కి.మీ మేర పూర్తి చేశారని సీఎం రేవంత్ తెలిపారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో ఈ ప్రాజెక్ట్ పనులే చేపట్టలేదన్నారు. ఎస్ఎల్‌బీసీ ప్రమాదంపై సానుభూతి చూపించాల్సిన బీఆర్ఎస్ నేతలు పైశాచికానందం పొందుతున్నారంటూ మండిపడ్డారు.

కేసీఆర్ వందేండ్లు ప్రతిపక్షంలోనే ఉండాలి

మీ స్టేచర్ గురించి ఉన్న ఆలోచన స్టేట్ ఫ్యూచర్ మీద లేదనీ, అందుకే బీఆర్ఎస్ ఇప్పుడు మార్చురీలో ఉంది' అని అన్నాననీ, దీనిలో తప్పేముందని సీఎం ప్రశ్నించారు. దాన్నేదో వ్యక్తిగతంగా కేసీఆర్‌ను కించపరిచినట్టు కేటీఆర్, హరీశ్‌రావు విమర్శిస్తున్నారనీ, తానుమాత్రం కేసీఆర్ వందేండ్లు జీవించి ప్రతిపక్షంలోనే ఉండాలని కోరుకుంటున్నానని చెప్పారు. కేసీఆర్ కుర్చీని తాను లాగేసుకున్నాననీ, ఇక ఆయన దగ్గర ప్రతిపక్షనేత కుర్చీ మాత్రమే ఉందనీ, దానికోసమే హరీశ్‌రావు, కేటీఆర్ ఆరాట పడుతున్నారేమో తనకు తెలీదని వ్యంగ్యంగా అన్నారు.

ఆ ఎమ్మెల్సీ మిమ్మల్నీ అన్నారు...

కులగణన తప్పు అని స్వయంగా కాంగ్రెస్ ఎమ్మెల్సీ(తీన్మార్ మల్లన్న)నే చెప్పారని అంతకుముందు బీఆర్ఎస్ నేతలు సభలో విమర్శించారు. దీనిపై సీఎం స్పందిస్తూ గతంలో బీఆర్ఎస్ నేతలపై అదే వ్యక్తి అనేక వ్యాఖ్యలు, ఆరోపణలు చేశారనీ, వాటిని అంగీకరిస్తే, తాను కూడా కులగణనపై ఆ వ్యాఖ్యల్నే ప్రాతిపదికగా తీసుకుంటానని అన్నారు.

చెరువులు, కుంటలు మాయం చేశారు

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కమీషన్లకు కక్కుర్తి పడి హైదరాబాద్ నగరాన్ని సర్వనాశనం చేశారని సీఎం విమర్శించారు. చెరువులు, కుంటలు మాయం అయ్యాయని చెప్పారు. ఎలాంటి ముందుచూపు లేకుండా కేవలం పర్సెంటేజీలు తీసుకొని అపార్ట్‌మెంట్లకు ఇష్టంవచ్చినట్టు అనుమతులు ఇచ్చారని విమర్శించారు. డ్రైనేజీ వ్యవస్థలు లేకుండా, పార్కింగ్ సౌకర్యాలు లేకుండా అనుమతులు ఇచ్చి సిటీలో గందరగోళం సృష్టించారన్నారు. దాన్ని స్థిరీకరించేందుకు హైడ్రాను తెస్తే, దానిపై అనవసరమైన వివాదాలు సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సీఎం స్పీచ్...వెళ్లిపోయిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి ప్రసంగం ప్రారంభంకాగానే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభ నుంచి వెళ్లిపోయారు. అంతకుముందు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నీటి కేటాయింపులపై మాట్లాడారు. తమకు కూడా మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని స్పీకర్‌ను బీఆర్ఎస్ సభ్యులు కోరగా, ఆయన తిరస్కరించారు. దీనితో వారు సభ నుంచి వెళ్లిపోయారు.

సభ ఆమోదం

గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని శాసన సభ చర్చానంతరం ఏకగ్రీవంగా ఆమోదించింది.

తాట తీస్తా...

మీడియా పేరుతో నోటికొచ్చింది మాట్లాడుతూ పోస్టులు పెడితే బట్టలూడదీసి కొడతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా హెచ్చరించారు. ధరణిని రద్దు చేసి, భూభారతిని తెచ్చి పేదల భూముల్ని పేదలకే ఇవ్వాలని తాను ప్రయత్నం చేస్తుంటే కోపం పెంచుకున్నారా అని ప్రశ్నించారు. మీడియా పేరుతో పెయిడ్ ఆర్టిస్టులను తీసుకొచ్చి పార్టీ ఆఫీసుల్లో పెడుతున్నారనీ, వాళ్లు నోటికొచ్చిన మాటలతో రికార్డింగ్ చేసి సోషల్ మీడియాలో పెడితే పోలీసులు కేసులు పెట్టక ఏం చేస్తారని అన్నారు. సామాజిక మాధ్యమాల్లో వాడుతున్న భాషను ఒకసారి చూడాలనీ, అసలు జర్నలిస్టులు అనే పదానికి నిర్వచనం ఏంటని ప్రశ్నించారు. "ఎవరు పడితే వాళ్లు ఒక ట్యూబ్ (ఛానెల్) పట్టుకొని ఇష్టారాజ్యంగా మాట్లాడితే జర్నలిస్టులు అవుతారా? వాళ్లు వాడే భాష చూస్తే రక్తం మరిగిపోతోంది. ప్రజా జీవితంలో ఉన్నాం కాబట్టి ఓపిక పడుతున్నాం. కుటుంబసభ్యులను అంతేసి మాటలు అంటుంటే చూస్తూ ఎలా ఊరుకుంటాం' అని అడిగారు. "నా భార్యను, బిడ్డను తిడితే నాకు నొప్పి అవుతుంది. ఒక ఆడపిల్లను అవమానిస్తుంటే మీకు నొప్పి రాదా? మనం ఏ సంస్కృతిలో ఉన్నాం. ఇలాగే ఉంటాం అంటే ఒక్కొక్కరి తోలు తీస్తా. ప్రజా జీవితంలో ఉన్న మా గురించి మాట్లాడండి. విమర్శించండి. అంతేకానీ ఇంట్లో ఉన్న ఆడవాళ్లపై ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే సహించేది లేదు. వాళ్లు తిట్టిన తిట్ల చోట నా పేరు తీసేసి మీ పేరు రాసుకొని వినండి. అవి విన్నాక అన్నం తినబుద్ధి అవుతుందేమో చూడండి... అంటూ ఫైర్ అయ్యారు. జర్నలిస్టు సంఘాలు అసలైన జర్నలిస్టులు ఎవరో గుర్తించి జాబితాలు ఇవ్వాలనీ, దానిలో ఉన్నవారు తప్పులు చేస్తే ఏం చేయాలో వారే నిర్ణయించాలని చెప్పారు. ఆ జాబితాలో లేనివాళ్ళను క్రిమినల్స్‌గానే చూస్తామని హెచ్చరించారు.

ఐఎస్‌సదన్ డివిజన్‌లోని భూలక్ష్మి మాత ఆలయ సిబ్బంది మీద గుర్తు తెలియని వ్యక్తి నిన్న రాత్రి యాసిడ్ దాడి చేశారు. ఈ విషయం తెలుసుకున్న కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్ రెడ్డి శనివారం డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్‌ను, ఏసీపీ వెంకన్న నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత యాసిడ్ దాడి చేసిన వ్యక్తిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



నవతెలంగాణ - చంపాపేట్

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

7

ఎల్బీనగర్ -మహేశ్వరం

ఆదివారం | మార్చి 16, 2025 | www.navatelangana.com

మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 18వ డివిజన్ సాయి నగర్ కాలనీలో నివాసం ఉండే బాలాపూర్ గ్రామానికి చెందిన కందాడ మాధవరెడ్డి శనివారం మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నరసింహ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని మృత దేహానికి పూల మాలలు వేసి..నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు.



నవతెలంగాణ-బడంగ్‌పేట్

విద్యా రంగానికి నిధులు విడుదల చేయాలి



ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు శివ కుమార్

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

విద్యా రంగానికి 30 శాతం నిధులు మంజూరు చేయాలని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు శివ కుమార్ అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గుంత పల్లిలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వ ర్యంలో విద్యార్థులు సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు గుండె శివకుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్స్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలన్నారు. అనంతరం అవంతి ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులతో కలిసి సుమారుగా 12 మందితో ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు.

అధ్యక్ష, కార్యదర్శులుగా సంజయ్, విశాల్ ఉపాధ్యక్షులు సద్గుణ్, సహాయ కార్యదర్శిగా శాలీంరాజ్, 8 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రణయ్, హరీశ్, నూతన కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాచ కాల్వను వెంటనే సర్వే చేయాలి

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



నవతెలంగాణ-ఎల్బీనగర్

రాచ కాల్వను వెంటనే సర్వే చేయాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే తన కార్యాలయంలో హయత్ నగర్ ఎం.ఆర్.ఓ., ఇరిగేషన్ మరియు రెవెన్యూ శాఖ అధికారులతో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంతో ప్రాచీన నేపథ్యం ఉన్న కాల్వ రాచ కాల్వ అని అన్నారు. దీనిని నిజాం కాలంలో తుర్కయంజాల్ మసాబ్ చెరువు నుండి హయత్‌నగర్ కుమ్మరి కుంట వరకు రైతుల పొలాలకు నీరు ఇవ్వడానికి నిర్మించిందని తెలిపారు. ఈ కాల్వ తుర్కయంజాల్, ఇంజాపూర్, సాహెబునగర్ కలాన్, హయత్ నగర్ గ్రామాల మీదుగా ప్రవహిస్తుందని వివరించారు. రాచ కాల్వ సాహెబునగర్ కలాన్, హయత్‌నగర్‌లోని పలు చోట్ల కబ్జాకి గురవుతుందని ఆరోపించారు. ఈ రాచ కాల్వ పక్కన నేడు పెద్ద పెద్ద బహుళ అంతస్తులు, గ్రామ పంచాయతీ వెంచర్లు వెలిసి కొన్ని చోట్ల రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఈ కాల్వను తమ వెంచర్‌లో కలిపేసుకున్నారని ఆరోపించారు. 2020-2021లో ఈ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు నీరు పోయే దారిలేక అనేక కాలనీలు ముంపునకు గురి అయ్యాయని చెప్పారు.

భవిష్యత్తులో ఎంత పెద్ద వర్షం వచ్చినా రాచ కాల్వ పక్కన ఉన్న కాలనీలు ముంపునకు గురికాకుండా ఉండాలంటే.. వరద నీరు ఈ కాల్వ గుండా ప్రవహించి చెరువులోకి చేరాలని చెప్పారు. సాహెబునగర్ కలాన్ మరియు హయత్ నగర్ గ్రామాల్లో సర్వే చేసి, హద్దులు ఏర్పాటు చేసి ఈ కాల్వను పునరుద్ధరించాలని కోరారు. అలాగే బీఎన్‌రెడ్డి శివార్లో ఉన్న దాదాపు 30 కాలనీలో భవిష్యత్తు నందు ఎంత పెద ఎత్తున వర్షం వచ్చిన వరద ముంపునకు గురికావొద్దు అంటే రాచ కాల్వను పునరుద్ధరణ చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. అందుకే త్వరగా సర్వే పూర్తి చేయాలని అధికారులను కోరారు. వారంలో సర్వే పూర్తి చేస్తామని అధికారులు చెప్పారని తెలిపారు. ఈ సమావేశంలో బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు అరవింద్ రెడ్డి, హయత్‌నగర్ ఎం.ఆర్.ఓ.జానకి, ఇరిగేషన్ డి.ఈ.శుక్లజ, ఏ.ఈ.సతీష్, సర్వేయర్ జ్యోతి, గాయత్రి నగర్ ఫేస్-4 అధ్యక్షులు గౌరీశెట్టి మనోజ్, శ్రీ వెంకటేశ్వరా కాలనీ అధ్యక్షులు కృష్ణ, శ్రీ పాపిరెడ్డి కాలనీ అధ్యక్షులు తెరేటిపల్లి శ్రీశైలం, గాయత్రి నగర్ ఫేస్-3 అధ్యక్షులు రాజుగౌడ్, క్రిస్టల్ విల్లాస్ అధ్యక్షులు సత్యనారాయణ, శ్రీ గాయత్రి నగర్ అధ్యక్షులు సూర్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఏకదంత సంస్కృత
ఫండమెంటల్ కోర్సు రెండో లెవెల్ ప్రారంభం



నవతెలంగాణ-సిటీబ్యూరో

స్వామీజీ దయానంద సరస్వతి సహకారంతో ఏకదంత - ది స్కూల్ ఆఫ్ అనిషియంట్ ఇండియన్ స్టడీస్ భారతీయ ప్రాచీన విద్యా సంస్థ ఆధ్వర్యంలో, బ్రహ్మ విద్యా కుటీర్, హైదరాబాద్‌లో ఏకదంత సంస్కృత ఫండమెంటల్ కోర్సు రెండో లెవెల్‌ను శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని స్వామి తత్త్వవిదానంద సరస్వతి చేతుల మీదుగా నిర్వహించారు. ఏకదంత సంస్థ, భారతీయ సంప్రదాయ విద్యను అందరికీ చేరువ చేసే ప్రయత్నంలో భాగంగా, సంస్కృత భాషను ఉచితంగా నేర్చుకునే అవకాశాన్ని కల్పిస్తోంది. మొదటి లెవెల్‌లో 15 పాఠాలు ఉండగా, దాదాపు 2వేల మంది విద్యార్థులు ఈ కోర్సును ekadantha.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ అభ్యసించారు. ఇక రెండో లెవెల్‌లో 31 పాఠాలు ఉండగా, ఇది మరింత లోతుగా సంస్కృత భాషా పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు సహాయపడుతుంది. ప్రతి లెవెల్ పూర్తయిన తర్వాత విద్యార్థులకు అసెస్‌మెంట్స్ కూడా ఉంటాయి. సంస్కృతాన్ని నేర్చుకోవాలనే అభిరుచి గల వారు ఏకదంత వెబ్‌సైట్‌లో ఉచితంగా రిజిస్టర్ చేసుకుని భాషను అభ్యసించవచ్చు. మొదటి లెవెల్ పూర్తి చేసిన విద్యార్థులకు స్వామి తత్త్వవిదానంద సరస్వతి వారు ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన "ప్రతి ఒక్కరూ సంస్కృతాన్ని నేర్చుకుని భారతీయ జ్ఞాన సంపదను గ్రహించాలని" సూచించారు. ఈ కార్యక్రమంలో ఏకదంత ఫౌండర్ అండ్ డైరెక్టర్ సతీష్ కుమార్ ఎం.వి, ఏకదంత ప్రధాన ఆచార్య సీహెచ్ సద్గుణ, దయానంద్ షణ్ముగం, కృపానంద్ షణ్ముగం, కాశెట్టి కుమార్, ఏకదంత అధ్యాపక బృందం పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందు
మత సామరస్యానికి ప్రతీక

మేనేజ్మెంట్ డైరెక్టర్ మహమ్మద్ హసన్ అలీ

నవతెలంగాణ -చంపాపేట్

ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని హమజాకార్స్ గ్రూప్ మేనేజ్మెంట్ డైరెక్టర్ మహమ్మద్ హసన్ అలీ అన్నారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ పరిధిలోని ఆలేఖ్య టవర్స్ వద్ద మహమ్మద్ ముజాహిద్ అలీ, మహమ్మద్ జహీద్ అలీ, మహమ్మద్ ఆబిద్ అలీ, మహమ్మద్ అమిత్ అలీ ఆధ్వర్యంలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఇఫ్తార్ విందును శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఉండే ముస్లిం సోదరుల కోసం ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ విద్యను సద్వినియోగించుకోవాలి

కార్పొరేటర్ చింతల అరుణా సురేంద్రనాథ్ యాదవ్





నవతెలంగాణ-నాగోల్

ప్రభుత్వ పాఠశాలలో ప్రారంభిస్తున్న కంప్యూటర్ విద్యను సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ చింతల అరుణా సురేంద్రనాథ్ యాదవ్ విద్యార్థులకు సూచించారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఉప్పల్ మండలం నాగోల్ డివిజన్ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జైపురికాలనీ ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ కోర్సును శనివారం ప్రధానోపాధ్యాయులు బత్తుల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ రవీందర్ రాజు, మండల విద్యాశాఖాధికారి రామారావు, మండల ఎఫ్ఎల్ఎన్ నోడల్ అధికారి, నాగోల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు లక్ష్మి దేవిలతో కలిసి కార్పొరేటర్ ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన పేరెంట్ టీచర్‌ల సమావేశంలో కార్పొరేటర్ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కంప్యూటర్ ల్యాబ్ ద్వారా విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ ఉప్పల్ మండలంలోని రెండు ప్రభుత్వ పాఠశాలలను రెండవ విడతలో భాగంగా ఎంపిక చేసిందన్నారు. దీనిలో భాగంగానే ఈ నెల 15వ తేదీ నుంచి జైపురి కాలనీ ప్రభుత్వ పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సు బోధనను ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల పఠనా సామర్థ్యాలను మెరుగుపరిచే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐని ప్రవేశపెట్టాలని నిర్ణయించిందని తెలిపారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి విద్యను మరింత ప్రభావవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని వివిధ మండలాల్లో పైలట్ ప్రాజెక్ట్ ద్వారా ఇప్పటికే 6 పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోసం ప్రారంభించినట్లు చెప్పారు. జిల్లా విద్యాశాఖ అధికారి విజయ కుమారి ఆదేశాల మేరకు నేడు ఉప్పల్ మండలంలోని రెండు పాఠశాలలలో ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేంద్రనాథ్ యాదవ్, ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ వరలక్ష్మి , ఉపాధ్యాయులు అనంత రెడ్డి, మేరీ బ్యూల, మల్లేష్, రమాదేవి, సుధారాణి, విద్యార్థుల తల్లీదండ్రులు, ఆకృతి ప్రాజెక్టు ప్రతినిధులు సబిత, సీమ భరత్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యుదయ సాహితోద్యమ సారథిలో ప్రముఖుడు పెనుగొండ

- తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు ఆచార్య ఎస్వీ సత్యనారాయణ



నవతెలంగాణ-కల్చరల్

అభ్యుదయ సాహిత్య ఉద్యమ సారథిలలో ప్రముఖుడు పెనుగొండ లక్ష్మీ నారాయణ అని తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు ఆచార్య ఎస్వీ. సత్యనారాయణ అన్నారు. రవీంద్ర భారతిలోని సమావేశ మందిరంలో తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం నిర్వహణలో (అరసం) పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చిన సందర్భంగా ఆయనకు సత్కార సభ జరిగింది. అనంతరం ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆచార్య సత్యనారాయణ మాట్లాడుతూ అనేక దశాబ్దాలుగా అభ్యుదయ సాహిత్యానికి పెనుగొండ లక్ష్మీనారాయణ ఇతోధిక కృషి చేశారని అన్నారు. ఆయన రచించిన దీపిక విమర్శనా గ్రంథం పరిశోధకులకు కర దీపిక అన్నారు. నవ చేతన పబ్లిషింగ్ హౌస్ సంపాదకులు డాక్టర్ ఏటుకూరి ప్రసాద్ మాట్లాడుతూ.. పెనుగొండ సాహిత్యం అభ్యుదయ ఉద్యమానికి దన్నుగా నిలిచిందని హర్షం వ్యక్తం చేశారు. శాసన సభ పూర్వ సభ్యుడు చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. భారత కమ్యునిస్టు ఉద్యమాలలో పెనుగొండకు విడదీయరాని అనుబంధం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సినీ గీత రచయిత సుద్దాల అశోక్ తేజ, కవి జూలూరి గౌరీశంకర్, గ్రంథాలయ పరిషత్ చైర్మెన్ రియాజ్, డాక్టర్ కోయి కోటేశ్వరరావు, ప్రజా నాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహా, తిరుపల్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనుల్లో
నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



కాంగ్రెస్ సీనియర్ లీడర్ రెవల్లే యాదగిరి

నవతెలంగాణ-తుర్కయంజాల్

నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంగ్రెస్ సీనియర్ లీడర్ రెవల్లే యాదగిరి కాంట్రాక్టర్‌కు సూచించారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ 9వ వార్డు పరిధిలోని ఎన్ఎస్ఆర్‌నగర్‌లో సుమారు రూ.14లక్షలతో చేపట్టిన ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను కాంగ్రెస్ నాయకుడు రేవల్లె యాదగిరి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్డు కార్పొరేషన్ చైర్మెన్ రాంరెడ్డి, మున్సిపాలిటీ మాజీ చైర్ పర్సన్ అనురాధ సహకారంతో వార్డు పరిధిలో అనేక అభివృద్ధి పనులు చేపట్టి, ఆదర్శంగా తీర్చిదిద్దామన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లు, తాగునీటి పనులకు ప్రాధాన్యమిచ్చి పనులు చేయించామని తెలిపారు. తాము చేపట్టిన కార్యక్రమాల పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు.

ఆపదలో ఆదుకోకుండా
అంతా అయిపోయాక బాధపడడంలో అర్థంలేదు



- దోసపాటి రాము

నవతెలంగాణ-ఎల్బీనగర్

తోటి వారిని ఆపద సమయంలో ఆదుకోకుండా అంతా అయిపోయాక బాధపడడంలో అర్థం లేదని రైస్ ఏటీఎం అధినేత దోసపాటి రాము అన్నారు. ఈ మేరకు శనివారం రైస్ ఏటీఎం దగ్గరకు వచ్చిన వారికి ధైర్యం నింపి.. వారికి నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ఇటీవల జరిగిన ఘటనలు అందరిని ఆలోచింపజేస్తున్నాయని అన్నారు. ఉద్యోగం దొరకక, భోజనానికి ఇబ్బందులు పడుతూ, ఇల్లు గడవడం కష్టం ఉన్నప్పుడు తోటివారు కాస్త తోడు ఉంటే వాళ్ళు ఆత్మహత్యలు చేసుకునే స్థితి వచ్చేది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతా అయిపోయాక అయ్యే పాపం పసి పిల్లలతో సహా ఆత్మహత్యలు..ఇంత ఘోరం అంటే ఆ పిల్లలను వదిలిస్తే ఎవరు చూడరు అనే అపనమ్మకం అంతటి ఘోరానికి కారణం అని అన్నారు. తెలిసిన వాళ్ళు కష్టాల్లో ఉన్నప్పుడు మనం ఉన్నాం అనే భరోసా ఇవ్వలేకపోవడం మనదే తప్పు అన్నారు. మన వైపు నుండి ఆలోచన చేయాలి అన్నారు. ఆత్మహత్యలు అన్నింటికీ పరిష్కారం కాదని అని చెప్పారు. కరోనా సమయంలోనే కఠిన పరిస్థితులకు ఎదురు నిలిచి పోరాడామని, ఆ విషయాలను మరవద్దు అని గుర్తుచేశారు. మనకోసం నిలబడే వారు ఉంటారన్న విషయాన్ని మరచిపోవద్దు అన్నారు.

గేయ కథా ప్రక్రియకు బాట వేసిన నారాయణ రెడ్డి

ప్రముఖ సాహితీ వేత్త
డాక్టర్ వోలేటి పార్వతీశం

నవతెలంగాణ-కల్చరల్

సినీ పాటలు రాసిన వారు ఎందరో ఉన్నారు కానీ.. తెలుగు సారస్వతంలో సుస్థిర స్థానం ఏర్పాటు చేసుకున్న కొద్ది మంది సినీ గీత రచయితలలో సి. నారాయణ రెడ్డి ప్రముఖులు అని ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం అన్నారు. గేయ కథా ప్రక్రియకు బాట వేసి, తన కంటూ ప్రత్యేక గుర్తింపు పొందిన సినారె సాహిత్యం విశ్వ జనీనం అని కొనియాడారు. భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో వంశీ ఆర్ట్స్ థియేటర్స్ వంశీ కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వహణలో విఖ్యాత కవి డాక్టర్ సి. నారాయణ రెడ్డి తొలి సినీ గీత రచన చేసి 65 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా సినారె పాటకు పట్టాభిషేకం పేరిట ఆయన రచించిన పాటలు ప్రముఖ గాయకులు మిత్ర, గీతాంజలి, కృష్ణ ప్రసాద్, ఇందు నయన, మాస్టర్ విజయ్ మధురంగా ఆలపించారని చెప్పారు. మాస్టర్ విజయ్ పాడిన కంటే నే అమ్మ అని అంటే ఎలా ను హృద్యంగా పాడారని చెప్పారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ వోలేటి పార్వతీశం మాట్లాడుతూ.. సినారె రచనా వ్యాసంగం అరభించినతరుణంలో మహా మహులు విశ్వనాథ సత్యనారాయణ, రాయప్రోలు సుబ్బారావు, దేవులపల్లి కృష్ణశాస్త్రి వంటి వారు ఉన్నారని అన్నారు. వారిలో తన ప్రత్యేకత నిలుపుకొనేందుకు నాగార్జున సాగరం కర్పూర వసంత రాయలు వంటి గేయ కథా కావ్యాలు రాశారని వివరించారు. ప్రముఖ రచయిత్రి జలంధర చంద్ర మోహన్ మాట్లాడుతూ తన భర్త చంద్ర మోహన్ సినిమాలలోని పలు పాటలు విమర్శ సినారె రాసినవి హిట్ అయ్యాయని చెప్పారు. వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు మాట్లాడుతూ సినారే కార్యక్రమలకు ఆయన కుమార్తెలు రావడం సంతోషం అన్నారు.



నాచారంలో ఘనంగా
కాన్షీరామ్ జయంతి వేడుకలు



నవతెలంగాణ-చర్లపల్లి

మాన్యశ్రీ కాన్సీరామ్ విగ్రహాన్ని నాచారం ఏరియాలో నెలకొల్పుతామని దళిత సంఘాల జేఏసీ వ్యవస్థాపకుడు నల్ల రాధాకృష్ణ అన్నారు. శనివారం నాచారంలో బహుజనుల రాజ్యాధికార పితామహుడు మాన్యశ్రీ కాన్షిరామ్ జయంతి సందర్భంగా దళిత సంఘాల జేఏసీ వ్యవస్థాపకుడు నల్ల రాధాకృష్ణ, నాచారం అధ్యక్షుడు కరటె శ్రీరామ్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నాచారం అను ఫర్నిచర్ దగ్గర కాన్సీ రామ్ 91 వ జయంతి సందర్భంగా దళిత సంఘాల జేఏసీ నాచారం డివిజన్ కన్వీనర్ కరాటే శ్రీరామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దళిత సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ నల్ల రాధాకృష్ణ హాజరై మాట్లాడుతూ.. బహుజనల సాధన కోసం నిరంతరం తపించిన గొప్ప దార్శనికులు మాన్యశ్రీ కాన్షీరామ్ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి అతని సోదరి చైర్మెన్ స్వర్ణ కౌర్ వస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆర్ ఎస్ ప్రసన్నకుమార్, కురపాక అంజి మాదిగ, హెచ్ ఆర్ మోహన్, వేములవారన్న తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-హయత్‌నగర్



రేషన్ బియ్యాన్ని అక్రమంగా అమ్ముతున్న వారిని హయత్ నగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్, బంజారా కాలనీకి చెందిన మెగావత్ శ్రీను, కనావత్ రాము.. ఈ ఇద్దరు వ్యక్తులు తొర్రూరు గ్రామం ఇంజాపూర్ రోడ్డులో 07 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం అందిందన్నారు. వెంటనే ఘటనాస్థలానికి చేరుకొని బియ్యంతో పాటు ఆటోను సీజ్ చేసినట్టు తెలిపారు. తర్వాత ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

పేద ముస్లింలకు నిత్యావసర సరకుల పంపిణీ



నవతెలంగాణ-కాప్రా
పేద ముస్లింలకు నిత్యావసర సరకులను ఏఎస్‌రావు నగర్ డివిజన్ పరిధిలోని అనుపురం ఫంక్షన్ హాల్ దగ్గరలో మాజీద్‌లో రియాజ్ ఆధ్వర్యంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏండ్ల నుండి పేద ముస్లిం మహిళలకు నిత్యా వసర సరుకులను పంపిణీ చేసిన రియాజ్‌ని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు మునుముందు కొనసాగించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్, స్థానిక కార్పొరేటర్ శిరీష రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బీఆర్ఎస్ నాయకులు సోమశేఖర్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, కుమార్ స్వామి, మానెమ్మ, బాల రాజు, రహీం తదితరులు పాల్గొన్నారు.

'డివిజన్‌లో అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తాం'



నవతెలంగాణ-ఉప్పల్
చిల్కానగర్ డివిజన్ అన్ని కాలనీ, బస్తీలలో మౌలిక సదుపాయాలకు పెద్దపీత వేస్తామని కార్పొరేటర్ బన్నాల గీత అన్నారు. బీఆర్ఎస్ నాయకులు బాలేందర్ ముదిరాజ్, మాజీ కౌన్సిలర్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో బస్తీలలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ కార్పొరేటర్ కార్యాలయంలో కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్పొరేటర్ గీతా ప్రవీణ్ వారితో మాట్లాడుతూ నూతన ప్రతిపాదనలు పంపించడం జరిగిందని నిధులు విడుదలైన వెంటనే ఒక్కొక్కటిగా ప్రణాళిక బద్ధంగా పూర్తి చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈకార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రాజ్యలక్ష్మి బీఆర్ఎస్ నాయకులు బాలేందర్, శేఖర్, నవీన్, పాండు, నాగేష్, సమద్, శ్రీకాంత్ యాదవ్, వారి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల త్యాగం ఆదర్శనీయమైనది

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అవినాష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తీక్
- ఐటీఐ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు అమరుల స్ఫూర్తి ర్యాలీ..



నవతెలంగాణ-మేడ్చల్
భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌లు చూపిన త్యాగం ఆదర్శనీయమైనదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అవినాష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తీక్‌లు అన్నారు. శనివారం వీరి త్యాగాలను స్మరించుకుంటూ మేడ్చల్ పట్టణంలోని ఐటీఐ నుండి అంబేద్కర్ విగ్రహం వరకు జాతీయ రహదారి 44 పై మండల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో విద్యార్థులు, యువకులు భారీగా పాల్గొని జైభగత్ సింగ్ నినాదాలతో ర్యాలీ హెూరెత్తించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అవినాష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తీక్‌లు మాట్లాడుతూ విద్యార్థుల హక్కుల కోసం, నాణ్యమైన విద్య అందుబాటులోకి తీసుకురావడానికి వారు చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు. అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడే వీరి స్ఫూర్తిని అనుసరించాలని తెలిపారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ, ప్రయివేటీకరణ, వ్యాపారీకరణకు వ్యతిరేకంగా పోరాడేందుకు ఎస్ఎఫ్ఐ కట్టుబడి ఉంటుందని వారు స్పష్టం చేశారు. ఈ ర్యాలీ ద్వారా విద్యార్థుల సామాజిక న్యాయం, లౌకికవాదం, సమాజవాదం సిద్ధాంతాలను పాటిస్తూ సమాజ మార్పు కోసం కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎస్ఎఫ్ఐ మండల కమిటీ బాధ్యులు కిరణ్, ప్రసాద్ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి మందాపురం నరేష్, గొర్రెలు మేకలు పెంపకదారుల సంఘం జిల్లా కార్యదర్శి కొమురయ్య, సీఐటీయూ మండల నాయకులు రమేష్, నర్సింగ్‌రావు, శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సభ్యులు సాయి చరణ్, రాకేష్, నీరజ్, తదితరులు పాల్గొన్నారు.

సెక్యూరిటీ కౌన్సిల్ భాగస్వామ్యం మరింత బలోపేతం చేస్తాం

- రాచకొండ సీపీ సుధీర్ బాబు
- ఘనంగా ఆర్.కే.ఎస్.సీ నాలుగో వార్షిక జనరల్ బాడీ మీటింగ్



నవతెలంగాణ-సిటీబ్యూరో
సెక్యూరిటీ కౌన్సిల్ భాగస్వామ్యం మరింత బలోపేతం చేస్తామని రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ చైర్మెన్, కమిషనర్ సుధీర్ బాబు తెలిపారు. రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ నాలుగవ వార్షిక జనరల్ బాడీ సమావేశం నేరేడ్‌మెట్‌లోని రాచకొండ సీపీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ఆర్.కే. ఎస్.సీ సభ్యులు, కంపెనీల ప్రతినిధులతోపాటు పలువురు డీసీపీలు హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీపీ మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని, నేర నియంత్రణ కోసం, మహిళల భద్రత కోసం రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ భాగస్వామ్యంతో ఎన్నో విభిన్న అంశాల మీద అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సంవత్సరం రోడ్డు భద్రత పట్ల ప్రజలలో అవగాహన కల్పించేందుకు భారీ ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహించినట్లు, పలు కళాశాలల్లో నిర్వహించిన ప్రత్యేక సెషన్లకు విద్యార్థుల నుండి విశేష స్పందన వచ్చినట్లు పేర్కొన్నారు. ఉమెన్ ఫోరమ్, రోడ్ సేఫ్టీ ఫోరమ్, సైబర్ సెక్యూరిటీ ఫోరమ్ వంటి విభిన్న ఫోరమ్‌ల ద్వారా రాచకొండ పోలీసులకు పలు విధాలుగా సహాయకారిగా ఉంటూ సమాజంలో నేర నియంత్రణలో తమ వంతు పాత్ర నిర్వహిస్తున్నందుకు వారిని సీపీ ప్రశంసించారు. మహిళా భద్రతతో పాటు వారి సంక్షేమానికి కూడా అధిక ప్రాధాన్యమిస్తున్నామని, మహిళల కోసం ఉమెన్ ఫోరం ఆధ్వర్యంలో ప్రత్యేక జాబ్ మేళాను రేపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 1500 ఉద్యోగ ఖాళీలకు గాను దాదాపు 1800 మంది ఆశావహులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లుగా, ఉద్యోగమేళాకు విశేష స్పందన వస్తున్నట్లుగా కమిషనర్ ప్రత్యేకంగా పేర్కొన్నారు. ఆర్.కె.ఎస్.సి సభ్య కంపెనీలకు సమాజం పట్ల ప్యాషన్ ఉండాలని, సంస్థలో మరిన్ని కంపెనీలు భాగస్వామ్యం తీసుకోవాలని, సభ్యులందరూ మరింత ఉత్సాహంగా రాచకొండ కమిషనరేట్ తో కలిసి పని చేయాలని, నేర నియంత్రణకు అవసరమైన తమ వంతు సూచనలను అందించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్.కె.ఎస్.సి జనరల్ సెక్రటరీ రఘువీర్ సంస్థ యొక్క వార్షిక బ్యాలెన్స్ షీట్ సభ్యులకు చదివి వినిపించారు. రాజంబాల్ 20023-24 సంవత్సరానికి సంబంధించిన బ్యాలెన్స్ షీట్‌ను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి డీసీపీలు పీవీ పద్మజ, ఆక్షాంశ్ యాదవ్, అరవింద్ బాబు, ఇందిర, శ్రీనివాసులు, ఉషా విశ్వనాథ్, శివకుమార్‌తో పాటు ఫోరమ్ జాయింట్ సెక్రటరీలు, చీఫ్ కోఆర్డినేటర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యా రంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి



- ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు చింతల అనిల్

నవతెలంగాణ-ఘట్కేసర్
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న బడ్జెట్‌లో విద్యా రంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని, పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్మెంట్‌లను తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు చింతల అనిల్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొఠారి కమిషన్ ప్రకారం రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులు, కేంద్ర బడ్జెట్‌లో 10 శాతం నిధులు కేటాయించాలని దానికి అనుగుణంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించడం లేదన్నారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో పెండింగ్‌లో ఉన్న రూ.4300 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదలకు నిధులు కేటాయించాలన్నారు. ఇప్పటి వరకు విద్య శాఖ మంత్రిని నియమించకపోవడం సిగ్గుచేటన్నారు. తక్షణమే విద్యశాఖ మంత్రిని కేటాయించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలన్నారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో పెండింగ్‌లో ఉన్నటువంటి ఫీజు, రీయింబర్స్మెంట్‌ల కోసం బడ్జెట్ కేటాయించాలని కోరారు. లేని యెడల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసనలు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వినయ్, ప్రశాంత్, గోపి, కళ్యాణ్, మనోజ్, నందు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు అండా ఎర్రజెండా

- ఎర్రజెండా పోరాటాలకు ఆకర్షతులై సీఐటీయూలో చేరిక



నవతెలంగాణ-ఉప్పల్
కార్మికుల పక్షాన, కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తున్న సీఐటీయూ, పోరాటాలకు ఆకర్షతులై సీఐటీయూ ఉప్పల్ సర్కిల్ కార్యదర్శి జె. వెంకన్న ఆధ్వర్యంలో సుమారు 100 మంది ఇసుక లారీ అన్‌లోడ్ కార్మికులు సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ కార్మికులు, తమ హక్కుల కోసం పోరాటాలు నిర్వహించాలని, పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. కార్మికులకు సీఐటీయూ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కత్తుల యాదయ్య, వి.రలాల్ నారయ్య, రాజు అన్‌లోడింగ్ కార్మికులు గంగారాం భాస్కర్, ప్రసాద్, లక్ష్మణ్, రమేష్, మంగయ్య, యాదగిరి, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లతో వ్యాక్సిన్ క్యారియర్ మోపించడం అన్యాయం

- సీఐటీయూ మేడ్చల్ జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణ



నవతెలంగాణ-శామీర్‌పేట
ఆశ వర్కర్లతో వ్యాక్సిన్ క్యారియర్ మోపియడం అన్యాయం ఈ పద్ధతిని అధికారులు వెంటనే మానుకోవాలని సీఐటీయు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోశాధికారి కె.ఉన్నికృష్ణ అన్నారు. శనివారం ఆయన నవతెలంగాణతో మాట్లాడుతూ మూడు చింతలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాలతో వ్యాక్సిన్ క్యారియర్లు మోయిస్తున్నారని ఇంతకుముందే ఎన్నోసార్లు వ్యాక్సిన్ క్యారియర్లు మోయడం ఆశా వర్కర్ల పని కాదని ఎంత చెప్పినప్పటికీ ఆశా వర్కర్లను బెదిరించి ఆశా వర్కర్లతో వ్యాక్సిన్ కేర్ మోయించడం మాత్రం అధికారులు మానలేదని మండిపడ్డారు. ఈ విషయం మీద ఆశా వర్కర్లు ఎంత గొడవ చేసినప్పటికీ వాళ్లని బెదిరించి వ్యాక్సిన్ క్యారియర్లు తెప్పించుకుంటుంటే అధికారులు కూడా వాళ్ల మీద ఎటువంటి యాక్షన్ తీసుకోకుండా అన్ని కార్యక్రమాలలో ఆశా వర్కర్లను వాడుకోవాలని అధికారులే చెప్పడం అత్యంత శోచనీయమని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణన్ అన్నారు. ఇప్పటికైనా అధికారులు ఆశాలపైన వేధింపులు అరికట్టాలని ఆశలకి ఆశాల పని తప్ప వేరే పనులు చేయించకూడదని అలా కాకుండా వేరే పనులు చేయిస్తే తీవ్రంగా పోరాడుతామని హెచ్చరించారు.

ఓపెన్ ప్లాట్ ఉన్న ప్రతి ఒక్కరూ ఎల్ఆర్ఎస్ చెల్లించాలి



నవతెలంగాణ-ఘట్కేసర్:
ఓపెన్ ప్లాట్ ఉన్న ప్రతి ఒక్కరూ ఎల్ఆర్ఎస్‌ను తప్పనిసరిగా చెల్లించాలని ఘట్కేసర్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌పై 25శాతం తగ్గింపు (ల్యాండ్ రెగ్యులర్ స్కీమ్) కల్పిస్తుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కింద ప్రవేశ పెట్టిన ఈ పథకం ఓపెన్ ప్లాట్ ఉన్న ప్రతి ఒక్కరూ ఈ నెల 31వ తేదీ వరకు ఎల్ఆర్ఎస్‌ను మున్సిపల్ కార్యాలయంలో కట్టుకోవాలన్నారు. ఎల్ఆర్ఎస్ చెల్లింపునకు ప్రత్యేక క్యాబిన్‌ను 25శాతం రాయితీతో ఏర్పాటు చేశామని ఘట్కేసర్ మున్సిపల్ పట్టణ ప్రజలు అదేవిధంగా విలీన మైన గ్రామాలల్లో ఖాళీ స్థలం (ఓపెన్ ప్లాట్) ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగించుకోవాలని కోరారు.

కాలనీ అభివృద్ధికి ఐక్యంగా కృషి



నవతెలంగాణ-చర్లపల్లి
కాలనీవాసులు అందరూ ఐక్యంగా ఉండి కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామని నాగార్జున నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన యావపురం రవి అన్నారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వ్యక్తిగత కారణాల వల్ల అధ్యక్షుడు నామాల కృష్ణ పదవీకి రాజీనామా చేసిన కారణంగా శనివారం ప్రధాన కార్యదర్శి యావపురం రవి అధ్యక్షతన ఏర్పాటైన కాలనీ సంక్షేమ సంఘం సమావేశంలో నూతన అధ్యక్షునిగా యావపురం రవి, ప్రధాన కార్యదర్శిగా మొగిలి కరుణాకర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు యావపురం రవి మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్, అధికారులు, సీసీఎస్ సహకారంతో కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో కోశాధికారిగా బొల్లంపల్లి శ్రీకాంత్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా సయ్యద్ సాదిక్, బైరంకొండ గోపాల్ యాదవ్, మచ్చ మహేందర్ గౌడ్, ఉప కోశాధికారిగా యేరుపుల సాయి వివేక్, సహాయ కార్యదర్శులుగా మేడిపల్లి శ్రీశైలం, బైరగోని వెంకటేష్ గౌడ్, సిద్ధగొని నాగరాజు గౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా మహమ్మద్ జహంగీర్ పాషా, చింతల కొండల్ రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

వికలాంగుల హామీలను నెరవేర్చకపోతే ఉద్యమిస్తాం



నవతెలంగాణ-కాప్రా
వికలాంగుల హామీలను నేరవేర్చకపోతే ఉద్యమం చేస్తామని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఎన్‌పీఆర్‌డి మేడ్చల్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు కె. చంద్రమోహన్ అన్నారు. ఎన్‌పీఆర్‌డి రాష్ట్ర అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శి కె.వెంకట్, అడివయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు రూ.6 వేలు, వృద్ధులు, వితంతువులకు రూ.4వేలు ఇస్తామని ప్రభుత్వం మాట తప్పిందన్నారు. వికలాంగులకు చేయూతను ఇవ్వాల్సిన ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని వికలాంగులకు నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని రాష్ట్ర వ్యాప్తంగా లక్ష సంతకాల సేకరణ చేపట్టామని ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే సీఎం ఇంటిని వేలమంది వికలాంగులతో ముట్టడిస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి కె.నాగలక్ష్మి, కోశాధికారి జె.మల్లేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ సుల్తాన్ రమేష్, కమిటీ సభ్యులు లక్ష్మిపతి,షెన్ బేగం, కోటయ్య, రమేష్, రజిత, నిరాజారెడ్డి, శివకుమార్, ఆదర్శ్ తదితరులున్నారు.

ఆశా వర్కర్‌ల సేవలు అభినందనీయం..

- కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్
- ఆశా వర్కర్లతో కార్పొరేటర్ మహిళా దినోత్సవ సంబరాలు..



నవతెలంగాణ-చర్లపల్లి
కరోనా కష్టకాలంలో ఆశావర్కర్ల అందించిన సేవలు అభినందనీయమని కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ అన్నారు. శనివారం నాచారం డివిజన్‌లో పనిచేస్తున్న 26 మంది ఆశా వర్కర్లతో కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేకర్ మహిళా దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఆశావర్కర్లు కరోనా వ్యాప్తి సమయంలో బాధితులకు అండగా నిలవడమే కాకుండా వారికి ధైర్యం కల్పించి తమ సేవ గుణాన్ని చాటరన్నారు. ఈ ప్రాంతంలోని ఆశా వర్కర్లకు అండగా నిలుస్తున్నామని, సమాజంలోని ప్రతి ఒక్కరికి ఆశా వర్కర్లు ఆరోగ్య భద్రత కల్పిస్తున్నారన్నారు. అనంతరం కార్పొరేటర్ ప్రతి ఒక్క ఆశ వర్కర్లను శాలువాతో సత్కరించి, బహుమతులను అందజేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

మంచినీటి లో ప్రెషర్ సమస్యలను పరిష్కరించాలి



నవతెలంగాణ-కాప్రా
మంచి నీటి లో ప్రెషర్ సమస్యలను పరిష్కరించాలని స్థానిక కార్పొరేటర్ జేరిపోతుల ప్రభుదాస్ అన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలో ఓల్డ్ మీర్‌పేట్, శాంతినగర్, అన్నపూర్ణ కాలనీలలో తాగునీటి సరఫరా సమస్య లో ప్రెషర్ విషయంపై కాలనీవాసుల ఫిర్యాదు నిమిత్తం జలమండలి అధికారులకు మంచినీటి సరఫరా సమస్యపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురాగా పరిష్కార దిశగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాటర్ ఏజీ ఎం.వేణుగోపాల్, సిరాజుద్దీన్ పాల్గొన్నారు.

కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో యాన్యువల్ డే సెలబ్రేషన్స్

నవతెలంగాణ-కాప్రా
కృష్ణవేణి టాలెంట్ స్కూల్స్ కాప్రా బ్రాంచ్‌లో యాన్యువల్ డే సెలబ్రేషన్స్‌ను నిర్వహించారు. ఈకార్యక్రమానికి అకాడమిక్ మేనేజర్ మురళీ, జోనల్ మేనేజర్ జావేద్ అలీ, అతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర నాయకుడు రేగళ్ల సతీష్ రెడ్డి మాట్లాడుతూ పిల్లలు చదువుతో పాటు అన్ని రంగాలలో ముందుండాలని విజయాలు సాధించాలని కోరుకున్నారు. ప్రిన్సిపాల్ రామకృష్ణ మమత, రవి, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాదిగలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి



- మాదిగ పోరాట సమితి

నవతెలంగాణ-అల్వాల్
మాదిగలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఉద్యమకారుల జేఏసీ ప్రాంగణంలో మాదిగ పోరాట సమితి, వికలాంగుల పోరాట సమితి ఆధ్వర్యంలో నాలుగో రోజు నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి శాసనసభలో మాదిగలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వారు డిమాండ్ చేస్తూ ఎస్సీ వర్గీకరణ చట్టం అమలులో జాప్యం జరుగుతుండటంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ చట్టం రాకముందే గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 పరీక్ష ఫలితాలను నిలిపి వేయాలని వారు కోరుతున్నారు. ఎస్సీ వర్గీకరణ చట్టం వచ్చేంత వరకు ఉద్యోగ నియామకాలు చేపట్టవద్దని వారు పట్టుబడుతున్నారు. ఎస్సీ వర్గీకరణ చట్టం అమలు కాకుండానే ఈ ఫలితాలు వెలువడితే, మాదిగలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నిరసన కార్యక్రమంలో అంది రాంబాబు, బచ్చలకూర స్వామి, రామచంద్ర మాదిగ, ఎన్. వినయ్, సురేష్, షేక్ షబానా, శోభ తదితరులు పాల్గొన్నారు.

విదేశాల్లో విద్యకు కన్సల్టెన్సీలు ఎంతో దోహదపడుతాయి



నవతెలంగాణ-కాప్రా
విదేశాల్లో విద్యను అభ్యసించేందుకు కన్సల్టెన్సీలు ఎంతో దోహదపడుతాయని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మీర్ పేట హౌసింగ్ బోర్డు డివిజన్ పరిధిలోని మెయిన్ రోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆల్ఫా బ్రిడ్జ్ కన్సల్టెన్సీ ఓవర్సీస్ ఎడ్యుకేషన్‌ని ముఖ్య అతిథిగా హాజరై వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వాహ కులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మీర్ పేట హౌసింగ్ బోర్డు డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్,మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-అల్వాల్
సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శనివారం అల్వాల్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు దురదృష్టకరమని, ప్రజాస్వామ్య విరుద్ధమని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన రేవంత్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, కార్పొరేటర్ సబిత అనిల్ కిషోర్, బీఆర్ఎస్ నాయకులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా నవగ్రహ ధ్వజస్తంభ ప్రతిష్టాపన



నవతెలంగాణ-ఘట్కేసర్
ఘట్కేసర్ మున్సిపల్ పరిధిలోని ఎన్ఎఫ్‌సీ నగర్‌లో శ్రీ త్రయంబకేశ్వర సహిత శ్రీ దాసాంజనేయ స్వామి ఆలయంలో నవగ్రహ ప్రతిష్టాపన ధ్వజ స్తంభ ప్రతిష్టాపన ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా నవగ్రహ విగ్రహాలను ఎన్ఎఫ్‌సీనగర్‌కు చెందిన గడ్డం హర్షిత వేణు సొంత డబ్బులతో ఆలయానికి బహుకరించారు. కుక్కట్‌పల్లికి చెందిన సురాంగం సునీత శ్రీనివాస్‌రావు గజ స్తంభాన్ని ఆలయానికి బహుకరించారు. పెద్ద అంబర్‌పేటకు చెందిన దోమల అపర్ణ వెంకటేష్ గౌడ్ చండీశ విగ్రహాన్ని ఆల యానికి బహుకరించారు. ఈ విగ్రహాలను గజ స్తంభాన్ని ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహాలను వేద స్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఈ పూజా కార్యక్రమంలో భక్తులు అత్యధిక సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1లో ర్యాంకు సాధించడం హర్షనీయం

- పూర్వ విద్యార్థిని సన్మానించిన సెరినిటీ పాఠశాల యాజమాన్యం



నవతెలంగాణ-కీసర
తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్-1 ఫలితాలలో బండ్లగూడ నివాసియైన పన్నీరు శ్రీనివాస బాబు (స్వామి) సరస్వతి కుమార్తె చిరంజీవి శివాని (2015-16) ఎస్ఎస్‌సీ బ్యాచ్) అత్యుత్తమ ర్యాంకును సాధించటం, మా పాఠశాల విద్యార్థినీ కావటం మాకు ఎంతో ఆనందంగా, గర్వంగా ఉందని పాఠశాల ముఖ్య కార్యదర్శి నోముల వసంత తెలిపారు. సాధారణ కుటుంబంలో పుట్టి అసాధారణ విజయాన్ని కైవసం చేసుకున్న చిరంజీవి శివాని కృషి, పట్టుదల ఆదర్శనీయమని పాఠశాల కరెస్పాండెంట్ నోముల జంగిరెడ్డి అన్నారు. చిరంజీవి శివానినీ పాఠశాల తరపున ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-కాప్రా
సాయి సుధీర్ డిగ్రీ కళాశాల డిగ్రీ బీయస్సీ, బీకాం, బీబీఏ విద్యార్థుల మధ్యగల సఖ్యతను, స్నేహాన్ని, కళాశాల పట్ల గౌరవాభిమానాలు చాటిచెప్పే విధంగా విద్యార్థి సమ్మేళం వేడుకలు నిర్వహించారు. సాయి సుధీర్ డిగ్రీ కళాశాలలో ప్రస్తుతం చదువుతున్న మూడు సంవత్సరాల విద్యార్థులు ఎంతో ఆనందోత్సాహాలతో కన్నుల పండుగగా చర్లపల్లిలోని సిరి గార్డెన్స్‌లో విద్యార్థి సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి సాయి సుధీర్ కళాశాలల చైర్‌పర్సన్ ఆర్.ఉషారాణి ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థి సమ్మేళనం స్నేహపూర్వ వాతావరణంలో కలకాలం గుర్తుండిపోయేలాగా జరపుకోవాలని పిలుపునిచ్చారు. కళాశాల ఉపన్యాసక, ఉపన్యాసకేతర సిబ్బంది కూడా ఈ వేడుకలో పాలుపంచుకుని పండుగ వాతావరణాన్ని సృష్టించారు.

తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి నీరుగొండ సతీష్ బాబు ఇటీవల కాళ్లకు సర్జరీ చేసుకున్న విషయం తెలుసుకున్న తెలుగుదేశం రాష్ట్ర నాయకులు కనకమేడల రాంబాబు, జిల్లా సంయుక్త కార్యదర్శి రుద్రగోని రాంచందర్ గౌడ్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు శివానంద్, టీడీపీ నాయకులు వీరభద్ర రావు, రమేష్‌లు పరామర్శించారు.

నవతెలంగాణ కాప్రా/చర్లపల్లి



కుషాయిగూడ డిపో తెలంగాణ ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన జ్యోతిరావు పూలే విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జీహెచ్ఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్. ఈ కార్యక్రమంలో చర్లపల్లి డివిజన్ కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకురాలు ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు తదితరులు నవతెలంగాణ-కాప్రా



గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి..



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కండ్లకోయ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. బైసాకి దాబా ముందు శుక్రవారం గుర్తుతెలియని వాహనం ఢీకొని టీవీ ఎస్ ఎక్సెల్ పై వెళ్తున్న ఒరిస్సాకు చెందిన ప్రకాష్ సాహు (25)అనే వ్యక్తి మృతి చెందాడు. మృతుడు ఒరిస్సా నుంచి మూడు సంవత్సరాల క్రితం హైదరాబాదుకు వచ్చి దినసరి కూలిగా పని చేస్తున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డివిజి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని చంద్రమ్మ కాలనీలో పెయింటర్‌గా పనిచేసే సతీష్(43), డివిజన్ పరిధిలోని శంషిగుడాలో నివసించే వి.లక్ష్మమ్మ(69) లు అనారోగ్యంతో బాధపడుతూ మరణిం చడం జరిగింది. సమాచారం తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తనయుడు, యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. డివిజి ట్రస్ట్ ద్వారా బాధిత కుటుంబాలకు రూ.5,000ల చొప్పున ఇరు కుటుంబాలకు పది వేల రూపాయలు ఆర్థిక సహా యం అందించారు. ఈ కార్యక్రమంలో తనతోపాటు విరేశం, కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.

ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీక



- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీక అని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. హైదర్ నగర్‌లో నిర్వహించిన ఇఫ్తార్ విందులోఎమ్మెల్యే పాల్గొని ముస్లీం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరులు ఎంతో పవిత్రంగా భావించే రంజాన్ మాసంలో ఉపవాసం ఉండి నియమ నిష్టల తో ప్రార్థనలు చేసి ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. అల్లా దయతో అందరూ ఆయురాగ్యంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, బీఆర్ఎస్ నాయకులు సిందం శ్రీకాంత్, ఎర్రబల్లి సతీష్ రావు, శ్రీనివాస్, మహమ్మద్ గౌస్, ఖలీల్, షకీల్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

బహుజన రాజ్యం కోసం కాన్షీరాం స్ఫూర్తితో పోరాటం కొనసాగిద్దాం



- రాష్ట్రీయ దళిత సేన మైనార్టీ విభాగం జాతీయ అధ్యక్షులు డాక్టర్.సయ్యద్ జహంగీర్ హుస్సేన్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

బహుజన రాజ్యం కోసం కన్షీరామ్ స్ఫూర్తితో పోరా టం కొనసాగిద్దా మని రాష్ట్రీయ దళిత సేన మైనారిటీ విభాగం జాతీయ అధ్యక్షులు డాక్టర్ జహంగీర్ హుస్సేన్ అన్నారు. శనివారం గాజులరామారం డివిజన్ పరిధి రోడా మేస్త్రి నగర్‌లో కాన్షిరాం 91వ జయంతిని ఆయన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో బహుజన రాజ్యం స్థాపించిన గొప్ప వ్యక్తి కాన్షిరాం అని కొనియాడారు. భారతదేశంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ,బీసీ,మైనార్టీలను సమీకరించి ఉత్తరప్ర దేశ్‌లో గతంలో ముఖ్యమంత్రిగా మాయావతినీ చేసిన చరిత్ర కాన్షిరాంది అన్నారు. రాష్ట్రీయ దళిత సేన జాతీయ అధ్యక్షులు అవిజే జేమ్స్, ప్రధాన కార్యదర్శి వై.బాలరాజు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఓబీసీ జాతీయ అధ్యక్షులు గూడ ఐలయ్య గౌడ్, జాతీయ దళిత సంక్షేమ సంఘం అధ్యక్షులు డాక్టర్ బూదాల అమర్ బాబు, ఓబీసీ జాతీయ ఉపాధ్యక్షులు ఎం.జనార్దన్, సంజీవ రెడ్డి, బలరాం, హనుమంతు, పాల్గొన్నారు.

గాలి కాలుష్యంపై చర్యలు తీసుకోండి..



- పీసీబీ అధికారుల వద్ద కాలనీలవాసుల ఆవేదన

నవతెలంగాణ-నిజాంపేట్

కాలుష్యం కారణంగా బాచుపల్లి సమీపంలోని కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలు కాలనీల వాసులు సనత్ నగర్‌లోని ప్రాంతీయ కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో శనివారం ఫిర్యా దు చేశారు. బాచుపల్లి గ్రామం పరిధిలోని సాయి అనురాగ్ కాలనీ వాసులు సమీపంలోని టీఎఫ్ఎల్ రసాయనపరిశ్రమ నుంచి విడుదల అయ్యే కాలు ష్యం కారణంగా స్థానిక కాలనీలలో వృద్ధులు, చిన్నారులు అనారోగ్యం బారిన పడుతున్నారని వారు కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయ కార్యదర్శి రఘుకు ఫిర్యాదు పత్రాన్ని అందించారు. సమీప రసాయన కంపెనీ విడు దల చేస్తున్న కాలుష్యం కారణంగా స్థానిక కాలనీలలో గాలి, నీరు పూర్తిగా కలుషితమవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్య నియం త్రణ మండలి కలగజేసుకొని కాలనీలకు అత్యంత సమీపంలో ఉన్న టీఎఫ్ ఎల్ రసాయన పరిశ్రమను కాలనీలకు దూరంగా తరలించి తమ ఆరోగ్యాల ను కాపాడాలని పీసీబీ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు కస్తూరు రాజకుమార్, హనుమంతరావు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ సత్యంను సన్మానించిన సీపీఐ నాయకులు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

నూతనంగా ఎమ్మెల్సీగా ఎన్నికైన సత్యంను శనివారం సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో సీపీఐ నేతలు కలిసి శాలువాతో సన్మాని స్తూ అభినందించారు. ఉద్యమకారుడు,ప్రజా ఉద్యమాల ను నిర్మించి జైలు జీవితం అనుభవించి అనేక అటుపోట్లు వచ్చినప్ప టికి పార్టీ సిద్ధాంతంతో పని చేస్తున్న క్రమశిక్షణ కలిగిన నాయకులు సత్యమన్నా అని నేతలు అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీగా నియమితులైన సత్యం మాట్లాడుతూ పదవుల కోసం కాకుండా ప్రజల కోసం పనిచేస్తే పదవులు అవే వస్తాయని, ప్రజల కోసం నిరంతరం పని చెయ్యాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఈ.ఉమామహేష్, కార్యవర్గ సభ్యులు వి.హరినాథ్ రావు, వంగాల శ్రీనివాస్, సదానంద్, వెంకటేష్, ప్రజానాట్యమండలి అధ్యక్షులు బాబు, విద్యార్థి నాయకుడు జంబు సన్మానించిన వారిలో ఉన్నారు.

సర్వేల పెండింగ్ బకాయిలు చెల్లించాలి

- సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోశాధికారి కె.ఉన్నికృష్ణన్
- డీఎంఅండ్‌హెచ్‌ఓకు వినతి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఆశా వర్కర్లకు బకాయి ఉన్న ఎల్‌సీడీసీ, హెచ్‌బీఎన్‌సీ, హెచ్‌బీవైసీ హెూం ఎర్లియర్లీ ట్రైనింగ్, బీసీజీ సర్వే డబ్బులను వెంటనే చెల్లించాలనీ, ఆశాలపై అధికారుల వేధింపులు అరికట్టాలనీ, పని భారం తగ్గించాలని కోరు తూ శనివారం డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సి.ఉమాగౌరీకి సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోశాధికారి కె.ఉన్నికృష్ణన్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి 30వ తేదీ వరకు సర్వే చేయాలని ఆశా వర్కర్లను ఆదేశించినట్టు తెలి పారు. ఇప్పటికి జిల్లాలో 4 విడతల ఎల్‌సీడీసీ సర్వే డబ్బు లు బాకీ ఉన్నాయనీ, అవి చెల్లించకుండా మళ్లీ సర్వే చేయ మని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. లాస్ట్ డిసెంబర్‌లో చేసిన సర్వే వేతనం కూడా ఇంకా ఆశాల ఖాతా ల్లో జమ కాలేదని తెలిపారు. బకాయిలు చెల్లించిన తర్వాత నే ఆశాలు ఎల్‌సీడీసీ సర్వే చేస్తారని తేల్చి చెప్పారు. నేషన ల్ ప్రోగ్రామ్స్‌ని గవర్నమెంట్ గౌరవప్రదమైన ప్రోగ్రామ్స్‌గా చెప్పుకుంటుందనీ, అలాంటి ప్రెస్టీజియస్ ప్రోగ్రామ్స్‌కు కూడా బడ్జెట్ కేటాయించకపోవడం అత్యంత దుర్మార్గం అన్నారు. రాష్ట్రంలో ఏ జిల్లాలో లేని విధంగా మన జిల్లాలో ఆశాలపైన ఆన్‌లైన్ పని ఒత్తిడి ఉందనీ, దీని వల్ల ఆశా వర్కర్లు మనస్తాపానికి గురై అనారోగ్యం బారిన పడుతు న్నారని తెలిపారు. జిల్లాలో కొత్తగా ఆశ వర్కర్లకు పీహెచ్ సీ, యూపీహెచ్‌సీ, బీకేడీ, పీడీకే డ్యూటీలు కొత్తగా చేయి స్తున్నారని తెలిపారు. ఇక ఆన్‌లైన్ అయితే అబ్బా కార్డ్స్, సీ బ్యాక్, ఎన్‌సీడీ స్క్రీనింగ్, ఈ సంజీవిని, ఐహెచ్ఐపీ ఎంఎ హెచ్ కిట్ చేయిస్తున్నారు. ఇది మా పని కాదు అని అడిగి తే చెప్పిందల్లా చేయాలి లేకపోతే డ్యూటీలో నుంచి తీసేస్తా మని కొన్ని వేల మంది ఉద్యోగాల కోసం ఎదురు చూస్తు న్నారనీ, మీరు తప్పుకుంటే వాళ్ళు రావడానికి సిద్ధంగా ఉన్నారని ఆశాలు 24 గంటలు పని చేయాలని అధికారు లు బెదిరించడం అత్యంత దుర్మార్గం అన్నారు. ఆశా వర్కర్లకు ఇచ్చే వేతనాలకు చేయించుకునే పనికి సంబం ధం లేకుండా అయిపోయిందన్నారు. ఈ సమస్యలను పరిష్కారం చేయకపోతే జిల్లా ఆశా వర్కర్లు పని బంద్ చేసి పోరాటానికి సిద్ధమవుతున్నారని హెచ్చరించారు.

సుచిత్రలో 'షాపర్స్ స్టాప్' కొత్త స్టోర్ ప్రారంభం



నవతెలంగాణ-సిటీబ్యూరో

భారతదేశ ప్రముఖ ప్రీమియం ఫ్యాషన్, బ్యూటీ, గిఫ్టింగ్ గమ్యస్థలమైన షాపర్స్ స్టాప్, సుచిత్రలో తన తాజా స్టోర్‌ను ప్రారంభించింది. ఈ స్టోర్‌లో ఫ్యాషన్, బ్యూటీ, లైఫ్‌స్టైల్ ఉత్పత్తుల ఎంపికను జాగ్రత్తగా కూర్చి ఉంచారు. ఈ సందర్భంగా షాపర్స్ స్టాప్ లిమిటెడ్ కస్టమర్ కేర్ అసోసియేట్, మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ కవీంద్ర మిశ్రాలి మాట్లాడుతూ "హైదరాబాద్ ఎప్పటికీ మా కీలక మార్కెట్ గా ఉంది. ఇక్కడి వినియోగదారులతో మా సంబంధాన్ని మరింత బలోపేతం చేయడం మాకు ఎంతో ఉత్సాహాన్ని స్తుంది. సుచిత్రలోని ఈ కొత్త స్టోర్‌లో జాగ్రత్తగా ఎంపిక చేసిన ఫ్యాషన్, బ్యూటీ, లైఫ్‌స్టైల్ ఉత్పత్తులతో మెరుగైన షాపింగ్ అనుభవాన్ని అందించడానికి మేం రూపకల్పన చేసాం. ప్రీమియం ఉత్పత్తులు, అత్యుత్తమ సేవ, వ్యక్తిగత అనుభవాలపై మా నిబద్ధత ఎల్లప్పుడూ స్థిరంగా ఉంటుం ది. హైదరాబాద్ వినియోగదారులు తాజా ధోరణులను అన్వేషించడానికి, మేం అందించే అపూర్వమైన రిటైల్ అనుభవాన్ని ఆస్వాదించడానికి మేం ఎదురు చూస్తున్నాం" అని తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ ప్రకారం ఉద్యోగ నియమాకాలు చేపట్టాలి



నవతెలంగాణ-నిజాంపేట్

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో చేపట్టనున్న ఉద్యోగాల ప్రక్రియలో ఎస్సీ వర్గీకరణ ప్రకారమే రిజర్వేషన్ అమలు చేయాలని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షులు తోకల చిరంజీవి మాదిగ డిమాండ్ చేశారు. శనివారం ఆయన బాచుపల్లి తెలుగు యూనివర్సిటీ ప్రాంగణంలో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భ ంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణను పరిగణలోకి తీసు కోకుండా ఉద్యోగుల భర్తీ చేయబడితే మాదిగ సామాజిక వర్గానికి తీరని నష్టం వాటిల్లుతుందని స్పష్టం చేశారు. గత 70 ఏండ్లుగా ఉద్యోగ నియమాకాల్లో మాదిగ లకు తీరని అన్యాయం చోటుచేసుకుందని అన్నారు. సుప్రీంకోర్టు అత్యున్నత రాజ్యాంగ ధర్మాసనం ఎస్సీ వర్గీక రణ బలప రుస్తూ ఇచ్చిన చారిత్రాత్మక తీర్పును ప్రతి రాష్ట్రం గౌరవిం చాల్సిందేనన్నారు. సాకులు చెబుతూ సుప్రీంకోర్టు తీర్పుని రేవంత్ రెడ్డి ప్రభుత్వం పెండింగ్‌లో పెడితే జరగ బోయే పరిణామాలకి రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత వహించా ల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్య దర్శి బైరపోగు శివకుమార్ మాదిగ, ముదిగొండ నవీన్, ప్రశాంత్, దుగ్గెల హరిప్రసాద్, అశోక్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలి



- భరత్ నగర్ కాలనీలో కార్పొరేటర్ సతీష్ గౌడ్ పర్యటన

నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిదిలోని భరత్‌నగర్ కాలనీ, జేపీ నగర్, ఎస్పీ నగర్ సంక్షేమ సంఘ కమిటీ సభ్యులు జలమండలి అధికారులు డీజీఎం శివ, మేనేజర్ జెక్కితో సంయుక్తంగా కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ మంచినీటి సమస్యపై కాలనీ వాసులతో కలిసి శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని కాలనీ కాలనీలో మంచినీటి మంచినీరు లోప్రె షర్‌గా వస్తున్నందున స్థానికపు కాలనీవాసులు తాగునీటి సరఫరా చేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రని సతీష్ గౌడ్ తెలిపారు. ప్రధానంగా వేసవి కాలం కావడంతో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. దీంతో మంచి నీటి కొరత ఇబ్బందికరంగా మారిందని కాలనీ నివాసితులు కార్పొరేటర్ సతీష్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. అందుకు వెంటనే స్పందించిన కార్పొరేటర్ సతీష్ గౌడ్ వెంటనే అక్కడే ఉన్న అధి కారులతో మాట్లాడారు. తక్షణమే కాలనీలో నెలకొన్న తాగునీటి సరఫరాను డివిజన్‌కు రావలసిన నీళ్లు సక్రమంగా వస్తున్నాయా లేదా రాకపోతే పై అధికారులతో చర్చించి తాగు నీరు వచ్చేలాగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు వేసవిలో కూడా గతంలో ఎలాంటి అవాంతరాలు లేకుండా మంచినీరు సరఫరా చేసే బాధ్యత అధికారులపై ఉంద న్నారు. కాబట్టి చర్చించి కచ్చితంగా దానికి అనుగుణంగా ప్రణాళికలు వేసుకోవాలని ఆదేశించారు. అదే విధంగా జేపీ నగర్ కాలనీలో 20 ఫీట్ల వరకు మూడు 900 డయా డ్రయినేజీ పైప్ వేస్తే సమస్య తీరుతుందని కాలనీవాసులు తెలిపారు. ఈ నేపథ్యంలో పైప్ లైన్లు కూడా రెండు, మూడు రోజులలో వేయాలని అధికారులకు సూచించారు. అనతరం సమస్యను శాశ్వతం గా పరిష్కరించమని డీజీఎం శివకు, మేనేజర్ జెక్కికి కార్పొరేటర్ సతీష్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమం లో కిషోర్ కుమార్, జనార్దన్ రెడ్డి, సీమాన్స్ పాస్టర్, రాజ్యలక్ష్మి, ఉమారాణి, జ్యోతిగౌడ్, సుదర్శన్ రెడ్డి, సురేంద్ర నాయుడు, సాంబశివారెడ్డి, రవీందర్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



- సీపీఐ(ఎం) కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్
- సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే..

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సీపీఐ(ఎం) రాష్ట్రవ్యాప్తంగా తలపెట్టిన ప్రజా సమ స్యల పరిష్కారానికై పోరుబాట కార్యక్రమంను జయ ప్రదం చేయాలని సీపీఐ(ఎం) కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు లో భాగంగా శనివారం మండల పరిధిలోని సూరారం డివిజన్ షాపూర్ నగర్ కళావతి నగర్‌లలో ఇంటింటి సర్వేలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లా డుతూ.. పాలకులు ఇచ్చిన హామీలను అమలు చేయడం లో ఘోరంగా విఫలం చెందినారని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఇండ్లు, ఇండ్ల స్థలాలు పెన్షన్లు, రేషన్ కార్డులు తదితర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కొరకు ప్రభుత్వ అధికారుల, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకురావడానికి ఈనెల 10 - 20 వరకు ఇంటింటి సర్వే నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొం టున్న సమస్యలను తెలుసుకొని అధికారులకు వినతి పత్రాలు సమర్పిస్తామన్నారు. బస్తీలలో వచ్చిన సమస్యలు వింటే ప్రభుత్వ అధికారులు ఉన్నారా ? లేరా ? అని సందేహం కలుగుతుందన్నారు. సంజయ్ గాంధీ నగర్ ప్రాంతంలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని, వేసవి ప్రారంభానికి ముందే భూగర్భ జలాలు అడుగంటి మొత్తం బోరు బావులు ఎండిపోయి మంచినీళ్ల కోసం ఎదురు చూడడం జరుగుతుందన్నారు. 4 నుంచి 5 రోజులకు ఒకసారి సమయపాలన లేకుండా మంచినీళ్ల వదులుతున్నారని పేర్కొన్నారు. అర్హులకు ఇండ్లు రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇవ్వాలని డిమాండ్ చేశారు. బస్తీలలో మంచినీటి సమస్యను వెంటనే పరిష్కారం చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించి వాటర్ వర్క్స్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యురాలు రావుల స్వాతి, కే శీను, సంతోష్, సత్యం సాయి, ముని, యాదగిరి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రం సుభిక్షం

- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్.
- నియోజకవర్గంలో రూ. కోటి 15 లక్షలతో నూతన సీసీ రోడ్ల మంజూరు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రంతో పాటు కుత్బుల్లా పూర్ నియోజకవర్గం సుభిక్షంగా ఉందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. శనివారం గాజులరామారం డివిజన్ పరిధిలోని రోడ మేస్త్రి నగర్(బి)లో రూ.55 లక్షలతో, సుభాష్ చంద్రబోస్ నగర్(బి)లో రూ.60 లక్షల తో నూతన సీసీ రోడ్లు మంజూరయ్యాయి. ఈ సందర్భం గా అయన, ఆయా బస్తీవాసులతో కలిసి సీసీ రోడ్డు పనులను పర్యవేక్షించారు. మంచినీటి, డ్రయినేజీ శానిటై జింగ్ సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారుల తో మాట్లాడారు. ఈ సందర్భంగా కూన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొబ్బరికాయలకే పరిమిత మైన పనులు ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో అభివృద్ధికి నోచుకున్నయన్నారు. ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసు కొస్తే వీలైనంత త్వరగా పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి నాయకత్వంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రివర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు చొరువతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గణనీయంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డి, ఆరిఫ్, జాంగిర్ హుస్సేన్, ఆంజనేయులు, నవీన్, బలరాం, యాదగిరి, కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌డి గ్రామర్ హై స్కూల్‌లో లాంగ్వేజ్ ఎక్స్పో



నవతెలంగాణ-కూకట్‌పల్లి

విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఎస్ఎస్‌డీ గ్రామర్ హై స్కూల్‌లో లాంగ్వేజ్ ఎక్స్పో నిర్వహించారు. విద్యార్థులు ప్రస్తుత పోటీ ప్రపంచంలో సమాజంలోని వివిధ రకాలైన సహచరులతో ఎలా మెలగాలి అనే అంశ ంపై, ఎస్ఎస్‌డి గ్రామర్ హై స్కూల్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగం గా విద్యార్థులు, ప్రస్తుత సమాజంలో పోటీ తత్వా నికి అనుగుణంగా, సమాజంలో ఎలా మాట్లాడాలో విద్యా ర్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కథలు, నేటి తరానికి అనుగుణంగా, ఇంగ్లీష్ ఎలా మాట్లాడాలో విద్యా ర్థులు ఎంతో చక్కగా వివరించారు. ప్రస్తుత పోటీ తత్వానికి తట్టుకునే విధంగా విద్యార్థులలో, డిబేట్ ఏలా మాట్లాడాలో విద్యార్థులకు వివరించారు.

ఈ కార్యక్రమంలో స్కూల్ ఫౌండర్ రవీందర్ రావు, వారి సతీమణి సురభి దుర్గా వాణి, డైరెక్టర్ చెన్నమనేని స్రవంతి, ప్రిన్సిపల్ సురభి తేజస్విని, అకాడమిక్ డీన్ మినాలినీ, వైస్ ప్రిన్సిపల్ జయశ్రీ, ఇన్‌చార్జిలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

భారతదేశ సంస్కృతి చాలా గొప్పది

- ఐఎన్‌టీయూసీ రాష్ట్ర, ప్రధాన కార్యదర్శి,ఓబీసీ జాతీయ అధ్యక్షులు గూడ ఐలయ్య గౌడ్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

భారతదేశ సంస్కృతి ఎంతో గొప్పదని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,ఓబిసి జాతీయ అధ్యక్షులు గూడ ఐలయ్య గౌడ్ అన్నారు.హెూలీ పర్వదినం పురస్కరించు కొని జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి మగ్దూం నగర్‌లోని మాజీ కౌన్సిలర్ వరమ్మ క్యాంపు కార్యాలయం ఆవరణలో ఘనంగా హెూలీ ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. రంగులు పూసుకుంటూ హెూలీ శుభాకాంక్షలు తెలుపుకు న్నారు. కులమతాలకతీతంగా ప్రతి ఒక్కరు సోదర భావంతో సంతోషాల్లో మునిగితేలుతూ జరుపుకునే గొప్ప పండుగ హెూలీ అన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ జాతీయ ఉపాధ్యక్షులు జనార్ధన్, కాంగ్రెస్ నాయకులు బండి యాదగిరి, రేవంత్ రెడ్డి యువసేన నాయకులు సాయి ప్రవీణ్ గౌడ్, కొండ మహేష్, గర్జన పాల్గొన్నారు.

ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్, తిరుమల మేనే జింగ్ పార్ట్నర్స్ ఆధ్వర్యంలో హెూలీ వేడుకలు సభ్యుల కేరింతల నడుమ ఉత్సాహంగా జరుపుకున్నారు. రంగు రంగుల కలర్లు పూసుకుంటూ హెూలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు సిహెచ్. భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఐక్యతకు నిదర్శనంగా హెూలీ పండుగ నిలుస్తుందని ప్రతి సంవత్సరం కుటుంబ సభ్యులతో పాటు సన్నిహితులతో హెూలీ వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్ర మంలో బీఆర్ఎస్ నియోజకవర్గ యూత్ నాయకులు కొలుకుల జైహింద్, సభ్యులు పాండాల శ్రీనివాస్ గౌడ్, పోలేపల్లి శేషారెడ్డి, సరస్వతి నరేందర్ రాజు, జనుముల జగన్మోహన్ ముదిరాజ్, ఆర్.నరేష్ రెడ్డి, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ శాఖ కార్యదర్శిగా పి.చంద్రమ్మ నియామకం



నవతెలంగాణ-బాలానగర్

ఇంద్రానగర్ సీపీఐ శాఖ కార్యదర్శి పి.చంద్రమ్మను సభ్యులు ఏకగ్రీవం గా ఎన్నుకున్నారు. బాలానగర్ మండ ల పరిధిలోని ఇంద్రానగర్ శాఖ మహా సభ ఎం.దావీద్ అధ్యక్షతన శ్రీశ్రీ నగర్ సీపీఐ పార్టీ కార్యాలయంలో శని వారం నిర్వహించారు. ఈ సందర్భంగా నేపథ్యంలో సీపీఐ కూకట్‌పల్లి మం డల కార్యదర్శి జి.కృష్ణ హాజర య్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఐ పేద ప్రజల పార్టీ కావున నియోజకవర్గంలో ప్రజల పక్షాన ప్రజా సమస్యలపై నిరంతరం వాటి పరిహా రం కోసం నిత్యం పోరాటంలో పోరాడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పి.రాములు, లక్ష్మయ్య, మాదవి, కనకమ్మ, మహేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

50 ఏండ్ల గుర్తు తెలియని పురుష వ్యక్తి చనిపోయిన ఘటన సనత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పురుష వ్యక్తి 50-55సంవత్సరాల వయస్సు కలిగి ఉంటుంది. ఈనెల 13. మధ్యాహ్నం 03.30 గంటల సమయం లో రాధాకృష్ణ నగర్ తన్విత కిరాణా షాప్ వద్ద అతను పడిపోయి చనిపోయి కనిపించాడు. స్థానికులు గుర్తించి పోలీసుల సమాచారం ఇవ్వగా వారు అక్కడకు చేరుకుని అంబులెన్స్ లో గాంధీ మార్చురీకి మతదేహాన్ని తరలించారు. ఈ వ్యక్తి గురించి తెలిసిన వారు ఎవరైనా ఉంటే సనత్‌నగర్ పోలీసు స్టేషన్ సెల్ నంబర్లకు (8712510038, 8331013246, 9490617132) కాల్ చేసి తెలియపరచాలని కోరుతున్నారు.

బేగంపేటలో అగ్నిప్రమాదం



నవతెలంగాణ-బేగంపేట

బేగంపేటలో అగ్నిప్రమాదం సంభవించింది .బేగంపేట ఫంక్షన్ హాల్ సమీపంలోని ఖాళీ ప్రదేశంలో చెట్లకు మంటలు అంటుకోవడంతో ఒక్కసారిగా స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఖాళీ ప్రదేశంలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో పాటు పొగ కమ్ముకోవడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్ సహాయంతో మంటలను అదుపు చేసే ప్రయత్నం చేస్తున్నారు. అమెరికన్ కాన్సులెట్ సమీపంలోనే ఈ అగ్ని ప్రమాదం జరిగింది.

సమస్యలు వెంటనే పరిష్కరించండి

- అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్
- బుద్ధ నగర్‌లో పర్యటించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

బుద్ధ నగర్‌లో అన్ని సమస్యలను పరిష్కరించి ప్రజల ఇబ్బందులను తొలగించాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు.ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తానని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. శనివారం వివిధ శాఖల అధికారులతో కలిసి బుద్ధ నగర్‌లో ఎమ్మెల్యే పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు. ముందుగా బుద్ధ నగర్‌లో ప్రమాదకరంగా ఉన్న ఐరన్ విద్యుత్ పోల్స్ ను తొలగించి, సిమెంట్ పోల్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా విద్యుత్ పోల్స్ పై పెద్ద మొత్తంలో ఉన్న కేబుల్స్ వైర్లను కూడా వెంటనే తొలగించాలని ఆదేశించారు. అదేవిధంగా బస్తీలో అంతర్గత రోడ్ల నిర్మాణం కోసం వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి అందజేయాలన్నారు. కమిటీ హాల్ కు విద్యుత్ సరఫరా లేదని, కిటికీలు దెబ్బ తిన్నాయని, ఇతర చిన్న చిన్న మరమ్మతులు చేయాల్సి ఉందని బస్తీ వాసులు ఎమ్మెల్యే దష్టికి తీసుకురాగా, వెంటనే కమిటీ హాల్‌కు వెళ్ళి పరిశీలించారు. అవసరమైన మరమ్మతులు చేపట్టడంతో పాటు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో బస్తీలోని నాలాలో నీరు నిలిచి పోయి బస్తీ మొత్తం ముంపునకు గురవుతున్నదని, రిలయన్స్ గల్లీలోని నాలా కు కలపడం ద్వారా సమస్య కు శాశ్వత పరిష్కారం లభిస్తుందని మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, బస్తీ వాసులు ఎమ్మెల్యేకు విన్నవించారు. అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, నామన సంతోష్ మణికుమార్, డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్, డీఈ వాసుదేవ రెడ్డి, వాటర్ వర్క్స్ జీఎం హరి శంకర్, ఎలెక్ట్రికల్ ఏఈ మౌనిక, స్ట్రీట్ లైట్ ఏఈ సుష్మ, ఏఎంఒహెచ్ చంద్రశేఖర్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి మన్సూర్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు హన్మంతరావు, నాయకులు ప్రవీణ్ రెడ్డి, గోపిలాల్ చౌహాన్, కూతురు నర్సింహ, బలరాం, పీయూష్ గుప్తా, గుడిగే శ్రీనివాస్ యాదవ్, వనం శ్రీనివాస్, బాసా లక్ష్మి, బస్తీ అధ్యక్షుడు బాజీబాబ, వినోద్, అనిల్, కష్ణ, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పురోగతికి సదస్సులు దోహదం

- రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ..
- సికింద్రాబాద్ యశోద ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆర్థోస్కోపీ కాన్‌క్లేవ్-2025" అంతర్జాతీయ సదస్సు అండ్ లైవ్ వర్క్‌షాప్ ప్రారంభం



నవతెలంగాణ-బంజారాహిల్స్

సాంకేతిక పురోగతికి సదస్సులు దోహదం చేస్తాయని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. సికింద్రాబాద్ యశోద హాస్పిటల్స్ ఆధ్వర్యంలో అత్యంత అధునాతన "ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్" (ఏఐ) టెక్నాలజీతో ఆర్థోపెడిక్, కీ హెూల్ ప్రొసీజర్స్, స్పోర్ట్స్ ఇంజూరీస్ అండ్ మినిమల్లీ ఇన్వాసివ్ సర్జరీలపై "హైదరాబాద్ ఆర్థ్రోస్కోపీ కాన్‌క్లేవ్-2025" అంతర్జాతీయ సదస్సు, లైవ్ వర్క్ షాప్ బంజారాహిల్స్‌లోని హెూటల్ పార్క్ హయత్‌లో శనివారం ప్రారంభమైంది. రెండు రోజుల ఈ సదస్సును యశోద హాస్పిటల్స్ గ్రూప్ డైరెక్టర్, డాక్టర్.పవన్ గోరుకంటితో కలిసి ముఖ్యఅతిథిగా హాజరైన గవర్నర్ ప్రారంభించి ప్రసంగించారు.

దేశంలో ఇప్పుడు ఎక్కువ మంది యువత క్రీడలవైపు మొగ్గు చూపుతున్నారని, భారత్ క్రీడా రంగంలో దుసుకుపోతున్నదన్నారు. స్పోర్ట్స్ గాయాలు దేశంలో అత్యంత సాధారణ ఆర్థోపెడిక్ గాయాలలో ఒకటి అని, తెలుగు రాష్ట్రాల్లో స్పోర్ట్స్ ఇంజూరీ, మెడిసిన్, ఆర్థ్రోస్కోపీపై జరుగుతున్న ఈ అంతర్జాతీయ సదస్సు అండ్ లైవ్ వర్క్ షాప్ లో జాతీయ, అంతర్జాతీయ అధ్యాపకులు రోబోటిక్ శిక్షణ, లైవ్ సర్జరీ, వీడియో ఆధారిత బోధనతో జ్ఞాన మార్పిడిని పొందడానికి తమ నైపుణ్యాన్ని విస్తరించుకోవడానికి ఇక్కడి యువ ఆర్థోపెడిక్ వైద్యులకు ఇది సరైన వేదిక అని తెలిపారు. యశోద హాస్పిటల్స్ గ్రూప్ డైరెక్టర్ మాట్లాడుతూ ఆర్థ్రోస్కోపీ శస్త్రచికిత్సలో అత్యాధునిక పద్ధతులు, పురోగతిపై దష్టి సారించే ఈ అంతర్జాతీయ సదస్సు అండ్ లైవ్ వర్క్ షాప్, మినిమల్లీ ఇన్వాసివ్ సర్జరీ ప్రాముఖ్యతను తెలియజేస్తుందన్నారు. కీళ్ల సంబంధిత సమస్యలను నిర్ధారించడానికి, చికిత్స చేయడానికి ఉపయోగించే మినిమల్లీ ఇన్వాసివ్ సర్జికల్ ప్రక్రియ అయిన ఆర్థ్రోస్కోపీ, ఆర్థోపెడిక్ సర్జరీలు చేసే విధానాన్ని విప్లవాత్మకంగా మార్చివేసిందన్నారు. ఈ సదస్సులో అత్యాధునిక రోబోటిక్ సహాయం మరియు ఏఐ, ఇంటిగ్రేషన్ వంటి అత్యాధునిక వైద్య విధానాల ద్వారా అనేక ఆర్థోపెడిక్ సర్జరీలు విజయవంతంగా ఎలా నిర్వహించాలో ఈ సదస్సుకు హాజరైన 600 మందికి పైగా యువ సర్జన్లకు లైవ్ సర్జికల్ వర్క్ షాప్ ద్వారా వివరించారు. ఇక్కడ ఆపరే టింగ్ సర్జన్లు ఆర్థోపెడిక్ శస్త్రచికిత్సలలో ఉన్న వివిధ సంక్లిష్టతలను అర్థం చేసుకోవడంతోపాటు ఆర్థో వైద్య రంగంలో దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 60 మందికి పైగా ప్రముఖ అంతర్జాతీయ జాతీయ ఆర్థోపెడిక్ వైద్య నిపుణులతో వారి అనుభవాలను పంచుకునే విధంగా సదస్సు, లైవ్ వర్క్ షాప్ రుపొందించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో దేశం నలుమూలల నుంచి 600 మందికి పైగా ఆర్థోపెడిక్ సర్జన్లు పాల్గొన్నారని యశోద హాస్పిటల్స్ సికింద్రాబాద్, సీనియర్ స్పోర్ట్స్ ఆర్థోపెడిక్స్ అండ్ ఆర్థ్రోస్కోపీ సర్జన్ డాక్టర్. ఆర్.ఎ. పూర్ణచంద్ర తేజస్వి తెలిపారు.

గ్రూప్ 1 పరీక్షలో అవకతవకలు ..



- మొదటి వంద ర్యాంకుల వారి ప్రశ్నాపత్రాలు ప్రజా క్షేత్రంలో పెట్టాలి
- ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ

నవతెలంగాణ-బంజారాహిల్స్

గ్రూప్ 1 పరీక్ష విషయంలో అనేక అవకతవకలు జరిగాయంటూ మొదటి వంద ర్యాంకుల వారి ప్రశ్న పత్రాలు ప్రజా క్షేత్రంలో పెట్టాలని ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్ కుమార్, సీనియర్ జర్నలిస్ట్ విఠల్‌తో కలిసి ఆయన మాట్లాడారు. సంవత్సరాల నుంచి ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగులకు అన్యాయం జరిగిందన్నారు. నిరుద్యోగుల కృషి వల్లే రాష్ట్రంలో ప్రభుత్వం మారిందన్నారు. గ్రూప్ 1కు జీఆర్ఎల్‌ను ఎందుకు ఇవ్వలేదో చెప్పాలని, గత మెయిన్స్ పేపర్ ప్రశ్నలే ఈసారి వచ్చాయన్న ప్రశ్నకు మీ సమాధానమేంటని ప్రశ్నించారు. పేపర్ లు దిద్దిన వారి అర్హతలు ఏంటి? బ్లూ ప్రింట్ శాస్త్రీయత ఎంత? తెలంగాణ ఉద్యమానికి సంబంధించిన పేపర్‌లను ఆంధ్ర వారితో దిద్దించారా?తెలుగు మీడియం విద్యార్థులు వాళ్ళ సమస్యలు మీ ముందు ఏకరువు పెట్టినా ఎందుకు పరిష్కరించలేదని నిలదీశారు. టాప్ వంద మందిలో ఎంత మంది తెలుగు మీడియం విద్యార్థులు ఉన్నారో తెలియజేస్తూ ప్రజా క్షేత్రంలో ఈ టాప్ వంద మంది రాసిన పత్రాలు ప్రజా క్షేత్రంలో పెట్టాలన్నారు. రీ కౌంటింగ్ కాదు.. రీ వాల్యూయేషన్ చెయ్యాలని డిమాండ్ చేశారు.

పేదలకు నాణ్యమైన వైద్య సేవలకు సహకారం



- ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

నవతెలంగాణ-ఓయూ

నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలను పొందేందుకు తమ వంతు సహకారాన్ని అందిస్తున్నామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. పార్సీగుట్ట కు చెందిన పద్మావతికి రూ.2 లక్షలు, చిలకలగుడా కు చెందిన మహమ్మద్ ఫిరోజ్ కు రూ.2 లక్షలు, వారసిగూడకు చెందిన భవాని కి రూ.2 లక్షలు, అడ్డగుట్టకు చెందిన బాబు మియాకు రూ.లక్షా పదివేల చొప్పున రూ.7.10 లక్షల విలువజేసే సీఎంఆర్ఎఫ్ నుంచి నిధుల మంజూరు చేసే పత్రాలను (ఎల్.ఓ.సీ)లను ఎమ్మెల్యే శనివారం సితాఫల్‌మండీ లోని తమ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ .ప్రజలు అత్యవసర సందర్భాల్లో సితాఫలమండీలోని తమ కార్యాలయాన్ని సంప్రదించాలని పేర్కొన్నారు. వైద్య సేవలకు అధిక ప్రాముఖ్యతను కల్పిస్తున్నానన్నారు. బీఆర్ఎస్ నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందుకు హాజరైన ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే పద్మారావు

నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్ నియోజకవర్గంలోని మహమ్మద్ గూడాలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్సీ కవిత, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఇఫ్తార్ విందులు సర్వ మత సౌభాతత్వాన్ని చాటుతాయని అన్నారు. రాష్ట్రం అన్ని మతాల ప్రజల సహ జీవనానికి ప్రతీకని చెప్పారు. ఇఫ్తార్ విందుకు హాజరు కావడం ఆనందాన్నిస్తోందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లిం లు పవిత్రంగా భావించే రంజాన్ మాసాన్ని ప్రతి ఒక్కరు గౌరవించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు అబ్దుల్, మునావర్, యువ నేతలు కిషోర్ కుమార్ గౌడ్, రామేశ్వర్ గౌడ్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ ప్రకారం నియామకాలు చేపట్టాలి

- ఎమ్మార్పీఎస్ కంటోన్మెంట్ నియోజక వర్గం ఇన్‌చార్జి ఇటీక శ్రీ కిషన్ మాదిగ



నవతెలంగాణ-కంటోన్మెంట్

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు ఎస్సీ వర్గీకరణ ప్రకారమే చేపట్టాలని ఎమ్మార్పీఎస్ కంటోన్మెంట్ నియోజ కవర్గం ఇన్‌చార్జి, హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఇటీక శ్రీ కిషన్ మాదిగ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ కంటోన్మెంట్ నియోజకవర్గ నాయకులు శనివారం బోయినపల్లి మార్కెట్‌లోని అంబేద్కర్ జగ్జీవన్ రామ్ విగ్రహాల వద్ద నిరసన చేశారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ లేకుండా ఉద్యోగాలు భర్తీ చేస్తే ఎస్సీ ఉద్యోగాలన్ని మాలలకే చెందుతాయన్నారు. ఎస్సీ వర్గీకరణ లేకపోవడం వల్ల 70 ఏండ్లుగా ఉద్యోగ నియామకాల్లో మాదిగలకు తీవ్ర అన్యాయం జరిగింద న్నారు. ఈ అన్యాయాన్ని గుర్తించిన సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణ బలపరుస్తూ చారిత్రక తీర్పును ఇచ్చిందని గుర్తు చేశారు. తీర్పు తర్వాత కూడా రాష్ట్ర ప్రభుత్వం మాదిగలకు అన్యాయం చేయాలని ప్రయత్నించడం దారుణమన్నారు. ఈ నెల 17న ఎస్సీ వర్గీకరణ చట్టం అసెంబ్లీలో పెడతామని ప్రకటించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం అప్పటి వరకు ఉద్యోగ పరీక్షల ఫలితాలు నిలిపివేస్తే ఏమైందని ప్రశ్నించారు.ఎస్సీ వర్గీకరణ జరిగేంత వరకు తమ పోరాటం ఆగదన్నారు.వెంటనే ఎస్సీ వర్గీకరణ చట్టం అసెంబ్లీలో ఆమోదించడంతో పాటు త్వరగా అమలులోకి తీసుకురా వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మంద మధుకర్ మాదిగ, అజిత్ కళ్యాణ్ వాల్మీకి, మధు, బాబెందర్, జగదీష్ మాదిగ, రాజు మాదిగ, విష్ణు మాదిగ, శీను, బాలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మల దినోత్సవం



నవతెలంగాణ-ఓయూ

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల చిలకలగూడ దూదిబావి పాఠశాలలో శనివారం పాఠశాల విద్యార్థులు అమ్మల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో భాగంగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థుల అమ్మలకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న అమ్మలను ఘనంగా సత్కరించారు. అమ్మలు టీచర్స్‌ను సన్మానించారు. జీవితం లో అమ్మ ను మించిన దైవం లేదని ఇటువంటి అమ్మలను సన్మానం చేయడం అదృష్టమన్నారు.టీచర్స్ అయేషా అంజూమ్, మల్లీశ్వరి, హసీనా బేగం,సాలెహ, షహీన్ సుల్తానా పాల్గొన్నారు.



2018 పీహెచ్డీ బ్యాచ్ గడువు పొడిగించాలని వీసీకి విజ్ఞప్తి

నవతెలంగాణ-ఓయూ

2018 పీహెచ్డీ రీసెర్చ్ స్కాలర్స్ గడువు కాలం పొడిగించాలని ఓయూ వీసీ ప్రొఫెసర్ ఎం. కుమార్‌కు ఓయూ పీహెచ్డీ విద్యార్థులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రీసెర్చ్ స్కాలర్స్ కొమ్ము శేఖర్ మాదిగ, జిడి అనిల్, జంగలి దర్శన్, మేడి కార్తీక్, వలిగొండ నరసింహా , కాసర్ల మధు ,అజయ్ కుమార్, , సైదులు, రవీందర్ పాల్గొన్నారు.

ఘనంగా కాన్షీరాం జయంతి



నవతెలంగాణ-ఓయూ

ధర్మ స్టూడెంట్స్ యూనియన్ ఓయూ ఆధ్వర్యం లో శనివారం కాన్షీరాం 91 వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌యూ రాష్ట్ర కన్వీనర్ కార్తిక్ మహారాజ్ మాట్లాడుతూ అంబేద్కర్‌కు నిజమైన జ్ఞాన వారసుడు, బహుజన రాజ్యం కోసం అహర్నిశలు కృషి చేసిన మహెూన్న తమైన వ్యక్తి, టూ ఫీట్ - టూ వీల్ అనే నినాదం తో దేశవ్యాప్తంగా సైకిల్ యాత్రలు చేసి అంటరాని వారికి,బహుజనులకు రాజకీయ ఆస్తకిని రగిలించిన కరణజన్ముడు మన్యవర్ కాన్షీరాం అన్నారు. మనకి అసలైన శత్రువులు అగ్రవర్ణాలు కాదని,మన జాతి లో ఉన్న దళారులేనని సమాజానికి నిర్మహెూమాటంగా చెప్పిన వ్యక్తి కాన్షిరాం అన్నారు. పూలే ఆలోచన ,అంబేద్కర్ సిద్ధాంతం , కాన్షీరం పనివిధానంతో బీసీ,ఎస్సి ,ఎస్టీల రాజ్యం సాధ్యం అవుతుందన్నారు. దానికోసం విద్యార్థుల పాత్ర ముఖ్యమన్నారు. కాన్షీరాం కలలు కన్న రాజ్యం వైపు విశారదన్ మహారాజ్ నాయకత్వం లో డీఎస్‌యూ నడుస్తుందన్నారు. ఓయూ ఇన్‌చార్జి శివ మొగిలిపాక, నాయకులు శ్రీను ,సుభాష్, నరేష్, గణేష్, బన్నూ ,మల్లేష్, పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బీసీని నియమించాలి : జాజుల



నవతెలంగాణ-ఓయూ

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యాదర్శిగా ఉన్న శాంతికుమారి వచ్చే నెల 30న ఉద్యోగ విరమణ చేయనుండడంతో నూతన సీఎస్‌గా బలహీన వర్గాలకు చెందిన వారిని నియమించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ రాష్ట్ర ప్రభుత్వానికి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

బీజేపీ పాలనలో ప్రమాదంలో రాజ్యాంగం



- ఏప్రిల్ 14న భారత రాజ్యాంగ రక్షణ ర్యాలీ
- డాక్టర్ పిడమర్తి రవి

నవతెలంగాణ-ఓయూ

అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఏప్రిల్ 14న భారత రాజ్యాంగ రక్షణ ర్యాలీ నిర్వహిస్తామని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. శనివారం ఓయూ ఆర్ట్స్ కళాశాలలో జరిగిన బీఎస్ఎఫ్ 5వ రాష్ట్ర మహాసభ బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్ అధ్యక్షతన ఓయూ ఆర్ట్స్ కాలేజ్ న్యూ సెమినార్ హాల్లో ఘనంగా నిర్వహించారు. సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన పిడమర్తి రవి మాట్లాడుతూ బీజేపీ పాలనలో భారత రాజ్యాంగం ప్రమాదంలో పడిందని తెలిపారు. భారత రాజ్యాంగ రక్షణ బాధ్యత ప్రతి భారతీయ పౌరునిపై ఉందని, రాష్ట్రంలోని విద్యార్థి యువజన ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఏప్రిల్ 14న ట్యాంక్ బండ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర భారత రాజ్యాంగ రక్షణ ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. ఓయూ లా కాలేజ్ యందు ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వచ్చే ఆదివారం నుంచి నిత్య పూలమాల కార్యక్రమం ఉంటుందని అన్నారు. కాన్సిరాం ఆశయాల కోసం నిత్యం విద్యార్థులు అప్రమత్తంగా ఉండి ఆశయ సాధన కోసం పనిచేయాలన్నారు. రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల కు పెద్దపీట వేసింది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని కాంగ్రెస్‌తో సామాజిక న్యాయం జరుగుతుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ బహుజన కులాలకు పెద్దపీట వేసి వివిధ పదవులు కట్టబెడుతున్నారని అన్నారు.ఈ కార్యక్రమానికి విచ్చేసిన విశిష్ట అతిథి గిరిజన శక్తి జాతీయ అధ్యక్షులు వెంకటేష్ చౌహన్ మాట్లాడుతూ కాన్సిరాం బహుజన రాజ్యం తెచ్చిన గొప్ప మహనీయులన్నారు. వారి ఆశయ సాధన కోసం విద్యార్థి యువకులు నిరంతరం శ్రమించాలన్నారు. బోరెల్లి సురేష్ మాట్లాడుతూ. ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ అగ్రవర్ణాలలోని పేద విద్యార్థుల కోసం పోరాడే ఏకైక విద్యార్థి సంఘం బీఎస్ఎఫ్ అని అన్నారు. బీసీ సంఘం నాయకురాలు కోటగిరి ఉషారాణి, బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు గాద వెంకట్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోలు రాములు, ఓయూ ఇన్‌చార్జి కల్వకుర్తి శ్రీశైలం, బీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకష్ణ, హ్యూమెన్ రైట్స్ రాష్ట్ర అధ్యక్షులు మాధవచారి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ నంద్రు నరసింహ, డాక్టర్ మీసాల మల్లేష్, ఏర్పుల శ్రావణ్, డాక్టర్ బొమ్మెర స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం సోదరులకు సేహరి విందు ఏర్పాటు



నవతెలంగాణ - జూబ్లీహిల్స్

గత పది సంవత్సరాల నుంచి ప్రతిరోజు ఉదయం 5 గంటలకు సుమారు 500 మందికి సెహరీ విందును బోరబండ కార్పొరేటర్ మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసివుద్దీన్ తన ఇంటి వద్ద ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో హిందూ-ముస్లిం సోదరులు కలిసి సేహరి విందు లో పాల్గొంటారు. హిందూ సోదరులు ఉదయం ఐదు గంటలకే వచ్చి ముస్లిం సోదరులకు సెహరి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమం సేహరి ఏర్పాటల్లో పాల్గొన్న వారికి శనివారం కార్యక్రమం అనంతరం కార్పొరేటర్ సతీమణి హబీబా సుల్తానా బహుమతులను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లడుతూ, తన భర్త గత దశాబ్దకాలంగా ఈ సహేరి కార్యక్రమం చేపడుతుండడం ఎంతో సంతోషాన్ని కల్గిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో గంగ -జమున-తహెజిబ్, ఉట్టిపడే విధంగా హిందు, ముస్లిం, ఇతరమతాల సోదరులు పాల్గొని సేహరిలో అన్ని రకాల సేవలు



నీటి సమస్యల నివారణ చర్యలకు వినతి

- కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు రాజేశ్వరి ఆధ్వర్యంలో..

నవతెలంగాణ-బేగంపేట్

కాంగ్రెస్ సనత్ నగర్ ఇన్‌చార్జి డాక్టర్ కోటా నీలిమ ఆదేశాల మేరకు, అమీర్‌పేట డివిజన్ మహిళా అధ్యక్షురాలు రాజేశ్వరి హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ అధికారులను కలిసి అమీర్‌పేట్‌లోని నివాసితులకు నీటి సరఫరా మెరుగుపరచడానికి ఆవశ్యకమైన నీటి ట్యాంకులను కల్పించాలని కోరారు. అలాగే లో ప్రెషర్‌తో నీరు సరఫరా అవుతున్నదని వారి దష్టికి తీసుకువెళ్ళారు. దీన్ని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అధికారి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. అందుకు రాజేశ్వరి కతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ ప్రెసిడెంట్ ఎస్.ఎస్.రావు, నాయకులు రజినీకాంత్, కష్ణకుమార్, ప్రతాప్ నాయక్, వినోద్ సింగ్, నరేష్, నరేష్, గోదాస్ నవీన్, ముత్తు, బాబూరావ్, పద్మావతి, సనత్ నగర్ డివిజన్ నాయకులు ఖమర్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

కోకాపేటలో సిలిండర్ పేలి అగ్నిప్రమాదం

- పలువురికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-గండిపేట్

నగర శివారులోని కోకాపేట్‌లో సిలిండర్ పేలి భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన నార్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. ఏసీపీ రమణ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం గండిపేట మండలం నార్సింగి మున్సిపాలిటీలోని కోకాపేట్‌లోని గార్ టవర్స్‌లోని రెస్టారెంట్‌లో ప్రమాదవశాత్తు సిలిండర్ పేలింది. దాంతో ఆ భవనం మొత్తం మంటలు వ్యాపించాయి. నిర్వాహకులు వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఏసీపీ, పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. ఈ ప్రమాదంలో పలువురు ఉద్యోగులు, స్థానికులు గాయపడ్డారు. ఒకరు తీవ్రంగా గా యపడ్డారు. క్షతగ్రాతులను పోలీసులు ఆస్పత్రికి తరలించారు. రెస్టారెంట్‌లో ఎలాంటి ఫైర్ జరగలేదని, కిచెన్ షెడ్‌లో గ్యాస్ పేలడంతో మంటలు వ్యా పించినట్టు ఏసీపీ తెలిపారు. ప్రమాదం జరిగిన భవనంలో పలు ఐటీ కంపెనీలు ఉన్నట్టు గుర్తించారు.

శిల్పారామంలో భరత నాట్య ప్రదర్శన



నవతెలంగాణ-శేరిలింగంపల్లి

మాదాపూర్‌లోని శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం అశ్విని, హర్షిత రెడ్డి, ఐక్యత వర్మ, సాయి రామ్‌ల భరతనాట్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. పుష్పాంజలి, వినాయక కౌతం, నటేశ కౌతం, బ్రహ్మనంది కౌత్వం, హంసా నందిని జతిస్వరం, పరిపాహి చాముండేశ్వరి దేవి కృతి, పదం, శృంగార లహరి, సురిటీ తిల్లాన అంశాలను ప్రదర్శించి మెప్పించారు.

రవాణా రంగాన్ని రక్షించుకుందాం

- కార్మిక హక్కులు కాపాడుకుందాం
- 24న చలో పార్లమెంటును జయప్రదం చేయండి
- తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రయివేటు రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) నగర సహాయ కార్యదర్శి కె. అజయ్ బాబు, జి.రాములు



నవతెలంగాణ-అంబర్‌పేట

కార్మిక హక్కులు కాపాడుకుందామని, 24న చలో పార్లమెంట్‌ను జయప్రదం చేయాలని తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రయివేటు రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) నగర సహాయ కార్య దర్శి కె. అజయ్ బాబు, జి.రాములు పిలుపునిచ్చారు. రవాణా రంగాన్ని రక్షించుకోవడానికి కార్మికుల సమస్యల పరిష్కారా నికి ఈ నెల 24న చలో పార్లమెంటుకు ఆలిండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్‌డబ్ల్యూఎఫ్) కేంద్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు శనివారం అంబర్‌పేట జోన్‌లో కార్మిక అడ్డాలు తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రవాణా రంగ కార్మికులు ఆటో, కారు, డీసీఎం, లారీ, ట్రాలీ, మినీ డీసీఎం, టాటా ఏసీ ట్రాక్టర్, అంబులెన్స్, స్కూలు బస్సు, ట్రక్కు, ప్రొక్లైనర్, వరికోత మిషన్, జేసీబీ బోర్ బండి, టూరిస్ట్ బస్సు, ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్లు, క్లీనర్స్, మెకానికల్స్ అధిక సంఖ్యలో చలో పార్లమెంట్ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రవాణా రంగంలో రిక్షా మొదలు కొని ఆటో, టాక్సీ, లారీ, ప్రయివేటు బస్సు, ఆర్టీసీ వగైరాలన్నీ తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడ్డాయన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలే ఈ దుస్థితికి కారణమని.. కార్మికుల పని పరిస్థితులు దుర్భరంగా మారాయని చెప్పారు. ఈ పరిస్థితులు మారాలంటే ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. అందుకే ఏఐఆర్ డబ్ల్యూఎఫ్ చలో పార్లమెంటుకు పిలుపునిచ్చిందన్నారు .

"పగలనకా రాత్రనకా, ఎండ, వాన, చలి కాలాలలో కూడా 24 గంటలు రోడ్లపై వాహనాలు నడిపేది డ్రైవర్లు. ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియని ప్రమాదకర పరిస్థితుల్లో వీరు విధులు నిర్వర్తించాల్సి వస్తున్నది. వీరికి కనీస వేతనాలు, చట్టబద్ధ సౌకర్యాలు, సామాజిక సంక్షేమ చట్టం గానీ లేవు. సంఘ విద్రోహశక్తుల దాడులు ఇటీవల కాలంలో విపరీతంగా పెరిగాయి. నిత్యావసర సరకుల ధరలు ఆకాశాన్నంటాయి విద్యా వైద్య ఖర్చులు భరించలేనంతగా పెరిగాయి. కానీ ఆదాయం మాత్రం పెరగలేదు. భవన నిర్మాణ కార్మికులు పోరాడి వెల్ఫేర్ బోర్డును సాధించుకున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకే వెన్నెముకగా ఉన్న రవాణారంగ కార్మికులకు సామాజిక సంక్షేమ చట్టం ఇంతవరకు లేదు.. పుండు మీద కారం చల్లిన చందంగా మోటారు వాహనాల చట్ట సవరణలో భారీగా పెంచిన పెనాల్టీల భారంతో నడ్డి విరుగుతున్నది. పోలీసులు వేధింపులు నిత్యకృత్యం అయినాయి. ఫలితంగా పొద్దున్నుంచి రాత్రి దాకా కష్టపడి పనిచేసినా కుటుంబ పోషణ భారంగా మారింది.

ప్రమాదకర 4 లేబర్ కోడ్లు కార్మికులకు కొద్దిపాటి వెసులుబాటును కల్పించే కార్మిక చట్టాలను కూడా రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లను తెచ్చింది. సంఘం ఏర్పాటు చేసుకునే హక్కు, బేరసారాల హక్కు, సమ్మె హక్కును హరించ తలపెట్టింది. ఈ కోడ్ల అమలుకు ప్రభుత్వం తీవ్ర సన్నాహాలు చేస్తున్నది. అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు గణనీయంగా తగ్గినా మనదేశంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను కేంద్ర ప్రభుత్వం ఇబ్బడి ముబ్బడిగా పెంచింది ఇన్సూరెన్స్ ప్రీమియం, టోల్ చార్జీలు, విడిభాగాలు తదితర ఖర్చులన్నీ తడిసి మోపెడైనాయి ఆదాయాలకు అనుగుణంగా వేతనాలు పెరగలేదు. ఫలితంగా వాహనాల నిర్వహణ కుటుంబ పోషణ దుర్భరంగా మారింది.

కేంద్ర ప్రభుత్వం 2019లో మోటారు వాహనాల చట్టానికి చేసిన సవరణలు ఉనికికే ప్రమాదాన్ని తెచ్చిపెట్టాయి. అప్పో సొప్పో చేసి ఆటో, ట్యాక్సీ, లారీ లాంటి వాహనాలు కొనుక్కొని బతుకుతున్న వారిని గెంటివేసి ఉబర్, ఓలా, రాపిడ్, పోర్టర్ లాంటి కార్పొరేట్ సంస్థలకు రవాణా రంగాన్ని అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం మోటార్ వాహనాల చట్టంలో అగ్రిగేటర్ అనే కొత్త సెక్షన్ 93ను చేర్చింది. మొత్తంగా రవాణా రంగం తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టబడ్డమైనది. రవాణా రంగ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని చలో పార్లమెంట్‌ను జయప్రదం చేయాలి" అని వారు విజ్ఞప్తి చేశారు.

రంగుల్లో రమ్యంగా కంట్రీ క్లబ్ హెూలీ వేడుక



నవతెలంగాణ-బంజారాహిల్స్

బేగంపేటలోని పోలీస్ హాకీ స్టేడియంలో శనివారం కంట్రీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఆసియాస్ బిగ్గెస్ట్ బోలీ బాష్ రంగ్ బర్సే వేడక -2025 రంగుల హరివిల్లు విరిసింది. యువత రెయిన్ డాన్స్ జడివానలతో తడిసి ముద్దయ్యారు..మ్యూజిక్ మస్తీలో ఉర్రూతలూగారు. ఆత్మీయ నేస్తాలతో పలకరింపులు..పులికింతలతో ఆడి పాడారు. రిలవంట్ సమర్పించిన ఈ హెూలీ వేడకకు, వీకెండ్ కలిసి రావడంతో రెండో రోజు కూడా వేలాది మంది పార్టీ పీప్స్ సంతోష సాగరంలో మునిగి తేలారు. పర్యావరణ అనుకూలమైన సేంద్రీయ రంగులతో ఐదు గంటల పాటు సాగిన కంట్రీ క్లబ్ హెూలీ గాలా, బాలీవుడ్, ధోల్, తమటినో, కలర్ స్ప్లాష్ కోలాహలంగా జరిగింది. అంతర్జాతీయ డీజే లు లైవ్ మ్యూజిక్ పెర్ఫార్మెన్స్ అందరినీ హుషారెక్కించారు. ఈ సందర్భంగా కంట్రీ క్లబ్ హాస్పిటాలిటీ అండ్ హాలిడేస్ చైర్మెన్ వై రాజీవ్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఢిల్లీ,కోల్‌కతా,అహ్మదాబాద్,సూరత్,ముంబై,పూణే, కోల్హాపూర్,బెంగళూరు,చెన్నై కంట్రీ క్లబ్ లో కూడా ఈ వేడుకను రెండు రోజుల పాటు ఆనందోత్సవాల మధ్య జరుపుకుందని వివరించారు.



వ్యవసాయాన్ని చంపాలని చూస్తున్న ఎన్డీయే ప్రభుత్వం

- ఆకలి చావులకు కారణం బీజేపీయే
- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘాల సమాఖ్య..

నవతెలంగాణ-బంజారాహిల్స్

వ్యవసాయాన్ని చంపాలని చూస్తున్న ఎన్డీఏ ఆటలను సాగనివ్వబోమని, ఆకలి చావులకు బీజేపీ ప్రభుత్వమే బాధ్యత వహించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘాల సమైక్య సదస్సులో వక్తలు అన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన సమావేశంలో రైతు సంఘాల సమైక్య అధ్యక్షప్రధాన కార్యదర్శిలు శ్రీరామ్ రెడ్డి,దుడిపాల విజయపాల్ రెడ్డి,ప్రొఫెసర్ రాజిరెడ్డిలు మాట్లాడుతూ.. రైతులు వారు హక్కులు కోసం ఉద్యమిస్తే టెర్రరిస్టులంటూ ముద్ర వేసి వారిపై లాఠీచార్జ్ చేసి ఇది రైతు ఉద్యమం కాదంటూ సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేస్తూ తాత్కాలిక ఆనందం పొందిన బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పారని తెలిపారు. అప్పుడే స్పందించి రైతు చట్టాలను వెనక్కి తీసుకున్నది కేంద్ర ప్రభుత్వం అన్నారు. ప్రస్తుతం తెలంగాణలో జరుగుతున్న రాజకీయ నాటకీయతను గమనించిన తాము వారి ఆటలను ఈ రాష్ట్రంలో సాగనివ్వకుండా ఆ ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని దక్షిణ తెలంగాణకు చేస్తున్న అన్యాయాన్ని ప్రతి జిల్లాలో వివరిస్తామన్నారు. నీటి వసతి లేని వ్యవసాయం గిట్టుబాటు ధరలు లేని వ్యవసాయం ఏలా ఉంటుందో చెప్పాలనీ ప్రశ్నించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడే నైతిక హక్కును బీఆర్ఎస్ కోల్పోయిందన్నారు. గడిచిన పది సంవత్సరాలు వారు ప్రజలకు రైతులకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. రైతు భరోసా, రుణ మాఫీ కూడా పూర్తి స్థాయిలో జరగలేదని కావున రైతులను ఆదుకోవాలని కోరారు. వ్యవసాయాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు ప్రభుత్వ కృషి చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్ర రైతాంగం కోసం తాము అనేక సమావేశాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షులు రామ స్వామి,రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో యాసిడ్ తాగిన వ్యక్తి మృతి

నవతెలంగాణ-శంషాబాద్

మద్యం మత్తులో యాసిడ్ తాగిన వ్యక్తి మృతి చెందిన ఘటన శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధి లో శనివారం జరిగింది. స్టేషన్ హౌస్ ఆఫీసర్ కె నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం శంషాబాద్ మం డల పరిధిలోని నర్ఖూడ గ్రామానికి చెందిన కమ్మరి ఆనంద్ చారి (62) కమ్మరి కొలిమి పని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇతను ఈ నెల 14వ తేదీ ఉదయం 7:30 గంటలకు ఇంట్లో నుంచి బయటకు వెళ్లి హెూలీ ఆడి 11 గంటలకు తిరిగి వచ్చాడు. ఇంట్లో భోజనం చేసిన తర్వాత మళ్లీ బయటకు వెళ్ళాడు. కాముని దహనం అనంతరం పీకల దాకా మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. తాగిన మత్తులో రాత్రి 9 గంటల 20 నిమిషాలకు బాత్రూంలోకి వెళ్లి యాసిడ్ తాగి బయ టికి వచ్చాడు. మత్తులో ఉన్న ప్రవర్తన చూసిన అతని భార్య లక్ష్మి బాత్రూంలోకి వెళ్లి చూసింది. యాసి డ్ బాటిల్ సగం ఖాళీ కావడంతో పాటు మూత తెరిచి ఉన్నది. బట్టల పైన పసుపు రంగు కనిపించడంతో అనుమానం వచ్చిం ది. వెంటనే అతన్ని శంషాబాద్‌లోని ట్రైడెంట్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొం దుతూ అర్ధరాత్రి 2గంటల 13 నిమిషాలకు మరణించినట్టుగా వైద్యులు ధ్రువీకరించారు. ఈ విషయంపై పోలీసులకు మృతుడి భార్య ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సౌమ్యుడైన ఆనంద్ చారి అకాల మరణంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

PUBLIC NOTICE

It is informed to the general public that my Client **Smt. Repala Sunitha** W/o. Sri. R. Rama Rao has informed that she had misplaced the Original Regd General Power of Attorney (Link Documents) **No.6602/2015**, dated:28-09-2015 and Regd Sale Deed **No.6505/1989**, dated:27-04-1989 at SRO, Hayathnagar of the below mentioned Schedule of Property. If anybody found the above Document same may be intimated / hand over the same to the below mentioned office. My Client further states that she want to avail loan by mortgaging the schedule mentioned property. If any person has any claim / interest / dispute over the said transaction, the same may be intimated to the undersigned within 7 (seven) days from the date of this publication, failing which, no further claims / objections will be entertained and my clients will proceed with the same.

SCHEDULE OF PROPERTY

All that the Piece and Parcel of the Open land bearing Plot No.77 (Part), admeasuring area 100.00 Square Yards or its equivalent to 83.61 Square Meters, in Survey No. 241, Situated at Kuntloor Village, Abdullapurmet Revenue Mandal, Under Pedda Amberpet Municipality, Ranga Reddy District and bounded by: North: Part of Plot No.77, South: Plot No. 76, East: Plot No. 80, West: 25 Ft Wide Road.

Sd/- **P. Santosh Kumar**, Advocate
#1-8-506/2/A/1, Adnan Chambers,
Prakashnagar, Begumpet,
Secunderabad -16. Ph:09440067560

IN THE COURT OF PRINCIPAL JUNIOR CIVIL JUDGE-CUM-XIV ADDL. JUDICIAL MAGISTRATE OF FIRST CLASS. RANGA REDDY DISTRICT AT: HAYATHNAGAR
O.S.No.538 OF 2024

BETWEEN:
CHIRABOINA SATHYAMMA ....Plaintiff
AND
SHANKAR S/O RAMULU ...Respondents/Defendants

Shankar s/o Ramulu, Aged about 41 years, Occ: Pvt.empolyee R/o.H.no.11-129, Shivaji Nagar, Narekal village and Mandal, Nalgonda Dist-508211.

Please take notice that the plaintiff herein has filed the above suit for Perpetual Injunction against you. The above suit is posted on 26-03-2025. The Defendant here by inform in respect of the claims made by the plaintiff, the Defendant may appear before the said Hon'ble Court at 10.30 AM on 26-03-2025 by person or through an Advocate, failing which the Hon'ble court may be constrained to decide the above suit as per law.

//By order of the Hon'ble Court //
M/s
G.SHANKARAIAH, B.RAGHAVENDRA. S.VIVEKA NANDA, Advocates
Flat no.209, Larven Complex,
Chaitanyapuri, Dilsukhnagar, hyd
Ph: 9848082431/9948886002

IN THE COURT OF THE PRL. JUNIOR CIVIL JUDGE, SANGAREDDY DISTRICTAT: SANGAREDDY.
O.S No.597 OF 2023

Between
Sri. V. Ravi Kiran Reddy ... Plaintiff
AND
Sri. Hari Mohan Reddy and others ...... Defendants

SUMMONS

To,
K. Jacob S/o K. Devasahayam, Age 65 Years, Occ: Retired IDL Employee, R/o. H. No. 5-4-75/2, Kukatpally, Hyderabad.

Please take Notice that, the Plaintiff has filed above for suit for perpetual injunction against the defendants in respect of Suit Schedule property. The Hon'ble Court has ordered to publish the summonson above named defendant i.e Defendant no.2to be published in Nava Telangana Telugu Daily News Paper for his appearance on 18-03-2025 at 10:30 AM before the said Hon'ble Court. Hence, ifanyone has objection make it convenient to appear before the Hon'blePrl. Junior Civil Judge, at Sangareddyon the said date and time otherwise, the case will be decided on merits and on the material available, in your absence.

// By Orders of the Court //
D. MADHAVA RAO
C/O. DMR LAW CHAMBERS
41, 1ST FLOOR, Ishaq Colony,
AOC Center, Secunderabad.

IN THE COURT OF THE PRL. JUNIOR CIVIL JUDGE, SANGAREDDY DISTRICTAT: SANGAREDDY.
O.S No. 597 OF 2023

Between
Sri. V. Ravi Kiran Reddy ... Plaintiff
AND
Sri. Hari Mohan Reddy & others ...... Defendants

SUMMONS

To
Thakre Sukhdev S/o T. Haribabu, Age: 70 years, Occ: Retired Employee,R/o.H.No. 2025-C, BHEL Township, Ramachandrapuram, Hyderabad.

Please take Notice that, the Plaintiff has filed above for suit for perpetual injunction against the defendants in respect of Suit Schedule property. The Hon'ble Court has ordered to publish the summonson above named defendant i.e Defendant no.7 to be published in Nava Telangana Telugu Daily News Paper for his appearance on 18-03-2025 at 10:30 AM before the said Hon'ble Court. Hence, if anyone has objection make it convenient to appear before the Hon'blePrl. Junior Civil Judge, at Sangareddy on the said date and time otherwise, the case will be decided on merits and on the material available, in your absence.

//By Orders of the Court //
D. MADHAVA RAO
C/O. DMR LAW CHAMBERS
41, 1ST FLOOR, Ishaq Colony,
AOC Center, Secunderabad.

మాదిగలకు ముఖ్యమంత్రి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి

- అన్ని ఉద్యోగాల్లో మాదిగలకు న్యాయం చేయాలి
- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ



నవతెలంగాణ - ముషీరాబాద్

తెలంగాణలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండకుండా ఎస్సీ వర్గీకరణ లేకుండా ఉద్యోగాలు భర్తీ చేయడం దారుణమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్ మాదిగ అన్నారు. మాదిగలకు ముఖ్యమంత్రి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. బాగ్ లింగంపల్లిలోని అంబేద్కర్ విగ్రహం నుంచి సుందరయ్య పార్క్ వరకు గజ్జల రాజశేఖర్ మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నిరసన ప్రదర్శనను నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .ఎస్సీ వర్గీకరణ మీద సుప్రీంకోర్టు ఆగస్టు 1న ఇచ్చిన తీర్పును స్వాగతించిన ముఖ్యమంత్రి ప్రతి ఉద్యోగ నోటిఫికేషన్ కు ఎస్సీ వర్గీకరణను వర్తింప చేస్తామని అసెంబ్లీలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ హామీని అమల్లోకి తీసుకురాకుండా టీచర్ ఉద్యోగాలను భర్తీ చేసి మాదిగలకు అన్యాయం చేశారన్నారు. ఒకవైపు 17న అసెంబ్లీలో చట్టం చేస్తామని చెబుతూనే మరోవైపు వర్గీకరణ అమలు చేయకుండా ఉద్యోగ పరీక్షల ఫలితాలు విడుదల చేస్తూ ద్వంద్వ వైఖరిని అవలంబిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలకు చేతులకు పొంతన ఉండడం లేదని అన్నారు. ఎస్సీ రిజర్వుడు ఉద్యోగాలన్నీ మాల సామాజిక వర్గానికి దోచిపెట్టడానికే రేవంత్ రెడ్డి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే ఉద్యోగాల్లో తీవ్రంగా నష్టపోయిన మాదిగలకు మరొకసారి గ్రూప్ -1 గ్రూప్ -2 గ్రూప్ - 3 ఉద్యోగాల్లో అన్యాయం చేయాలని చూడడం అనేది దుర్మార్గమైన చర్య అన్నారు. వెంటనే సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట కట్టుబడి అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని ఆమోదించాలని డిమాండ్ చేశారు. ఆ చట్టాన్ని వెంటనే అమలులో తీసుకురావాలని, వర్గీకరణ ప్రకారమే ఉద్యోగ అవకాశాలన్నీ భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణను అమల్లోకి తీసుకువచ్చేంత వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ బొర్రా బిక్షపతి, జిల్లా అధ్యక్షులు టీవీ నరసింహ, అధికార ప్రతినిధి దప్పు మల్లికార్జున్, సీనియర్ నాయకులు గండి కృష్ణ, చిలక ఎల్లయ్య, తదితర నాయకులు పాల్గొన్నారు.



జనసేన ముసుగులో పవన్ ఆర్ఎస్ఎస్ ఎజెండా..



- ఆర్ఎస్ఎస్ ఏజెంట్‌గా పనిచేస్తున్న పవన్‌కళ్యాణ్
- పిఠాపురం లో జరిగిన జనసేన ఆవిర్భావ సభ అట్టర్ ప్లాప్
- టీడీపీని తొక్కడానికి కేంద్రం నిధులు ఇవ్వకుండా అడ్డుకుంటున్నాడు
- ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

జనసేన ముసుగులో ఆర్ఎస్ఎస్ ఏజెంట్‌గా పవన్ కళ్యాణ్ పనిచేస్తున్నాడని, పిఠాపురంలో జరిగిన జనసేన ఆవిర్భావ సభ పూర్తిగా విఫలమైందని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ అన్నారు. నిజమైన జనసేన కార్యకర్తలు ఎవరు రాలేదని, డబ్బులు ఇచ్చి బలవంతంగా ప్రజలను తరలించారని తెలిపారు. అందుకు రూ.180 కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. శనివారం, అమీర్ పేటలోని ప్రజాశాంతి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కే ఏ పాల్ మాట్లాడారు.

ప్రజారాజ్యం పార్టీ స్థాపించి దానిని రద్దు చేసి, పార్టీలు మారి చివరకు బీజేపీ ,తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకుని అధికారంలోకి వచ్చి తానే బీజేపీని, తెలుగుదేశం పార్టీని గెలిపించానని అవాస్తవాలు మాట్లాడుతున్నారని అన్నారు. ఎప్పటికైనా ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశాన్ని తొక్కి, తాను ముఖ్యమంత్రి కావాలని చూస్తున్నాడని ఆరోపిం చారు. అందుకే కేంద్రం నుండి నిధులు ఇవ్వకుండా మోడీని అడ్డుకుంటున్నాడని అన్నారు. కేంద్రం నుంచి నిధులు వస్తే ,చంద్రబాబు అన్ని పథకాలు అమలుపరిస్తే, ప్రజలు చంద్రబాబును ఆదరిస్తారని తిరిగి టీడీపీ అధికారంలోనికి వస్తుందని, అందుకే నిధులు రాకుండా చేసి చంద్రబాబు పై ప్రజలు తిరగబడే లాగా చూస్తున్నాడని పెద్ద కుట్ర జరుగుతుందని, దీనిని చంద్రబాబు గ్రహించాలని హెచ్చరించారు. ఒకప్పుడు బీజేపీని,ఆర్ఎస్ఎస్ పార్టీని వ్యతిరేకించిన పవన్ కళ్యాణ్, అనేక రకాలుగా సనాతన ధర్మానికి, బీజేపీకి ఆర్ఎస్ఎస్‌కు వ్యతిరేకంగా మాట్లాడిన వీడియోలు ఒకసారి యూట్యూబ్ లో చూసుకోవాలని, అవి చూసి సిగ్గుపడాలన్నారు. ఇప్పుడు సనాతన ధర్మం గురించి మాట్లాడటం పవన్ కళ్యాణ్ కు సిగ్గుగా లేదా ?అని ప్రశ్నించారు.

ఇప్పుడున్న నాయకులందరూ అనేక పార్టీలు మారిన వారే అని, ఒక్క ఎన్టీఆర్, పీవీ నరసింహారావు మాత్రమే ఒకే పార్టీలో చివరి వరకు ఉన్నారన్నారు. అదేవి ధంగా తాను ప్రజాశాంతి పార్టీని స్థాపించి ఇప్పటివరకు పార్టీని విజయవంతంగా నడుపుతున్నానని అన్నారు. గద్దర్ తన పార్టీలో చేరి, తన కుమార్తె, కొడుకు పార్టీ మారినప్పటికీ ఆయన పార్టీ మారకుండా చివరివరకు పార్టీకి పనిచేశారని గద్దర్‌ను అభినందించారు. త్వరలో తెలంగాణలో ప్రజాశాంతి పార్టీ కార్యకర్తలను నాయకులను పెంచుకుంటామని, వచ్చే సర్పంచ్ ఎన్నికలలో గట్టి నాయకులను పోటీలో ఉంచి గెలిపించుకుంటానని అన్నారు. అనేకమంది బీఎస్పీని వీడి యువకులు ప్రజాశాంతి పార్టీలో శనివారం చేరారని తెలిపారు. ఎప్పటికైనా తెలుగు రాష్ట్రాల ప్రజలకు ప్రజాశాంతి పార్టీ అధికారంలోనికి వస్తేనే మంచి జరుగుతుందని, ప్రపంచ దేశాల నుంచి నిధులు సేకరించి తీసుకువస్తానని, విద్య- వైద్యం ఉచితంగా అందిస్తానని తెలుగు రాష్ట్రాల ప్రజలకు హామీ ఇచ్చారు.




సోషల్ వర్క్ కోర్సును ఆర్ట్స్ కళాశాలకు తరలించాలి

- ఏబీవీపీ

నవతెలంగాణ-ఓయూ

యూనివర్సిటీ పోస్ట్ గ్రాడ్యుయేట్ కళాశాలలో 2004 నుంచి నడుపుతున్న మాస్టర్ అఫ్ సోషల్ వర్క్(ఎం.ఎస్.డబ్ల్యూ)కోర్సును యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల, మెయిన్ క్యాంపస్ తార్నాకకు మార్చాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో శనివారం ఓయూ రిజిస్ట్రార్ ప్రో. నరేష్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. సోషల్ కోర్స్ ప్రారంభం నుంచి పి.జి. కళాశాల లో ఉండటం నేటికీ దాదాపు 20 ఏండ్లుగా సెల్ఫ్ ఫైనాన్స్ డిపార్ట్మెంట్ గా ఉండటం వలన తగిన గుర్తింపు దక్కలేదన్నారు. గౌరవం, అధునాతన లైబ్రరీ, అకాడమిక్స్ సరైన మౌలిక వసతులు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు కనుక తక్షణమే కోర్సు బదిలీ చేస్తూ, బడ్జెట్ కోర్సు మార్చాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు జి. జీవన్ ,రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అలివేలు రాజు, ఓయూ ప్రెసిడెంట్ ధహన్, సెక్రటరీ శివ శంకర్,సికింద్రాబాద్ జిల్లా కన్వీనర్ చెర్క. బాలకృష్ణ, కదం పాండు రంగా,సోషల్ వర్క్ విద్యార్థులు, పాల్గొన్నారు.



జీహెచ్‌ఎంసి కార్మికులతో కలిసి టీపీసీసీ రాష్ట్ర కమిటీ కో కన్వీనర్ అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాసగుప్త నాగోల్‌లోని తన నివాసంలో హెూలీ సంబరాలను జరుపుకున్నారు. ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను ఒక్కతాటిపైకి తెచ్చే హెూళి పండగ విశిష్టమైనదని, అందరి జీవితాల్లో వెలుగులు విరబుయాలని ఆకాంక్షించారు. నవతెలంగాణ-నాగోల్

IN THE COURT OF THE HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE, R.R. DISTRICT, AT RAJENDRANAGAR
O.S. No. 457 OF 2022

Between:
M/s. IDBI Bank Limited, Registered Office at IDBI Tower, World Trade Complex, Cuffe Parade, Mumbai - 400005 and a branch office at IDBI Bank Ltd., Madhav Ratna Towers, H.No.4-6-68 Near Pillar No.139, Attapur Ring Road, Rajendra Nagar, Hyderabad-500048, represented by its Recovery officer
Mrs. V. V. Suneeta, W/o. V. Bhavani Shankar, Aged about 42 years, Occ: Assistant General Manager & Recovery Officer, R/o. Hyderabad. ...Plaintiff
AND
M/s. Burhan and Sons Hardware Materials Proprietor Mr. Mohammed Amjaduddin Rep. by its Proprietor & others ...Defendants

To,
Mr.Mohammed Atheruddin S/o. Mohammed Burhanuddin Aged about 44 years, Occ: Business H.No.12-2-354/5/A, Syed Ali Guda, Asif Nagar, Hyderabad - 500028. ...Defendant No.3

PLEASE TAKE NOTICE that the above named Plaintiff has filed the above suit vide O.S.No.457/2022 against the respondents for seeking Recovery of Money of Rs.5,72, 525.16/- and the case stands posted to 09-04-2025 at 10:30 a.m. for your appearance either in person or through your counsel, failing which the matter will be decided in your absence as per law.

//BY ORDER OF THE HON'BLE COURT//
V. SURESH BABU
Advocate
Office at Flat No.104, Padmaja Residency, Commercial Tax Colony Mohan Nagar, Hyderabad-35, T.S.
Cell No. 9392434289

IN THE COURT OF HON'BLE I ADDITIONAL DISTRICT AND SESSIONS JUDGE, MEDCHAL-MALKAJGIRI DISTRICT, AT: MALKAJGIRI
O.S.No.12 OF 2025

Between:
M.ANUPAM NATH ...PLAINTIFF
AND
The Tahsildar,
Alwal Mandal
And another ...DEFENDANTS

D-2 ALL CONCERNED

The Plaintiffs had filed the above suit for Declaration to declare that the Plaintiff herein is the absolute Owner and Possessor of the SUIT SCHEDULE PROPERTY i.e., Plot bearing No.B-153,admeasuring 925 Sq. Yds, or 774.22 Sq. Meters, in Sy.No.601 Situated at Kapra Village, Medchal-Malkjgiri District and bounded on North: H.No.B-155, South: 50 Feet Wide Road, East: Vacant Land and Society Private Limited and West: H.No.B-154 being the Legal Heir and Successor of Late Brig. Madhurantakam Ravindranath, S/o.Late Ethirajulu Madhurantakam, who died on 17.09.2020. The Hon'ble Court was pleased to order for publication of this notice for your appearance in the above suit and the matter is posted to 24.03.2025 at 10.30 a.m.

Therefore, you may appear before the Hon'ble Court either personally or through your authorized counsel or otherwise the matter will be adjudicated in due process of Law.

(BY ORDER OF THE COURT)
Sd/-
K.Madhavi, CH.N.Achyuth, Naveen Undavalli and Hemanth Kumar V, Advocates
O/o Plot No.3, Durga Enclave,
Banjara Hills, Road No.12,
Hyderabad- 500034
Phone No.96663 36693.

IN THE COURT OF THE HON'BLE X ADDL CHIEF JUDGE::CITY CIVIL COURT:: HYDERABAD DISTRICT:: AT:HYDERABAD
E.P.NO. 299 OF 2024
IN
O.S.NO. 246 OF 2019

BETWEEN
Sri. V.Venkateshwar Rao ...... Decree holder/Plaintiffs
And
Smt. C.Sathyavathi ...... Judgment Debtor/Defendant

To,
JDR
Smt.C.Sathyavathi W/o Sri.C. Prasad,H.No.7-1-397/109, Plot No.18/A,Sanjeeva Reddy Nagar, Hyderabad.

Where as V.Venkateshwar Rao and others, the Decree holder/Plaintiff have instituted a suit in O.S.No. 246 of 2019 for recovery of sum of Rs.16,20,000/-.The Decreetal amount comes to Rs.22,71,808/-as on 06-03-2024. Inspite of notices sent to you through Court and registered Post, the same were retuned un served. Hence, you are here by informed that the above E.P stands posted to **10.04.2025** for your appearance and to file your objections by way of filing counter/Written Statement. In case you fail to attend before the above Court on **10.04.2025** at 10.30 A.M. you will be set ex-parte and the matter will be decided ex-parte.

// By Order Of the Court //
M/s.L.SHIVA CHARAN
Advocate
H.No.1-1-403/A/1,
G-3,Sairam Apartment,
Gandhinagar, Hyderabad
Mobile No. 9849597344

5 కే రన్ కార్యక్రమంలో గాంధీ



నవతెలంగాణ-కూకట్‌పల్లి

అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని, మహిళల యొక్క విలువలు కోసం, వారి యొక్క ఆత్మ గౌరవం కోసం అవని స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు శిరీష సత్తూర్ 5కే రన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శేర్లింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే, పీఏసీ చైర్మెన్ అరికేపూడి గాంధీని ఆహ్వానించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ప్రతి రంగంలో మహిళలు ముందుండాలని వారి పురోగతి కొరకు, అందరం కృషి చేయాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గాయత్రి, కిషోర్, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

గ్లకోమ అనేది చాలా ప్రమాదకరం

- కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

గ్లకోమ అనేది చాలా ప్రమాదకరం అని హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు అన్నారు. హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని పీఎన్ఆర్ ఎంపీరి కాంప్లెక్స్‌లోని వాసన్ ఐ కేర్ సెంటర్ వారి ఆధ్వర్యంలో ఉచిత గ్లకోమ స్కీనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హజరై ప్రారంభించి ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నలభై సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అలాంటి వారికోసమే ఈ రోజు నుంచి వాసన్ ఐ కేర్ సంస్థ వారు గ్లకోమా పరీక్షలు అన్ని శాఖల్లో ఈ నెలాఖరు వరకు ఉచి తంగా చేయించుకోటానికి అందుబాటులో ఉన్నాయి అని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన వాసన్ ఐ కేర్ హాస్పిటల్ డాక్టర్లకు, ఉద్యోగస్తులకు ధన్యవాదాలు తెలిపారు.

దుర్గంధం నుంచి ప్రజలను కాపాడండి

- సీపీఐ(ఎం) కార్వాన్ జోన్ కమిటీ కన్వీనర్ విట్టల్



నవతెలంగాణ-మెహిదీపట్నం

లంగర్ హౌజ్ డివిజన్‌లో ఇండ్ల మధ్యన ఉన్న ఓపెన్ నాలాపై కప్పు వేసి ప్రజలను దుర్గంధం, నుంచి కాపాడాలని సీపీఐ(ఎం) కార్వాన్ జోన్ కమిటీ కన్వీనర్ విట్టల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రజా సమస్యలపై సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో చేస్తున్న సర్వేలలో భాగంగా.. కార్వాన్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో లంగర్ హౌస్ డివిజన్‌లో ప్రజా సమస్యలపై ప్రజలను కలిశారు. ఈ సందర్భంగా జోన్ కమిటీ కన్వీనర్ విట్టల్ మాట్లాడుతూ లంగర్ హౌస్ డివిజన్‌లోని కంది గూడ, లక్ష్మీ నగర్, బాపు ఘాట్ బస్తీల మధ్యలో ఇండ్ల పక్కన నుంచి ప్రవహిస్తున్న ఓపెన్ నాలా ద్వారా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ నాల నుంచి వస్తున్న దుర్గంధాన్ని ప్రజలు భరించలేక పోతున్నారని పేరొన్నారు. ఆ ఓపెన్ నాలా వలన దుర్గంధం, కాలుష్యం, దోమల వలన ప్రజలలో కలరా, టైఫాయిడ్ లాంటి అంటు వ్యాధులు ప్రబలుతున్నాయని వాపోయారు. ఈ విషయం మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన ఎవరు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ అధికారులు ఆయా బస్తీలలో పర్యటించాలన్నారు. స్థానిక ప్రజలను కలిసి వారి ఇబ్బందులను గుర్తించి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. లేనియెడల సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలతో కలసి పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ పర్యటనలో జోన్ పార్టీ కమిటీ సభ్యులు యాదయ్య, రాములు, నర్సమ్మ, పి.నరసింహ పాల్గొన్నారు.

గుడిమల్కాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-మెహిదీపట్నం

గుడి మల్కాపూర్ డివిజన్, నవోదయ కాలని కమ్యూనిటీ హాల్లో అమన్ వేదిక కమ్యూనిటీ బేస్డ్ కేర్ ప్రోగ్రాం, జనహిత సేవా ట్రస్ట్, కిమ్స్ ఫౌండేషన్ అండ్ రీసర్చ్ సెంటర్, రెయిన్ బో హెూమ్స్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కిమ్స్ ఆస్పత్రి నుంచి జనరల్ ఫిజీషియన్, ఆర్థోపెడిక్, గైనకాలజీ, పీడియాట్రిక్స్ వైద్యులు 150 మందికి బిపి, షుగర్ పరీక్షించి, వైద్య సలహాలు, మందులను ఉచితంగా అందజేశారు. మోకాలు, నడుము నొప్పి ఉన్నవారికి ఫిజియోథెరపిస్ట్ శ్రీనివాస్ ఎక్సర్సైజ్‌లను చూపించారు. భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరికి రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పరీక్షించి, రక్తహీనత ఉన్న వారికి ఐరన్ మాత్రలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పీపుల్స్ కలెక్టివ్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ప్రతినిధి అంబిక ప్రతీ ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని



అన్నారు. వేసవి కాలంలో అధికంగా నీరు తాగాలని సూచించారు. పేద ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు.

ఈ కార్యక్రమంలో రెయిన్ బో ఫౌండేషన్ ఇండియా సిటీ డెస్క్ మేనేజర్ క్రాంతి కిరణ్, అమన్ వేదిక ప్రాజెక్ట్ ఇన్‌చార్జి ఎల్లయ్య, సిబిసి కోఆర్డినేటర్ లు నాగభూషణం, రామస్వామి, రాజు, సంధ్య, కళావతి, కవిత, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంప్యూటర్ విద్య ప్రారంభం..



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

నాంపల్లి మండల పరిధిలోని జీపీఎస్ కుంచె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏఐ బోధన తరగతులతో విద్యనందించేకు కృషి చేస్తున్నామని నాంపల్లి మండలం డిప్యూటీ ఈఓ వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఐఓఎస్ డాక్టర్ విశ్వనాథ గుప్తా తెలిపారు. శనివారం చిరాక్ అలీ జిపిఎస్ కూచే ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కంప్యూటర్లు విద్యాబోధన కార్యక్రమాన్ని వారు ముఖ్య అతిథిగాపాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కృత్రిమమేధ వినియోగం పై విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు అని తెలిపారు. ఏఐ బోధన తరగతులతో మూడు, నాలుగు, ఐదు తరగతుల విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కంప్యూటర్ విద్యను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు ఎలా చదువుతున్నారు. వారి అలవాట్లను గమనిస్తూ ఉండాలని తెలిపారు. చదువు విషయాలను ఉపాధ్యాయులను ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకోవాలని తెలిపారు. ఎండలు ఎక్కువగా ఉన్న కారణంగా విద్యార్థులు సమతుల్యమైన ఆహారం తీసుకుంటూ, తగినంత మంచినీరు త్రాగాలని సూచించారు. విద్యార్థులు ఉన్నతంగా ఎదగడానికి చదువు ఎంతో ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబియ ప్రభుత్వ పాఠశాల కాంప్లెక్స్ హెచ్ఎం నీరజ, జీ బి హెచ్ఎస్ చాదర్ఘట్ నెంబర్ 2 ఇన్‌చార్జి హెచ్ఎం మంజులత, ఎఎంపీ చైర్మెన్ రేణుక, జీపీఎస్ పూచే చిరాగ్ ఆలీ పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌యం.సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

సంపత్ కుటుంబానికి న్యాయం చేయాలి

- బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్

నవతెలంగాణ-ముషీరాబాద్

పోలీస్ కస్టడీలో మృతి చెందిన అలకుంట సంపత్ కుటుంబానికి న్యాయం చేయాలని లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ డిమాండ్ చేశారు. శనివారం విద్యానగర్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా అంతర్గాం గ్రామానికి చెందిన అలకుంట సంపత్ గల్ఫ్ దేశాలకు మ్యాన్ పవర్ సప్లై లైసెన్స్‌తో కొంత మంది వ్యక్తులకు గల్ఫ్ దేశాలకు పంపారని తెలిపారు. గల్ఫ్‌లో వారికి సరైన ఉపాధి అవకాశాలు కల్పించలేదని సంపత్ పై నిజామాబాద్ జిల్లా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు అని తెలిపారు. సంపత్‌ను అరెస్టు చేసి, రిమాండ్



చేసి, పోలీసులు మళ్లీ కోర్టు ద్వారా కస్టడీకి తీసుకోని తీవ్ర ంగా మానసిక, భౌతికంగా హింసించడం వల్లే సంపత్ మృతి చెందారని బంధువు లు ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందిం చి.. సంబంధిత పోలీస్ అధి కారులను డిస్మిస్ చేయలన్నా రు. హత్య నేరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని దండి వెంకట్ డిమాండ్ చేశారు.పోలీసులు సంపత్‌ను కస్టడీకి అడిగినప్పుడు సంపత్ కుటుంబ సభ్యులకు గాని, ఆయన న్యాయవాది గాని ఎందుకు సమాచారం ఇవ్వాల నేదని ప్రశ్నించారు. చట్టాన్ని ధిక్కరించిన నిజామాబాద్ జిల్లా సైబర్ క్రైమ్ పోలీసులపై హత్య నేరం కేసు నమోదు చేసి, సంపత్ కుటుంబ సభ్యులకు యాభై లక్షల రూపా యల ఆర్థిక సహాయాన్ని అందించాలని కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

విద్య, వైద్యానికి 20 శాతం బడ్జెట్ కేటాయించాలి

- బహుజన్ ముక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అంసోల్ లక్ష్మణ్



నవతెలంగాణ-ముషీరాబాద్

రాష్ట్రంలో జరగబోయే బడ్జెట్ సమావేశంలో విద్యకు వైద్యానికి 20 శాతం బడ్జెట్ కేటాయించాలి అని బహుజన్ ముక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అంసోల్ లక్ష్మణ్ తెలిపారు. బహుజన్ ముక్తి పార్టీ ఆధ్వర్యంలో జాతీయ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన దాస్ రాం నాయక్ మహమ్మద్ మహ్మద్దీన్‌కి సన్మాన సత్కార సభ బహుజన్ ముక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అంసోల్ లక్ష్మణ్ అధ్యక్షతన కాన్షీరాం జయంతి పురస్కరించుకొని శనివారం బాగ్లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో స్వాగత సత్కార సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అంసోల్ లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో జరగబోయే బడ్జెట్ సమావేశంలో విద్యకు వైద్యానికి 20 శాతం బడ్జెట్ కేటాయించాలని, కామారెడ్డి సభలో కాంగ్రెస్ పార్టీ 42 శాతం బీసీలకు రిజర్వేషన్ ఇస్తామని ఇచ్చిన హామీని బీసీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీల కులాల జనగణన దేశవ్యాప్తంగా చేపట్టాలని ఈవీఎంలను తొలగించి బ్యాలెట్ పేపర్ ద్వారా ఎన్నికలు నిర్వహించాలన్నారు. బహుజన్ ముక్తి పార్టీ జాతీయ అధ్యక్షులు దాసరం నాయక్ మాట్లాడుతూ అమిత్ షా చేసినటువంటి వాఖ్యాలను తీవ్రంగా ఖండించారు.ఈవీఎంలను తొలగించాలని అధికార పార్టీలు ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీల ఓట్లను దొంగలించడానికి ఈవియం మిషన్లను తీసుకొచ్చారని ఈ సందర్భంగా ఈవీఎం హటావ్ దేశ్ బచావో అనే నినాదాలతోని ముందుకు పోవాలి అన్నారు. ఏప్రిల్ 9న జరగబోయే జైల్ బరో ఆందోళనకు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఎంఎస్పిని రైతులకు కేటాయించాలని అన్నారు. ఈ దేశంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల పైన జరుగుతున్నటువంటి అన్యాయాలను బహుజనముక్తి పార్టీ రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఎండగడ్తదని తెలియజేశారు. నిరుద్యోగుల సమస్యల మీద పోరాటం చేస్తుందని తెలియజేశారు ఈ కార్యక్ర మంలో బహుజన్ ముక్తి పార్టీ రాష్ట్ర ఉప అధ్యక్షులు ప్రొఫెసర్ ధర్మయ్య, ఉపాధ్యక్షులు అంజయ్య, రాష్ట్ర కార్యదర్శి ఇనాయక, వివిధ జిల్లా అధ్యక్షులు గటియా నాయక్, శ్రీనివాస, మట్టి ప్రసాద్, తదితరులున్నారు

రంజాన్‌లో ఖర్జూరకు ప్రత్యేక స్థానం..





మెండైన పోషకాలు

నవతెలంగాణ-ధూల్‌పేట్

రంజాన్ మాసంలో మొదటి ప్రాధాన్యత ఖర్జూర పండ్లది. ముస్లింలు ఉపవాసం ఉండి సాయంత్రం దీక్ష విరమణ చేసేటప్పుడు మొదట తినేది ఖర్జూర.. తర్వాత ఇతర ఫలాలు తీసుకుని నీరుతాగి ఉపవాస దీక్షను విరమిస్తారు. మహ్మద్ ప్రవక్త తన ఉపవాస దీక్షలో మొదటి ప్రాధాన్యం ఖర్జూరకే ఇచ్చేవారనే అంటుంటారు ముస్లిం పెద్దలు. ముస్లింలు ఇంట్లో ఖర్జూర చెట్టును పెంచితే ఆ ఇల్లు సుఖశాంతులతో ఉంటుందని చెప్పేవారు. దీంతో ముస్లింలు ఎక్కువగా ఖర్జూరలతోనే దీక్ష విరమిస్తారు. గత ఏడాది రంజాన్ నెలలో 250 లారీల ఖర్జూరాలు అమ్ముడయ్యాయని, ఈ ఏడాది ఇప్పటికే హైదరాబాద్‌కు వంద లారీల ఖర్జూరాలు వచ్చాయాని ఖర్జూరాల వ్యాపారి మొహమ్మద్ మునవర్ హుస్సేన్ తెలిపారు. పాత బస్తీ షమ టాకీస్ వద్ద గల తమ షాప్ అల్ మునవర్ డెట్స్ అండ్ డ్రై ఫ్రూట్స్ లో ఏడాది పొడవున ఇరాన్, ఇరాక్, ఫలస్తీన్, ఆఫఘనిస్తాన్, సౌదీ అరబియా, మదీనా, అలాజీరియా, ఇరాక్, జోర్డన్, మంచి దిగుమతి చేసుకుంటారు.

రకరకాలు..

ఖర్జూర పండ్లలో, ఎన్నో రకాలు ఉన్నాయి. జవాది, సియా, జరత్, అంబార్, అజ్వా, బర్నీ, ఖర్జూరాల ధర చాలా ఎక్కువగా ఉంటుంది. జవాది, సియా, జరన్, అంబార్ ఖర్జూరలు రూ.18 వందం నుంచి రూ.2500 వరకు ఉంటాయి. పహద్, మరియం, మదిన, ఫనల్ ఖర్జూర్, అంబర్, మబరువు, రాతిక, జన్నాత్, జయినబ్, బేధాన, రూ.100 నుంచి నిరూ.1600 వరకు ఉంటాయి.

- పోషక విలువలు..

భోజ్య భాగం 86శాతం, తేమ 15.3 గ్రాములు, కొవ్వు 0.4 గ్రాములు, ప్రొటీన్ 2.5 గ్రాములు, పిండిప దార్ధాలు 75,8 గ్రాములు, పీచుపదార్థాలు 3.3 గ్రాములు, కాల్షియం 120 మిల్లీ గ్రాములు, ఫాస్ఫరస్ 50మిల్లి గ్రాములు, ఇనుము 7.3 మిల్లి గ్రాములు, విటమిన్-సి మిల్లి గ్రాములు, థయామిన్ 10 1 మిల్లి గ్రాములు, లైట్ మిన్ విటమిల్లీ తమిలి నయాసిన్ 1.3 మిల్లి గ్రాములు, విటమిన్- ఎ 44 మిల్లి గ్రాములుఉంటాయి యని ప్రముఖ యూనని వైద్యుడు టౌహీద్ తెలిపారు,

- ఖర్జూరతో లాభాలు...

ఆకలిదప్పులను హరించి శరీరానికి సత్వరం శక్తిని సమకూర్చే సుగుణాలు ఉన్న అద్భుత ఆహార ఔషధంగా ఖర్జూరపండుకు ప్రత్యేక స్థానం ఉంది. ప్రధానంగా ఉపవా సదీక్షల్లో ఉండేవారు ఈ పండ్లను తింటుంటారు. ప్రస్తుతం రంజాన్ ఉపవాస దీక్షల నేపథ్యంలో ఈ ఖర్జూర పండ్లు విరివిరిగా మార్కెట్లలో దొరుకుతాయి. ఈ ఖర్జూరాలు పసి పాపలు, గర్భిణులు, వృద్ధులు అందరికీ ఆరోగ్య దాయకమే ఇనుము, కాల్షియం, పోటాషియం, విటమిన్లు, చక్కర మూలాలు పుష్కలంగా ఉంటాయి. పీచు పదార్థాల శాతమూ అదికమే. సత్వరశక్తి లభించడంతో పాటు శారీరక వ్యవస్థలోని లోపాలను సరిచేసేందుకు సహకరిస్తుంది. ప్రధానంగా గర్భిణులకు రోజూ నాలుగు ఖర్జూరాలను ఇతర వళ్లతోపాటు ఉదయాన్నే ఇలా హారంతో ఇస్తే మంచి శక్తితో పాటు విటమిన్లు లభ్యమవుతాయి. అధిక విరోచనాలు అయినప్పుడు నాలుగుపండ్లు ఉడకబెట్టి రసం తీసి మేకపాలు, లేదా ఆవుపాలతో తీసు కుంటే వెంటనే ఫలితం కనిపిస్తుంది. నిరంతరం ప్రయాణాలు సాగించేవారు తరచుగా ఈ పండ్లను తింటే మంచిది. ఖర్జూరపండును బాదంపప్పుతో కలిపి తీసుకావడంతో తలెత్తే నొప్పులు త్వరగా తగ్గి చురుగ్గా ఉండ గలుగుతారు. ఈ ఖర్జూరాలను అధికంగా తీసుకుంటే అజీర్ణంతో పాటు పైత్యం వచ్చే ప్రమాదం ఉంది.. చక్కెర వ్యాధిగ్రస్తులు, స్థూలకాయులు డాక్టర్ సలహాల తర్వాతే ఖర్జూరాలను వాడాలి. ఉపవాస దీక్షలు వదిలే సమయంలో ప్రథమంగా ఖర్జూరాలను తినడం ఆనవాయితీ.

'వినియోగదారుల హక్కుల చట్టంపై ప్రజలకు ప్రభుత్వం అవగాహన కల్పించాలి'



- అడ్వకేట్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ అవేర్నెస్

నవతెలంగాణ-హిమాయత్ నగర్

వినియోగదారుల హక్కుల చట్టం వచ్చి 35 సంవత్సరాలు గడుస్తున్న చట్టంపై ప్రజలకు అవగాహన లేదని, ప్రభుత్వం చొరవ తీసుకుని అవగాహన కల్పించాలని ఆస్రా (అడ్వకేట్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ అవేర్నెస్) కోరింది. ఈ మేరకు శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు మీడియా సమావేశంలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం పురస్కరించుకుని ఆస్రా ప్రతినిధులతో కలిసి సుప్రీంకోర్టు సీనియర్ అడ్వకేట్, ఆస్రా ఫౌండర్ హబీబ్ సుల్తాన్ అలీ పోస్టర్ ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. సంస్థ ప్రారంభమైన నుంచి ఇప్పటి వరకు ఎన్నో కేసులు పరిష్కరించామని ఆయన తెలిపారు. వినియోగదారులు ఎదుర్కొంటున్న సవాళ్లు, వినియోగదారుల పరిరక్షణ చట్టాల అమలును మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే వ్యాపార సంస్థలు, పాలకులు, వినియోగదారులు కలిసికట్టుగా న్యాయమైన మార్కెట్ వాతావరణాన్ని నిర్ధారించాల్సిన బాధ్యత కూడా ఉందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. వినియోగదారులకు వారి హక్కులపై అవగాహన కల్పించేందుకు వర్క్‌షాప్‌లు ప్రచారాలు ప్రభుత్వం నిర్వహించాలన్నారు. ఫిర్యాదుల పరిష్కార విధానం, వినియోగదారుల కోర్టుల్లో వేగంగా వివాద పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. డిజిటల్ వినియోగదారుల రక్షణ, ఆన్‌లైన్ మోసాలను నివారించడం, డేటా భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆస్రా స్టేట్ ప్రెసిడెంట్ ఎస్.వెంకటేష్ గుప్త, నేషనల్ లీగల్ కో-ఆర్డినేటర్స్ అడ్వకేట్ హరీకుమార్, అడ్వకేట్ శివకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వీరేష్, వైస్-ప్రెసిడెంట్ శ్రీధన్య, పీఆర్ఓ ప్రశాంత్, హైదరాబాద్ మాజీ మెంబెర్ కైలాష్, బీఎన్ఎస్.రాజు, తదితరులు పాల్గొన్నారు.

'ఉత్తరాది రాజకీయ ఆధిపత్యాన్ని అడ్డుకోవాలి'

- దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఉత్తరాది రాజకీయ ఆధిపత్యాన్ని అడ్డుకోకపోతే దక్షిణాది రాష్ట్రాలకు బానిసత్వం తప్పదని దళిత బహుజన పార్టీ (డీబీపీ) జాతీయ అధ్యక్షులు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ హెచ్చరించారు. శనివారం హిమాయత్ నగర్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దక్షిణాది ద్రావిడ ఉద్యమానికి ప్రధాన కేంద్రంగా ఉన్న తమిళనాడు ప్రజలను అనాగరికులు అంటూ పార్లమెంట్‌లో తమిళ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచే విధంగా కేంద్ర మంత్రి వీరేంద్ర ప్రధాన్ వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. ఆయన వెంటనే బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. హిందీ భాషను బలవంతంగా దక్షిణాది రాష్ట్రాలపై రుద్దే ప్రయత్నాలను మానుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి రాష్ట్రానికి మాతృభాష ఉంటుందని, దాని తర్వాత అంతర్జాతీయ స్థాయిలో ఇంగ్లీషు రెండో భాషగా చలామణిలో ఉందన్నారు. ఉత్తరాది రాజకీయాధిపత్యం వారి భాష హిందీని బలవంతంగా రుద్దడం వల్ల 25 ప్రాంతీయ భాషలు ఉనికి కోల్పోయారన్నారు. దేశానికి జాతీయ ఆదాయంలో దక్షిణాది రాష్ట్రాల నుంచి 50 శాతం వరకు కేంద్రానికి ఆదాయం వస్తుంది. కానీ దక్షిణాది రాష్ట్రాలకు ఐదు శాతం నిధులు కూడా కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోడీ, అమిత్ షా నేతృత్వంలోని బీజేపీ ఎన్డీఏ నిధులు కేటాయించకుండా తీవ్ర వివక్షత చూపుతున్నారని విమర్శించారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ కాషాయ మాఫియా ఉత్తరాది ఆధిపత్యాన్ని వారి దోపిడీని ప్రశ్నిస్తున్నా తమిళనాడు రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ పై అవమానకర వ్యాఖ్యలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇందులో భాగంగా హైదరాబాదులోనూ పార్లమెంటు భవనాలను, కేంద్ర ప్రభుత్వ సచివాలయాలను, సుప్రీంకోర్టు దక్షిణాది బెంచ్ హైదరాబాదులో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ గోలి నరేష్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు ఎం.ప్రవీణ్ కుమార్, మహిళా విభాగం అధ్యక్షురాలు బండారి లావణ్య, మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి సంకు శ్రీనివాసులు, రాష్ట్ర శాఖ అధ్యక్షులు జేఎస్.రావు, నగర అధ్యక్షులు అక్కిదాసు సురేంద్రబాబు తదితరులున్నారు.

రాజ్యాధికారమే అంతిమ లక్ష్యంగా బీసీలు ఉద్యమించాలి



- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య

నవతెలంగాణ-అంబర్‌పేట

బీసీలు రాజ్యాధికారం సాధించడమే అంతిమ లక్ష్యంగా ఉద్యమించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. కోల జనార్ధన్ అధ్యక్షతన శనివారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో ఓబీసీ డెమోక్రటిక్ జేఏసీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల పక్ష పార్టీలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంత రావు, బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, టీ టీడీపీ జాతీయ నాయకులు అరవింద్ కుమార్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ నేతలు గుజ్జ కృష్ణ, గుజ్జ సత్యం తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన బీసీలకు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా రావాల్సిన వాటా మర్యాదగా ఇవ్వాలని, లేని పక్షంలో యుద్ధమే జరుగుతుందని హెచ్చరించారు. బీసీలకు స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్ల కోసం చేపట్టనున్న బీసీ బిల్లుకు అన్ని పార్టీలు పూర్తిస్థాయిలో మద్దతు పలకాలని, లేని పక్షంలో ఆయా పార్టీలకు బీసీలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభలలో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని అన్నారు. దేశ జనాభా గణనలో బీసీ కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. మన ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్, బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు వేముల రామకృష్ణ, నీల వెంకటేష్, తంగెళ్లముడి నందగోపాల్, ఉదయ్నేత, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

వాణి సక్కుబాయికీ రచయిత్రి మొల్ల సాహిత్య పురస్కారం ప్రదానం..



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

కవయిత్రి మొల్ల కళావేదిక తాండూర్ ఆధ్వర్యంలో "రచయిత్రి మొల్ల సాహిత్య పురస్కారం" ఉపాధ్యాయురాలు వాణి సక్కుబాయికీ ప్రొఫెసర్ల చేతుల మీదుగా అందజేశారు. చంద్రబాబు వారు మాట్లాడుతూ..నేటి ఆడపిల్లల్లో చదువు, భద్రత, ఆరోగ్యం, ఉపాధిపై అవగాహన కల్పిస్తూ మహిళలు స్వయం ఉపాధి పొందుతూ మహిళ సాధికారత దిశగా అడుగులు వేయాలని అందుకు అనుగుణంగా ప్రతి ఒక్కరు నిర్మాణం అయ్యేలా కృషి చేస్తున్నందుకు.. అలాగే సామాజిక చైతన్యంతో కూడిన వ్యాసాలను నేటి తరానికి అందిస్తున్న ఉపాధ్యాయురాలు వాణి సక్కుబాయి సేవలను గుర్తించి ఈ సంవత్సరం మొల్ల సాహిత్య పురస్కారానికి ఎంపిక చేశారు. కవయిత్రి మొల్ల జయంతి వేడుకలు 2025 సందర్భంగా మొల్ల సాహిత్య పురస్కార అవార్డును అందజేశారు. సరళమైన తెలుగు భాషలో తొలి రామాయణ మహాకావ్యాన్ని అందించిన 15వ శతాబ్దానికి చెందిన కవిత్రి కమ్మరి అతుకూరి మొల్ల నేటి మహిళ లోకానికి ఆదర్శమని తెలిపారు. ప్రోత్సాహం ఉంటే ప్రతి స్త్రీ తనకు నచ్చిన రంగంలో తన ప్రతిభను నిరూపించుకుంటుందని తెలిపారు. ముఖ్య అతిథి ఉస్మానియా విద్యాలయం తెలుగు ఆచార్యులు డాక్టర్ ఏ విజయలక్ష్మి, డి.ఎస్.పి బాలకృష్ణారెడ్డి, రిపేర్ ప్రిన్సిపల్ రామకృష్ణ సేవ సమితి అధ్యక్షులు బాలకృష్ణ, రిటైర్డ్ ప్రిన్సిపల్ రామకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మెన్ కొత్రిక విజయలక్ష్మి, రవీందర్ గౌడ్ డాక్టర్ ఏ విజయలక్ష్మి, విజయ కుమారి, జ్వలిత, డాక్టర్ మంజుశ్రీ పాల్గొన్నారు.

ట్యాంక్ బండ్‌పై చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయాలి..



- రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మెన్ మెట్టు సాయికుమార్

నవతెలంగాణ-ముషీరాబాద్

ట్యాంక్ బండ్ పై చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటుచేసి పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తాం అని రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మెన్ మెట్టు సాయికుమార్ తెలిపారు. శనివారం బాగలింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రజక ఫిషర్మెన్ సొసైటీల కమిటీ రాష్ట్ర అధ్యక్షులు రాజీవ్ కుమార్ రజక అధ్యక్షతన రజకుల జన శంఖారావం రజకుల ఆత్మగౌరవ సభ జరిగింది. ఈ సభకు రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మెన్ మెట్టు సాయికుమార్, రజక ఫెడరేషన్ రాష్ట్ర సొసైటీల కమిటీ వ్యవస్థాపక చైర్మెన్ అమన గంటి సైదులు రజక హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. నాటినుండి నేటి వరకు శ్రమ చేసే యంత్రాలుగా పనిచేస్తూ అభివృద్ధికి నోచుకునే రజక కులాన్ని కొన్ని కులాల వారు అణిచివేస్తూ వారిని భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 23 ప్రకారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు శ్రమదోపిడి జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. కులం పేరు చెప్పుకోవడానికి సిగ్గుపడితే మన కులానికి మనమే ద్రోహం చేసిన వాళ్లమవుతామన్నారు. మన కులాన్ని సగౌరవంగా చెప్పుకోవాలన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రజకులకు అండగా ఉంటుందని ముఖ్యమంత్రి బీసీల పక్షపాత అన్నారు.ట్యాంక్ బండ్ పై ఐలమ్మ విగ్రహం ఏర్పాటుచేసి ఆమె పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తామన్నారు. కులాల యొక్క అసత్వాన్ని కాపాడడానికి ముఖ్యమంత్రి అహర్నిశలు కృషి చేస్తున్నారని కుల గణన ద్వారా దాని నిరూపించారు అన్నారు. రజక ఫెడరేషన్ జన్మాతగా వచ్చిన హక్కుని రజకులు సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా ఎదగాలన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ రజక, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్,కోశాధికారి నేరెల కుమార్,రాష్ట్ర కార్యదర్శి రామస్వామి, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి వడ్డబోయిన మంగ, మహిళా నాయకులు వి సంధ్య తదితరులు పాల్గొన్నారు.



కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో గ్రాడ్యుయేషన్ డే ప్రోగ్రాం ఘనంగా నిర్వహించారు. -ముషీరాబాద్

ఆరోగ్యంగా ఉండాలంటే

ఆరోగ్యంలో ఆహారాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. వాటిలో విత్తనాలు ఒకటి. మనం తీసుకునే ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి రోజువారీ ఆహారంలో విత్తనాలను జోడించాలని నిపుణులు చెబుతూనే ఉన్నారు. ఏ విత్తనాలు తింటే మంచిదో ఇప్పుడు తెలుసుకుందాం..

చియా గింజల్లో ఫైబర్, ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు, ప్రోటీన్, కాల్షియం, మెగ్నీషియం వంటి అనేక విటమిన్లు, ఖనిజాలతో నిండి ఉన్నాయి. చియా విత్తనాలను తీసుకోవడం జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. అధిక ఫైబర్ కంటెంట్ కారణంగా ఆరోగ్యానికి మంచిది. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయి. చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. మెరుగైన బరువు నిర్వహణను నిర్ధారిస్తాయి.

అవిసె గింజలు ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు, ఫైబర్, లిగ్నాన్స్, వివిధ విటమిన్లు, ఖనిజాల అద్భుతమైన మూలం. ఈ విత్తనాలను మీ రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించవచ్చు. వాటి అధిక ఫైబర్ కంటెంట్ కారణంగా మలబద్ధకం నుండి ఉపశమనం పొంద వచ్చు. అవిసె గింజలలో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి క్యాన్సర్-పోరాట లక్షణాలను కలిగి ఉంటాయి. ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టాన్ని తగ్గించడంలో సహాయ పడతాయి.

గుమ్మడి గింజల్లో ప్రొటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్, మెగ్నీషియం, జింక్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఈ ఆరోగ్యకరమైన విత్తనాలను ఆహారంలో చేర్చుకోవడం వల్ల వాటి అధిక జింక్ కంటెంట్ కారణంగా ప్రోస్టేట్ ఆరోగ్యాన్ని మెరుగు పరచడంలో సహాయపడుతుంది. ఇన్సులిన్ స్థాయిలను మెరుగ్గా నియంత్రించడంలో సహాయపడతాయి. గుండె ఆరోగ్యాన్ని పెంచుతాయి. అధిక మెగ్నీషియం కంటెంట్ కారణంగా నిద్ర నాణ్యతను మెరుగుపరుస్తాయి.

నువ్వులతోనూ చాలా ఉపయోగాలు ఉన్నాయి. భారతీయ వంటకాలలో ఇవి ముఖ్యమైన భాగం. నువ్వులు ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్లు, ఫైబర్, బి విటమిన్లు, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం వంటి ఖనిజాలకు మంచి మూలం. నువ్వులను మీ రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల వాటి అధిక కాల్షియం కారణంగా ఎముకల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. అంతే కాకుండా ఈ గింజల్లో యాంటీఆక్సిడెంట్లు ఎక్కువ. ఇవి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.



పుట్టగొడుగులను పేపర్లో చుట్టి ఫ్రిజ్‌లో పెడితే ఎక్కువ కాలం నిల్వ ఉంటాయి.

ఆమ్లేట్ వేసేముందు పెనం మీద కాస్త ఉప్పు చల్లితే పెనానికి అంటుకోదు.



అణచివేతపై తిరగబడ్డ ధీర

దాక్షాయణి వేలాయుధన్... 75 ఏండ్ల కిందటనే దేశంలో పాతుకుపోయిన అంటరానితనంపై గొంతెత్తారు. అణచివేత, కుల, లింగ, అసమానతలకు వ్యతిరేకంగా అవిశ్రాంతంగా కృషి చేశారు. రాజ్యాంగ సభలో ఏకైక దళిత మహిళగానేకాక అత్యంత పిన్న వయస్కురాలిగానూ చరిత్ర సృష్టించారు. దేశంలో అంటరానితనాన్ని సమూలంగా తుడిచేసేందుకు అవసరమైన మార్గాలను అన్వేషించిన ఆమె జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకం.



దుర్గామాతకు పర్యాయపదంగా ఉన్న 'దాక్షాయణి' అనే పేరుపెట్టడంలోనే ఆమె కుటుంబం ఆమెకు పోరాడే శక్తిని ఇచ్చింది. 1935లో ఆమె భారతదేశంలో రసాయన శాస్త్రంలో సైన్స్‌లో బ్యాచిలర్స్ పట్టా పొందిన మొదటి దళిత మహిళ. ఆమె చేసిన ఈ ప్రయాణం ఎన్నో సవాళ్లతో కూడుకున్నది. ప్రయోగశాల పరికరాలను ఉపయోగించకుండా ఒక ప్రొఫెసర్ ఆమెను తిరస్కరించాడు. దాంతో దూరంగా నిలబడి ఆమె ప్రయోగాలను గమనించాల్సి వచ్చింది. అప్పటి నుండే ఆమె అంటరానితనంపై తిరగబడ్డారు. అణచివేతను సూటిగా ప్రశ్నించారు.

రాజ్యాంగ సభలో...

34 ఏండ్ల వయసులో ఆమె రాజ్యాంగ సభలో ఒకరిగా ఉన్నారు. సామాజిక న్యాయం, మత సామరస్యం, ఆర్థిక అభ్యున్నతి, మానవ గౌరవం కోసం గట్టిగా వాదించారు. స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావంతో కూడుకున్న భారతీయ సమాజాన్ని ఆమె కోరుకున్నారు. తన బాల్యం నుండి వ్యక్తిగతంగా ఎదుర్కొన్న అంటరానితనం ఆమెకు ఎన్నో నేర్పింది. అసెంబ్లీలో గొంతెత్తి మాట్లాడేందుకు మద్దతునిచ్చింది. 1948లో 'ముసాయిదా కమిటీ చైర్మన్ స్వయంగా అంటరాని సమాజానికి చెందినవాడు కాబట్టి అంటరానితనానికి సంబంధించిన నిబంధన లేకుండా రాజ్యాంగాన్ని మనం ఆశించలేము' అని ఆమె డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌ను ప్రస్తావిస్తూ ఆమె నొక్కిచెప్పారు.

అంటరానితనాన్ని నిర్మూలించడం గురించి మాత్రమే కాక దీనికోసం పాలకులు ఏం చేయాలో కూడా ఆమె స్పష్టంగా చెప్పారు.

సమగ్ర స్వేచ్ఛతోనే సాధ్యం...

కుల వ్యవస్థ మన దేశంలో అత్యంత లోతుగా పాతుకుపోయింది. ఈ సామాజిక నిర్మాణాలను గమనించిన ఆమె ఆర్థిక దోపిడీ, ఆర్థిక భారం, వలస పాలన వంటివన్నీ ఈ దుస్థితికి దోహదపడ్డాయని గుర్తించారు. ఆమె అభిప్రాయం ప్రకారం సమగ్ర స్వేచ్ఛ మాత్రమే ఈ వర్గాలను విముక్తి చేయగలదు. వేతనాలను




డిమాండ్ చేసే హక్కు వారిని ఆత్మగౌరవంగా జీవించేలా చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. వారి జీవితాల్లో పరివర్తన విప్లవాన్ని తెస్తుంది. ఈ దృక్పథంతోనే భారత రాజ్యాంగంలోని మూడవ భాగంలో దీనికి స్థానం కల్పించారు.

75 ఏండ్ల తర్వాత కూడా...

దాక్షాయణి ఒక్క అంటరానితనాన్ని మాత్రమే కాదు నిరంకుశత్వాన్ని, అధికార కేంద్రీకరణను కూడా తీవ్రంగా విమర్శించారు. భారతదేశం సార్వభౌమ గణతంత్ర రాజ్యంగా ఉండాలని ఆమె ప్రతిపాదించారు. రాజ్యాంగం ఆమోదించబడిన 75 ఏండ్ల తర్వాత కూడా దేశంలో దారుణాలు కొనసాగుతున్నాయి. కుల దురాగతాలు కొనసాగుతున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో, ఉన్నత వర్గాలలో, మధ్య తరగతిలో, ప్రైవేట్, ప్రభుత్వ రంగాలలో రోజువారీగా ఇలాంటి ఘటనలే పునరావృతమవుతున్నాయి. లోతుగా పాతుకుపోయిన ఈ సామాజిక నిర్మాణాలను అప్పట్లోనే గమనించిన ఆమె సమస్యకు ఏం చేయాలో గుర్తించారు.

ప్రాణాలు బలిగొంటున్నాయి

పారిశుద్ధ పని చేస్తున్న కార్మికులు ఎక్కువ మంది షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఇతర వెనుకబడిన తరగతుల వర్గాలకు చెందినవారే. ఇటీవలి డేటా ప్రకారం 2019 - 2023 మధ్య మురుగు కాలువలు, సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేస్తున్నప్పుడు 300 మందికి పైగా మరణించారు. వీరి రక్షణ కోసం 2013లో తీసుకొచ్చిన చట్టం అమలును బలోపేతం చేయాలని సుప్రీంకోర్టు ఇటీవల ఆదేశాలు ఇచ్చినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దాని అమలును విస్మరిస్తూనే ఉన్నాయి. అమాయక ప్రజల ప్రాణాలు బలిగొంటున్నాయి. అంటే దాక్షాయణి కోరుకున్న మార్పు మన దేశంలో ఇంకా సాధ్యం కాలేదు.



కుల రంగస్థలం కొనసాగుతూనే ఉంది

దళిత విద్యార్థులు ఇప్పటికీ విభజనను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికీ గ్రామాల్లో అందరూ ఉపయోగించే మంచి నీటి బావుల వద్దకు వీరికి ప్రవేశం నిషేధం. కులాంతర వివాహాలు హింసాత్మకంగా మారిపోయాయి. 'పరువు' పేరుతో కులదురహంకార హత్యలు జరుగుతున్నాయి. ప్రపంచంలో ఒక్క భారతదేశమే దీని నుండి బయటపడలేకపోయింది. ఇలాంటి సమాజంలో దాక్షాయణి వారసత్వం కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాజ్యాంగ సభలో ఆమె ప్రసంగాలు - సామాజిక సమానత్వం, రాజకీయ ప్రాతినిధ్యం కోసం పిలుపునిస్తూ రాజ్యాంగ సభలో ఆమె చేసిన ప్రసంగాలు నేటి తరంలో స్ఫూర్తినింపుతాయి. నేటికీ కొనసాగుతున్న వ్యవస్థాగత అసమానతలను నేరుగా ఎదుర్కొనే ధైర్యాన్ని ఇస్తాయి. నేడు దేశం ఎదుర్కొంటున్న సమస్యల మధ్య దాక్షాయణిని గుర్తుంచుకోవడం అంటే భారతదేశ ప్రజాస్వామ్యం చుట్టూ ఉన్న కలవరపెట్టే సత్యాన్ని ఎదుర్కోవడం. దశాబ్దాలు గడుస్తున్నా సమానత్వం అనే వాగ్దానం నెరవేరలేదు. ఆమె జీవితం మనల్ని మనం లోతుగా చూసుకునేలా చేస్తుంది. మనల్ని మనం ప్రశ్నించుకునేలా చేస్తుంది.

పల్లా వర్సెస్ భట్టి

వామపక్ష విద్యార్థి సంఘం నుంచి వచ్చి ఇలా మాట్లాడుతావా?

సభలో అబద్ధాలు మాట్లాడటం తగదు : భట్టి

వందశాతం రుణమాఫీ అయినట్టు నిరూపిస్తే ముక్కునేలకు రాసి రాజీనామా చేస్తా : పల్లా

సీఎంకు కాకుండా క్రెడిట్ తనకే దక్కాలని భట్టి మాట్లాడుతున్నారు : వేముల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శనివారం శాసనసభలో మాట్లాడే సమయంలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క వర్సెస్ బీఆర్ఎస్ సభ్యులు పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నట్టుగా పరిస్థితి కొనసాగింది. వామపక్ష విద్యార్థి సంఘంలో పనిచేసి వచ్చావు కాబట్టి ప్రభుత్వానికి సహేతుక సూచనలు చేస్తావనుకున్నానుగానీ ఇలా వచ్చి అబద్ధాలు మాట్లాడుతావనుకోలేదు అంటూ పల్లానుద్దేశించి భట్టి వ్యాఖ్యానించారు. 'నీవు సెంట్రల్ యూనివర్సిటీలో చదువుకుంటే నేను ఓయూలో చదువుకున్నాను. కొంత జ్ఞానం మీకు ఎక్కువ ఉండొచ్చు' అన్నట్టుగా డిప్యూటీ సీఎం భట్టిని ఉద్దేశించి పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. తాను అబద్ధాలు మాట్లాడటం లేదనీ, తన నియోజకవర్గంలోనే 127 గ్రామాల్లో ఏదైనా ఒక గ్రామాన్ని మీరే ఎంచుకుని వంద శాతం రుణమాఫీ అయినట్టు చూపాలని ఆయన భట్టికి సవాల్ విసిరారు. ఒకవేళ వంద శాతం రుణమాఫీ చేసినట్టు నిరూపిస్తే రాజీనామా ముక్కు నేలకు రాసి రాజీనామా చేస్తానని సభావేదికగా ప్రకటించారు. రుణమాఫీ, గృహలక్ష్మి పథకాల వల్ల బీఆర్ఎస్, బీజేపీ సభ్యుల నియోజకవర్గంలో ఎంత మంది లబ్దిపొందారనే విషయాన్ని డిప్యూటీ సీఎం అంకెలతో వివరంగా చదివి వినిపించారు. 'సార్ ప్లీజ్ ఆపండి సార్..లెక్కలు ఆపండి సార్..ఈ వివరాలు బడ్జెట్ చర్చల్లో చెప్పండి సార్' అంటూ బీఆర్ఎస్ సభ్యులు రన్నింగ్ కామెంట్ చేయడం కనిపించింది.

పేర్లు, నెంబర్లు, బోర్డులు కాదు ప్రజల జీవితాలు మార్చండి : పల్లా రాజేశ్వర్‌రెడ్డి

తన నియోజకవర్గంలో ఎక్కడ కూడా పూర్తిస్థాయిలో రుణమాఫీ కాలేదని బీఆర్ఎస్ సభ్యులు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి నొక్కిచెప్పారు. తన నియోజకవర్గంలోని 127 గ్రామాల్లో ఏ ఒక్క గ్రామంలోనైనా వంద శాతం రుణమాఫీ పూర్తయినట్టు చూపెడితే తాను ముక్కు నేలకు రాస్తాననీ, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు సవాల్ విసిరారు. మాట మాట్లాడితే వంద శాతం రుణమాఫీ చేశామని కాంగ్రెస్ సర్కారు పచ్చి అబద్ధాలు చెబుతున్నదని విమర్శించారు. ఇంత అప్రజాస్వామ్య, అహంకారపూరిత ప్రభుత్వాన్ని ఉమ్మడి రాష్ట్ర, తెలంగాణ చరిత్రలో పరిపాలించిన 19 ప్రభుత్వాల్లో తానెప్పుడూ చూడలేదంటూ చురకలు అంటించారు. మహిళా జర్నలిస్టులపై కేసులు పెట్టడాన్ని తప్పుబట్టారు. రుణమాఫీ కాని రైతులకు కూడా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత కారణంగా విద్యాశాఖలో 2 లక్షల డ్రాపౌట్స్ పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాసంస్థలకు నిధుల కేటాయింపులో కూడా ప్రభుత్వం విఫలమైందని అన్నారు. విద్యావ్యవస్థ పూర్తిగా పడకేసిందన్నారు. ఎనిమిది వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయాయన్నారు. దీంతో ప్రయివేటు కాలేజీల యాజమాన్యాలు ఇబ్బంది పడుతున్నాయనీ, సిబ్బందికి, లెక్చరర్లకు జీతాలు ఇచ్చే పరిస్థితి కూడా లేదని సభా దృష్టికి తీసుకొచ్చారు. వైద్యరంగం మరీ దారుణంగా తయారైందన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో కనీస వసతుల్లేవనీ, టెస్టులు బయట చేయించుకోవాలంటున్నారనీ, మందు గోళీలు కూడా బయట కొనుకొచ్చుకోవలంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో 481 మంది విద్యార్థులు చనిపోయారనీ, 491 మంది రైతులు, 116 మంది ఆటోడ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకున్నారనే విషయాన్ని సభాదృష్టికి తీసుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదన్నారు. ఫార్మాసిటీ రద్దు చేయొద్దని సర్కార్‌కు విజ్ఞప్తి చేశారు. కులగణనను తాము కాదు..కాంగ్రెస్ ఎమ్మెల్సీనే తప్పుబడుతున్నారని చెప్పారు. నెక్లెస్‌రోడ్డులోని అంబేద్కర్ విగ్రహాన్ని ప్రారంభించాలని సూచించారు. ఇచ్చిన హామీమేరకు పింఛన్లను పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుబంధును కాంగ్రెస్ సర్కారు ఎగ్గొడుతున్నదని విమర్శించారు. లోఓల్టేజీతో వ్యవసాయ బావుల మోటార్లు కాలిపోతున్నాయని వాపోయారు. తెలంగాణ చిహ్నం నుంచి కాకతీయ తోరణాన్ని తొలగించడాన్ని తప్పుబట్టారు. పేర్లు, బోర్డులు, నెంబర్లు మార్చడం కాదు..ప్రజల బతుకులను మార్చాలని సూచించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని నిలబెట్టడం కోసం తమ ప్రభుత్వం వచ్చాక చిహ్నాలు, పేర్లను మారుస్తామని నొక్కి చెప్పారు.

ఇలా మాట్లాడటం తగదు : భట్టి

తాము ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఒకే దశలో రూ.2 లక్షల మేరకు రైతులకు రుణమాఫీ చేశామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నొక్కి చెప్పారు. గత ప్రభుత్వం మాదిరిగా రుణమాఫీ చేస్తామని ఐదారేండ్లు పెండింగ్‌లో పెట్టలేదనీ, విడతలుగా విడుదల చేయలేదని గుర్తుచేశారు. గజ్వేల్, జనగాం, సిద్దిపేట, సిరిసిల్ల, ఆర్మూర్, నిర్మల్, బాల్కొండ, ఆదిలాబాద్, దుబ్బాక, హుజూరాబాద్, తదితర నియోజకవర్గాల్లో ఎన్ని వందల కోట్ల రూపాయలు, ఎంత మందికి రుణమాఫీ అయిందనే విషయాన్ని అంకెలతో సోదాహరణంగా వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా హామీలను అమలు చేస్తున్నదిగానీ సరిగా ప్రచారం చేసుకోవడం లేదనే అభిప్రాయం బయట వినిపిస్తోందన్నారు. గతంలో బీఆర్ఎస్‌వాళ్లు ఏం చేయకున్నా చేసినట్టు ప్రచారం చేసుకున్నారనీ, ప్రజల్ని తప్పుదోవ పట్టించారని విమర్శించారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఏం చేయట్లేదంటే ఈ అంకెలన్నీ వివరంగా చెప్పాల్సి వస్తోందన్నారు. వామపక్ష విద్యార్థి సంఘంలో పనిచేసి ఈ స్థాయికి వచ్చిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇలా అబద్ధాలు మాట్లాడటం తగదని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 11 వేల టీచర్ పోస్టులను రిక్రూట్ చేసింది కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. మరో ఐదారు వేల టీచర్ పోస్టులను భర్తీ చేసేందుకు కూడా తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రమోషన్ల విషయాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. తమ ప్రజా ప్రభుత్వం 22 వేల మంది ప్రమోషన్లను కల్పించిందన్నారు. ఎలాంటి ఆందోళనలు లేకుండా టీచర్ల సంఘాలతో సంప్రదింపులు జరిపి 36 వేల మంది టీచర్లను బదిలీ చేశామని తెలిపారు. గత ప్రభుత్వం యూనివర్సిటీలను గాలికొదిలేసింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం ఇటీవల 12 మంది వీసీలను నియమించిందనీ, తొలిసారి ఓయూకి ఓ దళితున్ని వీసీగా నియమించామని తెలిపారు. సామాజిక న్యాయానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రకటించారు. పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వ మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం 40 శాతం మెస్ చార్జీలను, 200 శాతం కాస్మోటిక్ చార్జీలను పెంచామని సగర్వంగా చెప్పారు. మహిళా యూనివర్సిటీ చాకలి ఐలమ్మ పేరు పెట్టామనీ, కొత్త భవనాలు కట్టబోతున్నామని తెలిపారు. పదేండ్లలో విద్యారంగాన్ని గాలికొదిలేసింది బీఆర్ఎస్ సర్కారే అని విమర్శించారు. ఒక్క గురుకులానికైనా సొంత భవనం ఉందా? అని ప్రశ్నించారు. తాము ఒకేసారి 58 ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ఒక్కొక్కటి 25 ఎకరాల్లో ఫుట్‌బాల్, క్రికెట్, ఖోఖో, ఇలా అన్ని ఆటలకు సంబంధించిన మైదానాలు ఉండేలా టీచర్లు కూడా అందులోనే ఉండేలా నివాస సముదాయాలను కడుతున్నామని వివరించారు. యంగ్‌ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఐటీఐలను గాలికొదిలేస్తే..తమ ప్రభుత్వం 65 ఐటీఐను ఏటీసీలుగా అప్‌గ్రేడ్ చేశామని గుర్తుచేశారు. 15 నెలల కాలంలో ఒక్కొక్కటిగా తమ ప్రభుత్వం చేస్తూ పోతుంటే ఏమీ చేయలేదన్నట్టు మాట్లాడటం సభను తప్పుదోవ పట్టించడమే అవుతుందన్నారు. ఈ సందర్భంలో బీఆర్ఎస్ సభ్యులు, మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి జోక్యం చేసుకుని మాట్లాడుతూ..సీఎంకు అవకాశం లేకుండా క్రెడిట్ అంతా తానే కొట్టేయాలని భట్టి మాట్లాడుతున్నట్టు ఉందని చలోక్తులు విసిరారు. తన నియోజకవర్గంలో రుణమాఫీ గురించి మాట్లాడారు.

అసెంబ్లీలో సమస్యలపై చర్చ జరగాలి

నవతెలంగాణ-వికారాబాద్ కలెక్టరేట్, మర్పల్లి, మోమిన్‌పేట్

ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చ జరగాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. రాష్ట్రానికి నిధులను రాబట్టేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలూ పోరాడాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పారు. అదేవిధంగా రాష్ట్రంలో నెలకొన్న ప్రజా సమస్యలను గుర్తించేందుకు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఈనెల 31వ తేదీ వరకు సర్వే చేపట్టామని, ఆ సర్వేలో తమ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని అన్నారు. శనివారం వికారాబాద్ జిల్లాలో జాన్‌వెస్లీ పర్యటించారు. మర్పల్లి మండలం సిరిపురం, మోమిన్‌పేట మండలంలోని కేసారం గ్రామంలో ప్రజాసమస్యలపై సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను సీపీఐ(ఎం) బృందానికి చెప్పుకున్నారు. వాటి పరిష్కారానికి ప్రభుత్వంపై పోరాడుతామని బృందం నాయకులు వారికి హామీ ఇచ్చారు. అనంతరం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని గెస్ట్‌హౌస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జాన్‌వెస్లీ మాట్లాడారు.

కేసారం, సిరిపురం గ్రామాల్లో చేపట్టిన సర్వేలో ప్రజలు తమ సమస్యలు తెలియజేశారని జాన్‌వెస్లీ తెలిపారు. 220 ఎకరాల్లో 100 కుటుంబాలు సాగులో ఉన్నా ఇప్పటివరకు పట్టాలు ఇవ్వలేదన్నారు. రైతుల పొలాలకు వెళ్లకుండా దారులు మూసేసి ప్రభుత్వ భూములను ఆక్రమించిన హిలక్ వెంచర్ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీకి నిధులు లేక అధ్వానంగా తయారైందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం రూ.50 లక్షలా 65 వేల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టిందని, అందులో రాష్ట్రానికి సరైన నిధులు ఇవ్వకపోవడం దారుణమన్నారు. విభజన చట్టంలోని హామీలను అమలు చేయడం లేదన్నారు.

ఉపాధి హామీ కూలీలకు నిధులు తగ్గించారన్నారు. జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. లౌకికత్వానికి భిన్నంగా బీజేపీ వ్యవహరిస్తోందని, రాజ్యాంగాన్ని మార్చే దిశలో వారి అడుగులు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మనువాదం ముందుకు తేవడం అంటే కులాన్ని, మతాన్ని పెంచి పోషించడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. స్త్రీ, పురుష అసమానతలు, మూఢ విశ్వాసాలను బీజేపీ పెంచి పోషిస్తోందని అన్నారు. డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలలో లోక్‌సభ సీట్ల సంఖ్యను కుదించేందుకు ప్రయత్నిస్తున్నారని, దీన్ని తమ పార్టీ వ్యతిరేకిస్తోందని స్పష్టం చేశారు.తాగునీటి సమస్య తలెత్తకుండా ముందుస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యలకు ప్రభుత్వం పరిష్కారం చూపకుంటే.. పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరిం చారు. బడుగు, బలహీన వర్గాలకు, రైతులకు అండగా ఉండి వారి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజా ఉద్యమాలు నిర్మిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.వెంకటరాములు, జిల్లా కార్యదర్శి ఆర్.మహిపాల్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సభ్యులు ఎం.వెంకటయ్య, బుస్స చంద్రయ్య, శ్రీనివాస్, బుగ్గప్ప, రామకృష్ణ, సతీష్, సుదర్శన్, నవీన్, మంగమ్మ తదితరులు ఉన్నారు.

ట్రంప్ మరో షాక్


(మొదటిపేజీ తరువాయి)

పాకిస్తాన్ రాయబారిగా పనిచేస్తున్న కేకే అహ్సాన్ వాగన్ తమ దేశంలో ప్రవేశించేందుకు కొద్ది రోజుల క్రితం అమెరికా నిరాకరించింది. ఆయనను లాస్ ఏంజెల్స్ నుంచి వెనక్కి పంపింది. దీనిపై అమెరికా ఎలాంటి నిర్దిష్ట కారణం చెప్పనప్పటికీ ఆయన వీసా రిఫరెన్సులు వివాదాస్పదంగా ఉన్నాయని ఇమ్మిగ్రేషన్ అధికారులు గుర్తించినందునే వెనక్కి పంపారని తెలుస్తోంది.

రెడ్ లిస్ట్‌లో పది దేశాలు

అమెరికా భద్రతాధికారులు రూపొందించిన ముసాయిదా ప్రకారం పది దేశాలను 'రెడ్ లిస్ట్'లో ఉంచారు. అంటే ఆయా దేశాల పౌరులకు వీసాల జారీని పూర్తిగా నిలిపివేస్తారు. ఆఫ్ఘనిస్తాన్, క్యూబా, ఇరాన్, లిబియా, ఉత్తర కొరియా, సోమాలియా, సూడాన్, సిరియా, వెనెజులా, యమన్‌లు జాబితాలో ఉన్నాయి. మరో ఐదు దేశాలపై ఆంక్షలను ప్రతిపాదించారు. వీటి ప్రకారం ఎరిత్రియా, హైతీ, లావోస్, మయన్మార్, దక్షిణ సూడాన్ దేశాల పర్యాటక, విద్యార్థి వీసాలపై ప్రభావం పడబోతోంది. వీటితో పాటు కొన్ని ఇమ్మిగ్రెంట్ వీసాలనూ నిలిపివేస్తారు.

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంపై సమగ్ర విచారణ జరపాలి



కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలి

తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘాల జేఏసీ

నవతెలంగాణ - ముషీరాబాద్

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని, వెల్ఫేర్ బోర్డు పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. జేఏసీ ఆధ్వర్యంలో హైదరాబాద్ గోల్కొండ చౌరస్తాలోని సీఐటీయూ సెంట్రల్ సిటీ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం(సీఐటీయూ) రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వంగూరు రాములు మాట్లాడుతూ.. ఎస్ఎల్‌బీసీ టన్నెల్లో జరిగిన ప్రమాదంపై నిపుణుల చేత సమగ్ర దర్యాప్తు చేసి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో రక్షణ చర్యలు తీసుకోని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టి.. ఎనిమిది మంది కార్మికుల కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున నష్టపరిహారం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. టన్నెల్ లోపల పరిస్థితిని క్షుణ్ణంగా పరీక్ష చేయకుండా హడావిడిగా కార్మికులను లోనికి పంపించడంతో అరగంటలోనే ప్రమాదం జరగడం అత్యంత బాధాకరమన్నారు. ఈ ప్రమాదానికి కారణం కాంట్రాక్టర్ల నిర్లక్ష్యమే అన్నారు. తెలంగాణ భవన ఇతర నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించాలని, బోర్డులో రెన్యువల్ కానీ 11.5 లక్షల కార్డులను యుద్ధ ప్రతిపాదికన బోర్డు స్వయంగా రెన్యువల్ చేయాలని కోరారు. కోటి రూపాయల పైన వ్యయంతో నిర్మించే నిర్మాణాలపై 2 శాతం సెస్ వసూలు చేయాలని, గత ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించిన లక్ష మోటార్ సైకిల్స్‌ను కార్మికులకు అందించేందుకు నిబంధనలు రూపొందించాలని అన్నారు.

రాష్ట్ర అధ్యక్షులు ఎస్.రామ్మోహన్ మాట్లాడుతూ.. ప్రాజెక్టులు, రోడ్లు, పెద్ద పెద్ద కంపెనీలు, ఇటుక బట్టీలలో పనిచేసే కార్మికులు, వలస కార్మికులందరికీ స్పెషల్ డ్రైవ్ నిర్వహించి బోర్డులో నమోదు చేసి సంక్షేమ పథకాలను వర్తింపజేయాలన్నారు. 1979 అంతర్రాష్ట్ర వలస కార్మిక చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. ప్రధాన కార్యదర్శి ఆర్ కోటంరాజు మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులందరికీ గుర్తింపు కార్డులు అందజేసి ప్రమాదాలకు గురైన కార్మికులకు ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

1996 చట్టం ప్రకారం రాష్ట్ర వెల్ఫేర్ బోర్డులో అడ్వైజరీ కమిటీని అనుభవజ్ఞులైన కార్మిక నాయకులతో నియమించాలని, అడ్వైజరీ బోర్డు లేని కారణంగా సెస్ నిధులను అక్రమంగా ఇతర శాఖలకు దారి మళ్లిస్తూ దుబారా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 60 సంవత్సరాలు పైబడిన కార్మికులకు పెన్షన్స్ సౌకర్యం, కార్మికుల పిల్లల చదువుకు స్కాలర్‌షిప్, సొంత ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల ఆర్థిక సహాయం చేయాలని కోరారు. అడ్డా ప్రాంతాలలో మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యాలు షెడ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ప్రగతిశీల తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు హనుమేష్, బీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు విశ్వనాధ్, రాష్ట్ర నాయకులు అనురాధ, విజయ్, సెంట్రింగ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కనకరాజు, స్ఫూర్తి భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి ఎస్ రవి, ఇతర కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ముంబయిదే టైటిల్

- డబ్ల్యూపీఎల్ చాంపియన్‌గా ముంబయి ఇండియన్స్
- ఫైనల్లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు హ్యాట్రిక్ పరాజయం
- మహిళల ప్రీమియర్ లీగ్ 2025



నవతెలంగాణ-ముంబయి : ముంబయి ఇండియన్స్ మురిసింది. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో రెండోసారి చాంపియన్‌గా అవతరించింది. శనివారం బ్రబౌర్న్ స్టేడియంలో జరిగిన మహిళల ప్రీమియర్ లీగ్ ఫైనల్లో మూడుసార్లు ఫైనలిస్ట్ ఢిల్లీ క్యాపిటల్స్‌పై ముంబయి ఇండియన్స్ 8 పరుగుల తేడాతో మెరుపు విజయం సాధించింది. తొలి సీజన్లో టైటిల్ కొట్టిన ముంబయి ఇండియన్స్.. మళ్లీ మూడో సీజన్లోనూ విజేతగా నిలిచింది. ఢిల్లీ క్యాపిటల్స్‌కు ముచ్చటగా మూడోసారి భంగపాటు తప్పలేదు. వరుసగా మూడోసారి ఫైనల్‌కు చేరుకున్న మెగ్ లానింగ్ సేన.. టైటిల్ పోరులో హ్యాట్రిక్ పరాజయం చవిచూసింది. ఓ టోర్నమెంట్ ఫైనల్లో ఓ జట్టును వరుసగా మూడుసార్లు ఓటమి వరించటం ఇదే ప్రథమం!.

150 పరుగుల ఛేదనలో ఢిల్లీ క్యాపిటల్స్ ఆఖరు వరకు పోరాడినా.. 20 ఓవర్లలో 9 వికెట్లకు 141 పరుగులే చేసింది. కెప్టెన్ మెగ్ లానింగ్ (13), షెఫాలీ వర్మ (4), జెస్ జొనాసెన్ (13), అనాబెల్ సూథర్‌లాండ్ (2) ఛేదనలో విఫలం అయ్యారు. జెమీమా రొడ్రిగస్ (30, 21 బంతుల్లో 4 ఫోర్లు), మారిజానె కాప్ (40, 26 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సులు) క్యాపిటల్స్‌ను రేసులో నిలిపారు. ఆఖర్లో యువ ప్లేయర్ నికి ప్రసాద్ (25 నాటౌట్, 23 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) పోరాడినా ఫలితం దక్కలేదు. చివరి ఓవర్లో 14 పరుగులు చేయాల్సి ఉండగా క్యాపిటల్స్ తేలిపోయింది. ముంబయి ఇండియన్స్ బౌలర్లలో నటాలీ సీవర్ (3/30), అమేలీ ఖేర్ (2/25) రాణించారు. అంతకుముందు, తొలుత బ్యాటింగ్ చేసిన ముంబయి ఇండియన్స్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 149 పరుగులు చేసింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (66, 44 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సులు) అర్థ సెంచరీతో చెలరేగింది. నటాలీ సీవర్ (30, 28 బంతుల్లో 4 ఫోర్లు), అమన్జోత్ కౌర్ (14 నాటౌట్) రాణించారు. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లలో మారిజానె కాప్, జెస్ జొనాసెన్, శ్రీ చరణిలు రెండేసి వికెట్లు పడగొట్టారు.

ట్రంప్ ముఖంపైకి మైక్రోఫోన్

- ఓ మహిళా పాత్రికేయురాలి అత్యుత్సాహం
- చిరాకు పడిన అధ్యక్షుడు



మేరీల్యాండ్ : అది మేరీల్యాండ్‌లోని ప్రిన్స్ జార్జ్ కౌంటీలో ఉన్న అమెరికా సైనిక స్థావరం. అక్కడ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాత్రికేయులతో ముచ్చటిస్తున్నారు. గాజాపై వారు అడిగిన ప్రశ్నలకు ట్రంప్ సమాధానమిస్తుండగా ఓ మహిళా జర్నలిస్టు అత్యుత్సాహంతో తన వద్ద ఉన్న మైక్రోఫోన్‌ను ఆయన ముఖానికి దగ్గరగా తీసికెళ్లారు. అది ఆయన ముఖాన్ని దాదాపుగా తాకినట్లయింది. ఈ హఠాత్పరిణామానికి ట్రంప్ చిరాకు పడుతూ కొంత అసహనం వ్యక్తం చేశారు. కనుబొమలను పైకి లేపారు.వాషింగ్టన్ డీసీ నుండి బయలుదేరి వెళ్లేందుకు ట్రంప్ వైమానిక స్థావరానికి చేరుకున్నారు. గాజాలో నెలకొన్న పరిస్థితులపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఇంతలో ఆకస్మికంగా ఓ మైక్రోఫోన్ ఆయన ముఖం మీదకు వచ్చింది. దీనిపై ట్రంప్ చిరాకు ప్రదర్శించారు. ఆ వెంటనే సర్దుకొని నవ్వేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్ కావడంతో రిపబ్లికన్లు పెద్ద ఎత్తున స్పందించారు. ట్రంప్ ప్రదర్శించిన అసహనం, చిరాకు మీమ్స్‌కు విందు భోజనాన్ని అందించాయి. ఘటనకు సంబంధించిన దృశ్యాలను సామాజిక మాధ్యమాలలో తిలకించిన అనేక మంది నవ్వు ఆపుకోలేకపోయారు.

ఈ ఘటన వెనుక కుట్ర ఏమైనా ఉన్నదా అనే అనుమానాలు కూడా వ్యక్తమయ్యాయి. మైక్రోఫోన్‌లో ప్రాణాంతక ఆంత్రాక్స్ లేదా ఫెంటానిల్ వంటి పదార్థాలు ఉండవచ్చునంటూ ఎక్స్ వినియోగదారుడొకరు ధర్మసందేహాన్ని బయటపెట్టాడు. 'రాబోయే కొన్ని గంటల్లో ట్రంప్ అనుమానాస్పద మరణానికి గురైతే మైక్రోఫోన్‌ను ఉపయోగించిన వ్యక్తిని నేను నిందిస్తాను' అని కూడా అన్నాడు. ఈ ఘటనపై దర్యాప్తు జరపాలని మరొకరు సూచించారు. 'ఈ భూమి మీద ఒక రిపోర్టర్ ట్రంప్ ముఖానికి చేరువగా మైకును ఎలా తీసికెళ్లగలరు?. భద్రతను మరింత కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఉంది' అని ట్రంప్ మద్దతుదారు ఒకరు ట్వీట్ చేశారు.

దేరాలు, గోడ రాతలు తొలగించండి

రాజధానిని అందంగా తీర్చిదిద్దండి : అధికారులకు ట్రంప్ ఆదేశాలు



వాషింగ్టన్ : ప్రపంచ నేతలు అమెరికా పర్యటనకు వచ్చినప్పుడు వారికి నిరసన ధ్వనులు వినిపించకూడదట. ఆందోళనకారులు ఏర్పాటు చేసుకునే దేరాలు కానీ, వారు గోడలపై రాసే రాతలు కానీ కన్పించకూడదట. రాజధాని నగరం పరిశుభ్రంగా, అందంగా, స్వచ్ఛంగా కన్పించాలట. ఇది దేశాధ్యక్షుడు ట్రంప్ ఆకాంక్ష. ప్రపంచ నేతలు అచ్చెరువందేలా రాజధాని నగరం వాషింగ్టన్ డీసీని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దాలని ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ, ఇతర ప్రపంచ నేతలు తనను కలవడానికి వచ్చినప్పుడు వాషింగ్టన్ డీసీలోని ప్రభుత్వ భవనాల సమీపంలో ఉండే దేరాలను, గోడలపై రాతలను చూడాలని తాను కోరుకోవడం లేదని ట్రంప్ చెప్పారు. రాజధానిని శుభ్రంగా ఉంచాలని ఆయన అధికారులను ఆదేశించారు. 'మేము మా నగరాన్ని శుభ్రం చేస్తున్నాము. గొప్ప రాజధానిని శుభ్రం చేస్తున్నాము. నేరాలకు ఇక్కడ స్థానం లేదు. చట్టవిరుద్ధంగా గోడలపై రాసే రాతలను చెరిపేస్తాం. ఇప్పటికే అనేక దేరాలను తొలగించాం' అని శుక్రవారం ఆయన వ్యాఖ్యానించారు. నగరాన్ని శుభ్రం చేయడంలో మేయర్ బౌజర్ చేస్తున్న కృషిని ట్రంప్ ప్రశంసించారు. 'అమెరికా విదేశాంగ శాఖ భవనం ఎదుట దేరాలు ఉన్నాయి. వాటిని తొలగించాల్సి ఉంది. కొన్నింటిని ఇప్పటికే తొలగించడం జరిగింది. రాజధాని అంటే ప్రపంచం గొప్పగా చెప్పుకునేలా ఉండాలి. ఇటీవల భారత ప్రధాని, ఫ్రాన్స్ అధ్యక్షుడు, బ్రిటన్ ప్రధాని...వారంతా నన్ను చూడడానికి వచ్చారు. వాళ్లు ప్రభుత్వ భవనాల సమీపంలో ఉన్న దేరాలను చూడాలని నేను కోరుకోవడం లేదు. అలాగే గోడలపై రాతలు చూడాలని అనుకోవడం లేదు. రోడ్లపై అడ్డుగా ఉన్న బారికేడ్లు, గుంతలు చూడాలని కూడా భావించడం లేదు. నగరాన్ని అందంగా ఉంచాలన్నదే మా ఆకాంక్ష' అని ట్రంప్ చెప్పుకొచ్చారు. నేరాలకు తావులేని నగరాన్ని తాము కోరుకుంటున్నామని, ఇక్కడికి వచ్చే ప్రజలు దోపిడీకి, కాల్పులకు, అత్యాచారాలకు గురికాకూడదని అన్నారు. వారికి నేర రహిత రాజధాని స్వాగతం పలకాలని, అది శుభ్రంగా, స్వచ్ఛంగా, సురక్షితమైనదిగా ఉండాలని ట్రంప్ అభిప్రాయ పడ్డారు.గత నెల 13న ప్రధాని మోడీ అమెరికాలో పర్యటించి ట్రంప్‌తో ద్వైపాక్షిక సమావేశం జరిపారు. జనవరిలో ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆ దేశంలో పర్యటించిన నాలుగో విదేశీ నేత మోడీయే. ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ, జపాన్ ప్రధాని షిగెరు ఇషిబా, జోర్డాన్ రాజు అబ్దుల్లా-2 కూడా అమెరికాలో పర్యటించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, బ్రిటన్ ప్రధాని స్టార్మర్ కూడా అమెరికాలో పర్యటించి ట్రంప్‌తో సమావేశమయ్యారు.

నితీశ్‌కు లైన్ క్లియర్

ఐపీఎల్‌లో ఆడేందుకు గ్రీన్ సిగ్నల్

బెంగళూర్ : భారత యువ ఆల్‌రౌండర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ కీలక ఆటగాడు నితీశ్ కుమార్ రెడ్డి పూర్తి ఫిట్‌నెస్ సాధించాడు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ తర్వాత గాయంతో ఆటకు దూరంగా ఉన్న నితీశ్ కుమార్ రెడ్డి ఐపీఎల్18లో ఆడేందుకు లైన్ క్లియర్ చేసుకున్నాడు. బెంగళూర్‌లోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో శనివారం జరిగిన యోయో టెస్టులో నితీశ్ కుమార్ పాసయ్యాడు. కనీస పాస్ స్కోరు 16.5 కాగా.. నితీశ్ కుమార్ రెడ్డి 18 స్కోరు సాధించినట్టు సమాచారం. శుక్రవారం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో జరిగిన ప్రాక్టీస్ మ్యాచ్‌లో నితీశ్ కుమార్ బ్యాటింగ్, బౌలింగ్ ఎటువంటి అసౌకర్యం లేకుండా చేసినట్టు తెలిసింది. నితీశ్ కుమార్ రెడ్డి తొలుత మూడు వారాల రిహాబిలిటేషన్ కోసం బెంగళూర్‌కు వెళ్లినా.. రెండు వారాల్లోనే వంద శాతం ఫిట్‌నెస్ సాధించాడు. యోయో టెస్టులో పాస్ కావటంతో ఐపీఎల్ ఫ్రాంచైజీ సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున ఆడేందుకు గ్రీన్ సిగ్నల్ లభించింది. గత సీజన్ ఐపీఎల్‌లో నితీశ్ కుమార్ రెడ్డి అద్భుత ప్రదర్శన చేశాడు. 142.92 స్ట్రయికరేట్‌తో 303 పరుగులు చేశాడు. బంతితో మాత్రం 11.62 ఎకానమీతో 3 వికెట్లే తీసుకున్నాడు. బౌలింగ్‌ను మరింత మెరుగుపర్చుకునేందుకు భారత మాజీ బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్ వద్ద శిక్షణ తీసుకునేందుకు చెన్నైకి వెళ్లాలని భావించినా.. గాయం కారణంగా అది సాధ్య పడలేదు. భారత టెస్టు జట్టు ప్రణాళికల్లో నితీశ్ కుమార్ రెడ్డి కీలక ఆటగాడు. ఐపీఎల్ ముగిసిన వెంటనే ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్ ఉండటంతో.. నితీశ్ ఫిట్‌నెస్‌పై సీజన్ బోర్డు పర్యవేక్షణ కొనసాగనుంది.

నేటి నుంచి క్యాంప్ :

ఐపీఎల్ 2024 ఫైనలిస్ట్ సన్‌రైజర్స్ హైదరాబాద్ ఈ సీజన్ కోసం సన్నద్ధమవుతోంది. కొందరు ఆటగాళ్లు ఈ నెల ఆరంభం నుంచే ఉప్పల్ స్టేడియంలో సాధన చేస్తుండగా.. ప్రీ సీజన్ శిక్షణ శిబిరం ఆదివారం నుంచి ఆరంభం కానుంది. నితీశ్ కుమార్ రెడ్డి సహా కెప్టెన్ పాట్ కమిన్స్, ట్రావిశ్ హెడ్, హెన్రిచ్ క్లాసెన్‌లు నేడు సన్‌రైజర్స్ శిబిరంలో చేరనున్నారు. ఈ నెల 23న సొంతగడ్డపై సన్‌రైజర్స్ తొలి మ్యాచ్ ఆడనుంది. తొలి సీజన్ చాంపియన్ రాజస్థాన్ రాయల్స్‌తో సన్‌రైజర్స్ తలపడనుంది. దీంతో వారం రోజుల పాటు సన్‌రైజర్స్ ఆటగాళ్లు శిక్షణ శిబిరంలో కఠోరంగా సాధన చేయనున్నారు.



స్వైటెక్‌కు షాక్

- సెమీస్‌లో అంద్రీవ చేతిలో ఓటమి
- ఇండియన్ వెల్స్ ఓపెన్ టెన్నిస్



ఇండియన్‌వెల్స్ (యుఎస్‌ఏ) : ఇండియన్స్ వెల్స్ ఓపెన్‌లో వరల్డ్ నం.2 ఇగా స్వైటెక్ (పోలాండ్)కు చుక్కెదురైంది. రష్యా యువ సంచలనం మిర్రా అంద్రీవ మూడు సెట్ల మ్యాచ్‌లో స్వైటెక్‌పై మెరుపు విజయం సాధించింది. మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో ఇగా స్వైటెక్‌పై 7-6(7-1), 1-6, 6-3తో అంద్రీవ పైచేయి సాధించింది. తొలి సెట్‌ను టైబ్రేకర్‌లో దక్కించుకున్న అంద్రీవ రెండో సెట్లో తేలిపోయింది. నిర్ణయాత్మక మూడో సెట్లో 6-3తో స్వైటెక్‌ను వెనక్కి నెట్టేసింది. ఇగా స్వైటెక్ ఐదు బ్రేక్ పాయింట్లు సాధించినా.. తను నెగ్గిన రెండో సెట్లోనే ఆమె ఆధిపత్యం కనిపించింది. నాలుగు బ్రేక్ పాయింట్లతో మెరిసిన అంద్రీవ తొలి, మూడో సెట్లో విజయంతో ఫైనల్లోకి ప్రవేశించింది. పాయింట్ల పరంగా 83-91తో, గేముల పరంగా 14-15తో అంద్రీవ వెనుకంజ వేసినా.. కీలక సెట్లలో గెలుపొంది టైటిల్ పోరుకు చేరుకుంది. మరో సెమీఫైనల్లో మడిసన్ కీస్‌పై సబలెంక 6-0, 6-1తో ఏకపక్ష విజయం నమోదు చేసింది. నేడు టైటిల్ వేటలో అంద్రీవ, సబలెంక అమీతుమీ తేల్చుకోనున్నారు.

మెరిసిన మెక్‌లారెన్స్

అర్హత రేసులో నోరిస్, ఆస్కార్ ముందంజ
ఆస్ట్రేలియన్ గ్రాండ్ ప్రీ ఫార్ములా వన్



మెల్‌బోర్న్ (ఆస్ట్రేలియా) : సీజన్ తొలి రేసు ముంగిట మెక్‌లారెన్స్ డ్రైవర్లు లాండో నోరిస్ (గ్రేట్ బ్రిటన్), ఆస్కార్ పియాస్ట్రిలు (ఆస్ట్రేలియా) మెరుపు వేగంతో దూసుకెళ్లారు. మెల్‌బోర్న్‌లోని ఫార్ములా వన్ సర్క్యూట్‌లో శనివారం జరిగిన అర్హత రౌండ్‌లో నోరిస్, పియాస్ట్రిలు తొలి రెండు స్థానాలు సాధించారు. లేక్‌సైడ్ ల్యాప్‌ను 1.15.096 (ఒక నిమిషం, 15 సెకండ్లు, 096 మిల్లీ సెకండ్లు) టైమ్‌లోనే పూర్తి చేసిన లాండో నోరిస్.. సహచర మెక్‌లారెన్ డ్రైవర్ ఆస్కార్ పియాస్ట్రి కంటే ముందుగానే రేసును ముగించాడు. రెడ్‌బుల్ డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ మూడో స్థానంలో నిలువగా.. లూయిస్ హామిల్టన్ ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. ఆస్ట్రేలియన్ గ్రాండ్ ప్రీ ప్రధాన రేసు నేడు ఉదయం ఆరంభం కానుండగా.. లాండో నోరిస్, ఆస్కార్ పియాస్ట్రి, మాక్స్ వెర్‌స్టాపెన్‌లు గ్రిడ్‌లో తొలి మూడు స్థానాల నుంచి రేసును మొదలెట్టనున్నారు. 2024లో నాలుగు రేసులు గెలుపొందిన నోరిస్ టైటిల్‌పై కన్నేసి నేడు మెక్‌లారెన్ కారు ఎక్సలేటర్ తొక్కనున్నాడు.

నవచిత్రం

సరికొత్త అనుభూతినిచ్చే 'మోగ్లీ..'

తొలి చిత్రం 'బబుల్ గమ్'లో తన నటనతో అలరించిన హీరో రోషన్ కనకాల ప్రస్తుతం 'మోగ్లీ 2025'లో నటిస్తున్నారు.
ఈ చిత్రానికి 'కలర్ ఫోటో' డైరెక్టర్ సందీప్ రాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్ర రెగ్యులర్ చిత్రీకరణ గత నెలలో ప్రారంభమైంది.
శనివారం రోషన్ కనకాల పుట్టినరోజు. ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ నిర్మాతలు ఒక కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఇంటెన్స్ లుక్, మెడలో గొలుసులా వేలాడుతున్న గద, చేతి చుట్టూ చుట్టబడిన వస్త్రం, అతని పాత్ర తాలూకా వ్యక్తిత్వాన్ని ఎలివేట్ చేస్తుంది. అంతేకాదు ఆయన పాత్ర యాక్షన్-ప్యాక్డ్ స్వభావాన్ని కలిగి ఉందని కూడా సూచిస్తోంది.
సినిమా గ్లింప్స్ రోషన్‌ను హై-ఆక్టేన్ యాక్షన్ అవతార్‌లో చూపించింది. ఈ చిత్రంతో సాక్షి సాగర్ మడోల్కర్ హీరోయిన్‌గా ఆరంగేట్రం చేస్తున్నారు. ఈ సినిమా సినీ ప్రేక్షకులకు ఒక గొప్ప సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ అందించబోతోంది. ఈ సంవత్సరం చివర్లో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.
ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: సందీప్ రాజ్, నిర్మాతలు: టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్, సంగీతం: కాల భైరవ, డిఓపి: రామ మారుతి ఎం, ఎడిటర్: కోదాటి పవన్ కళ్యాణ్, ఆర్ట్: కిరణ్ మామిడి, యాక్షన్: నటరాజ్ మాడిగొండ, సహ రచయితలు: రామ మారుతి, రాధాకృష్ణ రెడ్డి.



రోషన్ కనకాల



సప్తగిరి, ప్రియాంక శర్మ

ఆద్యంతం వినోదాత్మకం

'పెళ్లి కాని ప్రసాద్'గా హీరో సప్తగిరి ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. అభిలాష్ రెడ్డి గోపిడి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని థామ మీడియా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై విజన్ గ్రూప్ కె.వై.బాబు, భాను ప్రకాష్ గౌడ్, సుక్కా వెంకటేశ్వర్ గౌడ్, వైభవ్ రెడ్డి ముత్యాల కలిసి నిర్మించారు. చాగంటి సినిమాటిక్ వరల్డ్ సమర్పిస్తోంది.
దిల్ రాజు నేతృత్వంలోని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తోంది. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్ సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేశాయి. ఈ సినిమా ఈనెల 21న థియేటర్లలోకి రానుంది.
ఈ సందర్భంగా హీరో సప్తగిరి మాట్లాడుతూ,'ఈ సినిమా కోసం మాకు మేము ఒక ఎగ్జామ్ రాసుకున్నాం. నా మనస్సాక్షిగా 100% మంచి మార్కులు వేసుకున్నాను. ఈ సినిమాకి ఆడియన్స్ దగ్గర కూడా మంచి మార్కులు పడతాయని ఆశిస్తున్నాను. సినిమా చాలా బాగా వచ్చింది. 21న మీరంతా సినిమా చూసి జెన్యూన్‌గా రివ్యూ ఇస్తారని కోరుకుంటున్నాను. హీరోయిన్‌గా నటించిన ప్రియాంక శర్మ, అన్నపూర్ణమ్మ ప్రమోదిని.. మిగతా నటులంతా ఈ సినిమాలో చేసే హడావిడి తప్పకుండా మిమ్మల్ని కడుపుబ్బా నవ్విస్తుంది. ఇందులో నేను నటించిన మురళి గౌడ్ క్యారెక్టర్‌లో ఒక సిన్సియారిటీ కనిపిస్తుంది. ఈ సినిమా మంచి ఫన్ బ్లాస్ట్‌గా ఉంటుంది. నిర్మాతలు ఎక్కడా కూడా రాజీపడకుండా చాలా గ్రాండ్‌గా నిర్మించారు. డైరెక్టర్ అభిలాష్ రెడ్డి ఆడియన్స్ అందరు కూడా గొప్పగా మాట్లాడే సినిమా తీశారు. ఎస్‌విసీ లాంటి గొప్ప బ్యానర్‌లో ఈ సినిమా రిలీజ్ కావడం మా అదృష్టం. అందరికీ మంచి పేరు తీసుకొచ్చే సినిమా చేశాను' అని తెలిపారు. 'మా ప్రొడ్యూసర్ లేకపోతే ఈ సినిమా లేదు. అందర్నీ ఎంటర్‌టైన్ చేసే సినిమా ఇది' అని డైరెక్టర్ అభిలాష్ రెడ్డి చెప్పారు.

అతిథి పాత్రలో డేవిడ్ వార్నర్



డేవిడ్ వార్నర్


హీరో నితిన్ నటించిన తాజా చిత్రం 'రాబిన్ హుడ్'. వెంకీ కుడుముల దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈనెల 28న థియేటర్లలో విడుదలకు సిద్ధంగా ఉంది. మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్. ఈ చిత్రంలో ఆస్ట్రేలియా డైనమిక్ క్రికెటర్ డేవిడ్ వార్నర్ ఒక ప్రత్యేక అతిథి పాత్రలో నటించారు. ఈ చిత్రం నుండి ఆయన ఫస్ట్ లుక్‌ని మేకర్స్ శనివారం రిలీజ్ చేశారు.
డేవిడ్ వార్నర్ షార్ట్ హెయిర్ కట్‌లో, ట్రెండీ దుస్తులు ధరించి పోస్టర్‌లో ఫుల్ స్వాగ్‌తో ఆకట్టుకున్నారు. ఆయన చిరునవ్వు, కూల్ ఎక్స్‌ప్రెషన్ ఎట్రాక్టివ్‌గా ఉన్నాయి. ఇందులో వార్నర్ పాత్ర అతిథి పాత్ర అయినప్పటికీ, ఆయనకి ఉన్న ప్రపంచ ప్రజాదరణ, మ్యాసీవ్ సోషల్ మీడియా ఫాలోయింగ్ ఆయన ప్రజెన్స్ గ్రేట్ ఇంపాక్ట్ క్రియేట్ చేస్తుంది. ఈ చిత్రంతో ఆయన అసోషియేషన్ భారీ సంఖ్యలో ప్రేక్షకులను అలరించనుంది.
ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను త్వరలో విడుదల చేయనున్నారు మేకర్స్. సినిమా విడుదల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ అంతటా ప్రమోషనల్ టూర్‌లో చిత్ర బృందం చురుకుగా పాల్గొంటోంది.
ఇందులో భాగంగా శనివారం రాజమండ్రిలో ప్రచార కార్యక్రమాలను నిర్వహించారు. నేడు(ఆదివారం) కాకినాడలో పర్యటించ నున్నారు. రాజేంద్ర ప్రసాద్, వెన్నెల కిషోర్, కేతిక శర్మ (స్పెషల్ సాంగ్) తదితరులు నటించిన ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: వెంకీ కుడుముల, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై రవిశంకర్, సంగీతం: జివి ప్రకాష్ కుమార్, డీఓపీ : సాయి శ్రీరామ్, ఎడిటర్: కోటి, ఆర్ట్ డైరెక్టర్: రామ్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: హరి తుమ్మల, లైన్ ప్రొడ్యూసర్: కిరణ్ బళ్లపల్లి, ఫైట్స్: రామ్-లక్ష్మణ్, రవివర్మ విక్రమ్ మోర్.



విభిన్న పొయెటిక్ లవ్‌స్టోరీ..

వినయ్ కుమార్, శ్రావణి మజ్జరి, అరవింద్ ముదిగొండ, నోమిన తార ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'కాలమేగా కరిగింది'.
ఈ సినిమాను శింగర క్రియేటివ్ వర్క్స్ బ్యానర్ పై మరే శివశంకర్ నిర్మించారు. శింగర మోహన్ దర్శకుడు. పొయెటిక్ లవ్‌స్టోరీగా తెరకెక్కిన ఈ సినిమా ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో శనివారం ఈచిత్ర ట్రైలర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు.
ఫణి, బిందు విద్యార్థులుగా ఉన్నప్పటి నుంచి ప్రేమికులు. అమాయకత్వం నిండిన స్వచ్ఛమైన ప్రేమ వారికి ఎంతో సంతోషాన్నిస్తుంది. తమ ప్రేమే లోకంగా జీవిస్తుంటారు ఇద్దరు. కలహాలే లేని ఈ ప్రేమ కథను కాలం విడదీస్తే ఆ జ్ఞాపకాలు వెతుక్కుంటూ హీరో ఫణి ప్రయాణం సాగిస్తాడు. బిందుతో కలిసి చదువుకున్న స్కూల్, తామిద్దరు మాట్లాడుకున్న ప్లేస్‌లు...అన్నింటిలో ప్రేమను గుర్తుల్ని పోగేసుకుంటాడు. ఈ ప్రేమికులు తిరిగి ఎలా కలిశారు అనేది ట్రైలర్‌లో ఆసక్తిని కలిగించింది.
ఈ ప్లెజంట్ లవ్ స్టోరీని పొయెటిక్‌గా అందంగా రూపొందించారు దర్శకుడు శింగర మోహన్. గుడప్పన్ బ్యూటిఫుల్ మ్యూజిక్ ట్రైలర్‌లో ఆకట్టుకుంది. అంతేకాదు సినిమా చూడాలనే ఆసక్తిని ఈ ట్రైలర్ మరింతగా పెంచిందని అని చిత్ర యూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం - సింగార మోహన్, డీవోపీ - వినీత్ పబ్బతి, ఎడిటర్ - రా యోగేష్, మ్యూజిక్ డైరెక్టర్ - గుడప్పన్.

'అనగనగా ఆస్ట్రేలియాలో..'



తారక రామ

సహాన ఆర్ట్స్ క్రియేషన్స్ బ్యానర్ పై బి.టి.ఆర్ శ్రీనివాస్ నిర్మాణ సారథ్యంలో తారక రామ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అనగనగా ఆస్ట్రేలియాలో..'. తాజాగా ఈ చిత్ర ట్రైలర్‌ను రిలీజ్ చేశారు.
ఈ మూవీ ట్రైలర్ చాలా ఆసక్తిగా ఉంది. చాలా రోజుల తరువాత మంచి థ్రిల్లర్‌ను చూడబోతున్నట్లు ట్రైలర్ చూస్తే అర్థం అవుతుంది. హాలీవుడ్ గడ్డపై తీయడమే కాదు, సినిమాలోనూ హాలీవుడ్ మేకింగ్ కనిపిస్తుంది. యదార్థ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించడం కూడా చాలా ఆసక్తికరంగా ఉంది. మనదగ్గర ఎలాంటి సంఘటనలు జరుగుతాయో మనకు ఒక ఆలోచన ఉంటుంది. కానీ విదేశాల్లో జరిగే సంఘటనలు ఎలా ఉండబోతాయో తెలియాలంటే ఈనెల 21 వరకు వేచి చూడాల్సిందే అని అంటున్నారు మేకర్స్.
ఎంతో వినూత్నంగా జరిగిన ఈ ట్రైలర్ రిలీజ్ వేడుకలో రచయిత, దర్శకుడు తారక రామ మాట్లాడుతూ, 'ఈ సినిమా చిత్రీకరణ మొత్తం ఆస్ట్రేలియాలోనే చేశాం. అలాగే ఇందులోని నటీనటులు, సాంకేతిక నిపుణులు అందరూ తెలుగు వారే. తెలుగు వాడిని అయిన నేను ఆస్ట్రేలియాలో ఐటీ జాబ్ చేసుకుంటూ అక్కడే సెటిల్ అయ్యాను. చిన్నతనం నుంచి సినిమాలపై ఇష్టంతో జాబ్ చేసుకుంటూనే, ఫిల్మ్ కోర్స్‌లో మాస్టర్స్ చేశాను. సినిమాపై ఉన్న ఇష్టమే నన్ను ఈ సినిమా తీసేలా చేసింది. ఆస్ట్రేలియాలోని మెల్ బోర్న్ వాతావరణం చాలా వింతగా ఉంటుంది. అలాంటి పరిస్థితుల్లో సినిమా చేయడం చాలా కష్టమైనప్పటికీ ఈ చిత్రాన్ని పూర్తి చేయడం సంతోషంగా ఉంది. 122 రోజుల్లో 83 లోకేషన్స్‌లో చిత్రీకరణ పూర్తి చేశాం. ఈ నెల 21న కేవలం తెలుగులోనే రిలీజ్ చేస్తున్నాం' అని అన్నారు.
ఈ చిత్రానికి నిర్మాత: బి టి ఆర్ శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : మాధవి మంగపాటి, సంగీతం: యూ వి నిరంజన్, డిఓపి : అరుణ్ దొండపాటి, ఎడిటింగ్ : తారక రామ.

'రాజుగారి దొంగలు' రిలీజ్‌కి రెడీ

లోహిత్ కల్యాణ్, రాజేష్ కుంచాడా, జోషిత్ రాజ్ కుమార్, కైలాష్ వేలాయుధన్, పూజా విశ్వేశ్వర్, టీవీ రామన్, ఆర్కే నాయుడు ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'రాజు గారి దొంగలు'.
ఈ చిత్రాన్ని నడిమింటి లిఖిత సమర్పణలో హిటాసో ఫిలిం కంపెనీ బ్యానర్ పై నడిమింటి బంగారు నాయుడు నిర్మించారు. దర్శకుడు లోకేష్ రనాల్ హిటాసో రూపొందించారు.
ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఈనెల 21న ప్రపంచం వ్యాప్తంగా విడుదలకు సిద్ధమైంది.
ఈ సందర్భంగా దర్శకుడు లోకేష్ రనాల్ హిటాసో మాట్లాడుతూ,'మంచి వైవిధ్యమైన కథతో సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇప్పటివరకు ఎన్నో సస్పెన్స్ థ్రిల్లర్లను ప్రేక్షకులు చూశారు. వాటితో పోలిస్తే ఈ సినిమా చాలా వైవిధ్యంగా ఉంటుంది. సినిమా ప్రారంభం నుంచే ప్రేక్షకుల్ని లీనమయ్యేలా చేస్తుంది. అలాగే ఈ సినిమాకి 'రాజుగారి దొంగలు' అనే టైటిల్‌ని ఎందుకు పెట్టామనేది మాటల్లో కంటే వెండితెరపై చూస్తేనే మాజా వస్తుంది. సరికొత్త కథ, కథనాలు, స్క్రీన్‌ప్లే ప్రేక్షకుల్ని మెస్మరైజ్ చేస్తామనే నమ్మకం ఉంది. అలాగే అన్ని వర్గాలకు కావాల్సిన అన్ని అంశాలు ఉన్న మా చిత్రాన్ని ఆదరించాలని కోరుకుంటున్నాం' అని అన్నారు.
ఈ చిత్రానికి డీవోపీ : సందీప్ బదుల, ప్రకాష్ రెడ్డి, స్టోరీ రైటర్స్ : సుమంత్ పల్లాటి, సూరాడ బ్రహ్మ విజయ్, మ్యూజిక్ : నాఫల్ రాజా ఏఐఎస్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : రాజవంశీ, సమర్పణ : నడిమింటి లిఖిత, నిర్మాత : నడిమింటి బంగారునాయుడు.



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

రైలు హైజాక్‌లో షాకింగ్

- 214మంది పాక్ సైనికులను హతమార్చాం: బెలూచ్ తిరుగుబాటుదారుల వెల్లడి
- పాక్ సర్కారు 'ఆపరేషన్ సక్సెస్' ప్రకటనకు ఖండన



ఇస్లామాబాద్ : పాకిస్థాన్‌లోని వేర్పాటువాద బెలూచ్ తిరుగుబాటుదారులు జరిపిన ప్యాసింజర్ రైలు హైజాక్ ఘటన విషాదాంతంగా ముగిసినట్టు తెలుస్తున్నది. ఈ మేరకు బెలూచ్ లిబరేషన్ ఆర్మీ(బీఎల్ఏ) కీలక ప్రకటన చేసింది. తమ రాజకీయ ఖైదీలను విడుదల చేసేందుకు పాకిస్థాన్ ప్రభుత్వానికి ఇచ్చిన సమయం ముగియడంతో తమ చెరలో ఉన్న 214 మంది పాక్ సైన్యాన్ని చంపేసామని వివరించింది. ఆపరేషన్ విజయవంతంగా ముగిసిందంటూ పాక్ ప్రభుత్వం చేసిన ప్రకటనను కూడా బీఎల్ఏ ఖండించింది. ఆ దేశ మిలిటరీ అహంకారాన్ని, మొండి వైఖరిని తప్పుబట్టింది. "మా రాజకీయ ఖైదీల విడుదలకు పాకిస్థాన్ సైన్యానికి 48 గంటల సమయం ఇచ్చాం. మా చెరలో బందీలుగా ఉన్న వారిని రక్షించుకునేందుకు సైన్యానికి మేమిచ్చిన చివరి అవకాశం. కానీ, పాక్ తన మొండితనాన్ని, సైనిక దురహంకారాన్ని ప్రదర్శించింది. ఫలితంగా శత్రు సైన్యానికి చెందిన 214 మందిని మేం హతమార్చాం. బీఎల్ఏ ఎప్పుడూ అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగానే వ్యవహరిస్తుంది. అయితే ఇస్లామాబాద్ సైన్యం తమ సిబ్బందిని కాపాడుకునేందుకు బదులుగా మాతో పోరాడాలని ప్రయత్నించింది. ఫలితంగా బందీలను కోల్పోయింది. జాఫర్ ఎక్స్‌ప్రెస్ బోగిల్లోని బందీలను రక్షించేందుకు పాకిస్థాన్‌లోని ఎస్ఎస్‌జీ కమాండోలు రాగానే మా యోధులు వారిని చుట్టిముట్టి భీకర దాడి చేశారు. గంటల పాటు సాగిన ఈ దాడుల్లో పలువురు బందీలను ఉరితీయగా.. ఎస్ఎస్‌జీ కమాండోలు భారీ ప్రాణనష్టాన్ని చవిచూశారు. మా వాళ్లు చివరి బుల్లెట్ వరకు పోరాడారు. చనిపోయిన తిరుగుబాటుదారుల మృతదేహాలను చూపించి విజయం సాధించామని ఇస్లామాబాద్ ప్రభుత్వం వాస్తవాలను కూడా కప్పిపుచ్చుతోంది. సైన్యం, ఇంటెలిజెన్స్ బృందం ఉన్నప్పటికీ బందీలను రక్షించుకోవడంలో శత్రు సైన్యం విఫలమైంది. యుద్ధ సూత్రాలకు కట్టుబడి మేం విడుదల చేసిన వారిని కాపాడినట్టు ప్రకటించుకుంటుంది. ఈ యుద్ధం ఇంకా ముగియలేదు. బెలూచ్ యోధులు వివిధ ప్రాంతాల్లో మెరుపుదాడులతో ఆక్రమిత సైన్యాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఈ ఆపరేషన్‌లో బెలూచ్ విజయం సాధించింది" అని మిలిటెంట్ సంస్థ పేర్కొన్నది. హైజాక్ సమయంలో మరణించిన బీఎల్ఏ సభ్యులకు మిలిటెంట్ సంస్థ నివాళులర్పించింది.

పాక్‌లోని క్వెట్టా నుంచి పెషావర్‌కు 440 మంది ప్రయాణికులతో వెళ్తున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను బెలూచ్ వేర్పాటువాదులు మంగళవారం హైజాక్ చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 26 మంది బందీలు మరణించగా.. దాదాపు 33 మంది వేర్పాటువాదులను మట్టుబెట్టి మిగతా ప్రయాణికులు అందరినీ సురక్షితంగా విడిపించామని పాకిస్థాన్ సైన్యం ప్రకటించింది. బెలూచ్ మిలిటెంట్లు చంపిన 26 మంది బందీల్లో 18 మంది సైనికులని పాక్ ఆర్మీ కూడా పేర్కొన్నది. ఈ ఆపరేషన్ విజయవంతంగా ముగిసినట్టు ప్రకటన కూడా విడుదల చేసింది. అయితే, బెలూచ్ మిలిటెంట్లు ఇందుకు విరుద్ధంగా పేర్కొన్నారు. పాక్ ప్రకటనను ఖండించటం గమనార్హం.

తెలంగాణ అస్థిత్వంపై కాంగ్రెస్ దాడి

- ఉద్యమ తల్లి రూపాన్ని మార్చడం చారిత్రక తప్పిదం :బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ అస్థిత్వంపై కాంగ్రెస్ సర్కార్ దాడికి పాల్పడుతోందని ఎమ్మెల్సీ కవిత ఆందోళన వ్యక్తం చేశారు. గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం సందర్భంగా శనివారం ఆమె శాసనమండలిలో మాట్లాడుతూ ఉద్యమ సమయంలో ప్రజలు స్వచ్ఛందంగా ఆవిష్కరించిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడం చారిత్రక తప్పిదమని అన్నారు. జయజయహే గీతానికి మ్యూజిక్ డైరెక్టర్‌గా ఆంధ్రా వ్యక్తులకు అవకాశం కల్పించడాన్ని ఆమె తప్పుపట్టారు. తెంగాణ ఉద్యమ గొంతుక దాశరథి శతజయంతిని ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. ఉద్యమ నేపథ్యం లేని వ్యక్తి ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండటం వల్లే ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శించారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదనే వాదనను ఆమె తప్పు పట్టారు. 2014లో 60 లక్షల మెట్రిక్ టన్నులున్న వరి దిగుబడి ప్రస్తుతం 2.60 లక్షల మెట్రిక్ టన్నులకు చేరడం అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. తెలంగాణలో ఈ రంగంపై మెజార్టీ ప్రజలు ఆధారపడి ఉన్నారన్న విషయాన్ని మర్చి పోరాదని గుర్తు చేశారు. కాంగ్రెస్ సర్కార్ గవర్నర్ చేత నిండు సభలో పచ్చి అబద్ధాలు మాట్లాడించిందని ఆరోపించారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, సన్నాలకు రూ.500 బోనస్, సబ్సిడీ గ్యాస్ తదితర పథకాలు సగం కూడా అమలు కాలేదని గుర్తు చేశారు. కులగణన రిపోర్టును గ్రామాల వారీగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణకు సంబంధించి షమీమ అక్తర్ నివేదికను బహిర్గత పర్చాలని కోరారు.

సభలో న్యూసెన్స్ రగడ

మండలిలో న్యూసెన్స్ అనే పదం వాడటంపై ఎమ్మెల్సీ కవిత అభ్యంతరం వ్యక్తంచేశారు. గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదతీర్మానం సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతున్న సమయంలో బీఆర్ఎస్ సభ్యులు తాతా మధు పలుమార్లు అడ్డుతగిలారు."రోజూ న్యూసెన్స్ చేస్తు న్నావ్.. ఏందయ్యా నీ లొల్లి అని మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అసహనం ప్రదర్శించారు. సభలో సభ్యుడిని ఉద్దేశించి మీరు న్యూసెన్స్ అనే పదం వాడారనీ, ఆ పదాన్ని రికార్డుల నుంచి తొలగించాలని చైర్మెన్‌ను కోరారు. ఆ పదం అన్ పార్లమెంట్ అయితే తాను రికార్డుల నుంచి తొలగిస్తానని గుత్తా చెప్పడంతో వివాదం ముగిసింది.

ప్రభుత్వానికి ధన్యవాదాలు : ఎమ్మెల్సీ మల్లన్న

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయం తీసుకున్నందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ధన్యవాదాలు తెలిపారు. శనివారం గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాల తీర్మానంపై ముఖ్యమంత్రి సమాధానం ఇచ్చిన అనంతరం తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ తాను లెక్కల జోలికి పోదలుచుకోలేదనీ, ప్రభుత్వ లెక్కలను గౌరవిస్తున్నట్టు తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్‌లకు బీసీలపై ప్రేముంటే 42 శాతం రిజర్వేషన్ కోసం అఖిల పక్షంతో మోడీ దగ్గరికి రావాలన్నారు. బీసీల్లోని ఆయా కులాల వారీగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం జరిగిన కేటాయింపులు, ఖర్చుల్లో తేడాలున్నాయని విమర్శించారు. కామారెడ్డి డిక్లరేషన్ చెప్పినట్టు ప్రతి ఏడాది బీసీలకు రూ.20 వేల కోట్లు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గతేడాది రూ.9 వేల కోట్లు మాత్రమే కేటాయించారని గుర్తు చేశారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ మాదిరిగా బీసీ సబ్ ప్లాన్ అమలు చేయాలన్నారు. ప్రభుత్వ కాంట్రాక్టుల్లో బీసీలకు 42 శాతం ఇస్తామన్న కాంగ్రెస్ హామీ గవర్నర్ ప్రసంగంలో కనిపించలేదని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలకు కాపలాదారులేరి? : ఏవీఎన్ రెడ్డి

ప్రభుత్వ పాఠశాలలకు కాపలాదారులు లేక అసాంఘిక శక్తులు ఉపయోగించుకుంటున్నాయని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కాంపౌండ్ వాల్స్ నిర్మించి కాపలాదారులను నియమించాలని డిమాండ్ చేశారు.

రాజీనామాకు సిద్ధం : మంత్రి జూపల్లి కృష్ణారావు

గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు, వాటికి తాము కడుతున్న వడ్డీలకు సంబంధించిన లెక్కలు తప్పైతే తాను రాజీనామా చేస్తానని మంత్రి జూపల్లి కృష్ణారావు సవాల్ విసిరారు. శాసనమండలిలో ప్రత్యేక ప్రస్తావన సమయంలో సభ్యులకు సమాధానమిస్తూ మంత్రి, గణాంకాలను వివరించారు.

కార్పొరేట్ ఆస్పత్రుల్లో అమలుకు చర్యలు : బల్మూరి వెంకట్

రాజీవ్ ఆరోగ్యశ్రీని అన్ని కార్పొరేట్ ఆస్పత్రులు, ప్రయివేటు ఆస్పత్రులు అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొన్ని ఆస్పత్రులు రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద చికిత్స చేసేందుకు నిరాకరిస్తుండటంతో ఆ పథకం అసలు ఉద్దేశం నెరవేరదని ఆందోళన వ్యక్తం చేశారు.

అందరికి గొర్రెలు ఇవ్వాలి : యెగ్గే మల్లేశం

రాష్ట్రంలో అర్హులైన వారందరికి గొర్రెలను అందజేయాలని ఎమ్మెల్సీ యెగ్గే మల్లేశం కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొంత మందికి ఇచ్చిందనీ, మిగిలిన వారికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వాలని కోరారు. అదే విధంగా ఒగ్గు కళాకారులతో సాంస్కృతిక విభాగం ఏర్పాటు చేయాలని కోరారు.

సమాఖ్య బస్సులకు వడ్డీ
ప్రభుత్వమే చెల్లించాలి

- ఆర్టీసీపై ఆర్థికభారం వేయొద్దు : రవాణా మంత్రికి టీజీఎస్ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ విజ్ఞప్తి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆర్టీసీలో ప్రవేశపెడుతున్న మహిళా సమాఖ్య బస్సుల వడ్డీని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని టీజీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మెయిల్ ద్వారా వినతిపత్రం పంపినట్టు ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరాంజనేయులు, వీఎస్ రావు తెలిపారు. బ్యాంకులు 9శాతం వడ్డీకే అప్పులు ఇస్తుంటే మండల మహిళా సమాఖ్యలకు 15 శాతం వడ్డీతో ఆర్టీసి చెల్లించాలని చెప్పడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ద్వారా ఆర్టీసికి ఆ సొమ్మును చెల్లిస్తామని హామీ ఇవ్వాలని కోరారు. బస్సు ఖరీదును రూ.36 లక్షలుగా అంచనా వేశారనీ, ఏడేండ్లపాటు 15 శాతం వడ్డీతో ఇఎంఐలు చెల్లించాల్సి ఉంటుందని జీవో నెంబర్ 137లో పేర్కొన్నారని తెలిపారు. 15 శాతం వడ్డీతో చెల్లిస్తే ఒక్కో బస్సు ఖరీదు రూ. 64,86,480 అవుతుందని వివరించారు. ప్రభుత్వం 600బస్సులు కొనుగోలు చేస్తే రూ.216 కోట్లు ఖర్చవుతుందనీ, వడ్డీగా రూ. 173.19 కోట్లు వడ్డీతో కలిపి మొత్తం రూ.389 కోట్లు చెల్లించాల్సి వస్తుందన్నారు. మహిళా సమాఖ్యల ద్వారా బస్సుల్ని ఆర్టీసీనే కొనుగోలు చేస్తుందని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. ఆర్టీసీనే నిర్వహణ కూడా చేపడుతున్నందున కార్మికుల తగ్గింపు ఉండబోదని తాము భావిస్తున్నామన్నారు. ఏడేండ్ల ఈఎమ్‌ఐలు పూర్తయ్యాక బస్సుల యాజమాన్య హక్కులు ఆర్టీసీకే దక్కుతాయో లేదో ప్రభుత్వం వివరణ ఇవ్వాలని కోరారు.

వ్యవసాయ కార్మికోద్యమ నేత
అంబికా ప్రసాద్ మిశ్రా కన్నుమూత



లక్నో : సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు, ఉత్తరప్రదేశ్‌లో వ్యవసాయ కార్మికోద్యమ నేత అంబికా ప్రసాద్ మిశ్రా శనివారం కన్నుమూశారు. ఆయన వయస్సు 93 ఏండ్లు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యూయూ) యూపీ విభాగానికి అనేక సంవత్సరాలు నేతృత్వం వహించిన ఆయన పార్టీలోనూ పలు నాయకత్వ స్థానాల్లో పని చేసి ఉద్యమ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. అంబికా ప్రసాద్ మృతి పట్ల సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ తీవ్ర సంతాపం ప్రకటించింది. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది.

పదోతరగతి బాలికలకు సైకిళ్లు ఇస్తాం

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



నవతెలంగాణ - కరీంనగర్

ప్రభుత్వ పాఠశాలల్లో 10వతరగతి చదువుతూ అవసరం ఉన్న బాలికలు అందరికీ సైకిళ్లను అందిస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ చెప్పారు. మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమం ద్వారా కరీంనగర్ జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓ ఫంక్షన్ హాల్లో శనివారం ప్రభుత్వ పాఠశాలల బాలికలు వంద మందికి సైకిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బేటి బచావో - బేటి పడావో కార్యక్రమం ప్రారంభించి 10సంవత్సరాలు అవుతున్న నేపథ్యంలో సైకిల్ పంపిణీ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఆడపిల్లలు భారం కాదని.. కుటుంబానికి, సమాజానికి భరోసా అని అన్నారు. ఆడపిల్ల పుట్టినప్పటి నుంచి వివాహం అయ్యే వరకు కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. కిశోర శక్తి, బేటీ బచావో - బేటీ పడావో, జన్మోత్సవ్, ముద్ర యోజన వంటి పథకాల ద్వారా ఆడపిల్లలకు అనేక సంక్షేమ పథకాలను అందించిందని వివరించారు. ఆడపిల్ల ఉన్న ఇల్లు పండగ వాతావరణంలో ఉంటుందన్నారు. రాబోయే విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివే ఆడపిల్లలకు సైకిల్స్ అందిస్తామని తెలిపారు. బాలికల హాస్టల్‌లో వాషింగ్ మిషన్ వంటి ఉపకరణాలు అందిస్తామన్నారు. అంతకుముందు పలు శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ.. పాఠశాలకు దూరంగా ఉండి సైకిల్ లేని వారిని గుర్తించి వంద మందికి అందజేస్తున్నామని అన్నారు. ఇందులో 30సైకిళ్లను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందజేసిందని తెలిపారు. జిల్లాలో స్నేహిత కార్యక్రమం ద్వారా కెరియర్ గైడెన్స్, పర్సనాలిటీ డెవలప్మెంట్, సంక్షేమ పథకాలపై బాలికలకు అవగాహన వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అంధుల పాఠశాలలో వాషింగ్ మిషన్లు అందించామని తెలిపారు. జిల్లాలో పదో తరగతి మధ్యలో ఆపేసిన 110 మంది విద్యార్థులను గుర్తించి వారందరికీ పరీక్ష రాయించామని, 90 శాతం మంది ఉత్తీర్ణత సాధించాలని వివరించారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ.. ఆడపిల్లల స్వీయ రక్షణకు పోలీస్ శాఖ తరఫున అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా బాలికలు ప్రదర్శించిన నాటకాలు, నృత్యాలు, ఆలపించిన గేయాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ మెంబర్ శోభారాణి, జిల్లా సంక్షేమ అధికారి సబిత, ఎస్‌బీఐ ఏజీఎం ఎస్.వెంకటేష్ పాల్గొన్నారు.

బాధిత ఆశావర్కర్‌కు న్యాయం చేయాలి

- వేములవాడ ఆరోగ్య కేంద్రం ఎదుట ఆశావర్కర్ల నిరసన



నవతెలంగాణ - వేములవాడ

జగిత్యాల జిల్లాలో ఆశా వర్కర్‌పై లైంగికదాడి ఘటనను నిరసిస్తూ ఆశా వర్కర్స్ యూనియన్, సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం వేములవాడ పట్టణంలోని పీహెచ్‌సీ ఎదుట ఆశా వర్కర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం అశోక్ మాట్లాడుతూ.. ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖలో ఆరోగ్య కార్యకర్తలుగా, ఆశా వర్కర్లుగా ప్రజల ఆరోగ్యాలను కాపాడేందుకు వారు తమ ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా పని చేస్తున్నారన్నారు. జగిత్యాల జిల్లాలో ఆశా వర్కర్‌పై లైంగికదాడి ఘటన రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న ఆశా వర్కర్లను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండ, వాన, చలిలో కూడా పనిచేస్తూ ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లకు సరైన భద్రత లేని పరిస్థితి నెలకొందన్నారు. వెంటనే ఆశా వర్కర్‌కు న్యాయం చేసి, ప్రభుత్వం ఆశా వర్కర్లకు సరైన భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు మల్లీశ్వరి, పుష్పలత, ఉమ, వైష్ణవి, బాసలత, దేవ, సరిత, కవితతో పాటు పెద్దఎత్తున ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కొమ్మాల జాతరకు 'ప్రభ బండ్లు'

- పోటాపోటీగా రాజకీయ పార్టీల బల ప్రదర్శన
- నర్సంపేట-వరంగల్ రహదారిపై స్థంభించిన ట్రాఫిక్
- గిర్నిబావిలో పోలీసుల లాఠీచార్జి
- పోలీసుల తీరుపై 'పెద్ది' ఫైర్..



నవతెలంగాణ-నర్సంపేట

వరంగల్ జిల్లాలో కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి జాతరలో రాజకీయ పార్టీలు ప్రభ బండ్లతో బల ప్రదర్శన చేశాయి. జాతరలో సందర్శనకు వచ్చే జనం, ప్రభ బండ్లు, కోలాటాలు, డప్పు నృత్యాలతో నర్సంపేట-వరంగల్ రహదారి శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారమంతా కిక్కిరిసిపోయింది.. గిర్నిబావి సెంటర్‌లో ప్రధాన రహదారిపై ప్రభ బండ్లను నిలుపుదల చేసి బల ప్రదర్శన దిశగా సాగుతుండటంతో గంటల తరబడి వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ స్థంభించింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభ బండ్లు పెద్ద సంఖ్యలో చేరుకోగా పోలీసులు నిలుపుదల చేసి ట్రాఫిక్ నియంత్రించే చర్యలు చేపట్టారు. దుగ్గొండి రహదారి నుంచి గిర్నిబావి వరకు బీఆర్ఎస్‌కు చెందిన ప్రభ బండ్లు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. రహదారిపై ఉన్న కాంగ్రెస్ బండ్లను జాతర వైపు పంపించకుండా.. తమ బండ్లను పోనివ్వకుండా నిలుపుదల చేయడం ఎంతవరకు సమంజసమని బీఆర్ఎస్ కార్యకర్తలు పోలీసులతో వాదించారు.

ఈ క్రమంలో ఇరు పార్టీల కార్యకర్తల నడుమ వాగ్వివాదం గొడవకు దారితీయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఏసీపీ కిరణ్‌కుమార్ నేతృత్వంలో పోలీసులు పెద్ద సంఖ్యలో చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చే క్రమంలో లాఠీచార్జి చేసి బీఆర్ఎస్ కార్యకర్తలను చెదరగొట్టారు. లాఠీచార్జికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ కార్యకర్తలు రోడ్డుపై బైటాయించారు. ఆ తర్వాత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రభ బండ్ల వద్దకు చేరుకొని కొబ్బరికాయ కొట్టారు. బీఆర్ఎస్ శ్రేణులు పెద్దసంఖ్యలో అక్కడకు వచ్చి రోడ్డుపై డప్పు వాయిద్యాలు, కోలాటాల ప్రదర్శన చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. బండ్లతో ఇక్కడి నుంచి వెళ్లాలని చెప్పడంతో పెద్ది పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, కాంగ్రెస్ నాయకులు వారి ప్రభ బండ్లను ప్రారంభించారు. మరోవైపు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ జాతర ఊరేగింపులో పాల్గొన్నారు. లక్ష్మీనర్సింహ స్వామిని దర్శించుకొని ఉత్సవాల్లో పాల్గొన్నారు.

పోటాపోటీగా రేవూరి, కొండా ప్రభ బండ్లు

కొమ్మాల జాతరకు పరకాల నియోజవర్గంలోని గీసుకొండ, సంగెం మండలాల నుంచి కొండా వర్సస్ రేవూరి అనుచరులు పోటాపోటీగా ప్రభ బండ్లను తీసుకొచ్చారు. కొమ్మాల సెంటర్ వద్ద ప్రధాన రహదారిపై గ్రూపుల ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి, కుడా చైర్మెన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి ప్రభ బండ్లపై కొద్ది దూరం వరకు ఊరేగింపుగా వచ్చారు. పోలీసుల పహారా నడుమ ప్రభబండ్లతో జాతర వద్దకు చేరుకున్నారు.

రైతు ఆత్మహత్యలు ఆందోళనకరం

కేంద్రం ఒక పాలసీతో రావాలి: ఎన్సీపీ(ఎస్పీ) చీఫ్ శరద్‌పవార్



ముంబయి : మహారాష్ట్రలో అన్నదాతల ఆత్మహత్యలపై ఎన్సీపీ(ఎస్పీ) అధినేత, కేంద్ర మాజీ మంత్రి శరద్ పవార్ స్పందించారు. మరత్వాడా, విదర్భ ప్రాంతాలలో రైతుల బలవన్మరణాలు బాధాకరమని తెలిపారు. ఈ విషయంలో సాగుదారులకు ఉపయోగపడేవిధంగా కేంద్రం ఒక విధానంతో ముందుకు రావాలని చెప్పారు. రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలపై రాష్ట్ర సహాయ, పునరావాస శాఖ ఇటీవల ఒక డేటాను విడుదల చేసింది. మహారాష్ట్రలో 2024లో 2,635 మంది అన్నదాతలు సూసైడ్ చేసుకున్నట్టు వివరించింది. ఈ నేపథ్యంలో శరద్ పవార్ పై విధంగా స్పందించారు. "మరత్వాడా, విదర్భల నుంచి వచ్చిన సమాచారం బాధాకరం. వివిధ లొకేషన్ల నుంచి మేము కచ్చితమైన సమాచారాన్ని సేకరిస్తాం. రైతులకు సహాయపడేలా కేంద్రం ఒక పాలసీని రూపొందించాలి" అని బారామతిలో శరద్‌పవార్ అన్నారు. వ్యవసాయం ఒక విప్లవాన్ని చూస్తున్నదని చెప్పారు. చెరుకు సాగులో కృత్రిమ మేధ(ఏఐ) వాడకం త్వరలోనే రానున్నదని కేంద్ర మాజీ వ్యవసాయ మంత్రి అయిన శరద్ పవార్ తెలిపారు.

సర్పంచ్ సంతోశ్ దేశ్‌ముఖ్ హత్యతో వార్తల్లోకెక్కి బీడ్‌పై ఆయన స్పందించారు. బీడ్ ఒకప్పుడు శాంతియుతమైన జిల్లా అని చెప్పారు. "బీడ్‌లో ప్రస్తుతమున్న పరిస్థితి గతంలో లేదు. ఇది ఒకప్పుడు శాంతియుతమైన జిల్లా. నా పార్టీవారే దాదాపు ఆరుగురు బీడ్ నుంచి ఎన్నికయ్యారు. అయితే, వారిలో కొందరు అధికారాన్ని దుర్వినియోగం చేయటంతో, ప్రస్తుత పరిణామాలను మనం చూస్తున్నాం" అని శరద్ పవార్ ఆందోళనను వ్యక్తం చేశారు.

తెలంగాణ రైల్వేల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- బేగంపేట రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పనులు 90 శాతం పూర్తి
- స్టేషన్‌ను మహిళా లోకానికి అంకితం చేస్తాం : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



నవతెలంగాణ-బేగంపేట

తెలంగాణ రైల్వేల సమగ్రాభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. ఇందుకోసం ప్రజలు, రాష్ట్ర ప్రభుత్వం కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. బేగంపేట రైల్వే స్టేషన్‌ను పూర్తిగా మహిళా లోకానికి అంకితం చేయనున్నామని వెల్లడించారు. బేగంపేట అమృత్ స్టేషన్ పునరాభివృద్ధి మొదటి దశ పనులను శనివారం కేంద్ర మంత్రి పరిశీలించారు. స్టేషన్ ప్రాంగణంలో పర్యటించి, పనుల తీరును పర్యవేక్షిస్తూ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా రూ.38కోట్లతో స్టేషన్ పునరాభివృద్ధి పనులు చేపట్టామని, అందులో తొలి విడత రూ.26 కోట్లతో చేపట్టిన పనులు 90శాతం పూర్తయ్యాయని, మరో 5 నుంచి 10 శాతం సుందరీకరణ పనులు మాత్రమే జరగాల్సి ఉందన్నారు. ఆ వెంటనే రూ.12 కోట్లతో రెండో విడత పనులు చేపడతామని వివరించారు. పనులు నిర్వహించే సమయంలో ఇక్కడి నుంచి రాకపోకలు సాగించే రైళ్ల, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ రైల్వేస్టేషన్‌లో సెక్యూరిటీ గార్డుల నుంచి అధికారుల వరకు అందరూ మహిళా ఉద్యోగులే ఉండనున్నారని స్పష్టం చేశారు. బేగంపేట రైల్వే స్టేషన్లో పూర్తి స్థాయి వైఫై సదుపాయాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. స్టేషన్ పరిధిలో వినియోగించిన నీటిని ట్రీట్‌మెంట్ ప్లాంట్ ద్వారా శుద్ధి చేసి నీటిని తిరిగి మొక్కలకు, స్టేషన్‌లోని ఇతర పనులకు వినియోగించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. బేగంపేట రైల్వే స్టేషన్‌కు ఎంఎంటీఎస్ రైళ్ల కనెక్టివిటీ ఉందని, ప్రస్తుతం ఇక్కడ నుంచి 15వేల మంది ప్రయాణీకులు రాకపోకలు సాగిస్తున్నారని, స్టేషన్ ఆధునీకరణ తరువాత ఈ సంఖ్య రెట్టింపు అయ్యే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో 40రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధి చేస్తున్నామని, అందులో హైదరాబాద్‌లోని బేగంపేట్‌తో పాటు మేడ్చల్, యాకత్‌పురా, నాంపల్లి, కాచిగూడ, ఉందానగర్, మలక్‌పేట, హైటెక్ సిటీ, హఫీజ్‌పేట స్టేషన్లు ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి శశిధర్ రెడ్డి, మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక తదితరులు పాల్గొన్నారు.

బట్టల దుకాణం నిర్వాహకుల ఆత్మహత్యాయత్నం

- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చెల్పూర్ బ్రదర్స్ క్లాత్ స్టోర్ యజమానులు



నవతెలంగాణ-వరంగల్

బట్టల దుకాణం ఖాళీ చేయాలని బ్యాంకు అధికారులు వేధిస్తున్నారంటూ వరంగల్ బట్టల బజార్‌లోని చెల్పూరి బ్రదర్స్ యజమానులు శనివారం ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. ఇంతేజార్‌గంజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెల్పూరి బ్రదర్స్ క్లాత్ స్టోర్ యజమానులు వేణుకుమార్, ఆనంద్ కొనేండ్ల కిందట స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో సుమారు రూ.1.50 కోటి రుణం తీసుకున్నారు. ఇటీవల వ్యాపారం సరిగ్గా నడవక ఈఎంఐ కట్టకపోవడంతో స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా లీగల్ యాక్షన్ వేయడంతో యాక్షన్‌లో సత్యం అనే వ్యక్తి బట్టల దుకాణాన్ని కొనుగోలు చేశారు. చెల్పూరి బ్రదర్స్ ఖాళీ చేయకుండా.. ఇప్పుడు అప్పుడు అంటూ దాటవేయడం వలన కొన్నవారు కోర్టుకు వెళ్లి ఖాళీ చేయాలని ఆర్డర్ తీసుకొచ్చారు. కోర్టు పోలీస్ ప్రొటెక్షన్ కల్పించాలని చెప్పడంతో ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించారు. ఇంతేజార్‌గంజ్ పోలీసులు వెళ్లి షాపు ఖాళీ చేయాలని చెప్పడంతో రెండ్రోజులు తర్వాత ఖాళీ చేస్తామని షాపు యజమాని చెప్పినట్టు సమాచారం. శనివారం బ్యాంకు అధికారులు వెళ్లి ఖాళీ చేయాలని చెప్పడంతో క్లాత్ స్టోర్ యజమానులైన ఆనంద్, సృజన ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నారు. స్థానికులు గమనించి వెంటనే ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. దీనిపై ఇప్పటి వరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బీజేపీవి మోసపూరిత ఆలోచనలు

- పునర్విభజనపై గళంవిప్పిన పంజాబ్ సీఎం



చండీగఢ్: నియోజకవర్గాల పునర్విభజన ప్రతిపాదనపై పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ నిరసన గళం వినిపించారు. కేంద్రంలోని అధికార బీజేపీ అన్యాయమైన ఆట ఆడుతోందనీ, తాను గెలవలేని, సీట్ల సంఖ్యను పెంచుకోలేని రాష్ట్రాలలో లోక్‌సభ స్థానాలను కుదించేందుకు ఉద్దేశపూర్వకంగా ప్రయత్నిస్తోందని ఆరోపించారు. నియోజకవర్గాల పునర్విభజన ప్రతిపాదనను భగవంత్ మాన్ వ్యతిరేకించడం ఇదే మొదటిసారి. పంజాబ్ సీఎం శనివారం విలేకరులతో మాట్లాడుతూ తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌ను ఫోన్‌లో సంప్రదించానని చెప్పారు. "ఆయన ఇద్దరు మంత్రులను పంజాబ్‌కు పంపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మోసపూరిత ఎత్తుగడలు వేస్తోంది. తాను గెలవలేనీ, సీట్ల సంఖ్యను పెంచుకోలేని రాష్ట్రాలలో లోక్‌సభ స్థానాలను తగ్గించడానికి ప్రయత్నిస్తోంది. జనాభాను నియంత్రించాలనీ, దేశంలో కుటుంబాల పరిమాణాన్ని తగ్గించాలని కేంద్రం ఓ విధానంగా పెట్టుకుంది. మరోవైపు కుటుంబ నియంత్రణను అమలు చేయని రాష్ట్రాలలో పార్లమెంటరీ, శాసనసభ స్థానాలను పెంచుతోంది. జనాభా విధానం ప్రాతిపదికన సీట్లు పెంచినా లేదా తగ్గించినా పంజాబ్‌పై ప్రభావం పడుతుంది. పంజాబ్‌లో ఒకటి రెండు సీట్లు పెరగవచ్చు. కానీ ఇతర రాష్ట్రాలలో పెరిగిన దామాషాలో పెరగవు" అని భగవంత్ మాన్ తెలిపారు. కాగా నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన ప్రమాణాలు పంజాబ్‌ను బలహీనపరుస్తాయన్న ఆందోళనలు ఉన్నాయని ఆప్ రాష్ట్ర ప్రతినిధి, ఎంపీ ఆనంద్‌పూర్ సాహిబ్ చెప్పారు. పార్లమెంటులో పంజాబ్ ప్రాతినిధ్యంపై ప్రభావం పడుతుందనీ, అంతేగాక భారత సమాఖ్య నిర్మాణానికి ముప్పుగా పరిణమిస్తుందని ఆయన అన్నారు.